# మానవహక్కులు -2013



## విలువల గీటురాయిగానే
## ముందుకు సాగుదాం

బులెటిన్ - 13

ఐదవ రాష్ట్ర మహాసభల సంచిక

# మానవహక్కులు - 2013

బులెటిన్ – 13

---

**మానవహక్కుల వేదిక ప్రచురణ**
**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 29
ప్రచురణ కాలం: అక్టోబర్ 2013
కాపీలు: 1000, వెల: 20 రూపాయలు
కవర్: అక్బర్
డిటిపి: కె.వి.ఆర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతపూర్,
హైదరాబాద్ – 500 013
ఫోన్: 040-27039519

**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

## సంపాదకీయం

# పేదలకు అక్కరకు రాని కొత్త హక్కులు

'**మా**టల దొంగలొచ్చారు మౌనంగా ఉండకండి' అని నాలుగేళ్ల క్రితమే ఒక కరపత్రంలో హెచ్చరించాం. అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభల సందర్భంగా వేసిన కరపత్రం అది. ఇవ్వాళ దాన్ని కొంచెం మార్చి 'హక్కుల దొంగలొచ్చారు మౌనంగా ఉండకండి' అని హెచ్చరించాల్సిన అవసరం వచ్చింది.

హక్కుల పరిభాషను అందరికీ పరిచయం చేయడంలో మనం కృతకృత్యులయ్యాం కాని వాటి స్ఫూర్తిని అర్థం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమైనట్టున్నాయి. అన్నిటికీ హక్కులడుగుతారా... తీసుకుని ఇక మా జోలికి రాకండి అన్న పద్ధతిలో వ్యవహరిస్తోంది భారత ప్రభుత్వం.

సమాజంలో సంక్షోభం పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో హక్కుల స్పృహ పెరుగుతోందని గమనించి అడిగిన వాటికీ, అడగని వాటికీ కూడా హక్కులు ఇవ్వడానికి సిద్ధపడుతోంది ప్రభుత్వం. ఆ తర్వాత అమలు కాకపోతే తప్పును అధికారుల అలసత్వం మీద, అవినీతి మీద సులభంగా తోసేయొచ్చని కాబోలు దాని ఉద్దేశం. ప్రతి సంక్షేమ చర్యనూ హక్కు రూపంలోకి తీసుకురావడం సంతోషించదగ్గ విషయమే కాని ఆ హక్కులను అనుభవించగల సామాజిక పరిస్థితులను తగ్గించుకొంటూ పోవడం ఇవ్వాళ ఇందులో మనకు కనిపిస్తున్న పెద్ద ప్రమాదం. మరో రకంగా చెప్పాలంటే ఒక హక్కు ద్వారా ప్రయోజనం పొందగల ప్రజల సంఖ్యను కుదించాకే దానికి చట్టరూపం ఇస్తున్నారు. ప్రభుత్వంవారి ఈ 'అతి తెలివి'కి ఎన్నయినా ఉదాహరణలు ఇవ్వొచ్చు.

వ్యవస్థీకరించబడ్డ అవినీతిని, అస్తవ్యస్త ప్రభుత్వ పాలనను బట్టబయలు చేయగల సాధనంగా సమాచారహక్కు ఉపయోగపడుతుందనుకున్నాం. కాని రాజకీయ వ్యవస్థలో విలువల రాహిత్యం పెరిగిపోవడం వల్ల అది ఆశించినంత ప్రయోజనం ఇవ్వలేకపోతోంది.

పనిహక్కుకు మారురూపంగా ఉపాధిహామీ హక్కు కల్పించినా, పూర్తి స్థాయిలో దాన్ని అమలుపరిచే పరిస్థితి లేదు. ప్రైవేటీకరణ, అవుట్‌సోర్సింగ్, బిల్ట్ ఇన్ ఆపరేటివ్ పద్ధతులు అమలులోకి వచ్చిన తర్వాత చాలా రంగాల్లో ఉపాధి తగ్గిపోయింది. విద్యావ్యవస్థ పూర్తిగా ప్రైవేటీకరించబడి, కార్పొరేట్ స్థాయికి చేరిన తర్వాత 'విద్యాహక్కు చట్టం' వచ్చింది. ఈ చట్టం అమలుకు నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు ఎటువంటి మార్పునూ తీసుకురాలేక పోతున్నాయి. అట్లాగే ప్రజా ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా నిస్సత్తువైపోయి, కార్పొరేట్ ఆస్పత్రులు గుత్తాధిపత్యాన్ని సాధించిన తరుణంలో 'ఆరోగ్య హక్కు' తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకంలోని 78% నిధులు ఒక డజను కార్పొరేట్ ఆసుపత్రుల ఖాతాల్లోకి వెళ్ళడం ఇందుకు నిదర్శనం.

వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేయబడి, చిన్న రైతులకు, చిన్న కమతాలకు మనుగడ లేని పరిస్థితి ఏర్పడ్డ తరుణంలో, అంతర్జాతీయ సంస్థలను సంతృప్తిపరచడానికి, ఓట్ల రాజకీయాల్లో లబ్ధిపొందడానికి 'ఆహారభద్రత' బిల్లును హడావిడిగా తేవడం జరిగింది. దీన్ని అమలుపరచడానికి కావలసిన మౌలిక వ్యవస్థలింకా ఏర్పాటే కాలేదు. ఇప్పుడున్న ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలైనా లేవు. వ్యవసాయాన్ని రక్షించుకోకుండా దీన్నెలా అమలు చేయాలనుకుంటున్నారో అర్థం కాదు. పైపెచ్చు ఇప్పుడు సేకరిస్తున్న ఆహార ధాన్యాలు సరిపోవు కాబట్టి మళ్ళీ హరిత విప్లవం రావాలని, దానికోసం వ్యవసాయరంగంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం అనే కొత్త విధాన నిర్ణయాన్ని కూడా ప్రకటించారు. అంటే చిన్న రైతు, చిన్న కమతాలు పూర్తిగా నాశనమవబోతున్నట్టే.

ఈ పరిస్థితి దేనికి దారి తీయబోతోంది? ఒక ప్రభుత్వం తన ప్రజలను ఇంత బాహాటంగా వంచించడానికి ప్రయత్నిస్తున్నపుడు హక్కుల కార్యకర్తలుగా మన కర్తవ్యం ఏమిటి? సమాచార హక్కు, ఉపాధి హామీ హక్కు, విద్యాహక్కు, ఆహార భద్రతా హక్కు, రాబోతున్న ఆరోగ్య హక్కు వీటన్నిటినీ ఎందుకోసం ఈ దేశ ప్రజలు డిమాండ్ చేశారో ఆ స్ఫూర్తిని కాపాడుతూ వారి పూర్తి ప్రయోజనాలు చేకూరేలా మనం ఏం చేయగలమో ఆలోచించుకోవాలి.

మానవహక్కుల వేదిక

4-10-2013

# ఇందులో...

## వ్యాసాలు

నిర్మాణ కార్మికుల సంఖ్య ఎందుకు పెరుగుతోంది? . . . . . . . . . . . . . . . . . . .7
– పి.యస్. అజయ్ కుమార్

భూమి – కాగుతున్న పెనం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .19
– నాగరాజ్ ఆడ్వె

విధ్వంసరహిత అభివృద్ధి సాధ్యమా? . . . . . . . . . . . . . . . . . . . . . . . . .39
– ఎస్. అమర్

ఆఫ్రికా భూముల్లో కార్పొరేట్ సేద్యం . . . . . . . . . . . . . . . . . . . . . . . . .53
– ఎస్. జీవన్ కుమార్

దేశ అణు ఇంధన భవితవ్యం: కొన్ని పాఠాలు . . . . . . . . . . . . . . . . . . . . .61
– నిత్యానంద్ జయరామన్

## జ్యుడీషియరీ వాచ్

రాజ్యాధిక్కారం రాజద్రోహం కాదు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .89
– గొర్రెపాటి మాధవరావు

## రిపోర్టులు

పారిశ్రామిక ప్రమాదాలన్నీ భద్రతా వైఫల్యాలే . . . . . . . . . . . . . . . . . .98
నిర్లక్ష్యానికి మూల్యం డ్రైనేజీ కార్మికుల మరణాలు . . . . . . . . . . . . . . . . . .106
ఆత్మహత్యల పరంపర: పరిహారం దక్కని వేలాది రైతు కుటుంబాలు . . . . . . .109
కల్లీకల్లు: మత్తు బదులు మరణాన్నిచ్చింది . . . . . . . . . . . . . . . . . . . . . .120

**కరపత్రాలు** . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .125 – 184

# నిర్మాణ కార్మికుల సంఖ్య ఎందుకు పెరుగుతోంది?

పి.యస్. అజయ్ కుమార్ *

**గ్రామీణ సమాజం గురించి లోతుగా అధ్యయనం చేస్తున్న వారు చెపుతున్న కొన్ని సామాన్య లక్షణాలు ఈ విధంగా వున్నాయి.**

స్థూల జాతీయ ఉత్పత్తి (GDP) లో వ్యవసాయ రంగం భాగస్వామ్యం రానురాను తగ్గిపోతూ ఉంది. అసీం శ్రీవాత్సవ్, ఆశిష్ కొఠారిలు తమ గ్రంథం 'ది చర్నింగ్ ఆఫ్ ఎర్త్'లో 1983లో మన స్థూల జాతీయోత్పత్తిలో 37 శాతం ఉన్న వ్యవసాయ రంగం 2004 – 05నాటికి 21.1 కు తగ్గిపోయిందని, అదే సమయంలో ఆ రంగంపై ఆధారపడిన వారి సంఖ్య 68.5 శాతం నుండి 56.5కు మాత్రమే తగ్గిందని చెప్పారు. అంటే నేటికీ అధిక శాతం మంది వ్యవసాయ రంగంపై జీవిక కోసం ఆధారపడినా స్థూల జాతీయ ఉత్పత్తిలో మాత్రం దాని వాటా తగ్గిపోతున్నదని ఈ గణాంకాలు చెపుతున్నాయి.

వ్యవసాయంపై ప్రభుత్వం చేసే వ్యయం కూడా తగ్గిపోతూ వస్తున్నది. గత ఆర్థిక సంవత్సరం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో వ్యవసాయ శాఖ బడ్జెట్ 2946 కోట్లు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలన్నింటిని కలుపుకున్నా కేటాయింపుల మొత్తం 5050 కోట్లు. 1,40,854 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో ఇది కేవలం 3.5 శాతం. అంటే ఎక్కువ మంది ఆధారపడిన ఈ రంగానికి అతి తక్కువ నిధుల కేటాయింపు జరుగుతోందన్నమాట.

వ్యవసాయ రంగంలో వివిధ శ్రేణులు వుంటాయి. ఉదాహరణకు రైతులు, కూలీలు, చేతివృత్తులు, వంటి అనుబంధ రంగాలవారు. ఇందులో రైతులు

*ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

వ్యవసాయాన్ని వదిలేస్తూ కూలీల వర్గంలోకి చేరిపోతున్నారు. వీరందరూ చిన్న, సన్నకారు రైతులు, కౌలుదార్లేనని వేరే చెప్పనవసరం లేదు. 2001-2011 మధ్య ఈ విధంగా 13 లక్షల మంది అనగా రోజుకు 2035 మంది వ్యవసాయాన్ని వదిలేసారు. మన రాష్ట్రంలోనైతే ఇది రోజుకు 375గా వుంది.

ఇక వ్యవసాయ రంగంలో ఆత్మహత్యల సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 2,84,694 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే గత 17 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల సంఖ్య 33 వేలుగా వుంది. దీనిని బట్టి మనకు అర్థమౌతున్నది ఏమిటంటే వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారికి బతుకుతెరువు లేకుండా పోయింది. నిజానికి ఇటువంటి పరిస్థితి గిరాకి (డిమాండ్), సరఫరా (సప్లయ్)ల మధ్య సమతూకాన్ని దెబ్బతీసి శ్రామికుల మిగులుకు దారితీయాలి. కాని అటువంటిది జరగకపోగా, వ్యవసాయ పనులకు కూలీలు దొరకటం లేదని మనం వింటుంటాం. ఇందుకు కారణంగా చాలామంది ఉపాధి హామీ పథకం వైపుకు వేలు చూపిస్తుంటారు. ఈ పథకం ఎంతవరకు ఉపాధి కల్పిస్తున్నదో చూద్దాం.

| వ.సం. | సం..రం | పని పొందిన కుటుంబాలు | సగటు పని దినాలు | సగటు వేతనం |
|---|---|---|---|---|
| 1. | 2008-09 | 57 లక్షలు | 63 రోజులు | 90 రూ.లు. |
| 2. | 2009-10 | 61 లక్షలు | 54 రోజులు | 97 రూ.లు. |
| 3. | 2010-11 | 62 లక్షలు | 60 రోజులు | 97 రూ.లు. |
| 4. | 2011-12 | 50 లక్షలు | 51 రోజులు | 105 రూ.లు. |
| 5. | 2012-13 | 58 లక్షలు | 58 రోజులు | 106 రూ.లు. |

ఆధారం NREGS, AP వెబ్‌సైట్

దీనిబట్టి గత ఐదు సంవత్సరాలలో ఉపాధి హామీ పథకం నుండి పని పొందిన కుటుంబాలు 50 నుండి 62 లక్షలు. 2008-09లో మినహా మిగతా అన్ని సంవత్సరాలలోను వారి సగటు వేతనం ప్రకటిత వేతనాల కంటే తక్కువగా వుంది. కుటుంబానికి 60 రోజులు పని లభిస్తుందనుకుంటే, ఆ కుటుంబంలో పని చేసేవారు కనీసం ముగ్గురుంటారనుకుంటే 20 రోజులలో అది పూర్తవుతుంది.

ఇక జాతీయ స్థాయిలో చూస్తే 2009-10లో ఒక కుటుంబానికి 54 రోజులు పని లభిస్తే, ఇది 2010-11లో 47కు, 2011-12లో 43కు, 2012-13లో 39 రోజులకు తగ్గిపోతూ వచ్చింది. 2009-10లో షెడ్యూల్డ్ కులాల వారికి 86.45 కోట్లు, షెడ్యూల్డ్ తెగల వారికి 58.74 కోట్ల పనిదినాలు కల్పిస్తే 2012-13లో అవి 40.77, 31.37 కోట్ల పని దినాలకు తగ్గిపోయాయి. కనుక వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులందరిని ఉపాధి హామీ పథకం స్వీకరించడం లేదని అర్థమౌతుంది. మరి వాళ్లు ఎక్కడికి వెళుతున్నారు?




## సేవారంగంలోకి పెరిగిన వలసలు

వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులు సేవల రంగంలో తమ ఉపాధిని వెతుక్కుంటున్నారు. 1983లో జి.డి.పి.లో 38.6 శాతంగా వున్న ఈ రంగం 2004-2005 నాటికి 53 శాతానికి పెరిగింది. అదే విధంగా ఈ రంగంలో ఉపాధి పొందుతున్న వారి శాతం 17.6 నుండి 24.8కు పెరిగింది (అసీం శ్రీవాత్సవ్). దీనినే 'ఇన్‌ఫార్మల్ సెక్టార్' అంటున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే ఒక కంప్యూటరు ఇంజనీరు, రిక్షా తొక్కే కార్మికుడు ఇరువురు అసంఘటిత రంగం కిందికే వస్తారు. అందువల్ల ఇందులోని ఉపాధి అవకాశాలను అధిక ఆదాయ, తక్కువ ఆదాయ వర్గాలుగా విభజించారు. మొదటి రకం పనులు మన సమాజంలోని మధ్యతరగతికి, ధనిక వర్గానికి, అగ్రకులాల వారికి 'రిజర్వు'

చేయబడ్డాయి. గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి లభించేది రెండవ రకం 'తక్కువ ఆదాయాల' విభాగంలోనే.

అసంఘటిత రంగం చాలా విస్తృతమైనది, వైవిధ్యభరితమైనది. నూతన సాంకేతిక పరికల్పనలు, వస్తువులు ఎప్పటికప్పుడు కొత్త పనులు, సేవలను ఈ రంగంలోకి తెస్తూ వుంటాయి. ప్రస్తుతం అసంఘటిత రంగంలో ఒక పెద్ద విభాగంగా ఉండి గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నది మాత్రం నిర్మాణ రంగమే. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు బాగా ఎదిగిన మధ్యతరగతి వర్గం యొక్క నిర్మాణ అవసరాలే లక్షలాదిమంది గ్రామీణ కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నాయి. నిర్మాణ రంగానికి అవసరమైన ముడిసరుకుకు సంబంధించిన – ఉదాహరణకు రాతి క్వారీ, ఇసుక, స్టోన్ క్రషర్లు, సిమెంటు, ఐరన్ తయారీ, అమ్మకం, రవాణాలలో ఈ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నిర్మాణ రంగం వ్యాప్తితో వాటి అనుబంధ సేవల విస్తృతికూడా పెరిగింది. ఉదాహరణకు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, పాలిషింగ్ వగైరా పనులు. నిర్మాణరంగంలో యాంత్రీకరణ – ఉదాహరణకు కాంక్రీట్ మిక్సింగ్ – పెరిగినప్పటికీ అది ఇప్పటికీ మనుషులు చేయవలసిన పనిగానే వుంది. గ్రామీణ ప్రాంతాల వ్యవసాయంలో ఉపాధి తగ్గినప్పటికీ గ్రామీణ శ్రామికులు ఏదో ఒక స్థాయిలో జీవనాన్ని నెట్టుకు రాగలగడానికి అసంఘటిత రంగంలోని నిర్మాణ రంగమే ప్రధాన కారణం.

## నిర్మాణ కార్మికుల సమస్యలు

అసంఘటిత రంగంలోని నిర్మాణ రంగం కార్మికులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు మూడు. ఒకటి ఉద్యోగ భద్రత, రెండు సాంఘిక రక్షణ, మూడవది నైపుణ్యాల మెరుగుదల. ఇందులో ఆఖరిదాన్ని కార్మికుడు తనంతట తాను నేర్చుకొని మెరుగుపర్చుకోవలసిందే గాని వ్యవస్థాగతమైన ఎలాంటి ఏర్పాట్లు, అవకాశాలు లేవు. ఇక మిగిలిన రెండింటి గూర్చి చెప్పనవసరం లేదు. ఉద్యోగ/ఉపాధి భద్రత సంగతి ఎలా వున్నా సాంఘిక రక్షణ సహితం లేదు. అనారోగ్యం, ప్రమాదాలు కాక పని ప్రదేశంలో నీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు, వృద్ధాప్యంలో ఆసరాకు సంబంధించిన ఏర్పాట్లు లేనే లేవు. ఇప్పటి వరకు వచ్చిన కార్మిక సంక్షేమ చట్టాలు ప్రధానంగా సంఘటిత రంగం కార్మికులకు ఉద్దేశించినవే.

అసంఘటిత రంగ కార్మికుల, ముఖ్యంగా తక్కువ ఆదాయ విభాగాలలోని కార్మికుల యజమానులు నిత్యం మారిపోతూ వుంటారు. అంతేగాక పని ప్రదేశాలు, పనిచేసే కార్మిక సమూహాలు కూడా మారిపోతూ వుంటాయి. ఆ

కారణంగా వారు ఒక సంఘంగా ఏర్పడి చర్చించుకొని, తమ డిమాండ్లను రూపొందించుకోవడం ఒక పట్టాన జరిగే పని కాదు. దురదృష్టవశాత్తు కేంద్ర కార్మిక సంఘాలు సంఘటిత కార్మికులపై చూపిన శ్రద్ధ అసంఘటిత కార్మికులను సంఘటిత పర్చడంపై చూపలేకపోయాయి.

**అసంఘటిత రంగ కార్మికుల, ముఖ్యంగా తక్కువ ఆదాయ విభాగాలలోని కార్మికుల యజమానులు నిత్యం మారిపోతూ వుంటారు. అంతేగాక పని ప్రదేశాలు, పనిచేసే కార్మిక సమూహాలు కూడా మారిపోతూ వుంటాయి. ఆ కారణంగా వారు ఒక సంఘంగా ఏర్పడి చర్చించుకొని, తమ డిమాండ్లను రూపొందించుకోవడం ఒక పట్టాన జరిగే పని కాదు.**

ఈ ప్రతికూల పరిస్థితులు వున్నప్పటికీ, ఏదో ఒక స్థాయిలో నిర్మాణ, భవన నిర్మాణ కార్మికులను సంఘటితపర్చే ప్రయత్నాలు జరిగాయి. ఉత్తర భారత రాష్ట్రాలలోనూ, మన దక్షిణాదిన కర్ణాటకలోనూ జరిగాయి. సోషలిస్టులు, గాంధేయ వాదులు, అంబేద్కరు వాదులు, కార్మిక సంక్షేమ కార్యకర్తలు, కొన్నిచోట్ల కమ్యూనిస్టులు నిర్మాణ కార్మికులను సంఘటితపర్చారు. నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పార్లమెంటులో చట్టం ఆమోదించాలనే డిమాండ్‌తో వీరు దేశవ్యాప్తమైన నెట్‌వర్కును ఏర్పాటు చేయగలిగారు. ఇందుకోసం 'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్' సంఘం ఏర్పడింది. ప్రధానంగా నిర్మాణ రంగ కార్మిక సంఘాలతో బెంగళూరు కేంద్రంగా 'నేషనల్ సెంటరు ఫర్ లేబర్' ఏర్పాటయ్యింది. నిర్మాణరంగ కార్మిక సంఘాల డిమాండ్‌కు వామపక్ష పార్టీలు ఇచ్చిన మద్దతు కారణంగా 1996లో పార్లమెంటు రెండు చట్టాలను ఆమోదించింది. అవేమిటో చూద్దాం.

## సంక్షేమం కోసం రెండు చట్టాలు

అసంఘటిత రంగానికి చెందిన నిర్మాణ రంగ కార్మికుల పోరాట ఫలితంగా నిర్మాణ, భవన నిర్మాణ కార్మికుల ఉపాధి, పని పరిస్థితుల చట్టాన్ని 1996లో పార్లమెంటు ఆమోదించింది. నిర్మాణ పనులలో కార్మికుల భద్రతకు, పని ప్రదేశంలో వుండవలసిన ప్రాథమిక సౌకర్యాలు, సాంఘిక రక్షణ, సంక్షేమాలకు ఈ చట్టం ఉద్దేశించబడింది. ఈ చట్టం అమలు కోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 'నిర్మాణ, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు'లను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డులో సభ్యులుగా చేరే కార్మికులకు బోర్డు సంక్షేమ పథకాలను అందజేస్తుంది.

అయితే ఈ బోర్డుకు నిధులు ఎలా వస్తాయి? సూత్రరీత్యా కార్మికుల సంక్షేమం చూడవలసింది యజమాని. కాని నిర్మాణరంగంలో యజమాని స్థిరంగా వుండడు. మారిపోతూ వుంటాడు. కనుక యజమాని తరపున ఈ బోర్డు కార్మికులకోసం సంక్షేమ చర్యలు చేపడుతుంది. ఈ పని చేస్తున్నందుకుగాను యజమాని కొంత నగదును బోర్డుకు చెల్లించాలి. ఇందుకోసం నిర్మాణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టాన్ని కూడా అదే సంవత్సరంలో పార్లమెంట్ ఆమోదించింది. అంటే సంక్షేమం కోసం ఏర్పరిచే బోర్డుల నిర్మాణానికి ఒక చట్టం, ఈ బోర్డులకు యజమానులు నిర్దేశిత మొత్తాన్ని చెల్లించడానికి మరో చట్టం రెండింటినీ 1996లోనే ఆమోదించింది.

పార్లమెంటు ఆమోదించినప్పటికీ 2007 వరకు మన రాష్ట్రంలో నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు రూపొందలేదు. ఇది మన రాష్ట్రంలోని కార్మిక ఉద్యమాల, ప్రత్యేకంగా అసంఘటితరంగ కార్మిక ఉద్యమాల బలహీనతను తెలియజేస్తుంది. చివరికి సుప్రీంకోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం వలన కోర్టు ఆదేశాలతో పలు రాష్ట్రాలు బోర్డులను ఏర్పాటు చేసాయి. అందులో మన రాష్ట్రం కూడా ఒకటి.

## మూలుగుతున్న నిధులు

సమాచార హక్కు చట్టం ద్వారా వేసిన దరఖాస్తుకు స్పందనగా ఆంధ్రప్రదేశ్ నిర్మాణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఇచ్చిన సమాచారం ప్రకారం 31 ఆగస్టు 2012 నాటికి, బోర్డు వద్ద సెస్సు ద్వారా, కార్మికులు చెల్లించిన సభ్యత్వం ద్వారా పోగుపడిన నిధులు 854 కోట్ల 79 లక్షలు. ఇందులో వివిధ పథకాలకు గాను కార్మికులకు చెల్లించిన మొత్తం 23 కోట్ల 95 లక్షలు. సెస్ ద్వారా వస్తున్న నిధులకు, కార్మికుల సంక్షేమం కోసం చెల్లిస్తున్న మొత్తానికి ఎక్కడా పొంతన లేదు. ప్రస్తుతం బోర్డు వద్ద 1200 కోట్లు వున్నట్లుగా తెలుస్తున్నది.

బోర్డు వద్ద వున్న నగదు నిజానికి ప్రభుత్వం ఇచ్చిన నిధులు కావు. పార్లమెంటు చట్టం ద్వారా వసూలైన 'సెస్' నిధులవి. 23 జిల్లాలలో పైన చెప్పిన తేదీకి పరిష్కరించిన క్లయిములు కేవలం 12,037 !

నిర్మాణ కార్మికులు బోర్డులో సభ్యులుగా చేరాలంటే ఏమి చేయాలి, తద్వారా వారికి లభించే సౌకర్యాలేమిటి, క్లయింల పరిష్కారం, సెస్ వసూళ్ళలో సమస్యలేమిటో ఇప్పుడు చూద్దాం.

నిర్మాణరంగంలో పనిచేసే కార్మికుడు లేదా కార్మికురాలు బోర్డులో సభ్యులుగా చేరాలంటే వారు ముందుగా గడిచిన సంవత్సరంలో 90 రోజుల పాటు ఈ

రంగంలో పనిచేసి వుండాలి. అయితే ఇందుకు ఎలాంటి ధృవపత్రాలు ఇవ్వనవసరం లేదు. దరఖాస్తులోనే 'స్వయం ప్రకటన' (సెల్ఫ్ డిక్లరేషన్) వుంటుంది. రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు జతపర్చి దరఖాస్తు సమర్పించాలి. దీంతోబాటు రిజిస్ట్రేషన్ ఫీజుగా 50 రూపాయలు, నెలకి ఒక రూపాయి చొప్పున 12 నెలలకు 12 రూపాయలు మొత్తం 62 రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందవచ్చు. అయితే 12 నెలల గడువు తీరగానే సభ్యత్వ రుసుము మళ్లీ కట్టవలసి వుంటుంది. గడువులోగా సభ్యత్వం చెల్లించడంలో సమస్యలు ఎదురౌతున్నాయని ఇప్పుడు 5 సంవత్సరాలకు రూ. 60 లు (5 x 12 రూపాయలు), మరియు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 50/-లు మొత్తం 110 రూ.లతో సభ్యత్వం ఇస్తున్నారు.

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ALO) కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి రశీదు తీసుకోగానే కార్మికులు బోర్డు పథకాలు పొందడానికి అర్హులవుతారు. బోర్డు తన సభ్యులకు ఫోటో గుర్తింపు కార్డును ఇస్తుంది. ప్రస్తుతం రాష్ట్రం మొత్తం మీద 19 లక్షల మంది కార్మికులు బోర్డులో సభ్యత్వం పొందినట్లుగా తెలుస్తున్నది.

## 29 రకాల పనులకే అర్హత

ప్రస్తుతానికి లభించిన సమాచారం ప్రకారం 29 రకాల పనులు చేసే నిర్మాణ కార్మికులు మాత్రమే బోర్డులో సభ్యులుగా చేరుటకు అర్హులు. క్వారీ, స్టోన్ క్రషర్, ఇటుక బట్టీ కార్మికులతో పాటు, నిర్మాణ సామగ్రి అమ్మే దుకాణాలు, వ్యాపారాలలో పనిచేసే కార్మికులు కూడా సభ్యత్వం పొందవచ్చని బోర్డు చెపుతుంది. అయితే రాష్ట్రంలో నిర్మాణరంగంలో ఎంతమంది కార్మికులు ఉన్నారో శాస్త్రీయమైన అంచనాలు లేవు. కనుక బోర్డులో చేరకుండా ఎందరు వుండిపోయారో తెలీదు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిరంతరంగా నిర్మాణ పనులు జరిగే జిల్లాలు - ఉదాహరణకు హైదరాబాదు, రంగారెడ్డి వంటి జిల్లాలు - సభ్యత్వ నమోదులో అట్టడుగున వున్నాయి. డెల్టా ప్రాంతాలైన పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు ఒకటి, రెండవ స్థానంలోను, విశాఖపట్నం మూడవ స్థానంలో వున్నాయి. బోర్డు ద్వారా సభ్యులకు లభించే సంక్షేమ పథకాల గురించి తెలుసుకొని మళ్లీ ఈ సభ్యత్వాల అంశంలోకి వద్దాం.

బోర్డులో సభ్యులైన నిర్మాణ కార్మికులెవరైనా పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోతే వారికి 2 లక్షలు పరిహారంగా బోర్డు ఇస్తుంది. ఇందులో బోర్డు ద్వారా

1,75,000 రూ.లు, ఆపద్బంధు పథకం ద్వారా 25వేలు లభిస్తాయి. దహన సంస్కార ఖర్చుల కింద 5,000/-లు చెల్లిస్తారు. బోర్డు సభ్యుడు/సభ్యురాలు సహజ మరణం చెందితే 30,000 రూపాయలు చెల్లిస్తారు. బోర్డులో సభ్యత్వం వుండి పని ప్రదేశం వద్ద ప్రమాదంలో 50 శాతం పైగా వైకల్యం చెందితే 1 లక్ష రూపాయలు లభిస్తుంది. పని ప్రదేశంలో ప్రమాదం వలన నిర్మాణ కార్మికుడు మరణిస్తే, అతను/ఆమె బోర్డు సభ్యులు కాకపోయినా 50 వేలు చెల్లిస్తారు. బోర్డులో చేరిన అవివాహిత కార్మికురాలికి, కార్మికురాలు లేదా కార్మికుడి కుమార్తెకు వివాహ బహుమతిగా 5 వేలు, కార్మికురాలికి తొలిరెండు కాన్పులకు 5 వేలు చొప్పున ఇస్తారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో వుంటే కనిష్టంగా ఐదురోజులు, గరిష్టంగా 15 రోజులు మూడు నెలలకు మించకుండా రోజుకు 100/-లు చొప్పున 1500/-లు ఇవ్వాలి. ఇతరత్రా ప్రభుత్వ ఆర్థిక సహాయం లభించని నిర్మాణ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు కూడా ఇస్తామని బోర్డు చెపుతుంది.

## బోర్డు గురించి తెలియనివాళ్లే ఎక్కువ

బోర్డులో సభ్యులుగా చేరడం, సహాయాన్ని పొందడంలో కార్మికులు రెండు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. అత్యధిక శాతం నిర్మాణ కార్మికులకు బోర్డు గురించి తెలీదు. విషయాలు చెప్పి సభ్యులుగా చేర్పించే వ్యవస్థలేవీ లేవు. నిర్మాణ కార్మికులను సంఘటితపర్చేందుకు ఇదొక మంచి అవకాశం అయినప్పటికీ వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సభ్యులుగా చేరిన తరువాత ఆయా పథకాల క్రింద లబ్ధి పొందాలంటే కార్మిక శాఖకు సంబంధిత ఆధార పత్రాలతో క్లయింలు దాఖలు చేయవలసి వుంటుంది. ప్రస్తుతం ఈ క్లయిం ఫారాలు ఇంగ్లీషులో వున్నాయి. నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులు తమ పని వదిలేసి అనుబంధ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరగలేరు. కనుక క్లయింల సంఖ్య చాలా తక్కువగా వుంటుంది. 2007 నుండి 2012 మధ్య బోర్డు ఇచ్చిన క్లయింలు రాష్ట్రం మొత్తం మీద 12 వేలు మాత్రమే. వీటిలో కూడా ప్రమాదాలు, ప్రమాద మరణాల క్లయింలు అతి తక్కువగా ఉంటున్నాయి. విశాఖపట్నం జిల్లాలో ఈ మొత్తం కాలంలో ఇచ్చిన ప్రమాద మరణాల క్లయింలు 11 కాగా దహన సంస్కార ఖర్చులు ఇచ్చింది మూడిటికి మాత్రమే.

కార్మికుల సంక్షేమం కోసం యజమానుల నుండి వసూలు చేసిన కోట్లాది రూపాయలు కార్మికులకు చేరకుండా బ్యాంకులలో మూలుగుతున్నాయి. బోర్డు,

దాని కార్యకలాపాలు పౌరసమాజం, మీడియా దృష్టిలో పడవు కనుక దానిపై పెద్దగా చర్చ వుండదు. కార్మిక శాఖ ప్రధాన ప్రభుత్వ శాఖగా గుర్తించబడనందున దాని కార్యకలాపాలపై ఎవరూ ఆసక్తి చూపరు. జిల్లాలలో కలెక్టర్లు క్రమం తప్పకుండా నిర్వహించే సమీక్ష సమావేశాలలో ఈ శాఖ ఉండదు. ఏదైనా పారిశ్రామిక వివాదం ఏర్పడి అది పెద్దదైతేనే వారిని పిలిపిస్తుంటారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులకు తప్ప కార్మిక శాఖ అధికారులెవరో పెద్దగా ఎవరికీ తెలీదు. అందుచేత అసలు సమస్య కార్మిక శాఖ, దాని నిర్మాణం, వ్యవహారశైలిలో వుంది. అదేమిటో చూద్దాం.

**కార్మికుల సంక్షేమం కోసం యజమానుల నుండి వసూలు చేసిన కోట్లాది రూపాయలు కార్మికులకు చేరకుండా బ్యాంకులలో మూలుగుతున్నాయి. బోర్డు, దాని కార్యకలాపాలు పౌరసమాజం, మీడియా దృష్టిలో పడవు కనుక దానిపై పెద్దగా చర్చ వుండదు.**

బోర్డు తరపున కార్మిక శాఖే సభ్యత్వాల నమోదు, క్లయిముల పరిష్కారం, చెల్లింపులు చేస్తూ వుంటుంది. కార్మిక శాఖ అట్టడుగు నిర్మాణం 'అసిస్టెంట్ లేబరు ఆఫీసరు' (ALO) కార్యాలయం. ఆ శాఖకు సంబంధించినంత వరకు ఇది MDO, తాశీల్దారు కార్యాలయం వంటిది. అయితే ఇవి అన్ని మండలాల్లో వుండవు. కార్మిక శాఖ మొదటి నుండి సంఘటిత రంగ కార్మికుల అవసరాల నుండే రూపొందినందున పరిశ్రమలు ఎక్కడ ఎక్కువ వుంటే అక్కడ అవి వుంటాయి, లేకపోతే లేదు. ఒక ఉదాహరణ చూద్దాం. విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి మండల కేంద్రంలో రెండు ALO కార్యాలయాలు వున్నాయి. వాటి పరిధిలోకి వచ్చే మండలాలు నాలుగు. కాగా చోడవరం ALO కార్యాలయం పరిధిలో 16 మండలాలు వున్నాయి. ఇందులో ఎనిమిది ఆదివాసీ మండలాలు. సంఘటిత కార్మిక రంగంతో వ్యవహరిస్తున్నంత కాలం వారికి ఈ ఏర్పాటు సరిపోయింది. ఎప్పుడైతే వారు నిర్మాణ రంగం అనే అసంఘటిత కార్మిక రంగంలోకి ప్రవేశించారో ఈ నిర్మాణ రూపం వారికి సరిపోవడం లేదు. ఎందుకంటే ప్రతి మండలంలోను నిర్మాణ (అసంఘటిత) రంగ కార్మికులు వుంటారు. ఉదాహరణకు ముంచింగ్‌పుట్ అనే ఆదివాసీ మండలం నుండి చోడవరంలోని ALO కార్యాలయానికి నిర్మాణ కార్మికుడు ఎలా రాగలడు? మారిన, పెరిగిన పని పరిస్థితులకు అనుగుణంగా కార్మిక శాఖ తన పాలనా వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయలేదు. ALO

కార్యాలయాలలో తగినంత సిబ్బంది ఉండరు. చోడవరం ALO కార్యాలయంలో ఆదివాసీ ప్రాంతాల నిర్మాణ కార్మికులకు మంజూరైన గుర్తింపు కార్డులు గుట్టలుగా పడివుంటాయి. కాని ఆ గుర్తింపు కార్డులు తీసుకువెళ్ళి ఆదివాసీ నిర్మాణ కార్మికులకు ఇచ్చేవారే లేరు.

అయినా అసంఘటిత కార్మికులను చేరుకోవడానికి తీసుకోవలసిన నిర్మాణపరమైన మార్పుల గురించి ఎలాంటి చర్చ లేదు. రాజకీయ పునరావాసంగా పదవులు పొందిన బోర్డు సభ్యులకు ఇటువంటి అంశాలపై ఆసక్తి లేదు. కార్మిక వ్యవహారాలు కేంద్ర కార్మిక సంఘాల గుత్త సొత్తుగా (బహుశా) భావిస్తుండటం వలన ఇతర ప్రజా సంఘాలు, సంస్థలు దీనిపై దృష్టి పెట్టడం లేదు. మీడియా దృష్టి కూడా లేకపోవడంతో బోర్డువారికీ, కార్మికశాఖ ఉన్నతాధికారులకూ చాలా సౌకర్యంగా వుంది.

బోర్డు ప్రారంభించిన కొత్తలో కార్మికుల నుండి ఒక సంవత్సరం సభ్యత్వాన్ని మాత్రమే వసూలు చేశారు. ఆ సమయం గడిచాక 'రెన్యువల్' చేయించుకునే బాధ్యత ఆ కార్మికునిదే. కార్మికులు జ్ఞాపకంగా వెళ్ళి సభ్యత్వం పునరుద్ధరించుకోవాలి. అది జరగదనేది మన అనుభవంలోని విషయం. పునరుద్ధరణ జరగని సభ్యత్వం సాంకేతికంగా రద్దయినట్లే. కనుక అటువంటివారు బోర్డు సహాయం పొందడానికి అర్హులు కారు. సభ్యులుగా చేరారంటున్న 19 లక్షలలో రద్దయిన సభ్యత్వాలు ఎన్నో బోర్డు చెప్పటంలేదు.

ALO కార్యాలయాలలో సిబ్బంది లేనందువలన (ముందు ప్రస్తావించిన చోడవరం ALO కార్యాలయంలో సిబ్బంది ముగ్గురే) సభ్యత్వ దరఖాస్తు తీసుకొని, రశీదు, ఆపై గుర్తింపుకార్డు ఇచ్చేందుకు మూడు నుండి ఆరు నెలల సమయం పడుతుంది. ఒక క్లయిం దాఖలు చేశాక ఆ నగదు ఎప్పుడు అందుతుందో తెలీదు. రోజువారీ పనులు మానుకొని ఎ.ఎల్.ఒ. కార్యాలయాల చుట్టూ తిరగలేక బోర్డుకు ఒక దణ్ణం పెట్టి కార్మికులు వూరుకుంటున్నారు. మరో ప్రధానమైన సమస్య కార్మికశాఖ అధికారుల వ్యవహారశైలి.

యజమాని – కార్మికుల వివాదాల పరిష్కారానికి మధ్యస్తం చేయడం, దుకాణాలు, సముదాయాలు సందర్శించి కేసులు రాయడం, కేంద్ర కార్మిక సంఘాల నాయకులతో మంతనాలు ఇవే కార్మిక శాఖ అధికారులు నేర్చుకున్నవి. నిర్మాణ కార్మికుల బోర్డు తరఫున వారు మొదటిసారి సంక్షేమ పథకాలతో

వ్యవహరించవలసి వస్తోంది. ఈ కొత్త బాధ్యతలకు వారిని వ్యవస్థాగతంగాను, మానసికంగాను సన్నద్ధులను చేయలేదు. గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలలో వారికి ఎలాంటి సిబ్బంది, నెట్‌వర్క్ లేదు. దాంతో వారు నిరంతరం ఒక అభద్రతా భావంతో, అనుమానంతో ఉంటారు. సంక్షేమ కార్యకలాపాల అనుభవం లేనందువలన క్లయిములు పరిష్కరించడం చేతగాక వాటిని ఏదో ఒక కారణంతో తిప్పి పంపిస్తుంటారు. మారిన పని పరిస్థితులకు తగిన వ్యవస్థాగతమైన ఏర్పాట్లు లేనందున బోర్డు పనిని అదనపు పని భారంగా భావిస్తుంటారు. ఇదంతా కార్యాలయానికి వచ్చే కార్మికునిపై ప్రదర్శిస్తుంటారు. ఒక్క నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వహణలోనే పరిస్థితులు ఇలా వుంటే రేపు అసంఘటితరంగ కార్మికులందరికీ వర్తించే సంక్షేమ బోర్డుల పరిస్థితి ఏమిటో మరి!

## పెన్షన్ కోరుతున్న కార్మికులు

బోర్డు పెట్టిన సంక్షేమ పథకాలు కూడా ఏమంత ఆకర్షణీయంగా లేవు. పథకాలలోని నగదు మొత్తాన్ని పెంచడంతోబాటు, సృజనాత్మకమైన, కార్మికులకు అవసరమైన కొత్త పథకాల రూపకల్పనకు బోర్డుపై బలమైన ఒత్తిడి పెట్టవలసిన అవసరం వుంది. కార్మికులు ప్రధానంగా పెన్షన్ సౌకర్యాన్ని కోరుకుంటున్నారు. వృద్ధాప్యంలో వారికి ఆసరా కావాలి. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పెన్షన్‌తో సంబంధం లేకుండా ఒక నిర్మాణ కార్మికునిగా బోర్డు నుండి పెన్షన్ పొందగలగాలి. ఈ అంశంపై లోతైన పరిశోధన చేయవలసి వుంది.

కార్మికుల సంక్షేమం కోసం బోర్డుకు 'సెస్' ద్వారా నిధులు సమకూరుతాయని మనం ముందు తెలుసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో సెస్ వసూళ్ళు సక్రమంగా జరగటం లేదు. కార్పొరేట్ కంపెనీలు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, భవన నిర్మాణ యజమానులు సెస్ చెల్లింపు నుండి తప్పుకుంటున్నారు. 10 లక్షలు పైబడిన నిర్మాణానికి విధిగా ఒక శాతం సెస్ చెల్లించాలి. కాని మున్సిపాలిటీలు, పాత తాలూకా కేంద్రాలు, వ్యాపార, వర్తక కేంద్రాలు, మేజరు పంచాయితీలలో సెస్ వసూళ్లు సరిగ్గా జరగటం లేదు. అంతేగాక పలు ప్రభుత్వ శాఖలు సెస్ చెల్లించడం లేదు. ఉదాహరణకు గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయితీరాజ్ శాఖ, గిరిజన శాఖలు పెద్దఎత్తున రోడ్లు, పంచాయితీ కార్యాలయాలు వంటి నిర్మాణ పనులు చేస్తున్నాయి. వారు వ్యాట్ / పన్నును చెల్లిస్తున్నారు కాని కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన సెస్‌ను మాత్రం చెల్లించడం లేదు. పార్లమెంట్ చట్టం ప్రకారం వసూలు చేయవలసిన ఒక

శాతం సెస్‌ను సక్రమంగా వసూలు చేస్తే బోర్డు వద్ద సంక్షేమ నిధులు రెట్టింపు స్థాయిలో ఉంటాయి.

కార్మికుల సంక్షేమం కోసం నిర్మాణ కార్మికుల బోర్డు ఖర్చు చేసేది నిజానికి వారి కష్టార్జితమే. ఇందులో ప్రభుత్వం పెడుతున్నదేమీ లేదు. కార్మికుల కష్టం వలన బోర్డులో ఎంత నగదు జమ అయితే దానికి కనీసం 10 శాతం నగదును రాష్ట్ర ప్రభుత్వం జమచేయాలని అడగవలసి ఉంది. ఈ నగదును కార్మికశాఖ ALO కార్యాలయాల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, ప్రచారం కోసం ఖర్చు చేయవచ్చును. అదే విధంగా సభ్యత్వాల సేకరణ, క్లయిములు దాఖలు చేసే సందర్భంలో అందుకు సహకరించి సేవలు అందించే సంస్థలకు, సామాజిక కార్యకర్తలకు బోర్డు పారితోషికం చెల్లించాలి. ఉదాహరణకు ఒక దరఖాస్తు నింపి రిజిస్ట్రేషన్‌లో కార్మికునికి సహకరించిన వారికి కర్ణాటక ప్రభుత్వం దరఖాస్తుకు 25 రూ.లు., ఢిల్లీ ప్రభుత్వం 50 రూ.లు చెల్లిస్తున్నాయి. మన రాష్ట్ర బోర్డు మాత్రం 5 రూ.లు ఇస్తామని చెప్పింది. అదే విధంగా క్లయిమును దాఖలు చేసి సహాయం అందించినందుకు కూడా ఇవ్వవచ్చును. దీనివలన పార్టీలకు అనుబంధంగా లేని ప్రజా సంఘాల కార్యకర్తలకు, సామాజిక కార్యకర్తలకు పూర్తిస్థాయిలో పని చేయడానికి ఆలంబన దొరుకుతుంది.

ఇప్పుడు అసంఘటిత కార్మికులందరికీ సంక్షేమ బోర్డు రాబోతున్నది. అయితే పుష్కలంగా నిధులు వుండి కూడా నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కార్మికులకు అందుబాటులో లేదు. మరోవైపు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం నుండి నెట్టివేయబడుతున్న కార్మికులందరూ నిర్మాణరంగంలోకే చేరుకుంటున్నారు. అమీర్‌ఖాన్ సినిమా 'పిప్లీ లైవ్' లోని ఆఖరి సన్నివేశం ఇదే. నిర్మాణ కార్మికులంటే మరెవరో కాదు గ్రామీణ కార్మికులే. వ్యవసాయానికి రాజీనామా చేసిన చిన్న, సన్నకారు, కౌలు రైతులే.

# భూమి - కాగుతున్న పెనం

నాగరాజ్ ఆడ్వె *

**భూమి, భూగ్రహం మీద జీవరాశులు ప్రస్తుతం అతిపెద్ద ఆపదను ఎదుర్కొంటున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా పెరుగుతూ వచ్చిన భూతాపం (గ్లోబల్ వార్మింగ్) ఇపుడు వెనక్కు తగ్గించుకోలేని స్థితికి వచ్చింది. ఈ సమస్యను ఎదుర్కోవాలంటే మనం ఈ స్థితికి ఎందుకు వచ్చామన్న కారణాలను అన్వేషించడంతో పాటు భూతాపం పెరగడం వల్ల సంభవించే వాతావరణ మార్పులు, ప్రభావాలను కూడా అధ్యయనం చేయాలి.**

మా సంస్థ ఢిల్లీ ప్లాట్‌ఫాం గతేడాది నవంబర్లో గుజరాత్ అగ్రికల్చరల్ లేబర్ యూనియన్, ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఫుడ్ వర్కర్స్ సభ్యులతో కలిసి గుజరాత్‌లో కొన్ని ప్రాంతాలను సందర్శించింది. మా పర్యటనకు కొంచెం ముందు మునుపెన్నడూ కురవనంతగా భారీవర్షాలు ఆ ప్రాంతాన్ని ముంచెత్తి పత్తి, ఇతర పంటలను సర్వనాశనం చేశాయి. వ్యవసాయం కోలుకోలేని విధంగా దెబ్బతినింది. మేము ఇంకా అనేక దుష్ఫలితాల గురించి కూడా విన్నాం. శీతాకాలాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిన ఫలితంగా మంచు (Snow) కురవడం మందగించిందని చెప్పారు. పొలాల్లో బావులు తవ్వించుకోలేని పేదలు వ్యవసాయానికి ఈ మంచు మీదే ఆధారపడతారు. గుజరాత్ తూర్పు ప్రాంతంలో ప్రధాన పౌష్టికాహార వనరైన మొక్కజొన్న పంట ఈ కారణంగానే దెబ్బతిన్నది. కీటకాలు పెరగడం, మనుషులకూ, పశువులకూ కొత్త రోగాలు సంక్రమించడం, అతివృష్టి, అనావృష్టి, అస్వాభావిక వర్షాలు - ఇవీ వారు చెప్పిన ఇతర సమస్యలు.

*పర్యావరణవేత్త, న్యూఢిల్లీ

ఈ పరిణామాలకు ప్రజలు స్పందించిన తీరు చాలా ఆసక్తి కలిగించింది. చాలా గ్రామాల్లో మేము విన్నమాట ఇదీ – 'యే సబ్ ప్రకృతికీ బాత్ హై'. కానీ మానవునికి ప్రకృతిని మార్చగల శక్తి ఉందన్న విషయాన్ని వాళ్ళు గ్రహించలేదు. బహుశా దాన్ని ఊహించదగ్గ విషయంగా కూడా వారు పరిగణించలేదు.

## గ్లోబల్ వార్మింగ్ అంటే ఏమిటి?

గ్లోబల్ వార్మింగ్ ప్రక్రియ కర్బన చక్రం (కార్బన్ సైకిల్) లో మానవ జోక్యం పెచ్చుమీరినందువల్ల సంభవిస్తోంది. భూమి మీద జీవం మనుగడలో కార్బన్ ప్రధాన భూమికను పోషిస్తుంది. సముద్రాలు, వాతావరణం, రాళ్ళు, అరణ్యాలు, పర్వతాలు, జీవరాశుల మధ్య ఒక చోటు నుంచి మరో చోటికి కార్బన్ నిరంతరం ప్రయాణిస్తూ ఉంటుంది. (మొక్కలూ చెట్లలో జరిగే కిరణజన్య సంయోగ క్రియ, ప్రాణుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, భూమిలో పదార్థాలు కుళ్ళిపోవడం, శిలాజ ఇంధనాల దహనం వంటి ప్రక్రియల ద్వారా కార్బన్ ఒక చోటి నుంచీ మరొక చోటికి ప్రయాణం చేయడాన్నే కర్బన చక్రం అంటారు). ఈ కర్బన చక్రం మిలియన్ల ఏళ్ళ నుంచి అతి నెమ్మదిగా నడుస్తూ ఉంది. కాని మానవ జోక్యం మూలంగా కర్బన చక్రంలోని కొన్ని ప్రక్రియలు కొన్ని వేల రెట్లు వేగం పుంజుకున్నాయి. పరిశ్రమలు, ఇతర మానవ అవసరాల కోసం చమురు, గ్యాస్, బొగ్గులను మండించడం వల్ల హరిత వాయువులయిన (గ్రీన్ హౌస్ వాయువులు) కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ల పరిమాణం వాతావరణంలో పరిమితికి మించి చేరిపోతున్నాయి.

పై వాటన్నిటిలో కార్బన్ డై ఆక్సైడ్ అతి ముఖ్యమైనది. ఎందుకంటే దాని మనుగడ కాలం చాలా ఎక్కువ. మనకు అందుబాటులో ఉన్న గణాంకాలను బట్టి శిలాజ ఇంధనాల వినియోగం ద్వారా 3,100 కోట్ల టన్నుల (ఒక టన్ను అంటే వెయ్యి కిలోలు) కార్బన్ డై ఆక్సైడ్, అడవుల విధ్వంసం ద్వారా 400 కోట్ల టన్నుల కార్బన్ డై ఆక్సైడ్, ఇతర వాయువుల వినియోగం ద్వారా 800 కోట్ల టన్నుల 'కార్బన్ డై ఆక్సైడ్‌తో సరిసమానమైన పదార్థాలు' వాతావరణంలోకి చొచ్చుకు పోయాయి. ఇందులో 25 శాతానికి విద్యుత్తు రంగం; 14 శాతం చొప్పున రవాణా, పారిశ్రామిక, వ్యవసాయరంగాలూ; దాదాపు మరో 14 శాతానికి అటవీ విధ్వంసం కారణమవుతున్నాయి. సుమారు 70 శాతం ఉద్గారాలు అర్బన్ ప్రాంతాల నుంచే విడుదల అవుతున్నాయి. భూమి రమారమి 16 నుంచి 17 వందల కోట్ల టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ను మాత్రమే శోషించుకోగలదు. ఇందులో రెండింట మూడొంతుల భాగాన్ని సముద్రాలు పీల్చుకుంటాయి. ఒక పెద్ద స్పాంజ్ వంటి సముద్రాన్ని మనం ఒక చెత్తకుండీలా వాడుతున్నాం. ఇటువంటి దుర్వినియోగం

సముద్రాలను మరింత ఆమ్లపూరితంగా మారుస్తున్నది. పారిశ్రామిక విప్లవం ప్రారంభం నాటి కంటే నేడు సాగరాలు 30 శాతం అదనంగా ఆమ్ల స్వభావాన్ని సంతరించుకున్నాయి. ఆహార చక్రం (ఫుడ్ చెయిన్)లోని జలచరాలకు ఇది హానికరంగా మారుతోంది. కర్బన చక్రంలో మానవ జోక్యం మూలంగా దాపురిస్తున్న ప్రమాదం ఇది. కార్బన్ డయాక్సైడ్, ఇతర ఉద్గారాలు కలిసి ఏటా సుమారు 17 వందల కోట్ల టన్నులు వాతావరణంలో చేరుతున్నాయి. ప్రతీ 800 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ 1 పి.పి.ఎం. తో (PPM- Parts per million) సమానం. ఏటా 2 పి.పి.ఎం. చొప్పున కర్బన ఉద్గారం పెరుగుతూ వస్తోంది. ఇప్పటికిది 393 పి.పి.ఎం.కు చేరిపోయింది. మానవాళి బతికి బట్టగట్టాలంటే ఈ పరిమాణాన్ని 350 పి.పి.ఎం. లోపుకు తగ్గించుకోవాలని ప్రపంచ వ్యాపితంగా అందరూ గౌరవించే పర్యావరణవేత్త జేమ్స్ హేన్సన్ అంటారు. కాని మనమేం చేస్తున్నాం? దాన్ని మరింతగా పెంచుకుంటూ పోతున్నాం.




పరిమితికి మించి వాతావరణంలో ఉండి పోతున్న ఈ వాయువులు ఒకానొక ఫ్రీక్వెన్సీ రేంజ్‌లోని సూర్యతాపాన్ని (సోలార్ రేడియేషన్) గ్రహించుకోవడం గ్లోబల్ వార్మింగ్‌కు దారి తీస్తున్నాయి. ఈ అదనపు ఉష్ణశక్తిలో అధిక భాగాన్ని (గత 50 ఏళ్లలో 90 శాతం వరకు) సముద్రాలు శోషించుకుంటున్న ఫలితంగా సముద్ర జలాలు రెండు వేల మీటర్ల లోతు వరకు వేడెక్కుతున్నాయి. పారిశ్రామిక విప్లవం నుంచి నేటి వరకు యావత్తు భూ ఉపరితలం మీద ఉష్ణోగ్రత పెరుగుదల 0.9 డిగ్రీల సెల్సియస్ అయితే అది నేడు ప్రతి పదేళ్లకు 0.17 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతూ వస్తోంది. ఆనాడది 13.5 డిగ్రీల సెల్సియస్ కాగా నేడది 14.4 డిగ్రీలు. గ్లోబల్ వార్మింగ్‌ను మరొక రకంగా పరిశీలిద్దాం. గత 250 ఏళ్లలో భూగోళం మీద ప్రతి చదరపు మీటరుకు సగటున 1.6 వాట్ల మేరకు ఉష్ణశక్తి పెరిగింది. ఈ పెరిగిన

శక్తితో ఓ మధ్యతరగతి ఇంట్లో ఓ 100 వాట్ల బల్బును వెలిగించుకోవచ్చు. రెండు విషయాలు ఇక్కడ మనం గమనంలో ఉంచుకోవాలి. మనం చెప్పుకుంటున్న 0.9 డిగ్రీల సెల్సియస్ సగటు లెక్క మాత్రమే. హిమాలయాలు, ఆర్కిటిక్ ప్రాంతాలలో భూతాపం పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. (కొన్ని చోట్ల తక్కువగా ఉంటుంది. అన్ని ప్రాంతాలలో భూతాపం పెరుగుదలల్ని కలిపి సగటు లెక్క వేస్తున్నాం.) రెండోది ఏమిటంటే కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలయిన తర్వాత భూఉష్ణోగ్రతలు పెరగడానికి కొంత సమయం పడుతుంది. అంటే మరింతగా భూతాపం పెరగడానికి కావాల్సిన శక్తి వెనక సిద్ధంగా ఉందన్నమాట. (కొత్తగా విడుదల అవుతున్న కార్బన్ ఉద్గారాలు తమ ప్రకోపం చూపించడానికి మరికొంత సమయం పడుతుంది అని దీని అర్థం.) దీన్ని మనం తప్పించలేము. రానున్న దుష్ఫలితం ఎంత మేరకు ఉంటుందోనన్న చర్చ మన దృష్టిని ఆకర్షించటం లేదు. చాలామంది అది 0.6 డిగ్రీల సెల్సియస్ ఉండొచ్చని అంటున్నారు. అనుభవజ్ఞులయిన శాస్త్రవేత్తలు అది 2 డిగ్రీలకు మించే ఉండొచ్చని చెబుతున్నారు.

భూ వ్యవస్థలలో అసమతుల్యానికి ఈ అదనపు శక్తి దోహదపడుతోంది. తద్వారా వాతావరణ మార్పులకు కారణమవుతోంది. ఋతుపవనాలు, సముద్రజలాల వేడి, వ్యవసాయ దిగుబడులు, జీవరాశి విస్తృతి వంటి అంశాలెన్నో శక్తి సమతుల్యం పైనా, ప్రకృతి సమతుల్యం పైనా, ఉష్ణోగ్రతల సమతుల్యం పైనా ఆధారపడతాయి. వీటిలో మన జోక్యం పెరిగిపోయింది. ఒక పరిశీలకుడు అంటాడు – ''మానవ నాగరికత హోలోసీన్ (పన్నెండు వేల ఏళ్ళ క్రితం – Holocene) కాలంలో అవతరించింది. ఒక అసాధారణ వాతావరణ స్థిరత్వాన్ని సాధించిన యుగమిది. ఆ కాలం ముగియబోతోంది.''

## భూతాపం – పెట్టుబడి, వర్గం

పారిశ్రామిక పెట్టుబడి, వర్గం – ఈ రెండూ భూతాప సమస్యకు ఆయువుపట్టు లాంటివి. వివిధ రూపాల్లో నిర్వచించిన సమానత్వ భావనే ప్రధానంగా దీని నుంచి బైటపడే దారిని చూపించగలదు. ఎందుకంటే గ్లోబల్ వార్మింగ్‌తో తలపడడానికి ప్రభుత్వాలు దేశాలను (నేషన్ స్టేట్) ఒక నమూనాగా ముందుకు నెడతాయి. ఆ నమూనాతో చాలా మంది వ్యక్తులకూ, సంస్థలకూ ఏకీభావం ఉంటుంది. ఈ రకమైన మార్గం ఎన్నడూ ఫలితాన్ని ఇవ్వదు. ఎందుకంటే ప్రధాన కారణాలయిన పెట్టుబడి, వర్గాలను అవి విస్మరిస్తాయి కనుక. ఈ కారణంగానే కోపెన్ హేగన్, డర్బన్ వంటి ఐక్యరాజ్య సమితి సమావేశాలు సంపూర్ణంగా విఫలమవుతున్నాయి.

## పెట్టుబడి తెచ్చిన పెనుమార్పులు

**ప్రపంచ ఉద్గారాల పరిమాణం మళ్ళీ పైకి ఎగబాకింది తొంభైల చివర్లో చైనా ఆర్థిక పురోగతి ప్రక్రియ మొదలైన తర్వాతే. అక్కడనుంచి అది పైకి దూసుకుపోతూనే ఉంది. ఎందుకంటే 'తయారీ పరిశ్రమ' మొత్తం అక్కడికి వెతుక్కుంటూ వెళ్ళిపోయింది.**

కొంతమంది పర్యావరణ చరిత్రకారులు కర్బన చక్రంలో మానవ జోక్యం వేల ఏళ్ళ క్రితమే ప్రారంభమయ్యిందని చెబుతారు. ఆవాసాల కోసం, వ్యవసాయం కోసం అడవులను కొట్టి వేయడం (చనిపోయిన చెట్టు కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తుంది), మళ్ళలో నీటిని నిలువచేసి పంటలు పండించడం (మీథేన్ విడుదల అవుతుంది) వంటి వాటిని దానికి ఉదాహరణగా చూపుతారు. ఇది వాస్తవమే కాని, 1750 లో ప్రారంభమయిన పారిశ్రామిక పెట్టుబడి మూడు రకాలుగా పెను మార్పులను తెచ్చి పెట్టింది. ఒకటేమిటంటే విస్తృత ఇంధన వినియోగం – తొలుత బొగ్గు, ఆ తర్వాత చమురు, గ్యాస్. రెండోది – పారిశ్రామిక పెట్టుబడికి సహజంగా ఉండే లాభాపేక్ష, చవకగా ఇంధన, మానవ వనరులను వినియోగించుకోవాలనే ఉబలాటం. ఉద్గారాల తాజా గణాంకాలు ఈ వాస్తవాన్ని వెల్లడి చేస్తున్నాయి. క్యోటో ప్రోటోకాల్ గడువు పూర్తయిన 1990 నాటికే కార్బన్ డయాక్సైడ్ ఉద్గారం 2,100 కోట్ల టన్నులు ఉంది. సోవియెట్ రష్యా విడిపోయిన తర్వాత, రష్యా ఉద్గారాలు తగ్గుముఖం పట్టి ప్రపంచ ఉద్గారాల పరిమాణం ఒక చోట కొద్దికాలం స్థిమితంగా ఉండిపోయింది.

అది మళ్ళీ పైకి ఎగబాకింది తొంభైల చివర్లో చైనా ఆర్థిక పురోగతి ప్రక్రియ మొదలైన తర్వాతే. అక్కడనుంచి అది పైకి దూసుకుపోతూనే ఉంది. ఎందుకంటే 'తయారీ పరిశ్రమ' మొత్తం అక్కడికి వెతుక్కుంటూ వెళ్ళిపోయింది. కారణాలు రహస్యమేమీ కాదు. చైనాలో అసంఘటిత కార్మికులు తక్కువ వేతనానికే దొరుకుతారు. బొగ్గు చవగ్గా లభ్యమవుతుంది. అందుకే చైనాలో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు 2010 నాటికి అనూహ్యంగా 8.3 వందల కోట్ల టన్నులకు చేరిపోయాయి. దాంతో అమెరికా రెండో స్థానంలోకి వెళ్లింది. అది విడుదల చేస్తున్న కార్బన్ ఉద్గారాల పరిమాణం 5.6 వందల కోట్ల టన్నులు. దీని అర్థం అమెరికా కంటే చైనా ఒకటిన్నర రెట్లు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తోందన్నమాట. ఆర్థిక మాంద్యం సమయంలో కూడా శిలాజ ఇంధన వినియోగం ద్వారా విడుదల అయ్యే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం ప్రపంచంలో

పెరుగుతూ వస్తోందంటే దానికి ప్రధాన కారణం చైనాలో విడుదల అవుతున్న ఉద్గారాలే.

ఇక మూడోది – వ్యవస్థకు అభివృద్ధి/ పెరుగుదల కీలకమనే అభిప్రాయం. వృద్ధి లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థను ఊహించలేము. పారిశ్రామిక విప్లవానికి ముందు 750 ఏళ్లలో ఆర్థిక వృద్ధి ఏటా కేవలం 0.1 శాతం మాత్రమే. అక్కడి నుంచి అది సాలీనా 2–3 శాతంగా ఉంటూ వస్తోంది. పారిశ్రామిక విప్లవానికి ఎనిమిది వేల ఏళ్ళ ముందు కార్బన్ డయాక్సైడ్ ఉద్గారం 30–40 పిపియం మాత్రమే పెరుగుతూ వచ్చేది. ఆ తర్వాత మాత్రం అది 110 పిపియం అయింది. కాబట్టి అసలు కారణాలను విస్మరించి పైకి చెప్పుకునే 'పరిష్కారాలు' ఏ ఫలితాన్నీ ఇయ్యవు.

## వర్గం, అంతర్గత సమన్యాయం

ప్రధాన స్రవంతి భావనల్లో విస్మరణకు గురయ్యే మరొక అంశం వర్గం, అంతర్గత సమ న్యాయం. మా దేశంలో 'తలసరి కార్బన్ విడుదల' తక్కువని భారతదేశం అంటోంది. చాలామంది ప్రజలు ఆ వైఖరిని అంగీకరిస్తున్నారు. ప్రజల విషయానికొచ్చేసరికి 'తలసరీ' లేదు, ఒకే 'భారత దేశమూ' లేదు. ప్రభుత్వం పేదలను అడ్డం పెట్టుకొని వాదన చేస్తోందంతే. వాస్తవం ఏమిటంటే కోట్లాది మంది ప్రజల వినియోగం – వారు చేయదగిన వినిమయ స్థాయి కంటే తక్కువగా ఉంటోంది. కాబట్టే మన తలసరి 'తక్కువ'గా ఉండడం సాధ్యమైంది. దారిద్ర్య రేఖ మీద జరుగుతున్న చర్చ దీనికి అద్దం పడుతుంది. కార్బన్ విడుదల పరిమాణం ఆదాయం, వర్గం రెంటి మీదా ప్రత్యక్షంగా ఆధారపడ్డ విషయం. ఆదాయం, వర్గం రెంటికీ విధాన నిర్ణయాలతో, ఫైనాన్స్ దిగుమతితో లంకె ఉంది. గత 20 ఏళ్లలో లిబరలైజేషన్ విధానాలు ప్రజల ఆదాయంలో అసమతుల్యాన్ని తెచ్చిపెట్టాయి. కర్బన వినియోగాన్ని మొత్తంగా చూసినప్పుడు డెబ్బై శాతం పైగా ఉద్గారాల విడుదల అర్బన్ ప్రాంతాల నుంచే జరుగుతోంది. ఒక వ్యక్తి వలన లేదా ఒక ఇంటి నుంచి ఎంత ఉద్గారం విడుదల అవుతున్నదనే విషయం ఎవరు ఏ ఏ ఉపకరణాలను వాడుతున్నారనే విషయాలపైన ఆధారపడి ఉంటుంది. వినియోగిస్తున్న ఉపకరణాలు – ఏసీ కావచ్చు, హీటర్ లేదా టోస్టర్ మరేదైనా కావచ్చు.

ఉదాహరణకు ఒక కారు ప్రతి ఆరు కి.మీలకు ఒక కిలో కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తుంది. అదే బస్సు అయితే అందులో పదోవంతు తలసరిన విడుదల చే

స్తుంది. ఢిల్లీ నుంచి వరంగల్లుకు 1545 కి.మీ. రైలు ప్రయాణం చేస్తే 35 కిలోల కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. అదే ప్రయాణం విమానంలో చేస్తే అది 200 కిలోలు అవుతుంది. భూతాప ప్రభావాన్ని లెక్కవేసుకుంటే అది ఇంకా ఎక్కువే. ఇళ్ళలో కార్బన్ ఫుట్‌ప్రింట్ లెక్కవేయడం ఎలా అన్న విషయం ఢిల్లీ ప్లాట్‌ఫాంలోని నా సహచరుడుగా ఉన్న ఒకరు కళాశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించారు. ఢిల్లీలో నివసిస్తున్న ప్రతి మధ్యతరగతి వ్యక్తి 4-5 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను వెలువరిస్తున్నారని వర్క్‌షాప్ లెక్కలు తేల్చాయి. ధనిక కుటుంబాలైతే యూరోపియన్ స్థాయిలో ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. అదే సమయంలో దేశంలోని వ్యవసాయ కూలీల, అర్బన్ ఫ్యాక్టరీ కార్మికుల, ఆదివాసీ సమాజాల వినియోగం బాగా తక్కువ. అర్జున్ సేన్ గుప్తా కమిటీ నివేదిక 83.60 కోట్ల మంది ప్రజానీకం రోజుకు రూ. 20 కంటే తక్కువ ఖర్చు పెడుతున్నారని చెబుతోంది. వీళ్ళు విడుదల చేసే కార్బన్ ఎంత? నిజానికి వీళ్ళు మరింత విడుదల చేయడానికి అర్హులు. ధనిక, మధ్యతరగతి వారు తమ వినియోగాన్ని తగ్గించుకొనేలా చెయ్యగలిగినప్పుడే పేదలు తమ వినియోగాన్ని పెంచుకోగల్గుతారు.

## గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు

గ్లోబల్ వార్మింగ్‌కు కొంచెం కూడా కారణం కాని ప్రజలు - అంటే పేద మహిళలు, ఆదివాసులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మికులు వగైరా - దాని దుష్ప్రభావాల బారిన ఎక్కువ పడుతున్నారు. 1970ల మధ్యలో దీని ప్రభావాలు స్పష్టంగా కనిపించడం మొదలయ్యింది. కాని వాతావరణ మార్పుల దుష్ఫలితాలు మాత్రం గత 5 ఏళ్ళ నుంచీ మరింత తీవ్రతరం అయ్యాయి.

ఇతర దుష్ఫలితాల గురించి మాట్లాడే ముందు వర్షపాత సరళిలో మార్పుల గురించి తెలుసుకుందాం. ఎందుకంటే మారుతున్న వర్షపాత సరళి ఇప్పటికే దేశ గ్రామీణ ప్రాంతంలోని లక్షల మంది చిన్నకారు, మధ్య తరగతి రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలపై చాలా ప్రభావాన్ని చూపాయి.

### 1. క్రమరహిత వర్షపాతాలు

వానలు పడాల్సిన కాలంలో వానలు పడకపోవడం, కురవకూడని ఋతువుల్లో వర్షాలు కురవడం ఈ రోజుల్లో తరచూ జరుగుతోంది. వర్షపాతంలో ఎప్పుడూ కొన్ని హెచ్చుతగ్గులు ఉంటూ వచ్చాయి కానీ అవి నేడు ఒక సహజమైన స్థాయిని దాటిపోయాయి. వానలు పడతాయని భావించి రైతులు నాట్లు వేస్తారు, వానలు పడవు. ఒక్కోసారి పంట నూర్పుళ్ల వేళలోనో, కోతల వేళలోనో చేతికొచ్చిన పంటను

నాశనం చేస్తూ కుండపోతగా వర్షం కురుస్తుంది. మూడేళ్ళ క్రితం ఇలాంటి పరిణామం దక్షిణ కర్ణాటకలోని మా ఊరి ప్రాంతంలో సంభవించింది. వరి పంట పూర్తిగా నాశనం అయ్యింది. ఇటువంటి వైపరీత్యం తమ జీవితంలో ఎన్నడూ చూడలేదని పెద్దవాళ్ళయిన నా బంధువులు చెప్పారు. వాళ్ళు అక్కడే 70 ఏళ్లకు పైగా నివసిస్తున్నారు. తీర ప్రాంత కర్ణాటక, రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్రలలో గతేడాది అసాధారణంగా భారీ వర్షాలు కురిసి పంటలను పాడు చేశాయి. వానలు పడనప్పుడు బావుల, డీజిల్ పంపుల సౌలభ్యం ఉన్న ధనికులు భూగర్భ జలాలను తోడుకొని వ్యవసాయం చేస్తారు. లేని వాళ్ళు అనావృష్టిని భరిస్తారు. కురవకూడని కాలంలో వానలు పడితే ఎవరైనా ఏమి చేస్తారు? కొంచెం డబ్బున్న వాళ్లకయితే మ ళ్లీ కొనడానికి విత్తనాలు, సహాయం లభించే అవకాశం ఉంటుంది. లేనివాళ్ళకు ఆ అదృష్టం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొన్ని చోట్ల పేదలు పనుల కోసం వలసలు పోతారు.

## 2. అల్ప సమయంలో అత్యధిక వర్షం

గతంలో వానాకాలం అంతటా వర్షాలు ఎక్కువ తక్కువలు లేకుండా దరిదాపు సమానంగా కురిసేవి. ఇటీవల కాలంలో చాలా చోట్ల ఇలా జరగడం లేదు. ఆ కాలమంతటా పడవలసిన వాన కొద్ది రోజుల్లోనే కురుస్తోంది. తిరుపతిలోని జాతీయ వాతావరణ పరిశోధక కేంద్రం (National Atmospheric Research Laboratory) శాస్త్రవేత్తలు 2008లో ఈ విషయంలో ఒక అధ్యయనం చేశారు. గత 50 ఏళ్ల వర్ష సరళిని పరిశీలిస్తే ప్రతి 10 ఏళ్లకు 6 శాతం చొప్పున అతివృష్టి ఘటనలు పెరుగుతూ వస్తున్నాయనీ, తగినంతగా వర్షం కురిసే సరళి ఏటా 2.3 శాతం తగ్గుకుంటూ వస్తోందనీ ఆ అధ్యయనం పేర్కొంటోంది. మరీ ముఖ్యంగా ఆ అధ్యయనం ఒక విషయాన్ని కనుగొంది. గ్లోబల్ వార్మింగ్ మూలంగా సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు పెరగడానికీ, గత ఐదు దశాబ్దాలుగా సంభవిస్తున్న అతివృష్టి సంఘటనలకీ మధ్య ఒక క్రమానుగత సంబంధం (pattern) ఉన్నట్లు కనుగొన్నది.

విపరీత వర్షాలు చాలా నష్టాలను కొని తెస్తాయి. వ్యవసాయం మీదా, నదుల మీదా, వరదల పైనా, భూగర్భ జలాల పైనా వాటి ప్రభావం ఉంటుంది. ఇటీవల ఒడిషాలో వచ్చిన వరదలు ఒక ఉదాహరణ. సెప్టెంబర్ 3న ఒడిషా ముఖ్యమంత్రి 17 జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించారు. సెప్టెంబర్ 8న ఒడిషాలోని మహానది పరీవాహక ప్రాంతంలో, ఛత్తీస్‌గఢ్‌లో విపరీతంగా వానలు కురిసాయి. ఆ ఒక్క రోజులోనే రాయగడలోని కెలో లో 485 మి.మీ.లు, కోర్బాలో 245

మి.మీలు వర్షపాతం నమోదు అయ్యింది. అంతవరకూ వాన ఊసే లేని ఒడిషాలో సెప్టెంబర్‌లో కురవవలసిన సగటు వర్షపాతం కంటే ఒకేసారి రెట్టింపు వర్షం కురిసింది. ఫలితం – భారీ స్థాయిలో వరదలు, 83 మంది దుర్మరణం, 59 లక్షల మందిపై వరద ప్రభావం. ఏదో ఒక సంఘటనను చూసి అది వాతావరణ మార్పుల వల్లే జరిగిందని అంతిమ నిర్ణయానికి రాలేని మాట నిజమే. కాని వాతావరణ మార్పు అన్నది ఒక సంఘటన కాదు. కాలక్రమంలో జరిగే ఒక ప్రక్రియ. ఇక్కడి వాన వైపరీత్యం వాతావరణ మార్పు నమూనా ఊహించిన ప్రభావానికి అనుగుణంగానే ఉంది కదా. కనుక ప్రకృతి సహజం అనుకునే వరదలు వంటి విషయాలు ఇక ఎంతమాత్రం 'సహజం' కాదు. మానవ కార్యకలాపాల వల్లనే వరదలూ, దాని ఫలితంగా విస్థాపన సంభవిస్తున్నాయి. అటవీ ప్రాంతాలలో పరిశ్రమ లేదా జలాశయ నిర్మాణ ఏర్పాటు మూలంగా జరిగే విస్థాపన ఎలాంటిదో ఇదీ అలాంటిదే. కాకపోతే దానిలో కనిపించినట్టు వాతావరణ మార్పు విషయంలో లంకె స్పష్టంగా తెలియదు.

**ప్రకృతి సహజం అనుకునే వరదలు వంటి విషయాలు ఇక ఎంతమాత్రం 'సహజం' కాదు. మానవ కార్యకలాపాల వల్లనే వరదలూ, దాని ఫలితంగా విస్థాపన సంభవిస్తున్నాయి. అటవీ ప్రాంతాల లో పరిశ్రమ లేదా జలాశయ నిర్మాణ ఏర్పాటు మూలంగా జరిగే విస్థాపన ఎలాంటిదో ఇదీ అలాంటిదే.**

## 3. శీతాకాల ఉష్ణోగ్రతల్లో పెరుగుదల

పాతిక ముప్పై ఏళ్ళుగా ఢిల్లీలోనే ఉంటున్న ఏ ఒక్కరినైనా కదపండి, దీపావళి రోజుల్లో మునుపు ఎంత చలిగా ఉండేదో, ఎలాంటి ఉన్ని దుస్తులు వేసుకోవాల్సి వచ్చేదో చెబుతారు. పెరిగిన కార్ల సంఖ్య, నిర్మాణాలు నగర ఉష్ణోగ్రతల తాజా పెరుగుదలకు – దీన్నే అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ అని పిలుస్తుంటారు – కారణం అంటారేమో. మరి తూర్పు గుజరాత్‌లో ఏ కార్లూ, రోడ్లూ లేని చిన్న పల్లెటూళ్ళలో కూడా వేడిమి పెరిగిన మాట విన్నామే! పెరిగిన శీతాకాలపు ఉష్ణోగ్రతలే ఇక్కడి పంచమహల్ జిల్లాలో మంచు తగ్గిపోవటానికీ, అసలు కురవకపోవడానికీ కారణం. బావి నీటి సౌకర్యం లేని పేదల పొలాలలో మొక్కజొన్నకు, ఇంకా ఇతర పంటలకు ఈ మంచే ఆధారం. మొక్కజొన్న వారి ప్రధాన పౌష్టికాహార వనరు కూడా. మంచు కురవని ఫలితంగా వారు నాట్లు వేయకపోవడమో లేదా నాట్లు వేసిన తర్వాత వాటిని వదిలివేయడమో చేశారు.

శీతాకాల ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రత్యేకించి ఆకాశంలో చాలా పై తలంలో (Higher altitudes) జరుగుతోంది. మధ్య హిమాలయాల్లో 2000-2007 నాటి సగటు ఉష్ణోగ్రతలు 1973-1990ల కాలం నాటి సగటు ఉష్ణోగ్రతల కంటే 2-3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉన్నాయని హిమాచల్ ప్రదేశ్‌లోని వైఎస్ పర్మార్ హార్టికల్చర్ అండ్ ఫారెస్ట్రీకు చెందిన ఒక సీనియర్ శాస్త్రవేత్త వెల్లడించారు. ఒకనాడు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పదిహేను వందల మీటర్ల ఎత్తులో ఉన్న పర్వతాలలోనే ఆపిల్స్ పండేవి కాని నేడు రెండువేల మీటర్ల ఎత్తులోగాని పండట్లేదు. మునుపు కాలీఫ్లవర్, కాబేజ్ పండని చోట నేడు వాటిని పండించుకోవచ్చునని కొన్ని గ్రామాల్లోని కొంతమంది ప్రజలు సంతోషంగానే ఉండవచ్చు. కాని వీటిని సాగు చేయగల ఉష్ణోగ్రతలు ఈ గ్రామాలకు మరింత పైన ఉండే పర్వతాలలోనే లభించే పరిస్థితి ఒక రోజు వస్తుంది. అప్పుడు వారు ఎక్కడికి పోతారు?

కాగా, ప్రపంచమంతటా ప్రాణుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. భూతాపం పెరుగుతున్న కొద్దీ జలచరాలకు అవసరమైన సముద్ర నీటి ఉష్ణోగ్రతలు ధ్రువప్రాంతాలలో కూడా ఉంటున్నాయి. మన హిందూ మహాసముద్రంలో భాంగ్డా, ఇతర రకాల చేపల లభ్యత విషయంలో మనం దీనిని గమనించవచ్చు. మహారాష్ట్ర రత్నగిరిలో ఇదివరలో లభించే ఈ భాంగ్డా చేప నేడు గుజరాత్ జలాలలో కూడా దొరుకుతోంది. తూర్పుతీరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిషా తీరప్రాంతానికి ఈ చేపల చలనం మళ్లింది.

## 4. కరువు

బుందేల్‌ఖండ్ చాలా విశాలమైన ప్రాంతం. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని 13 జిల్లాలు ఇందులోకి వస్తాయి. ఇక్కడ ఎన్నడూ లేనంత స్థాయిలో నీటి కరువు నెలకొనడాన్ని మేము గమనించాము. సుమారు 25 నుంచి 30 లక్షల మంది ప్రజలు బలవంతంగా వలస పోవాల్సి వచ్చిందని జనసత్తా పత్రిక ప్రచురించింది. ఒక్క వాతావరణ మార్పులే కరువుకు కారణమని చెప్పడం కష్టమే. ఇతర కారణాలు కూడా దోహద పడ్డాయి. రైతులు నీరుతడి బాగా కావాల్సిన పంటలకు మళ్లడం, సొంత భూములున్నవారు డీజిల్, సబ్-మెర్సిబుల్ పంపులను వినియోగించడంతో పాటు వానలు పడకపోవడం కూడా కరువుకు కారణాలు. మహోబా జిల్లాలో 1994-2002 మధ్య వరుసగా తొమ్మిదేళ్ళలో పడ్డ వర్షపాతం 500 మి.మీ. కంటే తక్కువ. దానికి ముందు 26 ఏళ్ల కాలంలో ఎన్నడూ ఇలాంటి స్థితి వరుసగా రెండు సంవత్సరాలకు మించి లేదు. 1994-2007 మధ్య అక్కడి సగటు వర్షపాతం 400

మి.మీ.లే. దీర్ఘకాలిక సగటుకు ఇది బాగా దిగువున ఉంది. గ్రామస్తులు కూడా తాము ఇటువంటి స్థితిని ఇంతకు ముందెప్పుడూ చూడలేదని చెప్పారు.

అనేక గ్రామాల్లో సగం ఇళ్ళకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించాము. పొలాలనూ, పశువులనూ, ఇంట్లో పెద్దవాళ్ళనూ వదిలి మరీ వాళ్లంతా వలసపోయారు. మిట్ట మధ్యాహ్నపు ఎండలో ఆ గ్రామాల్లో నొసటన చావును రాసుకుని పశువులు అటూ ఇటూ దిక్కుతోచక తిరుగుతుండడం చూశాం. ఈ గ్రామాల్లో వ్యవసాయం సర్వనాశనం అయింది. సన్నకారు రైతులే కాదు పెద్ద రైతులూ దెబ్బ తిన్నారు. పదేసి ఎకరాలు ఉన్నవారు రెండేసి ఎకరాలు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. కూలీలను మాన్పించి తామే స్వయంగా పొలం పనులు చేసుకుంటున్నారు. దీనివల్ల వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోయింది. ప్రత్యేకించి పేద మహిళలు నష్టపోయారు, ఎందుకంటే పొలాల్లో ఎక్కువ పనులు చేసేది వీరే. మహోబా రైల్వేస్టేషన్లో మేము ఒక రాత్రి ఉన్నాం. ప్లాట్‌ఫాంపైన ఆ చివర నుంచి ఈ కొస వరకూ ఎంతో మంది పడుకుని ఉన్నారు. వారంతా ఢిల్లీ, ఆగ్రా, సూరత్‌లకు వెళ్ళే రైళ్ళ కోసం ఎదురుచూస్తున్నారు. భారత ఉపఖండ లోతట్టు ప్రాంతాలు తరచూ కరువులను ఎదుర్కోవలసి వస్తోందని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (IPCC) తన 2007 నివేదికలో వెల్లడించింది. దీని అర్థం బుందేల్‌ఖండ్‌లాంటి ప్రాంతాలలో కరువు పునరావృతం అవుతూనే ఉంటుంది.

## 5. వర్షపాతంలో ఇతర మార్పులు

పంటలు వేయవలసిన జూన్ మాసంలో కాకుండా వానలు ఆలస్యంగా పడుతున్నాయని పలు రాష్ట్రాల్లో లభ్యమవుతున్న డేటా చెబుతోంది. చుట్టుపక్కల పడకుండా మధ్యలో ఒక్కచోట మాత్రమే వానలు పడటం గురించి కూడా విన్నాము. ఒక ఊళ్ళో వాన పడితే ఆ పక్క గ్రామంలో చినుకు పడదు. పొరుగూర్లో వాన పడితే తమ గ్రామంలోనూ కురుస్తుందని రైతులు ఆశిస్తారు. అది జరగదు. అంతా అసందిగ్ధం.

మెట్ట వ్యవసాయం మీద ఈ వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగానే ఉండొచ్చు. పేదలు, క్రింది కులాల వారు, ఆదివాసులు వర్షాధారిత వ్యవసాయం మీదే ఎక్కువ ఆధారపడతారు. వ్యవసాయం దెబ్బతిన్నప్పుడు చిన్న, సన్నకారు రైతులే కాదు, కూలీలు, కౌలుదారులు కూడా నష్టపోతారు. కానీ రైతులకు నష్టపరిహారం ఇచ్చిన సందర్భాల్లో కూలీలు ప్రభుత్వ దృష్టికి అగుపడరు.

ఇప్పుడు చిన్న స్థాయి వ్యవసాయం చాలా సంక్షోభంలో ఉంది. వ్యవసాయం నుంచి ప్రజలు ఏ విధంగా మళ్లిపోతున్నారో 2011 జనాభా లెక్కలపైన పాలగుమ్మి సాయినాథ్ రాసిన వ్యాసాలు వెల్లడిస్తాయి. భూస్వాములు 40 ఏళ్లలో భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేసారు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఇంకా పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో రైతుల నడ్డి విరిచే ఆఖరి శరాఘాతం అన్నమాట వాతావరణంలో వస్తున్న మార్పులు.

## 6. ఇతర రకాల మార్పులు

మన దేశంలో ఏ ప్రాంతాన్నయినా తీసుకోండి, ఏ పర్యావరణ వ్యవస్థనైనా చూడండి, అవి వాతావరణ దుష్ఫలితాలకు ఇప్పటికే లోనయిపోయాయి. వాటి ప్రభావం పడకుండా మిగిలి ఉన్న ప్రాంతం లేదు.

అ) ఆరు నుంచి తొమ్మిదివేల అడుగులు పైగా ఎత్తులో ఉన్న హిమాలయాలలో మంచు తగ్గిపోవడం, శీతాకాల ఉష్ణోగ్రతలు పెరగడం, సహజంగా వికసించాల్సిన తరుణం కంటే ముందస్తుగానే పూవులు పూయడం, పళ్ళూ, పంటలూ కింది శ్రేణి పర్వతాలలో కాకుండా ఎత్తున ఉన్న పర్వతాలలోనే పండటం, నీటి ప్రవాహాలు ఎండిపోవడం, హిమనీనదాలు కనుమరుగు అవడం, పెద్ద హిమనీనదాల విస్తీర్ణం పడిపోవడం- ఇవీ ఇప్పుడొస్తున్న మార్పులు. మంచు ఎడారుల్లో ప్రజలకు సాగు నీరు, మంచి నీరు ఇచ్చేది ఈ హిమనీనదాలే. శీతాకాలంలో కాశ్మీర్లో కురిసే మంచుకు వివిధ రూపాలు ఉండేవని అక్కడి ప్రజలు చెబుతారు. ఆ కాలంలో కురిసే రకరకాల మంచులకు స్థానికులు భిన్నమైన పేర్లు (పితృస్వామ్యపు పేర్లే) పెట్టుకున్నారు. చిల్కాలం (తండ్రి - భారీ హిమం), చిలాకుర్ద్ (తల్లి - మరీ అంత భారీ హిమం కాదు, కొద్దికాలం గడిచిన తర్వాత కరిగేది), చిల్లబచ్చా (స్థిరత్వం లేనిది). కాని ఈ మధ్య మంచు ఆ రకంగా ఉండట్లేదు.

ఆ) కొన్ని అటవీ ప్రాంతాలలో జంతువులు ఎత్తయిన పర్వత ప్రాంతాలకు వెళ్లిపోయాయి. జీవ వైవిధ్యం దెబ్బతింది. క్రిమికీటకాల తాకిడి పెరిగింది. కలుపు మొక్కలు ఎక్కువయ్యాయి. అడవుల దహనం పెరిగింది. ఔషధ వనాల సంఖ్య పడిపోయింది. అడవుల, పచ్చిక మైదానాల పెరుగుదల నిలిచిపోయింది. చెట్ల నుంచి పూలు వాటి సహజ కాలాని కంటే ముందే వికసిస్తున్నాయి.

ఇ) ఒడిషా రాష్ట్రంలో, ఇతర తూర్పుతీర ప్రాంతాలలో, కొంతవరకు ఆంధ్రాకు కూడా తుఫానుల తాకిడి పెరిగింది. గ్లోబల్ వార్మింగ్ వలన సముద్ర ఉపరితల

జలాలు వేడెక్కుతున్నాయి. ఇది తుఫానులకు కారణమవుతోంది. వానల, తుఫానుల రాకడలో ఒక స్పష్టమైన సరళి అంటూ లేకపోవడం వల్ల సముద్రంలోకి వేటకు పోవడం ప్రమాదభరితంగా మారిందని కర్ణాటకలోని సూరత్కల్‌కు చెందిన కొంతమంది మత్స్యకారులు అంటున్నారు. తుఫానుల మూలంగా తీర ప్రాంత వ్యవసాయం కూడా దెబ్బ తింటుంది. ఎందుకంటే తుఫానులు తమతో ఉప్పును కూడా మోసుకొస్తాయి.

**గ్లోబల్ వార్మింగ్ వలన సముద్ర ఉపరితల జలాలు వేడెక్కుతున్నాయి. ఇది తుఫానులకు కారణమవుతోంది. వానల, తుఫానుల రాకడలో ఒక స్పష్టమైన సరళి అంటూ లేకపోవడం వల్ల సముద్రంలోకి వేటకు పోవడం ప్రమాదభరితంగా మారిందని మత్స్యకారులు అంటున్నారు.**

ఈ) పెరుగుతున్న సముద్ర మట్టం తమిళనాడులోని మత్స్యకారులకు గండంగా మారింది. చేపల వేట అనంతరం జరిగే ప్రతి పనీ గట్టు మీదే జరుగుతుంది. సముద్రగట్టు తరిగి పోవడంతో ఆ పనులు చేపట్టడానికి జాగా లేకుండా పోతోంది.

ఉ) హిమనీనదాలు కరిగిపోవడం గురించి తెలుసుకున్నాం కదా. హిమనీనదాలు 2035 నాటికల్లా కరిగిపోతాయని IPCC తన నివేదికలో చేసిన ప్రకటనపై జనవరి 2010లో పెద్ద దుమారమే చెలరేగింది. అయితే సరైన ఆధారాలు లేని ఆ ప్రకటన నివేదికలోకి చేరడాన్ని సమర్థించలేము. 'లోని థామ్సన్' అనే ప్రఖ్యాత హిమనీనద శాస్త్రవేత్త ఒకరు ఉన్నారు. ఆయన ఎందుకు గొప్పవాడంటే మంచు నమూనాల కోసం 20 వేల అడుగుల పర్వతాలను 50 సార్లకు మించే అధిరోహించాడు. ఒక ఇంటర్వ్యూలో ఆయన తాము పరీక్షించిన మంచు శాంపిళ్ళలో అణుధార్మిక (రేడియేషన్) లేశాలు కనిపించాయని అన్నారు. 1952, 1961 (సోవియట్ యూనియన్ కావచ్చు) లలో జరిగిన అణుపరీక్షలు దీనికి కారణం అయి ఉండవచ్చుననే సందేహానికి ఆధారం కోసం వెతుకుతున్నానని ఆయన చెప్పారు. అయితే క్రితంసారి పర్వతాల్లోకి వెళ్ళినపుడు 1961 అణుపరీక్షకు సంబంధించి ఏ ఆధారమూ ఆయనకు లభ్యం కాలేదు. ఆ ఆధారాలు కరిగిపోయాయి. 1952 అణుపరీక్షకు సంబంధించి ఆధారం మాత్రం ఇంకా మిగిలే ఉంది. హిమాలయాలలో తన పరిశీలనలో ఉన్న 800 హిమనీనదాలలో 95 శాతం కరిగిపోవడం ప్రారంభించాయని

ఆయన చెబుతున్నారు. కాబట్టి ఇంకా అక్కడక్కడా కరగక స్థిరంగా ఉన్న వాటిని చూసి మనం మోసపోవద్దు.

ఈ వ్యాసం కేవలం భారత దేశంలోని వాతావరణ ప్రభావాలకు మాత్రమే పరిమితం. ముఖ్యంగా ఇక్కడ ప్రస్తావించిన అన్ని ప్రభావాలు నేడు అనుభవంలోకి వస్తున్నవీ, తాజావీ. రెండోది, ఈ మార్పులన్నీ ఉష్ణోగ్రతలో కేవలం 0.9 డిగ్రీల సెల్సియస్ సగటు పెరుగుదల వలన ఉత్పన్నమయినవే. ఈ ఉష్ణోగ్రత ఇంకా పైకి ఎగబాకడం ఖాయం, దాని దుష్ప్రభావాలు పెరగడం కూడా అనివార్యం. ఎందుకంటే కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదల అయిన తర్వాత ఉష్ణోగ్రత పెరగడానికి కొంత సమయం పడుతుంది. మూడోది – కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో చాలాకాలం ఉండిపోవడం వలన (గణనీయమైన వందల ఏళ్ళపాటు అలా ఉండిపోతుంది) దాని దుష్ప్రభావాలు కూడా మనలను చాలాకాలం వెంటాడుతూనే ఉంటాయి – ఎంత ఉద్గారాలను తగ్గించుకున్నప్పటికీ కూడా. దీనిని మనం ముందుగానే గ్రహించుకొని దానిని ఎదుర్కోవడానికి తయారు కావాలి.

ఇక భవిష్యత్తులో రానున్న ప్రమాదాలను అంచనా వేయడం కన్నా కచ్చితంగా రాగలవని ఊహిస్తున్న ప్రమాదాలను వివరిస్తాను. 'కరెంట్ సైన్స్' పత్రిక 10 ఆగస్ట్ 2011 సంచికలో అనేక అధ్యయనాలను ప్రచురించింది. భారత దేశంలో 45 శాతం అడవులు వాతావరణ మార్పులకు గురవుతాయని అవి పేర్కొన్నాయి. ఈ అధ్యయనంలో తూర్పు కనుమలు, పర్వత ప్రాంత అడవులు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 2288 అటవీప్రాంతాలు కూడా ఈ పరిశీలనకు నోచుకున్నాయి. వీటిలో 39 శాతం 2035 నాటికల్లా మార్పులకు లోనవుతాయని ఆ అధ్యయనం పేర్కొంది. మొక్కజొన్న ఉత్పత్తి, దిగుబడి 2030 నాటికి 50 శాతం పడిపోతుందని అంచనా వేశారు. మొక్కజొన్న చాలా ప్రాంతాల్లో పేదప్రజలకు ప్రధాన పౌష్టికాహార వనరు. వరి, గోధుమ, సముద్ర మట్టం పెరుగుదల, తుఫానుల తాకిడి ఇలా అనేక విషయాల్లో రానున్న మార్పులపై మరెన్నో అంచనాలు ఇచ్చారు. కొన్ని మంచి మార్పులను కూడా అంచనా వేశారు.

కాని మొత్తంగా చూస్తే పరిస్థితి గడ్డుగానే ఉంది. ఉత్పాతాలు 'వాతావరణ మార్పుల నమూనా' అంచనాలకు మించి వేగంగా, ముందస్తుగా, తీవ్రంగా ఆవిష్కృతమవుతున్నాయి. వ్యవసాయం, జీవనాధారాలు, సముద్రంపైన ఆధారపడే తీరప్రాంత ప్రజాసమూహాలపైన ఈ మార్పుల ప్రభావాన్ని పరిశోధించే కృషిలో హక్కుల సంఘాలు తమ పాత్రను పోషించాలి. వాతావరణ మార్పుల

ప్రభావాలను గణించడానికి విశ్వసనీయమైన సమాచారం, గణాంకాలు తరచూ లభ్యం కావు. ఈ ప్రభావాలను సమాజానికి అతీతంగా అంచనా వేయవలసిన అవసరం లేదు. వ్యవసాయ సమాజంలో ఉనికిలో ఉన్న ప్రక్రియల, నిర్మాణాల న్నింటిలోనూ ఈ ప్రభావాలు చొచ్చుకుపోయాయి. 'వాతావరణ మార్పు' అన్నది సైన్సు నేర్పడం వంటిది కాదు. అది కేవలం సైన్సుకు పరిమితం అయిందీ కాదు. అది ప్రజల జీవితాలకూ, అభివృద్ధి గమనానికీ సంబంధించినది.

## తక్షణమే స్పందించవలసిన అవసరం

ఈ సమస్య పైన అత్యవసరంగా స్పందించవలసిన ఆవశ్యకతను విస్మరించకూడదు. కొన్ని పర్యావరణ వ్యవస్థలలో గ్లోబల్ వార్మింగ్ కలిగించే మార్పులు వాటికవిగా మరింత వేడిమి పెరుగుదలకు దోహదపడతాయి. వీటిని 'పాజిటివ్ ఫీడ్‌బ్యాక్స్' అని పిలుస్తుంటారు. ఉదాహరణకు, ఈ సెప్టెంబర్లో ఆర్కిటిక్ ప్రాంతంలోని మంచు ప్రాంత విస్తృతి, పరిమాణం ఎన్నడూ లేని కనిష్ట స్థాయికి పడిపోయాయి. సూర్యకిరణాలను పరావర్తనం చేసే ఈ మంచు పలకల వైశాల్యం కుంచించుకు పోవడంతో ఉష్ణం వెనక్కి మళ్లిపోకుండా అక్కడే ఉండిపోతుంది. కిరణాల రేడియేషన్ అంతట్నీ మంచు పలకలు గ్రహించుకుంటాయి. ఇది మంచు పలకలు మరింతగా కరిగిపోవడానికి దారితీస్తోంది. ఇదే పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ అంటే. మరొక ఉదాహరణ – అటవీ ప్రాంతం తరిగిపోతోంది, ప్రత్యేకించి అమెజాన్ అటవీ ప్రాంతం. చచ్చి కుళ్ళిపోతున్న చెట్టు కార్బన్‌ను విడుదల చేస్తుంది. దీని ప్రభావాలు అప్పుడే మొదలయ్యాయి.

భూతాపం ఈ ఫీడ్‌బ్యాక్‌లను తీవ్రస్థాయికి తీసుకుపోయే దశ ఒకటి దగ్గరలోనే ఉంది. ఆ దశలో మానవులు జోక్యం చేసుకొని దుష్పరిమాణాలను నివారించడం దుర్లభం. రెండు డిగ్రీల భూతాపపు సగటు పెరుగుదలను ఒక గరిష్ట అవధిగా (కట్ ఆఫ్ పాయింట్) ఇంతవరకూ అందరూ ఆమోదిస్తూ వచ్చారు. అయితే ఇప్పటికే సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 0.9 సెల్సియస్ తాకిందనీ, సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 2 డిగ్రీల సెల్సియస్ తాకక మునుపే భూతాపం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుందనీ అనేక మంది శాస్త్రవేత్తలు అంటున్నారు. నిజానికి తగిన చర్యలు చేపట్టడానికి అవసరమైన వ్యవధి కూడా మన చేతిలో లేదిప్పుడు.

## ఆపత్కాల సమయంలో స్పందనలు

ఈ ఆపత్కాల సమయంలో వస్తున్న స్పందనలు ఏమిటి? వాతావరణ నిరాశావాదులు ఏమంటున్నారు? పరిశ్రమలు ఎలా స్పందిస్తున్నాయి? ప్రభుత్వాలు ఏమి చెబుతున్నాయి? మన స్పందన ఏమిటి?

1. **కొంతమంది (బహుతక్కువే) అసలు గ్లోబల్ వార్మింగే జరగడం లేదు అంటున్నారు.** వీళ్లు దీనిపై వస్తున్న సమాచారాన్నే ప్రశ్నిస్తున్నారు. పూలు ముందే పూయడం, కరుగుతున్న హిమనీనదాలు, సుందర్ బన్ గ్రామాల్లో భూముల మునక వంటివి నిజానికి వారి కళ్ళు తెరిపించాలి.

మరి కొంతమంది గ్లోబల్ వార్మింగ్‌ను ఒప్పుకుంటారు. కాని భూమి వేడెక్కడం ఈనాడు కొత్తగా సంభవిస్తున్నది కాదు. అది ఇప్పటికే వేడెక్కడం, చల్లబడడం వంటి వాటిని దాటుకుంటూ వచ్చింది అని వాళ్లు అంటారు. ఈ సమస్యను ఎదుర్కోగలం అని భావిస్తారు. కానీ మనం ఈనాడు చూస్తున్న స్థితి లక్షల ఏళ్లపాటు లేదు. మిలియన్ల సంవత్సరాల కాలంలో ఇంత రేటున కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి ఎప్పుడూవిడుదల కాలేదు. సహజమైన కారణాలతో ఏవైనా వాతావరణ మార్పులు సంభవించినా కూడా ఆనాడు ఇప్పుడున్నట్టుగా ఏడు బిలియన్ల జనాభా లేదు. పేదలు వాటి ప్రభావాలను ఇప్పటికే చవి చూసారు. మనం త్వరితంగా స్పందించకపోతే మరింత నష్టం వాటిల్లుతుంది.

ఇంకో తరగతి వారు కూడా గ్లోబల్ వార్మింగ్ జరుగుతుందన్నదని అంగీకరిస్తారు. కాని మానవులే దానికి కారణం అని ఒప్పుకోరు. మరి ప్రపంచ వ్యాపితంగా భూతాపానికి కారణం అవుతున్నదేమిటి? సూర్యుడు 11 భ్రమణాల ద్వారా (సైకిల్స్) తన తీవ్రతను మారుస్తాడు. ఇప్పుడు సూర్యుడు తక్కువ వేడిమి చూపే భ్రమణ కాలాల్లో కూడా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. గత 65 మిలియన్ సంవత్సరాలలో సూర్యుని వేడిమిలో హెచ్చుదల కేవలం ఒక్కో చదరపు మీటరుకు 0.4 వాట్లు. ప్రస్తుతం కార్బన్ డయాక్సైడ్ ఒక్కటే ఒక్కో చ.మీ.కు 1.66 వాట్లు అదనపు వేడిని చేర్చింది. ఈ నిరాశావాదులు ఒక భౌతిక, రసాయనక సూత్రాన్ని అర్థం చేసుకుని తీరాలి. కార్బన్ డయాక్సైడ్‌కూ, హరిత వాయువులకూ ఉష్ణాన్ని శోషించుకునే సామర్థ్యం ఉంది. కార్బన్ డయాక్సైడ్ పెరిగితే భూతాపం తప్పనిసరిగా పెరుగుతుంది.

2. **పరిశ్రమలు:** ఒక్క బీమా పరిశ్రమ మినహా మిగతా పరిశ్రమలన్నీ భూతాపం విషయంలో సంతోషంగా ఉన్నాయి. అమెరికా బీమా పరిశ్రమ మాత్రం భారీ క్లెయిమ్‌ల మూలంగా సమస్యలను ఎదుర్కొంటోంది. భారత్‌లో వందల కొద్దీ సిడిఎం (clean development mechanism) ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో అధిక భాగం మోసపూరితమైనవే. వీటి ద్వారా కంపెనీలు కార్బన్ క్రెడిట్‌లను సొమ్ము చేసుకుంటున్నాయి.

మరి కొంతమంది పారిశ్రామికవేత్తలకు ఓ వెర్రి పట్టుకుంది. ఆర్కిటిక్ ఐస్ కరగడం వల్ల సముద్ర రవాణా మార్గపు దూరాలు తగ్గుతాయట. వెర్రి తప్ప మరో పదం లేదు దీనిని వర్ణించడానికి.

మరొకటి. పెట్టుబడి గతిశీలమయినది కనుక దాని ద్వారా ఉత్పన్నమయిన సమస్యలకు అదే తగిన సాంకేతిక పరిష్కారాలను సృష్టిస్తుంది అనే విశ్వాసం. నాకు ఇందులో అర్థం కానిది ఏమిటంటే సమస్యలను సృజించిన పెట్టుబడే పరిష్కారం ఎలా చూపుతుంది అన్నది. ఒక వేళ చూపినా ఈ రకపు సామర్థ్యం సమస్యలకు పైపై మరమ్మత్తులు మాత్రమే చేపడుతుంది. మూలాలలోకి పోకుండా తప్పుకుంటుంది.

## పరిష్కారం ఏమిటి?

మనం నేడు నడుస్తున్న అభివృద్ధి మార్గాన్ని మార్చడానికి ప్రయత్నించడమే సరయిన పరిష్కారం అని నా నమ్మకం. వివిధ రకాల సమానత్వ భావనలను ఏర్పరచుకోవాలి. ప్రకృతికి హాని చేయని ఇంధన వనరుల కోసం ముఖ్యంగా సౌర విద్యుత్తు కోసం ప్రయత్నాలు చేయాలి. ఉన్నత వర్గాల వారు ఇంధన దుబారాను కట్టడి చేసుకోవాలి. ఏది అసలు పారిశ్రామీకరణో, ఏది అవసరమో దాని గురించి ఆలోచించాలి. ఆధునికతలో సైతం ఉన్న చెడు అంశాలను ప్రశ్నించాలి.

3. **ప్రభుత్వాలు:** ఒక్క బొలీవియన్ ప్రభుత్వం మినహా మిగిలినవి గ్లోబల్ వార్మింగ్‌పై సరైన వైఖరిని కలిగి లేవు అని నేచర్ అనే పత్రిక గతేడాది అంది. చైనా, భారత్‌లతో పాటు ఇతర దేశాలు తమ ఉద్గారాలను తగ్గిస్తామని ప్రతిన చేయడమే కాదు. దానికి అనుగుణంగా అవి ఉద్గారాల విడుదలను తగ్గించుకున్నాయి. అయితే హరిత వాయువులు ఈనాడు ఉన్న పరిమాణం కంటే 2020 నాటికి 10 నుంచి 20 శాతం పెరిగిపోతాయి. ఈ విషయంలో భారత ప్రభుత్వ వైఖరిని గమనిస్తే నాలుగు విషయాలు కనిపిస్తాయి.

అ) **ఉపశమన చర్యలు:** గతంలో భారత్ వైఖరి ఇలా ఉండేది – మన తలసరి ఉద్గారాలు ఎప్పటికీ పారిశ్రామిక దేశాల ఉద్గారాల స్థాయిని దాటిపోవు. అయినా ఉద్గారాల విడుదలను 2005–2020ల మధ్య జీడీపీ లో 20 నుండి 25 శాతానికి తగ్గించుకుంటానని చెపుతోంది. దానర్థం ఒక యూనిట్ జీడీపీకి లేదా ఒక యూనిట్ ఉత్పత్తికి గణించే కార్బన్ ఉద్గారాన్ని 20 నుంచి 25 శాతానికి తగ్గించుతారని. ఆర్థిక వ్యవస్థలో ఆధునికత చోటుచేసుకున్నప్పుడల్లా సామర్థ్యాలలో పెద్ద మార్పే వస్తుంది. తొంభైల మధ్య నుంచి ఇది జరుగుతోంది. అలాంటప్పుడు సంక్షోభానికి ఆమోదయోగ్యమైన పరిష్కారమేనా ఇది? ఇది

ఎలా ఉందంటే గుండెపోటు వచ్చిన వాడికి నూనె తక్కువ వేసి మాంసం బిర్యాని పెట్టడం లాంటిది. భూమికి గుండెపోటు వచ్చింది. మనమేమో 'నేను తినే సమోసా తగ్గించుకుంటాను' అంటున్నాము. మన విధానాలలో గత 20 ఏళ్లలో వచ్చిన మార్పుల వల్ల తక్కువ ధరకు విమాన ప్రయాణాలను అందుబాటులోకి తెచ్చాయి. కార్ల కొనుగోలుకు సులభ రుణ సదుపాయాలను ఇపిస్తున్నాయి. నగరాల్లో పెద్ద దుకాణ సముదాయాలు (మాల్స్) వచ్చాయి. తక్కువ ధరకే గృహోపకరణాలు మార్కెట్లోకి ప్రవేశించాయి. ధనికులపై పన్నులు తగ్గాయి. ఈ చర్యలన్నీ మరింత కార్బన్ ఉద్గారాల విడుదలకీ దారితీసాయి. దీనికి వ్యతిరేకంగా సోంపేట, కాకరాపల్లి వంటి చోట్ల ప్రజలు తిరగబడ్డప్పుడు మాత్రం క్రూరమైన అణచివేతతో మాత్రమే వారికి సమాధానం చెపుతారు.

ఆ) **సర్దుబాటు చర్యలు** (adaptation) : రానున్న వాతావరణ మార్పులకు తట్టుకునే చర్యలు చేపట్టేందుకు జిడిపి లో 2.5 శాతాన్ని వెచ్చిస్తున్నామని ప్రభుత్వం అంటోంది. దీన్ని జాగ్రత్తగా పరీక్షించాలి. ఎందుకంటే అమలులో ఉన్న పథకాల కొన్నిటి రూపం మార్చారు తప్ప వాళ్ళు చేసిందేమీ లేదు.

ఇ) **ఆర్థిక చర్యలు:** పారిశ్రామిక దేశాలు తాము చారిత్రకంగా వెలువరించిన ఉద్గారాల నేపథ్యంలో పేదలకు పరిహారం చెల్లించాలన్న వాదనతో నేను అంగీకరిస్తాను. అయితే ఈ చర్యలు వరల్డ్ బ్యాంక్, ఎడిబి వంటి భారీ ఆర్థికసంస్థలను వెంటపెట్టుకుని వచ్చేవి కాకూడదు. నగదు బదిలీ పంపిణీని వికేంద్రీకరించాలి. పారదర్శకత పాటించాలి. సాధ్యమయినంతవరకూ ప్రజలకు నేరుగా పరిహారం అందజేయాలి.

ఈ) **సాంకేతికత :** పారిశ్రామిక సమాజాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి అయినంతకాలం తానేమీ చేయలేనని ప్రభుత్వం చెబుతోంది. సాంకేతికంగా కొంత బాగానే అభివృద్ధి చెందిన భారత్ నిజానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోనక్కరలేదు.

## 4. మన స్పందన ఎలా ఉండాలి?

గ్లోబల్ వార్మింగ్‌కు మూలం పెట్టుబడిలో ఉందని, కనుక దానిపైన పోరాడితేనే గ్లోబల్ వార్మింగ్‌ను నిలువరించగలమని ఒక వామపక్ష అభిప్రాయం. గ్లోబల్ వార్మింగ్‌కు మూలాలు పెట్టుబడిలోనే ఉన్నాయన్న దానితో నేనూ అంగీకరిస్తాను. అయితే మిగతా ప్రతి ప్రయత్నమూ వృథా అన్న అభిప్రాయంతో నాకు అంగీకారం

లేదు. అదే కనుక నిజమైతే తాము చేపడుతున్న అనేక కార్యక్రమాలకు అర్థం ఉండదు. గ్లోబల్ వార్మింగ్ విషయంలో చాలా పనే చేయాల్సి ఉంది. ముందుగా దృష్టి నొకదాన్ని రూపొందించుకోవాలి. ఏ విధంగా వాతావరణ మార్పులు వారి జీవితాలను ప్రభావితం చేస్తున్నాయో, వాళ్ళు ఈ మార్పులను తగ్గించడానికి ఏమి చేస్తున్నారో చిన్న రైతులనూ, ఇతర ప్రజా సమూహాలనూ అడిగి తెలుసుకోవడం ద్వారానే ఆ దృష్టిని అలవర్చుకోగలం. పరిశీలిస్తే మనకు చాలా సూచికలే దొరుకుతాయి. మారుతున్న వర్ష సరళి, ముందస్తుగానే పూలు పూయడం, క్రిమికీటకాలు పెచ్చుమీరడం వంటివన్నీ వాతావరణ ప్రభావాలను సూచిస్తున్న ఏ చర్య (adaptive measure) ఫలితాన్ని ఇస్తుందో, ఏది ఇవ్వదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. కొన్ని చోట్ల రైతులు సంప్రదాయ విత్తనాలకు మళ్లుతున్నారు. మరికొన్ని చోట్ల వారు పంటల సరళులను మార్చి వేస్తున్నారు. లేదా బహుళ పంటలకు మళ్లుతున్నారు. ఏది ఫలవంతమయిందో తెలుసుకోవడం అవసరం. అప్పుడు ఈ పద్ధతిని ఇదే రకమయిన పరిస్థితులు ఉన్న మరోచోటనో లేదా ఆ పరిసర ప్రాంతాలలోనో అవలంబించవచ్చు.

మన ప్రస్తుత పోరాటాలు – పోలవరం, థర్మల్ వ్యతిరేక పోరాటాలు – ఆ పరిశ్రమ, ఆ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా రానున్న ముప్పును లేవనెత్తడం మాత్రమే కాదు. ఈ ప్రాజెక్టులు, పరిశ్రమలు ప్రపంచ స్థాయిలో పర్యావరణ ప్రమాదాన్ని ఎలా కొనితెస్తాయో కూడా ఎత్తి చూపాలి. ఇంధనం, అణుఇంధనం, బొగ్గు ప్లాంట్లూ వంటి వాటిపై పెద్ద చర్చే నడుస్తోంది. ఆ వివరాలలోకి ఇప్పుడు పోను. కొన్ని ఉద్యమాలు విస్థాపన అంశాలను దాటి వారి ప్రాంతానికి నిజమైన అభివృద్ధి అంటే ఏమిటి అన్న అంశాన్నీ చర్చలోకి తెస్తున్నాయి.

ఏమి చేయాలన్న ప్రశ్నకు సులభమయిన సమాధానాలేవీ లేవు. పెట్టుబడి తీవ్ర సంక్షోభంలో ఉంది. అది కొని తెచ్చిన అసమానతల పైన ప్రపంచ వ్యాపితంగా ప్రతిఘటన పెరుగుతోంది  కానీ ఒక నిలకడైన వామపక్ష ప్రత్యామ్నాయం ఏమీ నాకు గోచరించడం లేదు. బహుముఖమైన సమానత్వ అవకాశాలను (Multi faceted dimensions of equity) ముందుకు తోయడమే మనం చేయగలిగింది. అభివృద్ధి చెందిన, చెందని దేశాల మధ్య సమానత్వాన్ని గురించి గ్లోబల్ వార్మింగ్ లేవనెత్తింది. అదొక్కటే సరిపోదు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో ఏర్పడవలసిన సమగ్ర సమానత్వ దృక్పథంలో మొత్తం నాలుగు పార్శ్వాలు ఉన్నాయి.

అ) **వర్గాల మధ్య సమానత్వం:** భూమి 16 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకోగలదని నేను చెప్పాను. ఈ లెక్కన ప్రతి వ్యక్తీ 2 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేయవచ్చునన్నమాట. అంటే పేదలు మాత్రమే మరింతగా కార్బన్‌ను విడుదల చేయవచ్చు. అయితే ఇంధన వినియోగం ద్వారా ధనికులు వెలువరించే కార్బన్ ఉద్గారాలను తగ్గించుకొనేలా చేసినపుడే ఇది సాధ్యమవుతుంది. ఈ మార్పు అభివృద్ధి మార్గంతో స్పష్టంగా ముడిపడి ఉంది.

ఆ) **ప్రభావాలను తట్టుకుని నిలబడగలిగేలా ప్రజలను సిద్ధపరచడంలో సమానత్వం:** నేడు పేదలు కూడా  వాతావరణ ప్రభావాలకు తీవ్రంగానే గురవుతున్నారు. వీటిని తట్టుకుని నిలబడడం అంటే ఆ మార్పులు తమపై దాడి చేయక మునుపే సమష్టిగా వారు తమ జీవితాలను మెరుగు పరుచుకోవాలి.

ఇ) **తరాల మధ్య సమానత్వం:** మనం అనుభవించిన ఉమ్మడి చెరువులు, స్థలాలను (commons) మన భావితరాలు కూడా అనుభవించాలని మనం అంగీకరిస్తాం కదా! అది పర్యావరణ హానిరహిత, సుస్థిర అభివృద్ధి (sustainable development) లో భాగం. ఆ రకమైన ఆలోచనలో మనం ఎక్కడ ఉన్నాం? మన పిల్లల వరకే చాలు అనుకుంటున్నామా? ఆ తర్వాత తరాల వారికి కూడా మిగిల్చి ఉంచాలని అనుకుంటున్నామా?

ఈ) **ప్రాణి జాతుల మధ్య సమానత్వం:** కేవలం మానవుల మీదే కేంద్రీకరించే దృష్టిని మనం విడనాడాలి. ఉమ్మడి ఆస్తుల మీదా, అడవులపైనా, ఇంధనం మీదా ఇతర ప్రాణులకు కూడా హక్కు ఉందన్న విషయాన్ని మనం గ్రహించాలి. భూగ్రహం మీద నివసిస్తున్న 17 లక్షల ప్రాణులలో మనం ఒకానొక ప్రాణి జాతి మాత్రమేనన్న విషయాన్ని సదా గుర్తెరగాలి. జీవితం ఒక అల్లిక గూడు (వెబ్) లాంటిది. దాన్ని మనం అర్థం చేసుకొని భద్రపరుచుకోవాలి.

అనువాదం : ఎన్.ఎన్. శ్రీనివాసరావు

# విధ్వంసరహిత అభివృద్ధి సాధ్యమా?

ఎన్. అమర్ *

‘‘కేవలం ఎదుగుదల కోసమే ఎదుగుదల అన్నది క్యాన్సర్ కణ స్వభావం’’

– ఎడ్వర్డ్ యాబి

‘‘వినియోగదారీ తత్వాన్ని మనం మన జీవన విధానంగా చేసుకోవాలని నేటి బృహత్ ఉత్పాదక ఆర్థిక విధానం కోరుతుంది. దీని కోసం సరుకుల కొనుగోలు, వినిమయాన్ని మనం ఒక మతాచారంగా మార్చుకోవాలి. వస్తు వినిమయంలోనే ఆధ్యాత్మిక, స్వీయ సంతృప్తిని సాధించాలి. ఎక్కువ వస్తువుల వినియోగంతోపాటు, పాతవాటిని తీసేసి కొత్త వాటిని కొనటం నిత్యం పెరుగుతూ ఉండాలి’’.

– విక్టర్ లీబోవ్

ఆర్థికవేత్త, 1955 ("Story of Stuff అనే యానిమేషన్ డాక్యుమెంటరీ చిత్రంలో ఉదహరించబడినది)

‘‘ఆఖరి చెట్టుని నరికేసిన తరువాతే, ఆఖరి నది విషపూరితమైన తరువాతే, ఆఖరి చేపని పట్టుకున్న తరువాతే... డబ్బుని తినలేరని మీరు గ్రహిస్తారు.’’

– ఒక అమెరికన్ మూలవాసి తెగ భవిష్యవాణి.

## పరిచయం

‘విధ్వంసకర అభివృద్ధి’పై తగినంతగా కృషి చేస్తున్నామా అన్న సందేహం నాకు అప్పుడప్పుడు కలుగుతుంటుంది. విధ్వంసకర అభివృద్ధిని మనం వ్యతిరేకిస్తున్నామనేది నిజమే. అది అవసరమే. కానీ అంత మాత్రమే సరిపోదు.

* మానవహక్కుల కార్యకర్త

అభివృద్ధి ప్రక్రియను, దాంట్లో మన పాత్రను లోతుగా అర్థం చేసుకోకుండా 'విధ్వంసకర అభివృద్ధి'ని వ్యతిరేకించే మన ప్రయత్నాలు – ఒక భయంకర దావానలాన్ని దానికి కారణం ఏమిటో తెలుసుకోకుండా ఆర్పటానికి పూనుకోవటం లాగా ఉంటాయి. ఈ అగ్నికీలలు ఆగకుండా రగులుతూనే ఉంటాయని మనందరికీ తెలుసు. ఈ జ్వాలలు తగ్గుముఖం పట్టే సంకేతాలు ఏమీ లేవు. పైగా, అవి మరింత తీవ్రతరమయ్యే సూచనలే కనబడుతున్నాయి. దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవటం అటుంచి, ఈ అగ్నికీలల మూలాలను గుర్తించటానికి, గుర్తించిన వాటిని అంగీకరించటానికి మనం అంతగా ప్రయత్నించటం లేదు. కొంతమంది వ్యక్తులు వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేలాగా సామ్రాజ్యవాద రాజకీయాలను, కార్పొరేట్ దురాశలను ఈ పరిణామాలకి బాధ్యులను చేసి చేతులు దులిపేసుకుంటారు. మన చుట్టూ ఉన్న అభివృద్ధి రూపాలలో మన పాత్రను చాలా కొద్దిమంది మాత్రమే చూడగలుగుతున్నారు, అంగీకరించగలుగుతున్నారు. విధ్వంసకర అభివృద్ధిని సమగ్రంగా ఎదుర్కోవడానికి, దానిలో మన పాత్రను అర్థం చేసుకోవటానికి చేస్తున్న ఒక చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం.

మనకు 'అవసరమైన' సరుకులు, సేవలు అందించటం ద్వారా మన జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామన్న పేరుతో నేటి ఈ అభివృద్ధి జరుగుతోంది. ఈ రకమైన అభివృద్ధి వల్ల ప్రజలు, జీవావరణాలపై ప్రభావాలు ఉంటాయనీ, ఈ అభివృద్ధికి వాళ్ళు లేదా అవి మూల్యం చెల్లించాల్సి ఉంటుందనీ ఒప్పుకుంటాం కానీ 'విస్తృత ప్రజా ప్రయోజనాల' కోసం వీటిని భరించక తప్పదని భావిస్తాం.

## అభివృద్ధి మూల్యం, దాని పరిణామాలు

భారతదేశంలో అభివృద్ధి పరిణామాలు, దానికి చెల్లిస్తున్న మూల్యాలు మనకు తెలుసు – అడవులు విధ్వంసానికి గురయ్యాయి; నదులు ఇప్పటికింకా పూర్తిగా ఎండిపోకపోతే బాగా కలుషితం అయ్యాయి, విషపూరితంగా మారాయి; రసాయనిక ఎరువులు పెద్ద ఎత్తున ఉపయోగిస్తే తప్పించి పంటలు పండనంతగా వ్యవసాయ భూములు క్షీణించిపోయాయి; భూగర్భ జలాలు అంతరించి పోతున్నాయి; మనం చేజేతులా తీసుకొచ్చిన వాతావరణ మార్పులవల్ల వానలు సకాలంలో పడటం లేదు, పడినపుడు విధ్వంసకారకంగా మారాయి; జీవనోపాధులు ఛిద్రమైపోయాయి, లేదా వాటినుండి సరైన ఆదాయం రాని కారణంగా, ఆత్మహత్యలు పెరిగాయి, పట్టణాలకు వలసలు పెరిగాయి. ఆనకట్టలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, కర్మాగారాలు, గనుల వల్ల లక్షలాది ప్రజలు ఎటువంటి,

పునరావాసం లేకుండా నిర్వాసితులయ్యారు. తమకు పూర్తిగా పరాయిదైన ప్రపంచంలో నెట్టుకు రాలేక ఎన్నో సమూహాలు అంతరించిపోతున్నాయి.




ఈ పరిణామాలు చాలామందికి – కనీసం తెలుసుకోవాలని ఉన్నవాళ్లకి – తెలుసు. అయితే ఇవి అనివార్యమంటూ వీటిని అంగీకరిస్తున్నారు, ఆమోదిస్తున్నారు. మానవ హక్కులకార్యకర్తల వరకు చెప్పాలంటే మనం అభివృద్ధిలోని 'విధ్వంసకర' కోణాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నాం. ఫలితంగా అభివృద్ధి ప్రక్రియలో కొంత మేరకు విధ్వంసం తప్పదని నమ్మేవాళ్ల దృష్టిలో మనం 'అభివృద్ధి వ్యతిరేకులు'గా ముద్రపడుతున్నాము. ఇలా ముద్ర వేయబడటాన్ని ఎదుర్కోడానికీ, అంతకుమించి ప్రస్తుత అభివృద్ధి ప్రక్రియ వల్ల జరుగుతున్న మొత్తం విధ్వంసాన్ని సమర్థవంతంగా వ్యతిరేకించడానికీ మనం కొన్ని విషయాల గురించి ఆలోచించాలి, వాటిని అర్థం చేసుకోవాలి. మొదటిది – అభివృద్ధికి కొంత విధ్వంసం అనివార్యమా? అయితే, అది ఎందుకు అనివార్యమవుతుంది? ఎంతో కొంత విధ్వంసం తప్పనిసరి చేసేలా అభివృద్ధి స్వభావంలో ఏముంది? విధ్వంసం అనివార్యమైతే ఆ అభివృద్ధివల్ల జరిగే విధ్వంసాన్ని సాధ్యమైనంతగా తగ్గించే వీలు ఉందా? అసలు అభివృద్ధి గురించే మనం పునరాలోచించాల్సివస్తే ఏ దిశలో ఆలోచించాలి?

మన సమాజంలో, దేశంలో, మొత్తం ప్రపంచంలో అవలంబించబడుతున్న అభివృద్ధి విధానం సరుకులు, సేవల ఉత్పత్తి వినిమయం పెంచటంపై ఆధారపడి ఉంది. తేలిక మాటల్లో చెప్పాలంటే, ఆచరణలో అభివృద్ధి అంటే అన్నీ మరింతగా ఉండడం. రోడ్లు, కార్లు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు,

విమానయానాలు, విద్యుత్తు, శిలాజ ఇంధన వినియోగం, పరిశ్రమలు, విద్యుత్ కర్మాగారాలు, గనుల తవ్వకం, ఆనకట్టలు, రసాయన, శిలా ఇంధన వనరులపై ఆధారపడే వ్యవసాయం మరింత విస్తృతం కావడం, టెలివిజన్లు, మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లు, విద్యుత్ పరికరాలు వంటి వినిమయ వస్తువులు; విద్య, ఫాస్ట్‌ఫుడ్, వినోదం వంటి వ్యాపారీకరించబడిన సేవలు – ఇవన్నీ వేగంగా పెరగటమే అభివృద్ధికి అసలైన సంకేతంగా భావిస్తారు. ఇదంతా కూడా స్థూల జాతీయోత్పత్తి (జిడిపి–GDP) లో నిక్షిప్తమై ఉందంటారు.

ఈ రకమైన అభివృద్ధికి ఉదాహరణగా కొన్ని గణాంకాలను చూద్దాం. గత పది సంవత్సరాలలో విమాన ప్రయాణాలు ఆరు రెట్లు పెరిగాయి. భారతదేశంలో ప్రతి వెయ్యిమందికి ఉండే నాలుగు చక్రాల వాహనాలు 1980లో 2 అయితే, అది 2012 నాటికి 100 కి పెరిగింది అంటే 50 రెట్లు పెరిగింది. 2020 నాటికి 400 కి పెరుగుతుందని వృద్ధి రేటు ఆధారంగా అంచనా వేశారు. భారతదేశంలో సగటున ప్రతి వ్యక్తి చేసే విద్యుత్ వినియోగం గత రెండు దశాబ్దాలలో 6 రెట్లు పెరిగిందని క్రింది పట్టిక తెలియజేస్తుంది. జనాభా వృద్ధిని లెక్కలోకి తీసుకుంటే ఈ వృద్ధి 11 రెట్లుగా ఉంది.

| సంవత్సరం | ప్రతి వ్యక్తి సగటు విద్యుత్తు వినియోగం (కిలోవాట్ గంటలు) | జనాభా (కోట్లు) | మొత్తం విద్యుత్ వినియోగం (వంద కోట్ల కిలోవాట్ గంటలు) |
|---|---|---|---|
| 1980 | 140 | 70 | 98 |
| 2012 | 880 | 125 | 1100 |

సగటున వస్తు వినియోగం పెరుగుతుందన్నది ఎవరూ నిరాకరించలేరు. మన జీవితాలు, జీవన విధానాలు దీనిని సూచిస్తున్నాయి. ఇంతకు ముందు కంటే మనం ఎక్కువ వస్తువులని సొంతం చేసుకుంటున్నాం, వినియోగిస్తున్నాం. ఈ పెరిగిన వస్తుసంపద మన సంతోషాన్ని తప్పనిసరిగా పెంచాలని ఏమీ లేదని మనలో కొంతమంది అప్పుడప్పుడు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ, వస్తు వినియోగం (సాధారణంగా) మంచిదని కానీ, లేదా (కొన్నిసార్లు) అనివార్యం అని కానీ మనమందరం అంగీకరిస్తున్నాం.

'అభివృద్ధి చెందుతూఉన్న' దేశాలుగా పిలవబడుతున్న దేశాలు పాశ్చాత్య, ప్రత్యేకించి అమెరికా, అభివృద్ధి నమూనాను అనుసరిస్తున్నాయి. నిజానికి పట్టణ జనాభాలో గణనీయభాగమైన ఎగువ తరగతి, ఎగువ–మధ్య తరగతి ప్రజల వస్తు

వినియోగ స్థాయి పాశ్చాత్య దేశాల ప్రజల సగటు వినియోగ స్థాయిలోనే ఉంది. ఒక కుటుంబానికి ఒకటికి మించి కార్లు ఉండడం, ఏర్‌కండిషనింగ్ చేయబడిన పెద్ద పెద్ద ఇళ్లు, ఆఫీసులు; ప్రతి వ్యక్తికీ కనీసం ఒక సెల్‌ఫోను, ప్రతి ఇంటిలో ఒకటి కంటే ఎక్కువ టీవీలు, కంప్యూటర్లు ఉండటం, మిగిలిన జనాభాతో పోలిస్తే పెద్ద మొత్తాలలో విద్యుత్తు, నీరు, శిలాజ ఇంధనాలను ఉపయోగించడం; పెద్ద మొత్తాలలో వ్యర్థాలను ఉత్పత్తి చేయటం - ఇవన్నీ దాని సూచికలే. ఇప్పటికే వీటన్నిటినీ అనుభవిస్తున్న వ్యక్తులు, ఇంకా, ఇంకా ఎక్కువ కావాలి అని కోరుకోవటమే కాకుండా, మన అభివృద్ధి విధానం అందరి వినియోగ స్థాయిని ఈ స్థితికి తీసుకు రావటానికి ప్రయత్నిస్తోంది. అయితే ఓ సగటు అమెరికన్ లేదా ఓ సంపన్న భారతీయ వ్యక్తి వినియోగించుకునే స్థాయిలో అందరూ వనరులని వినియోగిస్తే భూమి మీదున్న వనరులు సరిపోవనీ, ఆ స్థాయిలో ఉండే ఉద్గారాలను, వ్యర్థ పదార్థాలను భూమి తట్టుకోలేదనీ ఎంతో మంది విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పుడున్న వినిమయ స్థాయి భారాన్నే భూమి భరించలేకపోతోంది. ప్రస్తుత అభివృద్ధి ప్రక్రియల వల్ల మన చుట్టూ చూస్తున్న విధ్వంసం రానున్న రోజుల్లో మనం ఎదుర్కోబోయే పరిణామాలకి కేవలం ఓ మచ్చుతునక మాత్రమే.

## ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసకర అభివృద్ధికి ఉదాహరణలు

మానవహక్కుల వేదికలో మనం వ్యతిరేకిస్తున్న విధ్వంసకర అభివృద్ధి విధానాలకు కొన్ని ఉదాహరణలను తీసుకుని వాటిని వినియోగ దృష్టికోణం నుంచి విశ్లేషిద్దాం.

### 1. ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకం:

సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకంలో ఖర్చు తక్కువ, వేగంగా పని జరుగుతుందని చెబుతారు. అయితే కేవలం బొగ్గు తవ్వటానికి అయ్యే ఖర్చు మాత్రమే లెక్కలోకి తీసుకుంటే, ఈ పద్ధతిలోనే ఖర్చు తక్కువ (ఎందుకంటే ఈ విధానంలో యంత్రాల వినియోగం ఎక్కువ, కార్మికులు తక్కువ) అయితే లెక్కలోకి తీసుకోని ఇతర ఖర్చుల ఉన్నాయి. 1. ఆ ప్రాంతంలో నివసిస్తూ, అక్కడి భూమిపై ఆధారపడిన ప్రజలకి జరిగే నష్టం 2. ఈ తవ్వకంవల్ల దెబ్బతినే సహజ జీవావరణం. నిజానికి ఈ రెండు రకాల నష్టాల ఖర్చును మనం ఎప్పుడూ ఖర్చుగా పరిగణించి లెక్కవేయలేదు. ఈ 'ఖర్చులను' కూడా లెక్కలోకి తీసుకుంటే బొగ్గుధర, దానిమీద ఆధారపడిన విద్యుత్ ధర విపరీతంగా పెరిగిపోయి పట్టణ 'నాగరిక' సమాజం వాటి తవ్వకాన్ని వ్యతిరేకించి ఉండేది. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో అధిక భాగం విద్యుత్ ఉత్పత్తికే వినియోగింపబడుతోంది.

ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకమైనా, సంప్రదాయ బొగ్గు తవ్వకమైనా (ఇది కూడా జీవావరణ విధ్వంసానికి దారితీస్తుంది, మానవ ఆవాసాలపై ప్రభావం చూపుతుంది) బొగ్గు మీద ఆధారపడటం తగ్గించుకోవాలంటే ఈ ఖర్చులను పరిగణనలోకి తీసుకోవడం మొదలుపెట్టాలి. అలాగే మన విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలి.



**తవ్వకం ఉత్పత్తి పంపిణీ వినియోగం విసర్జన**

**2.** చెత్తకుప్పలు (హైదరాబాద్ జవహర్‌నగర్‌లో, అనకాపల్లిలో ఇటీవలే ఈ సమస్యల్ని చూశాం)

పెద్ద నగరాల్లో, చిన్న పట్టణాల్లో కూడా చెత్త ఉత్పత్తి పెరిగి పోతుంది. ఆ చెత్తని పారవేసే ప్రాంతంలోని ప్రజలపై, పశుపక్ష్యాదులపై దాని దుష్ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఈ చెత్త నుంచి విషపదార్థాలు నేలలోకి ఇంకి నేలను, భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో వ్యవసాయం, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటాయి. ఈ వ్యర్థ పదార్థాలను తగలబెడితే వచ్చే విషవాయువులు, బూడిద వల్ల చుట్టు పక్కల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం దెబ్బతింటాయి. హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌లో దీనిని చూస్తున్నాం. మన జీవిత విధానాలను మార్చుకుని చెత్త ఉత్పత్తిని తగ్గించుకోకపోతే పట్టణాల చెత్తను పల్లెల్లో పడేయటాన్ని వ్యతిరేకించే మన ప్రయత్నాలు వృథా ప్రయాసే అవుతాయి. ఇంకా చెప్పాలంటే ఈ సమస్య మరింత తీవ్రతరమవుతుంది, మరిన్ని డంప్‌యార్డ్‌లు పుట్టుకొస్తాయి.

**3. యురేనియం తవ్వకం, కృష్ణా-గోదావరి బేసిన్‌లో సహజవాయువు వెలికితీయటం, అణువిద్యుత్ కర్మాగారాలు, పెద్దపెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు**

ప్రజలకు, భూమికి, ఆవాసప్రాంతాలకు ఇవి తెచ్చిపెట్టే సమస్యల వల్ల వీటిని వ్యతిరేకించాం; ఇప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉన్నాం. వీటివల్ల కలిగే ప్రమాదాన్ని,

సమస్యలను గుర్తించని పాలనా యంత్రాంగంలోని వాళ్లూ, సమాజమూ ఇలాంటి ప్రాజెక్టులకు మద్దతుగా రెండు కారణాలను చూపిస్తున్నారు.

– మొదటిది, ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న డిమాండు దృష్ట్యా మనకు తీవ్ర విద్యుత్ కొరత ఉంది. ఇది వాస్తవం.

– రెండోది, సంప్రదాయేతర పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నది కాబట్టి అది ఆమోద యోగ్యం కాదు.

**బొగ్గు తవ్వకంలో గల ఇతర ఖర్చులు లెక్కలోకి తీసుకోనంతకాలం, గనులు తవ్వే ప్రాంతంలో, ధర్మల్ లేదా అణు విద్యుత్ కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనంత కాలం ఇవి చవకగానే అనిపిస్తాయి.**

బొగ్గు తవ్వకంలో గల ఇతర ఖర్చులు లెక్కలోకి తీసుకోనంతకాలం, గనులు తవ్వే ప్రాంతంలో, ధర్మల్ లేదా అణు విద్యుత్ కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనంత కాలం ఇవి చవకగానే అనిపిస్తాయి. బొగ్గు లేదా యురేనియం తవ్వకానికి అయ్యే ఖర్చు, విద్యుత్ కర్మాగారాన్ని స్థాపించి, నిర్వహించటానికి అయ్యే ఖర్చు మాత్రమే ప్రస్తుతం లెక్కలోకి తీసుకుంటున్నారు. ఈ తవ్వకాల కారణంగా నాశనమయ్యే ప్రజలకి, ప్రాంతాలకి రాజకీయంగా, ఆర్థికంగా ఎటువంటి ప్రాముఖ్యత లేకపోవటంవల్ల వారు నిస్సహాయులుగా ఉండిపోతారు. వినాశనం, విస్థాపన బాధాకరమే అయినప్పటికీ ధరలు అందుబాటులో ఉండాలంటే తప్పదు కదా అని వాదిస్తుంటారు.

### 4. రాళ్లు, బాక్సైట్, ఇనుములాంటి లోహాల / ఖనిజాల తవ్వకం

ప్రజలు, అడవులు, నీటి వనరులపై పడుతున్న ఈ విధ్వంసకర ప్రభావం కారణంగా వీటిని వ్యతిరేకించటం సరైనదే. కాని వీటికి ప్రత్యామ్నాయాల గురించి అడిగినపుడు మన దగ్గర ఎటువంటి సమాధానం లేదు. పర్యావరణానికి, మానవ నివాస ప్రాంతాలకు జరిగే నష్టాన్ని కొంత మేరకు తగ్గించే గనుల తవ్వకపు ప్రక్రియలు కొన్ని ఉన్నాయని మాత్రమే చెప్పగలం. ప్రభావిత ప్రజలకు తప్పకుండా నష్టపరిహారం చెల్లించమని చెప్పగలం. అయితే గత అనుభవాలను చూసినపుడు ఈ పరిహారం ప్రజల జీవితాలకు, జీవనోపాధులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసి వాటిని పునరుద్ధరించడంలో ఎంతవరకు విజయం సాధించాయన్నది

సందేహాస్పదమే అని తెలుస్తుంది. ప్రజలు, పర్యావరణం మీద గనుల తవ్వకపు ప్రభావాలని కొంతమేరకు తగ్గించడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఈ విధానాలు స్వతహాగానే విధ్వంసపూరితమైనవి అన్న వాస్తవం మిగిలిపోతుంది. మన పట్టణ 'మెరుగైన' జీవన విధానానికి ఆ వనరులు 'అవసరం' అయినంత వరకు ఈ విధ్వంసం అనివార్యమవుతుంది.

ఇనుము మన జీవితాల్లో అంతర్భాగం అయిపోయింది. ఇనుములేని జీవన విధానాన్ని మనం ఇప్పుడు ఊహించుకోలేము. ప్రస్తుత అభివృద్ధిలో రెండు ప్రధాన రంగాల్లో ఇనుము కీలకంగా ఉంది – నిర్మాణం (ఇళ్లు, కర్మాగారాలు, వంతెనలు మరియు అభివృద్ధిగా పరిగణించబడే పారిశ్రామీకరణకి అవసరమైన మౌలిక సదుపాయాలు), రవాణా (కార్లు, ట్రక్కులు, బస్సులు, ఓడలు వంటి వాటి నిర్మాణానికి). బాక్సైట్ నుండి వచ్చే అల్యూమినియం తేలికగా, మన్నికగా ఉంటుంది, కాబట్టి దానిని ప్రధానంగా రవాణా (కార్లు, విమానాల తయారీలో), నిర్మాణం, ప్యాకేజింగ్‌లలో వినియోగిస్తున్నాం. ఇనుములాగానే ఇది కూడా అనివార్యమైపోయింది. అలాగే రాయి కూడా మన అభివృద్ధి కార్యకలాపాల్లో తప్పనిసరి వస్తువుగా మారిపోయింది. ఇళ్లు, రోడ్లు, కార్యాలయాలు, కర్మాగారాలు, దుకాణ సముదాయాల (షాపింగ్‌మాల్స్) నిర్మాణంలో ఇది అత్యవసరం అయిపోయింది. నేటి అభివృద్ధికి తప్పనిసరైన ఈ వనరుల కోసం గనులున్న ప్రాంతాలలో పేల్చివేతలు, తవ్వకం కొనసాగించటం తప్ప గత్యంతరం లేదు. ఇలాంటి వనరులతో ముడిపడి ఉన్న మన జీవన విధానం ఇంకా పెరిగే కొద్దీ వీటి అవసరం కూడా మరింతగా పెరుగుతూనే ఉంటుంది.

**5. ఆనకట్టలు (చిన్నవి, పెద్దవి) :** నదులకు ఆనకట్టలు కట్టడం – పోలవరంలో మాదిరి పెద్దవే కాకుండా చిన్నవి కూడా – నదీ జీవావరణాన్ని, ముంపు ప్రాంతాలలోని ఆవాసాలను, ముంపు ప్రాంతంలో ఉంటూ, దానిమీద ఆధారపడిన ప్రజల (ఉదాహరణకు మత్స్యకారులు) జీవనాన్ని విధ్వంసానికి గురి చేస్తాయి. నదీ ప్రవాహానికి అడ్డంగా గోడ కట్టడం వల్ల నది జీవావరణం విధ్వంసం అవుతుందన్నది ప్రత్యేకించి ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదు. వేలాది సంవత్సరాలుగా నదితో ముడిపడి రూపు దిద్దుకుంటూ వచ్చిన నదీ ఆవాస ప్రాంతాలు నామరూపాలు లేకుండా పోతాయి. ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసులు, సామాజికంగా అంచులకు నెట్టివేయబడిన ఇతర వర్గాల వాళ్లు, తమ ఇళ్లు, భూములు, కలప మొదలైన అటవీ ఉత్పత్తుల సేకరణ (ఇవి ఆదివాసులకు చాలా ముఖ్యం) కోల్పోతున్నారు. నది దిగువన ఉన్న మత్స్యకారులు తమ జీవనోపాధిని

కోల్పోతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ విధాన నిర్ణేతలు, వారికి అధికారాన్ని ఇస్తున్న సమాజమూ ఆనకట్టల నిర్మాణాన్ని సమర్థించటానికి రెండు కారణాలను చూపిస్తున్నారు; మొదటిదీ, ప్రధానమైనదీ కాలవల ద్వారా వ్యవసాయానికి, పరిశ్రమలకు, తాగునీటికి చేసే నీటి సరఫరా. రెండవది విద్యుదుత్పత్తి.

అయితే ఈ రెండు కారణాలు నదికి అడ్డుకట్ట వెయ్యటం వల్ల కలిగే నష్టాలని విస్మరించదగినంత ముఖ్యమైనవా అనేది చర్చనీయాంశం. ఈ ఆనకట్టల వల్ల లభించే నీరు, విద్యుత్తు అవసరమయ్యేలా చేసే మన జీవన విధానం ఈ చర్చకు కేంద్ర బిందువు కావాలి. గృహ, పరిశ్రమల అవసరాల కోసం నీళ్లు, విద్యుత్తు - వీటివల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? ఈ ప్రయోజనాల కోసం ఎన్నో జీవితాలు, ఆవాస ప్రాంతాలు విధ్వంసం కావటం సమర్థనీయమేనా? ఇంకా ఇలాంటి ప్రశ్నలెన్నో మనం వేసుకోవాలి. ఒక నదికి ఆనకట్ట కట్టి వందల కిలోమీటర్ల దూరం నుంచి తాగునీటిని తీసుకురావలసిన స్థితికి అసలు ఎలా వచ్చాం? మన జీవన విధానం, అభివృద్ధి నమూనాల్లో ఏ అంశాలు వెనుకటి నుంచి స్థానికంగా మనకి అందుబాటులో ఉన్న నీటి వనరులన్నింటిని విచ్చలవిడిగా వాడుకొనేలా, చివరికి అవి అడుగంటిపోయేలాగా, అయిపోయేలాగా చేసాయి? అదే విధంగా విద్యుత్ ఉత్పాదన కోసం చెప్పే కారణాలని కూడా మనం ప్రశ్నించాలి. ప్రజల జీవితాలను, మనందరి ఉమ్మడి ఆవాస ప్రాంతాలను నాశనం చేసి ఉత్పత్తి చేసే విద్యుత్తు మనకి ఇంత పెద్ద మొత్తాల్లో ఎందుకు కావల్సివస్తున్నది?

వ్యవసాయానికి కావల్సిన నీటి గురించి ప్రశ్నే వస్తే గతంలో నదులకు ఆనకట్టలు కట్టకుండా మనం ఆహారం ఎలా ఉత్పత్తి చేయగలిగాం? గతంలో కంటే ఇప్పుడు జనాభా ఎక్కువ అన్నది, గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ ఆహారాన్ని వ్యర్థం చేస్తున్నామన్నదీ రెండూ వాస్తవమే. ఇవి రెండూ ఆలోచించి పరిష్కరించాల్సిన సమస్యలే. ఎందుకంటే వీటి వలనే గతంలో కంటే ఎక్కువ భూమిలో వ్యవసాయం చేయవలసి వస్తున్నది, ఎక్కువ పంటలను పండించవలసి వస్తున్నది, ఎక్కువ నీటితో అవసరం వస్తున్నది. అంతే కాకుండా కాలంతోపాటు మన ఆహారపుటలవాట్లలో ఎన్నో మార్పులు వచ్చాయి - వర్షాధారంగా పండే పంటలను తినటం మానేసి నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి, కూరగాయలు, చెరుకు లాంటి పంటలను తినటం అలవాటు చేసుకున్నాము. ఈ కారణాల వల్ల కూడా నదులకి ఆనకట్టలు వేసి ఆ నీటిని గతంలో వానలమీద ఆధారపడిన భూములకి లేదా ఇప్పుడు పండిస్తున్న పంటలకన్నా ఎక్కువ పండించాలి అనుకుంటున్న వాళ్ల భూములకి తరలించవలసి వస్తోంది.

**6. రైతుల ఆత్మహత్యలు:** గత రెండు సంవత్సరాలుగా మానవహక్కుల వేదికలోని మనమంతా రైతుల ఆత్మహత్యలపై దృష్టిని కేంద్రీకరించాం. రైతులు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేసే జి.వో. 421 (2004) అమలుకు మనం పోరాడటం సరైనదే. మన సమాజంలో అత్యంత కష్ట జీవులలో రైతులు ఒకరు – వ్యవసాయం అంటే శారీరకంగా ఉండే కష్టమే కాకుండా, మామూలుగానే భరోసాలేని వ్యవసాయం ఇంకా సందిగ్ధంగా మారుతూ ఉండటం వల్ల కలిగే మానసిక ఒత్తిడి కూడా ఉంటుంది. ఇంతకంటే ఎంతో తేలికైన ఉత్పాదన గల వృత్తులతో పోలిస్తే, రైతుల శ్రమ, ఒత్తిడిలకు లభించే ప్రతిఫలం అతి స్వల్పం.

మన సమాజంలో శారీరక శ్రమ అంటే ఉన్న చులకన భావం, సానుభూతి కొరవడిన ప్రభుత్వ విధానాలు, పెట్టుబడిదారీ వ్యవస్థ తర్కం ఈ మూడు కలవడం వల్ల కలిగిన దురదృష్టకర పరిస్థితి దీనికి కారణం. మొత్తంగా, కష్టకాలంలో రైతులకు రక్షణ చర్యలు వ్యవస్థీకరించటం మాట అటుంచి, 'ఆర్థిక పునర్నిర్మాణం' పేరుతో ప్రస్తుతం ఉన్న మద్దతు వ్యవస్థలను కూడా తీసేస్తున్నారు. ఈ సంక్షోభంలో అత్యధికంగా నష్టపోయిన కుటుంబాలు మరింత విస్మరణకు గురికావడం ఇంకా బాధాకరం.

కాని ఈ వ్యవసాయ సంక్షోభానికి మూలాలు ఎక్కడ ఉన్నాయి? విధ్వంసకర అభివృద్ధి గురించి మనం చేస్తున్న ఈ చర్చ ప్రకారం చూస్తే అసలు వ్యవసాయమే రైతులకు, భూమికి విధ్వంసకరం కాకుండా ఉండగలదా?

సమగ్రమైన విశ్లేషణ అవసరమైన ఒక విస్తృత, సంక్లిష్ట అంశం ఇది. అలాంటి విశ్లేషణ ఈ వ్యాస పరిధికి మించినది. అయితే అంత సమగ్రంగా కాకపోయినా వ్యవసాయం ఆర్థికంగా, జీవావరణ పరంగా సుస్థిరంగా లేకుండా పోవటానికి గల కొన్ని కీలక కారణాలను గుర్తిద్దాం:

- సాంప్రదాయ, వర్షాధార, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని పండే పంటలకు బదులు పెద్ద మొత్తంలో వనరులు అవసరమయ్యే, ఎక్కువ ఆటుపోట్లకు గురయ్యే ఆహార, వాణిజ్య పంటలను సాగుచేస్తుండడం.
- ఉత్పాదకాల ఖర్చులు/ధరలు విపరీతంగా పెరిగిపోవటం. (ప్రత్యేకించి విత్తనాలు, ఇతర ఉత్పాదకాలు కార్పొరేట్ గుత్తాధిపత్యంలోకి వెళుతున్న నేపథ్యంలో)
- ఉత్పాదకాల కొనుగోలు, సరఫరాలలో ప్రభుత్వ మద్దతు లేకపోవటం లేదా నామమాత్రంగా ఉండటం.

- అదే విధంగా పంట కొనుగోలు, గిట్టుబాటు ధరలు, పంట నష్టపోయినపుడు ఇచ్చే బీమా వంటి విషయాలలో ప్రభుత్వ మద్దతు లేకపోవటం లేదా నామమాత్రంగా ఉండటం.
- అధిక దిగుబడిని సాధించటమనే సంకుచిత దృష్టితో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, మన ప్రభుత్వాలు సిఫారసు చేస్తున్న విధ్వంసకర సాగు పద్ధతుల ఫలితంగా భూమిసారం కోల్పోవడం.
- మానవ ప్రభావిత మార్పుల కారణంగా వాతావరణంలో వస్తున్న ఒడిదుడుకులు.
- ప్రకృతి వనరులను అనాలోచితంగా, విధ్వంసకరంగా వాడుకోవటం వలన పెరుగుతున్న నీటికొరత, భూములు మెట్టగా మారుతున్న పరిస్థితులు.

ఈ వ్యాస పరిధి దృష్ట్యా క్లుప్తంగా పేర్కొన్న పై అంశాలను చూస్తే వ్యవసాయ సంక్షోభ మూలాలు శారీరక శ్రమ అంటే ఉన్న చిన్నచూపు కాక మనం అవలంబిస్తున్న అభివృద్ధి విధానంలోనూ ఉన్నాయని చెప్పగలం. భూమికి, రైతుకి సంబంధించినంత వరకు వారి దీర్ఘకాల సుస్థిరతను పణంగా పెట్టి అస్థిర లాభాల పైన దృష్టి కేంద్రీకరించిన విధానంగా ఈ అభివృద్ధి విధానాన్ని గురించి మనం అనుకోవచ్చు. సాంప్రదాయ, సుస్థిర వ్యవసాయ విధానం నుంచి రైతులను మన ప్రణాళికావేత్తలే పక్కకు తప్పించారు కాబట్టి, ఈ అస్థిర విధానాలను అవలంబిస్తున్నందుకు రైతులను తప్పు పట్టలేం. అన్ని రంగాలలోనూ ఈ ముందుచూపు లేని విధానాలనే చాలా కాలంగా అనుసరిస్తున్నారు. మొత్తంగా మన అభివృద్ధి విధానమే ఈ పంథాను అనుసరిస్తున్నందువల్ల మన వ్యవసాయ విధానం, ఆచరణ కూడా అదే దోవలో నడుస్తున్నాయి. దీని పరిణామాలు సమాజం గురించి పట్టించుకునే ఎవరికైనా సుస్పష్టంగా కనిపిస్తాయి.

## ముగింపు

విధ్వంసకర అభివృద్ధికి సంబంధించినంత వరకు ముగింపు ఒకటే ఉండగలదు. సమాజ, వ్యక్తిగత స్థాయిలలో ఉత్పత్తినీ, వినియోగాన్ని తగ్గించుకొని, మన జీవితాలను వీలైనంత వ్యర్థ రహితంగా తీర్చిదిద్దుకొని, దానికి అనుగుణంగా అభివృద్ధి విధానాన్ని మార్చుకుంటే తప్ప అభివృద్ధి అన్నది తప్పని సరిగా విధ్వంసకరంగానే ఉంటుంది.

కేవలం విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించటమే కాకుండా, వనరులనేవి న్యాయంగా పంచబడాలి అని కూడా ఆశించే మానవహక్కుల కార్యకర్తలు



Source: World Bank staff estimates.

వినియోగం తగ్గించాలి అనే వాదనని చేస్తున్నప్పుడు వారి ముందుకు వచ్చే (తప్పకుండా రావాల్సిన) మొట్టమొదటి ప్రశ్న ఇది : సమాజంలోని వివిధ వర్గాల మధ్య వినియోగ స్థాయిలో చాలా అంతరం ఉన్నప్పుడు అందరినీ వారి వినియోగం సమానంగా తగ్గించుకోమని అడగగలమా? అధిక శాతం జనాభా చేసే వినియోగం కన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా వస్తు, వనరుల వినియోగం చేసే పట్టణ ప్రాంతపు ధనిక, మధ్యతరగతి ప్రజలు ఉన్న నేపథ్యంలో ఈ ప్రశ్న చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

ప్రపంచ బ్యాంకు గణాంకాల ఆధారంగా రూపొందించిన పై రేఖా పటాన్ని చూస్తే ప్రపంచ జనాభా వినియోగ స్థాయి ఎలా ఉందో తెలుస్తుంది. 'కుటుంబవారీ వినియోగ ఖర్చు'కి సంబంధించిన గణాంకాల ఆధారంగా దీనిని తయారుచేసారు. ప్రతి పది శాతం జనాభాపరంగా, వారు వాడుతున్న అన్ని వస్తువుల, సేవల మార్కెట్ విలువను ఇది చూపుతుంది. దీంట్లో కార్లు, వాషింగ్ మెషీన్లు, కంప్యూటర్లు లాంటి వాటి ఖర్చు కూడా ఉంది. కాని ఇళ్ల కొనుగోలు ఖర్చు కలపలేదు. అది కూడా కలిపినట్లైతే ఈ అంతరాలు మరింత తీవ్రతరం అవుతాయి. సంపన్నులలోని పై పదిశాతం మంది ప్రపంచంలో దొరికే అన్ని వస్తువులలో 60 శాతం వాటిని వినియోగిస్తూ ఉండగా ఆ తర్వాత 10 శాతం సంపన్నులు మరో 18 శాతం వాడుకుంటున్నారు.

విద్యుత్, శిలాజ ఇంధనాలు, లోహాలు, ఆహారం, నీరు, ఇంటి వసతి, రవాణా, వినియోగ వస్తువులు, శ్రమను తగ్గించే సాధనాలు ఇవన్నీ అందుబాటులో ఉండటం, వాటిని వాడుకోవటం అనే విషయంలో మన సమాజంలో విపరీతమైన అసమానతలు ఉన్నాయనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా తక్కువ శాతం జనాభా కార్లు, పెద్ద పెద్ద ఇళ్లు, వాషింగ్ మెషీన్లు, టెలివిజన్లు, ఏర్ కండిషనర్లు

సొంతం చేసుకొని ఉండగా, అత్యధిక శాతం ప్రజలు మాత్రం ఎలాంటి వ్యక్తిగత వాహన సదుపాయం లేక, అద్దె ఇళ్లలో, అతికొద్ది వినియోగ వస్తువులతో బతుకుతున్నారు. ఇంత తక్కువ వినియోగం చేస్తున్న ఈ ప్రజలను నేటి విధ్వంసకర అభివృద్ధికి బాధ్యులని చేయలేం. ప్రత్యేకించి దాని నుండి వారు ఎలాంటి లబ్ధి పొందనపుడు వారిని దోషులుగా నిలబెట్టలేము. సంపన్న (బాగా చదువుకున్నవాళ్ళు కూడా) వర్గాల వారే ఈ విధ్వంసకర అభివృద్ధికి ప్రధాన బాధ్యులు. మనలో కూడా కొంతమందిమి ఈ సంపన్న వర్గానికి చెందినవాళ్లమేనని ఒప్పుకోవాలి.

కాబట్టి, లేని వాళ్ళకి ఇప్పుడు వారికి ఉన్నదానికన్నా ఎక్కువ లభించేలా, చాలా ఉన్నవాళ్ళు వాళ్ళ వినియోగాన్ని కొంత తగ్గించుకునేలా వనరుల పునఃపంపిణీ చేయాలి.

ఒక ప్రజాస్వామిక సమాజంగా, మనం మరింత లేకుండా బతకలేము, భావితరాల కోసం వనరులను, జీవావరణాన్ని సురక్షితంగా ఉంచేందుకు అవసరమైనమేరకు మన వినియోగాన్ని తగ్గించుకోలేము అని నిర్ణయించుకున్నట్లైతే, న్యాయం, సమానత్వం ఆశించే వ్యక్తులుగా మనముందు రెండే మార్గాలున్నాయి. అతి వేగంగా అంతరించిపోతున్న, తరిగిపోతున్న సహజ వనరులను, దాని వల్ల జరుగుతున్న జీవావరణ విధ్వంసాన్ని, భావి తరాలపై వాటి తీవ్ర పరిణామాలను మనం లక్ష్యపెట్టకుండా ఉండవచ్చు. లేదా ప్రస్తుతం జరిగే మానవహక్కుల ఉల్లంఘనలనే పట్టించుకొని ఆ హక్కుల పరిరక్షణ కోసమే పని చేస్తామని నిర్ణయించుకోవచ్చు. ఉత్పత్తి, వినియోగాల పెరుగుదలే లక్ష్యంగా గల అభివృద్ధి తప్పనిసరిగా విధ్వంసకరమైనదిగానే ఉంటుంది కాబట్టి నష్టపోయే ప్రజల అవసరాల పట్ల మరింత సున్నితంగా ఉండే నష్టపరిహార విధానాలను రూపొందించి వారికి ఆ మొత్తాలు దక్కేలా కృషి చేయవచ్చు.

అయితే విధ్వంసకర అభివృద్ధి వల్ల నష్టపోబోయే వారందరికీ, మనం ఒక సమాజంగా, పరిహారం చెల్లించే స్థోమత కలిగి ఉన్నామా? వ్యవసాయ కుటుంబాలకి మిగిలే సారంలేని, బీడు బారిన భూములకు; ఏదో ఒక ప్రాజెక్టు వల్ల ఇప్పటికే నిర్వాసితులుగా మారిన ఆదివాసులకు లేదా చెట్లు మిగలని అడవుల మధ్య మిగిలిన ఆదివాసులకు; గత్యంతరం లేక పనికోసం పట్టణాలకు వలసపోతున్న పల్లె ప్రజలు గురయ్యే వేదనకు; యురేనియం తవ్వకం లేదా అణువిద్యుత్ కర్మాగారాలు ఒకవేళ ఏదన్నా వైఫల్యానికి గురైతే వేల సంఖ్యలో రేడియేషన్, దాని నుండి వచ్చే క్యాన్సర్‌ల బారిన పడే ప్రజలకు; నీళ్లు, శుభ్రమైన

గాలి ఇప్పటికే అందుబాటులో లేని ప్రజలకు; పెరుగుతున్న అలాంటి ప్రజలందరికీ, ఇలాంటి ఎంతోమంది బాధిత వ్యక్తులు, సమూహాలకీ మనం నష్టపరిహారం చెల్లించగలమా? ఇప్పటికన్నా ఎంతో దారుణమైన స్థితిలో మిగిలే ప్రపంచాన్ని మన నుంచి కానుకగా అందిపుచ్చుకోబోయే మన పిల్లలు, వారి భావితరాల మాటేమిటి? వారు కూడా నష్టపరిహారానికి అర్హులవుతారా?

(మానవహక్కుల వేదికలో నా అనుభవాల ఆధారంగా)

అనువాదం: మంచి పుస్తకం సురేష్

# ఆఫ్రికా భూముల్లో కార్పొరేట్ సేద్యం

ఎస్. జీవన్ కుమార్ *

**ఆఫ్రికా ఖండం అమ్మకానికి వచ్చింది. శక్తివంతమైన దేశాలు, కంపెనీలు అక్కడ భూములను కాజేయడానికి ఎగబడుతున్నాయి. ఆఫ్రికాలో ఉన్న ఎన్నో చిన్న చిన్న దేశాలు వలసపాలన నుండి విముక్తి చెంది, స్వతంత్ర దేశాలుగా ఉంటూనే భూముల్ని అమ్ముకునే దుస్థితికి చేరుకున్నాయి. సంపన్న దేశాల చేతుల్లో పావులుగా మారిపోయాయి. కొన్ని వేల హెక్టార్ల వ్యవసాయ భూములను ప్రైవేటు కంపెనీలకు లీజు రూపంలో ధారాదత్తం చేస్తున్నాయి. సంపన్న దేశాల భవిష్యత్తు ఆహార, ఇంధన అవసరాలన్నీ సుసంపన్నమైన ఆఫ్రికా భూములు తీర్చనున్నాయి.**

## వలస చరిత్ర

ఆఫ్రికా ఖండం దాదాపు 400 సంవత్సరాలుగా యూరోపియన్ దేశాల వలస ప్రాంతంగా ఉంది. దట్టమైన అడవులు, ఎన్నోరకాల జంతువులు, పశుపక్ష్యాదులు, తరగని ఖనిజ సంపద అన్నీ పుష్కలంగా ఉండి ప్రపంచాన్నే అబ్బుర పరచిన భూభాగం ఆఫ్రికా. ఎన్నో ఆదివాసీ జాతులకు సంస్కృతులకు నెలవు అది. పారిశ్రామిక విప్లవం ఊపందుకున్న తరుణంలో ఆఫ్రికన్ తీరం వెంబడి ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, పోర్చుగీస్, బ్రిటిష్, ఇటాలియన్ వ్యాపారస్తులు ఓడల్లో బట్టలు, రకరకాల నిత్యావసర వస్తువులు తీసుకొచ్చి వ్యాపారం చేసేవారు. ఆదివాసీ ప్రజలను మచ్చిక చేసుకుని రకరకాల పద్ధతుల్లో ఆ దేశాల వారు ఆఫ్రికాలోకి అడుగుపెట్టిన వైనాన్ని చరిత్ర పుస్తకాల్లో చదువుకున్నాం.

*మానవహక్కుల కార్యకర్త

అట్లా ప్రవేశించిన వలసవాదులు క్రమంగా ఆఫ్రికా ఖండాన్నంతా తమ వలసలుగా చేసుకుని వారి సంపద, వనరులపై పెత్తనమేగాక రాజకీయ అధికారాన్ని కూడా సంపాదించుకున్నారు. వారి చేతుల్లో నుండి బయటపడి ప్రపంచంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు సంపాదించుకొనేందుకు ఆ దేశాలు చాలా మూల్యం చెల్లించాయి. జాతుల మధ్య అంతర్యుద్ధాలు, సైనికపాలన, సైనిక తిరుగుబాట్లు, గెరిల్లా యుద్ధాలతో అతలాకుతలమై, చివరికి ఇరవయ్యో శతాబ్దపు చివరి భాగంలో స్వతంత్ర దేశాలుగా స్థిరపడ్డాయి. ఆఫ్రికా దేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా చాలా దేశాల్లో అనిశ్చిత రాజకీయ పరిస్థితి కొనసాగింది. సైనిక తిరుగుబాట్లు, మిలిటెంట్ రాజకీయ గ్రూపుల గెరిల్లా పోరాటాల వల్ల అభివృద్ధి కొరవడింది. ఈ పరిస్థితి వల్ల ఆయుధాలు అమ్ముకునే గ్యాంగులు, నల్లమందు, మాదక ద్రవ్యాల మాఫియాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాగా లాభపడ్డాయి. యూరోపియన్ దేశాలలోని కార్పొరేట్ కంపెనీలు, బడా వ్యాపారవేత్తలు ఈ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని, ఖనిజాలు, కలప తదితర వ్యాపారాల్లో బాగా లాభాలు సంపాదించారు.

ఇంకోపక్క అగ్రరాజ్యం అమెరికా గత పదేళ్లుగా పెట్రోల్‌పై పట్టు కోసం, ప్రపంచంలో తన ఆధిపత్యం కోసం అరబ్ దేశాలలో యుద్ధాలు సృష్టించి, ఆ దేశాల సార్వభౌమత్వాన్ని అతలాకుతలం చేసింది. పేద దేశాల అభివృద్ధి, పేదరిక నిర్మూలన పేరుతో వివిధ ఆర్థిక సంస్థల ద్వారా తన పెత్తనాన్ని సాగిస్తోంది. ఎంతో ఖనిజ సంపద కలిగి, వ్యవసాయానికి అనుకూలమైన, సారవంతమైన భూములు కలిగివున్న ఈ ఆఫ్రికా దేశాలు ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## భవిష్యత్తు ఆహార అవసరాలు

ఈ నేపథ్యంలో జి-8 దేశాల సముదాయం (గ్రూప్ ఆఫ్ 8 దేశాలు - అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, జపాన్, రష్యా) ఆఫ్రికా దేశాల్లో వ్యవసాయ అభివృద్ధిపై దృష్టి సారించింది. 2012లో క్యాంప్ డేవిడ్‌లో జరిగిన సదస్సులో దానికి కావలసిన సిద్ధాంత దృక్పథాన్ని అమెరికా ప్రవేశపెట్టింది. తర్వాత 2013 జులైలో ఐర్లాండ్‌లో జరిగిన జి-8 దేశాల సదస్సులో దానికి అవసరమైన ఒక సంపూర్ణ తాత్విక చట్రాన్ని ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ఒబామా 'భవిష్యత్తుకు ఆహారం' (Feed the future) అనే తన తాత్విక ఆలోచనకు ఇలా వివరణ ఇచ్చాడు. ప్రపంచంలో రోజు రోజుకూ ఆహార కొరత, పౌష్టికాహార లోపం ఏర్పడుతోందని, వచ్చే ముప్ఫై సంవత్సరాలలో కోట్లాదిమంది

ప్రజలు ఆహారం లభించక బాధపడతారని, అందులో ఆఫ్రికా దేశాలలో 5 కోట్ల మంది వుంటారని, ఆ ప్రజలను ఆదుకోవడం మన దేశాల బాధ్యత అని ప్రకటించాడు. 'వ్యవసాయ క్షేత్రం నుండి మార్కెట్‌కు, అక్కడ నుండి భోజనం చేసే టేబుల్ మీదికి ఆహారాన్ని అందించడం, ఒక్క ప్రభుత్వం మాత్రమే చేయలేదు కాబట్టి ఈ ప్రక్రియలో ప్రైవేటు కంపెనీలకు భాగస్వామ్యం కల్పించాల'ని ప్రకటించాడు.




ఈ ఆలోచనను అనుసరించే 'అలయెన్స్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఇన్ ఆఫ్రికా' (AGRA) ఏర్పడింది. దానికి బిల్‌గేట్స్, ఫోర్డు ఫౌండేషన్ల ఆర్థిక సహాయంతో ఒక ద్రవ్యసంస్థ కూడా ఏర్పడింది. పెట్టుబడి పెట్టదల్చుకున్న కంపెనీలు ఆ సంస్థ ద్వారా ఆయా దేశాలలో వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడులు పెట్టవచ్చు. ఆయా దేశాలు, ఆయా కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని ఈ అలయన్స్‌లో చేరాలి. ఇప్పటికే ప్రపంచంలోని అతిపెద్ద విత్తన కంపెనీలు 'డ్యూపాంట్', 'మోన్‌శాంటో', 'కార్గిల్', 'సింజెంటా', 'బేయర్'తో సహా దాదాపు 72 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భారతదేశానికి చెందిన కంపెనీలూ, వ్యక్తులు కూడా వున్నారు.

## భూ పందేరాలు

ఆఫ్రికా దేశాలలో నివసిస్తున్న అత్యధిక తెగలు, సంచార జాతులు వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నవారే అయితే ఆ భూముల మీద చాలామందికి స్థిరమైన హక్కు పత్రాలు లేవు. కేవలం సాంప్రదాయక హక్కు (customary right) కలిగి వుంటారు. అంతేకాక ఊరుమ్మడి ఆస్తులుగా వున్న అనేక భూములను కొన్ని తరాలుగా వారు అనుభవిస్తూ వస్తున్నారు. ఎప్పుడైతే ఆఫ్రికా దేశాల ప్రభుత్వాలు సాగులో లేని తమ 'నిరుపయోగమైన' భూములను కార్పొరేట్ కంపెనీలకు లీజుకివ్వాలని నిర్ణయించాయో, అప్పుడు సరైన హక్కు పత్రాలు లేని

భూములు, ఊరుమ్మడి భూములు లాంటివి కూడా ఆ జాబితాలో కలిసిపోయాయి. స్థానిక ప్రజలు తాము అనుభవిస్తున్న భూములకు దూరం కావలసి వచ్చింది.

ఆఫ్రికాలో జరుగుతున్న ఈ భూ ఆక్రమణల గురించీ, స్థానిక రైతుల దుస్థితి గురించీ అంతర్జాతీయంగా చాలా గొడవ జరిగింది. మే 2012లో ఐక్యరాజ్యసమితి కూడా ఆఫ్రికా ప్రజల ఆహార భద్రత గురించి ఆందోళన వ్యక్తపరిచింది. ఇంత జరిగిన తర్వాతే ఆఫ్రికా దేశాల ప్రతినిధులంతా కలిసి కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించుకున్నారు. భూసేకరణకు సంబంధించి ఆ ప్రభుత్వాలు తమ విధానాల్లో కొన్ని మార్పుల్ని చేసుకుని, ప్రజల సమ్మతి, వారికి నిర్ణయాధికారం ఉండేలా లీజుల ప్రక్రియను మార్చారు. మొదట ప్రజల పేరుతో పట్టాలిచ్చి వారి ద్వారా కంపెనీలకు లీజుకు ఇప్పించే పద్ధతిని మొదలుబెట్టారు. దానికి కావలసిన చట్టపరమైన మార్పులను చేసి లీజు ప్రక్రియను సులభతరం చేసుకున్నారు. ఇక అప్పట్నుంచి చాలా దేశాలు ఉత్సాహంగా కంపెనీలను, పెట్టుబడిదార్లను ఆహ్వానించసాగాయి. అవసరమైన భూముల సర్వేలకు, సాంకేతిక కార్యక్రమాలకు కంపెనీలు అడ్వాన్సుగా ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసుకోవడానికి నిర్ణీతకాల పరిమితిని కూడా ఆయా దేశాలు పెట్టుకున్నాయి. ప్రథమంగా ఘనా, ఐవరీకోస్ట్, ఇథియోపియా, మొజాంబిక్, బుర్కినాఫాసో, టాంజానియా దేశాలు అలయన్స్‌లో సభ్యత్వం తీసుకుని ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ దేశాలలో ఏం జరుగుతోందో చూద్దాం.

## ఘనా

బంగారు సముద్రతీరంగా పిలవబడిన ఘనాను 15వ శతాబ్దంలో మొదటిసారి పోర్చుగీసు నావికులు గుర్తించారు. తర్వాత బ్రిటిష్, డచ్, స్వీడిష్ వారు వ్యాపారస్తులుగా ప్రవేశించి నివాసం ఏర్పరుచుకున్నారు. పక్కనే బ్రిటన్ స్వాధీనంలో వున్న టోగోలాండ్ 1956లో ఘనాలో విలీనం అయిన తర్వాత 1960లో ఘనా రిపబ్లిక్ ఏర్పడింది. అక్కడ అరవైశాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే బతుకుతున్నారు. చాలా సారవంతమైన భూములు గల ఈ దేశంలో కోకో, వరి, కర్రపెండలం, బఠాణి, మొక్కజొన్న, కాఫీ పంటలు పండిస్తారు. బంగారం, వజ్రాలు, బాక్సైట్, మాంగనీస్ ఖనిజాలు సమృద్ధిగా వున్నాయి. ఇప్పటికే పెద్దెత్తున వాటిని ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం బ్రిటన్, ఇటలీ, నెదర్లాండ్స్, జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, నైజీరియా, స్పెయిన్ దేశాలు

వ్యాపార భాగస్వామ్యం ఏర్పరుచుకుని అక్కడ ఖనిజ పరిశ్రమలు నడుపుతున్నాయి.

ఇప్పుడు జి-8 దేశాల అలయన్స్‌తో ఒప్పందాలు చేసుకొని ప్రభుత్వం పెద్దెత్తున వ్యవసాయ యోగ్యమైన భూమిని గుర్తించి, డేటాబేస్ తయారు చేసుకుంది. 2014 కల్లా 11,250 ఎకరాలు, 2015 నాటికి 25,000 ఎకరాల భూమిని వివిధ కంపెనీలకు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఘనా దేశం ఇతర ఆఫ్రికన్ దేశాలకంతటికీ పైలట్ నమూనా కావాలని ప్రైవేటు కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

**ఐవరీకోస్ట్‌లో 'మినరామ్ ఫ్రాన్స్' అనే ఫ్రెంచి కంపెనీకి లక్షాయాభై ఎకరాలు, అల్జీరియాకి చెందిన మరో కంపెనీకి 8 లక్షల యాభైవేల ఎకరాల భూమిని అప్పజెప్పబోతున్నారు. బియ్యం ఎగుమతుల్లో బాగా గడించి ఈ దేశంలోనే స్థిరపడిన ఫ్రెంచి వ్యాపారవేత్త లూయిస్ డ్రైఫూజర్ కంపెనీకి కూడా రెండు లక్షల ఎకరాలు లీజుకి ఇవ్వబోతున్నారు.**

## ఐవరీకోస్ట్ (కోటె.డి.ఐవాయిరే)

ఈ దేశంలో దాదాపు 60 ఆదివాసీ తెగలు నివసిస్తున్నాయి. 15వ శతాబ్దంలోనే బానిసలను, ఏనుగు దంతాలను కొనుక్కోవడానికి ఫ్రెంచి, పోర్చుగీస్ వర్తకులు ఇక్కడ అడుగుపెట్టారు. తర్వాత ఫ్రెంచి వలసగా కొనసాగింది. ఇక్కడ 80 శాతం మంది వ్యవసాయం మీదే ఆధారపడతారు. కాఫీ, కోకో, చిక్కుళ్లు, కొబ్బరి, మొక్కజొన్న, బంగాళదుంపలు, చెరకు, పత్తి ప్రధాన పంటలు. పెట్రోల్, సహజవాయువు, వజ్రాలు, మాంగనీసు, కోబాల్ట్, రాగి, బాక్సైట్ ఖనిజాలు పుష్కలంగా వున్నాయి. 1960లో ఇది స్వతంత్ర దేశంగా అవతరించింది.

ఈ దేశం కూడా తమ భూములను సులభంగా కౌలుకు ఇవ్వడానికి అనువుగా భూచట్టాలను మార్చింది. 'కో ఆపరేషన్ ఫ్రేంవర్క్' అనే పేరుతో ఎనిమిది విదేశీ కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి ఒప్పందం చేసుకున్నాయి. 'మినరామ్ ఫ్రాన్స్' అనే ఫ్రెంచి కంపెనీకి లక్షాయాభై ఎకరాలు, అల్జీరియాకి చెందిన మరో కంపెనీకి 8 లక్షల యాభైవేల ఎకరాల భూమిని అప్పజెప్పబోతున్నారు. బియ్యం ఎగుమతుల్లో బాగా గడించి ఈ దేశంలోనే స్థిరపడిన ఫ్రెంచి వ్యాపారవేత్త లూయిస్ డ్రైఫూజర్ కంపెనీకి కూడా రెండు లక్షల ఎకరాలు లీజుకి ఇవ్వబోతున్నారు. 2015 నాటికి ఈ లీజు ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## ఇథియోపియా

తూర్పు ఆఫ్రికాలో ఉండే ఇథియోపియాలో అత్యంత పురాతన కాలం నుంచి మానవజాతి నివసించినట్టు దాఖలాలు ఉన్నాయి. ఇటలీ స్వాధీనంలో వున్న ఈ దేశాన్ని విముక్తం చేయడానికి బ్రిటన్ సైనిక సహాయం చేసి, కొంతకాలం తన పెత్తనం సాగించింది. తర్వాత సహాయం చేయడానికి వచ్చిన క్యూబా, సోవియట్ రష్యాలు కూడా ఈ దేశం మీద పెత్తనం చేసాయి. 1991లో సంపూర్ణ స్వతంత్ర దేశంగా అవతరించింది. అయితే ఇక్కడ కేవలం 12 శాతం భూమి మాత్రమే వ్యవసాయ యోగ్యంగా వుంది. ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, కాఫీ, చెరకు, బంగాళాదుంపలు పండుతాయి. భారీ పశుసంపద కలిగి వుండటం వల్ల తోళ్ల పరిశ్రమ, డైరీ పరిశ్రమలు బాగా వృద్ధి చెందాయి. జనాభాలో 80 శాతం మంది పశుపోషణ, వ్యవసాయంపైనే ఆధారపడతారు. మొత్తం 12 శాతం వ్యవసాయ యోగ్యమైన భూమిలో 10 శాతాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడానికి ఆ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కాకపోతే 'కార్పొరేట్‌ల బాధ్యత' (Corporate responsibility) అనే పేరుతో స్త్రీల, పేద ప్రజల జీవనోపాధికి నష్టం కలగకుండా వారికి రక్షణ కల్పించాలని కంపెనీలకు మార్గదర్శక సూత్రాలను ప్రభుత్వం నిర్దేశించింది.

## మొజాంబిక్

15వ శతాబ్దంలో ఈ దేశాన్ని వాస్కోడిగామా గుర్తించాక పోర్చుగీసు వారి వలసగా మారింది. స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ పోరాటం చేసి 1975లో సాధించుకున్నారు. వ్యవసాయ యోగ్యమైన 15 శాతం భూమిలో వరి, మొక్కజొన్న, నూనెగింజలు, చెరకు, పప్పుధాన్యాలు పండుతాయి. 65 శాతం మంది వ్యవసాయం పైన ఆధారపడతారు. ఈ దేశంలో వాణిజ్య, వ్యాపార ఒప్పందాల ద్వారా జపాన్, బ్రెజిల్, ఇండియాకి చెందిన కంపెనీలు వ్యవసాయ రంగంలోకి ప్రవేశించి పెద్దెత్తున సోయా, మొక్కజొన్న పండిస్తున్నాయి. ఇక్కడ మొదలైన ఈ కార్పొరేట్ వ్యవసాయ విధానం ఆఫ్రికా ఖండానికే ఒక విధ్వంసక నమూనాగా ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ అలయన్స్‌లో చేరి మరిన్ని భూములు లీజుకివ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## బుర్కినాఫాసో

పశ్చిమ ఆఫ్రికా అప్పర్ వోల్టాగా పిలవబడే ఈ దేశం పోర్చుగీసు వారి స్వాధీనంలో వుండేది. 1960లో స్వాతంత్ర్యం వచ్చి 1982 వరకు అనిశ్చిత రాజకీయ వాతావరణంలో ఉండి, దేశానికి బుర్కినాఫాసో అని పేరు

పెట్టుకున్నారు. బుర్కినాఫాసో అంటే నిజాయితీ పరులుండే దేశం అని అర్థం. సాగు యోగ్యమైన భూమి 13 శాతమే ఉన్నా 90 శాతం మంది వ్యవసాయన్నే నమ్ముకున్నారు. నువ్వులు, పత్తి, తృణధాన్యాలు, ఉష్ణమండలంలో పండే మొక్కజొన్న, వరి పండిస్తారు. పశువుల పెంపకం, కోళ్ల పెంపకం బాగా అభివృద్ధి చెందాయి. ఇటలీ, ఫ్రాన్స్, ఇండోనేషియా, స్పెయిన్ దేశాలు వ్యాపారంలో భాగస్వాములుగా ఉంటూ రాగి, వెండి, సీసం, నికెల్, బాక్సైట్ నిక్షేపాలను దోచుకొని పోయారు.

అలయన్స్‌తో చేసుకున్న  ఒప్పందం ప్రకారం 2014 కల్లా నీటివసతి వున్న నాలుగు లక్షల ఎకరాల భూమిని అప్పజెప్పాలి. అంతేకాక లక్షన్నర ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగించిన అనంతరం లీజుకు ఇవ్వాలి.

## టాంజానియా

కొన్ని సంవత్సరాలు పోర్చుగీసు, ఆ తర్వాత జర్మనీ స్వాధీనంలో వున్న టాంజానియా కూడా ఆఫ్రికా తీరం మీదే వుంది. 1961లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న ఈ దేశంలో వ్యవసాయ యోగ్యమైన భూమి మూడు శాతం మాత్రమే. ఉన్న కొంచెం భూముల్లో తేయాకు, కాఫీ, జీడిపప్పు, లవంగాలు, మసాలా దినుసులు పండుతాయి. ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో పనిచేస్తారు. ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత కిలంబరీ అనే గ్రామంలోని భూమంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. సాగత్ ప్రాంతంలో 20 శాతం భూమిని లీజుకి ఇవ్వనుంది. నూతన వ్యవసాయం అభివృద్ధికి తోడ్పడేలా విత్తన చట్టంలో సవరణలు కూడా చేసింది.

## నయా వలసవాదం

పైన పేర్కొనబడిన దేశాలు రాజకీయ అస్థిరత, అవినీతి, అంతర్యుద్ధాల కారణంగా సంపన్నదేశాల గుప్పెట్లో పావులుగా మారాయి. పాత వలస విధానం పోయి ఆ స్థానంలో నూతన వలస విధానం మొదలయ్యింది. ప్రత్యక్షంగా రాజకీయాధికారం చెలాయించకపోయినా ఆ దేశాల వనరులన్నీ కార్పొరేట్ కంపెనీల ఆధీనంలో వుంటాయి. ఒక పక్క దోపిడీ చేస్తూ, వాళ్లను ఉద్ధరించడానికే అదంతా చేస్తున్నట్టు చెప్పడం ఇంకా విడ్డూరం.

మొత్తంమీద ఆఫ్రికాలో పరిస్థితి చాలా దయనీయంగా మారింది. రైతులు భూమికి దూరం అవుతున్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, వారి

సంస్కృతి నాశనం అవుతున్నాయి. అక్కడ ఏ పంటలు పండాలో, ఏమి తినాలో కూడా కంపెనీలే నిర్ణయిస్తాయి. మార్కెట్ వ్యవస్థ పూర్తిగా కార్పొరేట్‌ల చేతిలోకి పోతోంది. ప్రజలు వ్యవసాయ ఉత్పత్తుల కోసం చేతులు చాచి యాచించే పరిస్థితి వచ్చేలా ఉంది. స్థానిక ప్రజలు సర్వ హక్కులూ కోల్పోయి పరాయికరణ చెందడం ఖాయంలా కనిపిస్తోంది.

ఈ ఒప్పందాలు జరగక పూర్వమే ఆ దేశాల ప్రజలు కార్పొరేట్ కంపెనీల వ్యవహారాన్ని చవిచూసారు. బెంగుళూరుకు చెందిన కాటూరి ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఇథియోపియాలో రెండున్నర లక్షల ఎకరాల్లో గులాబీ తోటలు వేసింది. గులాబీ తోటల పెంపకంలో ప్రపంచంలో అతి పెద్ద సంస్థ ఇది. 2015 కల్లా ఈ విస్తీర్ణాన్ని ఏడున్నర లక్షల ఎకరాలకు పెంచాలని ఈ సంస్థ తన లక్ష్యంగా పెట్టుకుంది. కాటూరి ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే 40 వేల కుటుంబాలను నిర్వాసితులను చేసి, పర్యావరణానికి, స్థానిక నీటివనరులకు ఎంతో హాని తలపెట్టిందని 'హ్యూమన్ రైట్స్ వాచ్' పేర్కొంది.

మన దేశంలో కూడా ఈ కంపెనీ వ్యవసాయం మొదలైంది. రిలయెన్స్, కోక్, మోన్‌శాంటోతో పాటు దేశీయ కంపెనీలైన జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్, హిందుస్థాన్ యూనీలివర్, పెప్సీలాంటి సంస్థలు మహారాష్ట్రలో పెద్దెత్తున కార్పొరేట్ వ్యవసాయాన్ని చేపట్టాయి. ఒక్క జైన్ ఇరిగేషన్ సంస్థ ఈ సంవత్సరం చివరికల్లా 21 వేల ఎకరాలకు తన కార్యక్రమాలను విస్తరించనుంది.

మన దేశంలోలాగే ఆఫ్రికాలో కూడా అత్యధిక జనాభా వ్యవసాయం మీదే ఆధారపడి బ్రతుకుతారు. అంతమంది ప్రజల నుండి భూమిని దూరం చేసి కంపెనీలకు ధారాదత్తం చేసి ఉత్పాదకత, అభివృద్ధిని పెంచుకోవాలనుకోవడం చాలా అవివేకం. అంతకన్నా ఆ దేశాల ప్రభుత్వాలు స్థానిక రైతులకే ఆర్థిక ప్రోత్సాహాన్నిచ్చి వ్యవసాయ అభివృద్ధిని సాధించడం మంచిది. అదే నిజమైన అర్థంలో అభివృద్ధి అనిపించుకుంటుంది.

## ఫుకుషిమా, కూడంకుళం
# దేశ అణు ఇంధన భవితవ్యం : కొన్ని పాఠాలు

నిత్యానంద్ జయరామన్ *

ప్రధానమంత్రేమీ పెర్రివాడు కాదు. అయినా భారతదేశపు అణులక్ష్యాల గురించి ఆయనగారు సెలవిస్తున్న మాటలు విని మీకు అలా అనిపించి ఉంటే అందులో తప్పు పట్టడానికేమీ ఉండదు.

దేశం 2050 కల్లా 4 లక్షల 70 వేల మెగావాట్ల అణువిద్యుత్తు సామర్థ్యాన్ని సాధించగలగాలని 2009లోనే డాక్టర్ సింగ్ ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన నాటికి దేశ అణువిద్యుత్తు సామర్థ్యం మొత్తమంతా కలిపి 4,780 మెగావాట్లు. అది కూడా అరవై ఏళ్ల పాటు వేల కోట్ల సొమ్మును తగలబెట్టిన తర్వాత. రానున్న 37 ఏళ్ళలో ఈ అణు విద్యుత్తు సామర్థ్యాన్ని పది కాదు ఇరవై కాదు నూరు రెట్లు పెంచుతామని ప్రధాని ప్రకటన వాగ్దానం చేస్తోంది. డా. సింగ్ తన మాట నిజంగా నిలబెట్టుకోవాలంటే ఆయన సాలీనా 12,700 మె.వా. అణువిద్యుత్తును 37 ఏళ్ల పాటు ఉత్పత్తి చేయాలి. దానికి ఏటా రూ. 2 లక్షల 54 వేల కోట్లను (ఇది 2జి కుంభకోణం కంటే సుమారు రెండు రెట్లు అధికం) వెచ్చించాలి. అణువిద్యుత్తు కేంద్రాన్ని స్థాపించాలని ఆలోచన చేసిన ఇరవై నాలుగేళ్ళ తర్వాత మాత్రమే కూడంకుళంలో మొన్న 2013 జూన్ 14-15 తేదీలలో యూనిట్-1 లో అణువిచ్ఛిత్తి ప్రక్రియ ప్రారంభమయిందని అంటున్నారు. అయినా ఆగస్టు నెలాఖరుకి అది ఒక యూనిట్ విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయలేదు.

*చెన్నైకి చెందిన రచయిత, అధ్యాపకుడు, సోషల్ యాక్టివిస్ట్

డా. సింగ్ పిచ్చివాడేమీ కాదు. చిత్రమైన మనిషీ కాదు. ఈ విషయంలో ఘనాపాటీలయిన అనేక డాక్టర్ల సహచర్యం ఉందాయనకు. డా. హోమీబాబా, డా. హోమీ సేత్నా, డా. కకోడ్కర్, ఇంకెవరినయినా తీసుకోండి, భారతీయ న్యూక్లియర్ క్లబ్‌లో ప్రాధాన్యత కలిగిన స్థానాలలో అందరికందరూ ఇటువంటి దిగ్భ్రాంతికరమైన వాగ్దానాలనే చేశారు.

బాగా ప్రాచుర్యం పొందిన ఇటువంటి ప్రకటనలలో ప్రధానమంత్రి కార్యాలయంలోనే ఉపమంత్రి అయిన నారాయణస్వామి గారిది ఒకటి. కూడంకుళం విద్యుదుత్పత్తి గురించి 2011-13 మధ్య కాలంలో తమిళనాడులో ఆయన గారు ప్రతినెలా చేసిన వాగ్దానాలు ఛలోక్తులుగా మారాయి. అయినా ఈ ప్రకటనలు ఒక ప్రయోజనాన్నయితే నెరవేర్చాయి. కూడంకుళం అణువిద్యుత్తు కేంద్రం ప్రారంభమైతే అది రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తుందనే ఆశను కలిగించింది. దానితో పాటు అణువిద్యుత్ వ్యతిరేక ఆందోళనకారులపై ఆగ్రహాన్ని కూడా తమిళనాడులోని ఒక వర్గం ప్రజానీకంలో ఇవి కలిగించగలిగాయి.

డా. సింగ్ గారి ఉత్తరకుమార ప్రగల్భాలు మరో అసాధారణ ప్రయోజనాన్ని నెరవేర్చాయి. వీటి గురించి ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ భౌతిక శాస్త్రవేత్త ఎం.వి. రమణ తన పుస్తకం 'ద పవర్ ఆఫ్ ప్రామిస్ : ఎగ్జామినింగ్ న్యూక్లియర్ ఎనర్జీ' లో విశదపరిచారు.

విద్యుత్తు, దేశ భద్రత వంటి వాగ్దానాలను నెరవేర్చడం భారతదేశ అణు కార్యక్రమం లక్ష్యం కానేకాదని అంటారాయన. భవిష్యత్తులో కూడా అవి లక్ష్యాలు కాబోవని చెబుతారు. విద్యుత్తు, దేశ భద్రత వంటి హామీలు అణు కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఉపకరించే ఇంజన్లని వాదిస్తారు. అపరిమిత విద్యుత్తు, అణు ఆయుధ సంపత్తి రూపంలో వైఫల్యం ఎరుగని భద్రత (infallible security) అనే రెండు ఆదర్శాలను చూపుతూ భారతదేశ అణుపీఠం ఇతరులు అసూయపడేలా తనకంటూ ఒక స్థానాన్ని సృష్టించుకుంది. ఈ పీఠం ఒక్క ప్రధానికి తప్పితే ఎవ్వరికీ జవాబుదారీ కాదు. ఖర్చుకు తగిన ఫలితమేమీ సాధించకుండానే ఈ వర్గం అణు రంగంలో దశాబ్దాల పాటు కోట్లు ఖర్చు చేయవచ్చును.

దేశ సాంకేతిక, ఆర్థిక, సాంఘికాభివృద్ధికి అణు కార్యక్రమం అవసరమని పలువురు భావించడంలో డా. సింగ్ సఫలమయ్యారని రమణ అభిప్రాయపడతారు. పర్యావరణం దృష్ట్యా చూసినా ప్రపంచంలో అణువిద్యుత్తు అవసరం ఉందనే వాదన మొదలయ్యింది.



అణురంగ లాబీ క్రమం తప్పకుండా అణువిద్యుదుత్పత్తిపై ప్రకటించే అద్భుతమైన అంచనాలు – వాటితో పాటు అపరిమిత విద్యుత్తు హామీనీ, మారుతున్న వాతావరణ పరిస్థితులలో కాలుష్యరహిత ఉత్పత్తి హామీనీ మోసుకొస్తాయి.

కానీ వాటిలో ఏ హామీ కూడా నెరవేరే అవకాశం లేదు. అణు ఇంధనం కాలుష్యరహితమయినదీ కాదు. అలాగే అది కొనితెచ్చే ప్రమాదాలనూ, ప్రజల వ్యతిరేకత మూలంగా వచ్చే అస్థిరత్వాలనూ, అణు విద్యుదుత్పత్తి ప్రతిపాదన – ప్రారంభాలకు మధ్య పట్టే వ్యవధినీ గమనంలో తీసుకున్నపుడు, అది తక్షణ విద్యుత్తు అవసరాలను తీర్చడానికి ఎంచుకోదగ్గ మార్గం కానే కాదు.

ఈ దశలో వాతావరణ దుష్ప్రభావాల (క్లైమేట్ ఛేంజ్)ను నిలువరించడం ఒకవేళ సాధ్యమనుకున్నా కూడా దాని కోసం అణు సాంకేతికత మీద ఆధారపడకూడదు. ఈ సాంకేతికత ఖర్చుతో కూడుకున్నదే కాక ఎక్కువ సమయాన్ని తీసుకునేది.

కూడంకుళం అణుకేంద్రానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, సాధారణ ప్రజానీకపు స్పందనలు, ఈ ఉద్యమం పైన కేంద్ర, రాష్ట్రాల ప్రతిస్పందనలు, మీడియా పాత్ర, అణు విద్యుత్తు కేంద్ర నేటి స్థితి ఇవన్నీ అణువిద్యుత్తు నిరర్థకత మీద ఎన్నో వాదనలను బలంగా ముందుకు తెచ్చాయి ఫుకుషిమా ముందూ తర్వాతా కూడా.

## కొంచెం చరిత్రలోకి పోదాం

కూడంకుళం ప్లాంటుకు వ్యతిరేకంగా ఇటీవల వెల్లువెత్తిన ఆ ప్రాంత మత్స్యకారులు, రైతులు, వ్యాపారుల అహింసాయుత ఉద్యమాలు – నిజానికి చెర్నోబిల్, ఫుకుషిమా అనే రెండు విషాద ఉత్పాతాల నుంచి పుట్టుకొచ్చాయి.

రష్యాలోని చెర్నోబిల్ పట్టణంలో 1986 ఏప్రిల్ 26న అణురియాక్టర్‌లో రేడియో ధార్మిక పదార్థాలు ఉండే అంతర్భాగం (కోర్) అధిక ఉష్ణోగ్రతకు గురయి కరిగిపోయింది. దాంతో వాతావరణంలో రేడియో ధార్మికత వ్యాపించి అధిక సంఖ్యలో ప్రజలను తరలించవలసి వచ్చింది. ఈ భారీ దుర్ఘటన 'అంతర్జాతీయ అణు రేడియో ధార్మిక ఘటనల స్కేలు' మీద అతి భారీ ప్రమాదాన్ని సూచించే చివరి స్థాయి 'లెవెల్-7' గా నమోదయ్యింది.

చెర్నోబిల్ ఉదంతం ప్రపంచాన్ని వణికించింది. అణు పరిశ్రమకు సంబంధించిన స్వప్నాలను పటాపంచలు చేసింది. ముఖ్యంగా రష్యా కలలు కల్లలయ్యాయి. ప్రపంచ మార్కెట్‌లో రష్యా అణు రియాక్టర్లను కొనేవారే కరువయ్యారు. దక్షిణాసియాలో ఆధిపత్యం కోసం, సైనిక ప్రయోజనాల కోసం భారతదేశం 1974లో పోఖ్రాన్ అణుపరీక్షలు జరిపిన తర్వాత ఆ రంగంలో ప్రపంచ వెలివేతకు గురయింది. భారత అణు పరిశోధన సామర్థ్యానికి దోహదం చేయగల అణు సాంకేతికత, పరిజ్ఞానం, పరికరాలను అందించటానికి ప్రపంచం నిరాకరించింది.

అణు పరిజ్ఞానం కోసం తహతహలాడుతున్న భారతదేశ నిస్సహాయ స్థితిని మార్కెట్‌లో బేరాల్లేని రష్యా అణురంగం సదవకాశంగా భావించి చేజిక్కించుకుంది.

కూడంకుళంలో నిరసనలు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి నిజమే కాని ప్లాంట్ నిర్మాణం పూర్తయిన తర్వాతనే మొదలయ్యాయని అనడం సరికాదు. ప్లాంట్ నిర్మాణానికి ఒప్పందం జరిగినపుడూ, జరగక ముందూ కూడా దానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజానీకం నిరసన ప్రదర్శనలు జరిపారు. తొలినాళ్ళలో తలెత్తిన నిరసన త్వరగా చల్లారిన మాట నిజమే. అప్పుడు సోవియెట్ కూడా అదే రీతిన కునారిల్లిపోయింది.

రష్యా జవసత్వాలు పుంజుకోవడానికి మరో ఏడేళ్ళు పట్టింది. ఈ కాలంలో కూడంకుళం ప్రాజెక్టు ముందుకు సాగలేదు. ఒక్క భూసేకరణ మినహా ఏ పనీ జరగలేదు. మళ్ళీ 1998లో గతంలో చేసుకున్న ఒప్పందాన్ని రష్యన్ ఫెడరేషన్, భారత దేశాలు పునరుద్ధరించుకున్నాయి. అయినా ప్లాంట్ అసలు పని 2001 వరకూ ప్రారంభం కాలేదు.

## ఫుకుషిమా - ఆ తర్వాత

2011 మార్చ్ 11న వచ్చిన తీవ్ర భూకంపం సునామీని పుట్టించి ఫుకుషిమా దాయిచి అణు కేంద్ర సముదాయాన్ని ముంచెత్తింది. ఈ విపత్తు సమయంలో అక్కడ ఉన్న మొత్తం ఆరు యూనిట్లలో మూడు మూసివేసి ఉన్నాయి. వీటిలోని కోర్ నుంచి ఇంధన కడ్డీలను తొలగించి ఉంచారు. ఇటువంటి మూసివేత స్థితిలో కూడా వేడిని నియంత్రించడానికి రియాక్టర్లకు విద్యుత్తు సరఫరా అవసరం. వ్యర్థ ఇంధనాన్ని అక్కడే నిలువ చేస్తారు కనుక ఈ స్థితిలో కూడా రియాక్టర్లు భారీ ప్రమాదానికి లోనయ్యే ప్రమాదం ఉంది. ప్లాంట్ నడచిన కాలాన్ని చూస్తే ఎక్కువ పరిమాణంలోనే అణువ్యర్థ ఇంధనం ఉండవచ్చు. ఈ మొత్తం వ్యర్థంలో కోర్ కంటే వేల రెట్లు ఎక్కువ రేడియోధార్మికత ఉండవచ్చు.

భూకంపం వల్ల బయటనుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ప్లాంట్ల బేస్‌మెంట్‌లలో ఉన్న బ్యాక్‌అప్ డీజల్ జనరేటర్లు పనిచేయడం మొదలెట్టాయి. అప్పటికే భూకంపం వల్ల రియాక్టర్ల శీతల వ్యవస్థలు దెబ్బతిని ఉండవచ్చునని జపాన్ ప్రభుత్వం నియమించిన అత్యున్నత స్థాయి కమిటీ అంటోంది. భూకంపం వచ్చిన ఒక గంట తరువాత వచ్చిన పెను సునామీ అణుకేంద్ర సముదాయాన్ని పూర్తిగా తుడిచిపెట్టింది. ప్లాంట్ల బేస్మెంట్‌లను ముంచెత్తింది. అక్కడ ఉన్న బ్యాక్‌అప్ విద్యుత్ పరికర వ్యవస్థను నాశనం చేసింది. రియాక్టర్లలో ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి వినియోగించే సముద్రజలాల సరఫరాకు విఘాతం కలిగింది.

విద్యుత్ లేని కారణాన శీతల వ్యవస్థలు పనిచేయడం మానేశాయి. ఇంధన కడ్డీల చుట్టూ సాధారణంగా జిర్కోనియం చుట్ట (cladding) ఉంటుంది. వీటి చుట్టూ నీటిని ప్రవహింపజేస్తారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో నీటిని సరఫరా చేసే పంపులు మొరాయించాయి. నీటి సరఫరా పడిపోయింది. ఒక పక్క ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇంధన కడ్డీల చుట్టూ తిరుగుతున్న నీరు ఆవిరి అయిపోయింది. ఇంధన కడ్డీల ఉష్ణోగ్రత పెరిగిపోయింది. అది జిర్కోనియం చుట్టను కరిగించడం మొదలుపెట్టింది. జిర్కోనియం, నీటి ఆవిరీ కలిసి హైడ్రోజన్‌ను వెలువరించాయి. ఒకటి, మూడు యూనిట్లలోని కంటెయిన్మెంట్లలో హైడ్రోజన్ వ్యాపించింది. అది ఉమ్మడి డక్ట్‌ల ద్వారా పనిచేయని నాలుగో యూనిట్‌కు చేరింది. వెలువడుతున్న హైడ్రోజన్ గ్యాస్ పరిమాణం పెరిగిపోయింది. ఇది బయట ఉండే గాలితో కలిసి విస్ఫోటనానికి దారితీసింది. ఇది యూనిట్-1 పైకప్పును ముక్కలు చేసింది. ఆ తర్వాత రోజుల్లో జరిగిన హైడ్రోజన్

విస్ఫోటనాలు అక్కడున్న మొత్తం ఆరు రియాక్టర్ల భవనాలలో మూడింటిని ధ్వంసం చేశాయి. నాలుగో నంబరు యూనిట్ పైకప్పు కూడా కూలిపోయింది.

ఒకటో నంబరు యూనిట్లో జరిగిన మెల్ట్ డౌన్ ఎంత ప్రమాదకరమయినదో నాలుగో నంబరు యూనిట్ డోమ్ కూలిపోవడం కూడా అంతే ప్రమాదకరమయినది. ఎందుకంటే అణు వ్యర్థ ఇంధనాన్ని నిల్వచేసే ట్యాంకు నాలుగో నంబరు యూనిట్ పైకప్పుకు దగ్గరగా ఉంది. విస్ఫోటనం అణు వ్యర్థ ఇంధన ట్యాంక్‌ను బయటకు నెట్టింది. పేలుడుకు లోనయిన నాలుగో నంబరు యూనిట్ నిర్మాణాల (structure) స్థిరత్వంపైన ఆందోళన రేకెత్తించింది. ఒకవేళ భూకంపం లాంటి మరే ఘటనో ఈ నిర్మాణాలను అస్థిరపరిస్తే అణు వ్యర్థ ఇంధన ట్యాంక్‌లోని పదార్థాలు సూపర్ హీట్‌కు గురయి చెర్నోబిల్, ఫుకుషిమా దుర్ఘటనలను సైతం దిగుదుడిచేసే భారీ ప్రమాదానికి దారితీసి ఉండేది.

ఫుకుషిమా దుర్ఘటన జరిగిన రెండేళ్ళ పైచిలుకు కాలం తర్వాత 2013 ఆగస్టు 20న ఒక భూగర్భ నిల్వ ట్యాంక్ నుంచి విపరీత స్థాయిలో రేడియోధార్మిక స్వభావం కలిగిన 300 టన్నుల నీరు లీక్ అయింది. జపాన్ అణు రెగ్యులేటరీ అధికారులు ఈ ఘటనను లెవెల్-3 ప్రమాదంగా ప్రకటించవలసి వచ్చింది. నిలిపివేసిన ప్లాంట్లు (dead plants) కూడా ఎంతటి ప్రమాదాన్ని కొనితేగలవో ఈ ఘటన మనకు గుర్తు చేస్తుంది.

## కూడంకుళం వద్ద....

ఫుకుషిమా ఘటన తర్వాత ఎపుడు ఇంటికి తిరిగివస్తారో, అసలు జీవితకాలంలో తమ సొంతగూటికి రాగలరో లేదో తెలియని స్థితిలో వేలమంది ప్రజలు ఉన్నపళంగా తమ ఇళ్ళను వదిలి ఒట్టిచేతులతో వెళ్ళిపోతున్న దృశ్యాలను టీవీలు 24 గంటలూ చూపించాయి. సాంకేతిక పరిజ్ఞానంతో విశేష పరిచయం ఉన్న జపాన్ ప్రజలు ప్రకృతి ప్రకోపం ముందూ, విస్ఫోటిస్తున్న మిలియన్ అణువుల విలయ తాండం ముందూ పూర్తి నిస్సహాయంగా మిగిలారు.

భయపెట్టడానికి ఇది చాలదన్నట్టు, మన దేశ అణుయంత్రాంగ అగ్రస్థాయి శాస్త్రవేత్తలు పుండు మీద కారం చల్లే మాటలు మాట్లాడారు. వాళ్ళు ఏమంటారంటే మనం టీవీలో చూసినట్టుగా ప్రభావం ఉండదని. ఫుకుషిమా న్యూక్లియర్ మెల్ట్ డౌన్ ప్రమాదం ''ప్రకృతి వైపరీత్యం మూలంగా సంభవించిన ఒక అసాధారణ స్థితి'' అని అణుశక్తి విభాగ కార్యదర్శి శ్రీకుమార్ బెనర్జీ అన్నారు. ఈయనకు తీసిపోని రీతిలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCIL) ఛైర్మన్

ఎస్.కె. జైన్ ''అణుప్రమాదం, సంఘటన అంటూ ఏమీలేవు... ఆటోమేటిక్ షట్ డౌన్ అయిన తర్వాత మిగిలిన ఉష్ణాన్ని తగ్గించడం కోసం... చక్కటి ప్రణాళికతో రూపొందించిన అత్యవసర విధానం ఉంది...'' అంటారు.

**ఒక ప్రమాదం గురించిన మన దృష్టి కోణం ప్రమాదానికి మనం ఎంత దగ్గరలో ఉన్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకి మీ వీధిలో పాము ఉందని ఎవరైనా మీకు చెప్పారనుకోండి. దానికీ, మీ గదిలోనే పాము ఉందని ఎవరైనా చెప్పినదానికీ మీ స్పందనలో తేడా ఉంటుంది. ఫుకుషిమా ఘటన జరిగేంతవరకూ వాళ్ళ పెరట్లో ఉన్న క్రూర జంతువు స్వభావం గురించి వారికి పూర్తిగా తెలియదు.**

ఎలాంటి ప్రమాదాలు జరగగలవో వివరిస్తూ నిత్యం వస్తున్న దృశ్యాలకూ, మన అణుపండితులు నిరంతరం చేస్తూ వస్తున్న నిరర్థక ప్రవచనాలకూ మధ్య ప్రజలు ఆందోళనకు గురయితే దానికి వారిని నిందించకూడదు.

ఒక ప్రమాదం గురించిన మన దృష్టి కోణం ప్రమాదానికి మనం ఎంత దగ్గరలో ఉన్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకి మీ వీధిలో పాము ఉందని ఎవరైనా మీకు చెప్పారనుకోండి. దానికీ, మీ గదిలోనే పాము ఉందని ఎవరైనా చెప్పినదానికీ మీ స్పందనలో తేడా ఉంటుంది. కూడంకుళం ప్రజలు ఎందుకు భయపడ్డారో, ఎందుకు మొట్టమొదటగా తమ నిరసన వాణిని వినిపించారో ఇపుడు మీకు బోధపడే ఉంటుంది. ఫుకుషిమా ఘటన జరిగేంతవరకూ వాళ్ళ పెరట్లో ఉన్న క్రూర జంతువు స్వభావం గురించి వారికి పూర్తిగా తెలియదు.

అప్పుడే మొట్టమొదటిసారిగా ఈ వ్యాస రచయితకు కల్పాకం అణుకేంద్రం గురించి భయపడుతూ చెన్నై నుంచి ఫోన్లు వచ్చాయి. చెన్నైకు 70 కి.మీ దూరంలో ఉంది ఈ కేంద్రం.

జూన్ 2011లో పంచాయితీ స్థాయి ప్రజా ప్రతినిధులతో ఒక సమావేశాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించిందట. అట ఇట వార్తల ద్వారా జనం తెలుసుకున్నదేమిటంటే విద్యుత్ కేంద్రంలో ఏమైనా ఉపద్రవ పరిస్థితులు ఏర్పడితే సైరన్ మోత ద్వారా ప్రజలకు తెలియచేస్తారని. ఉపద్రవాన్ని బట్టి ప్రజలు తమ ఆహార పదార్థాలన్నింటి మీద మూతలు వేసుకొని, ఇంటి తలుపులు, కిటికీలు

బిగించుకొని ఇంట్లో ఉండిపోవడమో లేదా తమ ఇళ్ళను వీడి జిల్లా అధికారులు సూచించిన ప్రదేశాలకు ఒక క్రమ పద్ధతిలో తరలిపోవడమో చేయాలట. ఇంకోమాట చెప్పారట, కలెక్టరు గారు సూచించిన తిండిని మాత్రమే తినాలి అని.

ప్రజలు భయపడ్డారని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. వారు ప్లాంట్ భద్రత గురించి భయం గొలిపే మాటలు ఎన్నో మార్లు విన్నారు. ఉపద్రవ పరిస్థితికి ఎలా స్పందించాలో ఆ వివరాలు కూడా పుకార్లూ, గుసగుసల ద్వారా కొంచెం కొంచెంగా చెవిన పడుతున్నాయి. అంతకు ముందెప్పుడూ జిల్లా కలెక్టర్ ప్రజలతో ఇంత స్నేహంగా ఉన్నట్టు కనపడలేదు. ఆ స్థితిలో కూడంకుళం అణుకేంద్రంలో 2011లో ఎప్పటిలాగే నిర్వహించే ఒక పరీక్ష తీవ్రమైన భయాందోళనలకు దారితీసింది. నీటి ఆవిరిని బైటకు విడుదల చేసినపుడు వెలువడ్డ భారీ శబ్దాలు ప్రజలను పరుగులు పెట్టేలా చేశాయి. పుకార్లకు తోడు, ఫుకుషిమా దృశ్యాలు ఇంకా కళ్ల ముందు కదలాడుతున్న ప్రజలు ఘోరమేదో జరిగిపోయిందని భావించారు.

కూడంకుళం వాసులు తమ విపత్తునుఫుకుషిమాతో పోల్చుకోవడానికి మరో కారణం కూడా ఉంది. సముద్రం కలిగించగల ఉపద్రవాలు తుపానులు, జడివానలు మాత్రమే అని అప్పటిదాకా వారిలో ఉన్న భావనను 2004లో వచ్చిన సునామీ తుడిచిపెట్టింది. ఈ ప్రాంతంలో అణుకేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా గతంలో హెచ్చరించి నిద్రాణమైన గొంతులకు, ఊహించని విధంగా ఇప్పుడు కూడంకుళం ప్లాంట్ సమీపంలోని ప్రజలలో తమ మాట వినేవాళ్ళు లభ్యమయ్యారు.

కూడంకుళంలో 1000 మెగావాట్ల సామర్థ్యంతో ఒకే రకమైన రెండు యూనిట్లను నిర్మించారు. అందులోని వాటర్ మోడరేటెడ్, వాటర్-కూల్డ్ వివిఇఆర్ 1000 రియాక్టర్లకు సాంకేతిక సహాయాన్ని రుసాతుం అనే రష్యన్ ప్రభుత్వ సంస్థ సరఫరా చేసింది. ప్లాంట్లను భారత ప్రభుత్వ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCIL) నిర్మించింది. రష్యన్ నమూనా రియాక్టర్లు మామూలు నీటినే (లైట్ వాటర్) వినియోగించుకుంటాయి. భారతదేశ స్వదేశీ అణు పరిజ్ఞానంతో భారజల రియాక్టర్లను రూపొందించారు. వీటిని ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లు అంటారు. మామూలు నీళ్లలో (లైట్ వాటర్) హైడ్రోజన్ ఉంటే, భారజలంలో (హెవీ వాటర్) డ్యుటీరియం ఉంటుంది. ఇది హైడ్రోజన్‌కు రూపాంతరం (ఐసోటోప్).

భారతదేశంలో లభ్యమయ్యే యురేనియం చవక రకానిది. మామూలు నీళ్ళు వినియోగించుకునే రియాక్టర్లకు సత్తువ కలిగిన యురేనియం (enriched uranium)

కావాలి. అయితే సత్తువ పెంచే ప్రక్రియ ఖరీదయినది. దానికి తగిన సదుపాయాన్ని నిర్మించడం కష్టమైన పని. ఈ ప్రక్రియలో బాంబులకు ఉపయోగించే పదార్థాలు వెలువడతాయి కనుక ఇది అంతర్జాతీయ సంస్థల కనుసన్నల్లో ఉండాలి. ఈ అంతర్జాతీయ తనిఖీలను తప్పించుకోవడానికో, సాంకేతిక పరిజ్ఞానం లేకనో లేదా సత్తువపెంచే ప్రక్రియకోసం సదుపాయాలు నిర్మించే సమయం కరువయ్యో భారతదేశం స్వదేశీ పరిజ్ఞాన మార్గాన్ని ఎంచుకొంది. దీనికి సత్తువ పెంచకుండానే ఇక్కడ దొరికే యురేనియాన్నే వినియోగించుకోవచ్చు. ఈ యురేనియంను కేవలం భారజల రియాక్టర్లలోనే ఉపయోగించాలి.

అణు విద్యుత్తుకేంద్రం చాలా సులువైన సూత్రం మీద పనిచేస్తుంది. పరమాణు విచ్ఛిత్తికి గురికాగల అణు ఇంధనంలో విచ్ఛిత్తి జరిగి న్యూట్రాన్లు వెలువడతాయి. (విచ్ఛిత్తికి గురి కాలేని అణు ఇంధనాలు కూడా ఉన్నాయి). ఈ న్యూట్రాన్లు అణు ఇంధనాన్ని తిరిగి తాకి మరిన్ని న్యూట్రాన్లను విడుదల చేస్తాయి. బయటి నుంచి ఇంకే పదార్థాన్నీ పంపకుండానే గొలుసుకట్టుగా ఈ విచ్ఛిత్తి సాగిపోతుంది. (మొట్ట మొదట అణు ఇంధనపు న్యూట్రాన్ లోకి బయటి నుంచి ఒక ఫ్రీ న్యూట్రాన్‌ను పంపుతారు. దీనినే థర్మల్ న్యూట్రాన్ అని కూడా అంటారు. అది రెండు న్యూట్రాన్లను విడుదల చేస్తుంది. ఈ రెండు మరో రెండింటినీ, ఆ రెండూ మరో నాలుగింటినీ ఇలా విడుదల చేస్తూ పోతాయి. ఇదే గొలుసు చర్య.) నిలకడగా నిరంతరంగా ఈ పరమాణు గొలుసు చర్య (nuclear chain reaction) సాగడానికి వీలుగా రియాక్టర్ల నిర్మాణం ఉంటుంది. రియాక్టర్లలో ఈ స్థితిని క్రిటికాలిటి (సంక్లిష్ట దశ) అంటారు. ఈ దశకు రియాక్టర్ చేరినపుడు గొలుసు చర్య నియంత్రిత క్రమంలో సాగడానికి తగినన్ని న్యూట్రాన్లు ఉంటాయి. ఇందువలన విడుదల అవుతున్న ఉష్ణాన్నీ, న్యూట్రాన్ల సంఖ్యను అదుపులో ఉంచవచ్చును. అదుపులో లేని లేదా పరుగులు పెడుతున్న పరమాణు చర్య ఒక బాంబులాంటిది, అణు దుర్ఘటనలా ప్రమాదకరమైనది.

న్యూట్రాన్ల వేగాన్ని నియంత్రించి, మరిన్ని న్యూట్రాన్లు వెలువరించడానికి వీలుగా రియాక్టర్లలోని ఇంధన అమరిక (fuel assembly) చుట్టూ మోడరేటర్లు ఉంటాయి. ఒకసారి గొలుసు చర్య ప్రారంభం అయిన తర్వాత విచ్ఛిత్తి మూలంగా విడుదల అవుతున్న ఉష్ణాన్ని నీటిని మరిగించడానికి వినియోగిస్తారు. నీటిని మరిగించడం ద్వారా అధిక పీడనం కలిగిన నీటి ఆవిరిని (steam) ఉత్పత్తి చేస్తారు. ఈ స్టీమ్ టర్బైన్‌ను తిప్పుతుంది. టర్బైన్‌కు ఒక జనరేటర్‌ను అమరుస్తారు. ఇది విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది.

అణు కేంద్రాల స్థాపనకూ, నడిపేందుకూ సాంకేతిక విషయాలతో మంచి పరిచయం ఉండాలి. ఎన్.పి.సి.ఐ.ఎల్ మొట్టమొదటిసారిగా కూడంకుళంలో లైట్ వాటర్ టెక్నాలజీ రియాక్టర్లతో పనిచేయబోతోంది. రష్యా తన ఒప్పందంలో భాగంగా ఇప్పటికే 5 ఏళ్లకు సరిపడా ఇంధనాన్ని సరఫరా చేసింది. ఒప్పందం ప్రకారం ఇలా నలభై ఏళ్ల పాటు సరఫరా చేస్తుంది.

## ప్రధాన సమస్యలు

కూడంకుళంలో ఉద్యమం నడుస్తున్న ఈ రెండేళ్ళ కాలంలో ప్లాంట్‌లో అనేక సమస్యలు తలెత్తాయి.

## ఎ) అవినీతి, కేబ్లింగ్ లోపాలు, తప్పుడు సిగ్నల్స్

కూడంకుళం ప్లాంట్ ప్రారంభం మరింత ఆలస్యమవుతుందని 25 జనవరి 2013న అధికారిక ప్రకటనలు వార్తా పత్రికల్లో వచ్చాయి. ఒకటో నంబరు యూనిట్లో ఫుల్ సిస్టమ్స్ టెస్ట్‌ను తిరిగి నిర్వహించడానికి దేశ అణు నియంత్రణ అధికారులు ఒప్పుకున్నారని పీటీఐ వార్త. మీడియా దీనితో సంతృప్తి పడిపోయింది. తదుపరి ప్రశ్నలేమీ లేవనెత్తలేదు. హిందూ పత్రిక ఈ 'అనుమతి'ని కూడంకుళం విషయంలో ఒకింత శుభవార్త అంది. ఈ అనుమతి ప్లాంట్ త్వరగా ప్రారంభమవుతుందన్న ఆశలను రేకెత్తించింది అని రాసింది.

చెర్నోబిల్ వంటి దుర్ఘటనలు గడచిన కాలం నాటివనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా భద్రమైన అణు కేంద్రాలను అందిస్తోందని, కూడంకుళం అత్యున్నత ప్రమాణాలతో నిర్మించినదనీ అధికారులు ప్లాంట్ పొరుగున నివసించే ప్రజలకు చెప్పారు.

ఫుకుషిమా ప్రమాదం తరువాత కూడా కూడంకుళం ప్లాంట్ ప్రతినిధులు తిరిగి పాత భరోసాలనే ప్రజలకు ఇవ్వడం విరుద్ధమైన ఫలితాలను ఇచ్చాయి. ప్రత్యేకించి అవినీతి సంస్కృతి, నాసిరకపు పనులు ఈ వ్యతిరేక ఫలితాలకు కారణం. ఫుకుషిమా ప్రమాదం జరిగే నాటికి 2జి కుంభకోణం వార్తల్లో ఉంది. ఓ ఆరునెలల ముందు కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహించే చోట ఇంకా కొద్దిరోజుల్లో ఆటలు ప్రారంభం అవుతాయనగా కాలివంతెన ఒకటి కూలిపోయింది. ఇంకా వెనక్కి వెళ్లి చెప్పాలంటే భోపాల్ దుర్ఘటన ఉంది.

అందుకే అత్యున్నత భద్రతా ప్రమాణాలు ఉన్నాయని చెబుతున్న అణుయంత్రాంగపు మాటలలోని డొల్లతనం ప్రజలకు అర్థం కాకుండా పోలేదు.

పర్యావరణ న్యాయం కోసం దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒక సృజనాత్మక, అహింసాత్మక ఉద్యమంగా తమిళనాడు చరిత్రలోనూ, సమాచార హక్కు కోసం జరుగుతున్న పోరాటంగా భారత చరిత్రలోనూ పేరుకెక్కిన అతిపెద్ద నిరాహార దీక్షను 2011 ఆగస్టు 16న వర్తకులు, రైతులు, మత్స్యకారులు, ఇతర ప్రజలు కూడంకుళంలో మొదలుపెట్టారు.

ప్రభుత్వ కార్యనిర్వాహకుల ప్రతి మతిమాలిన మాటతోనూ ప్రజలు క్రియాశీలక పౌరులుగా మారారు. మరిన్ని వివరాలు అడగడం ప్రారంభించారు. ఏ షరతులతో ఏమి అంగీకరిస్తారో చెప్పనారంభించారు. కూడంకుళంవాసులు వేసే ప్రతి ప్రశ్న కోపం తెప్పించేది కావడంతో ప్రజాస్వామిక ప్రభుత్వం సహనాన్ని కోల్పోవడం మొదలయ్యింది.

## కూడంకుళం ప్లాంట్ గురించి

కూడంకుళం ప్లాంట్ గురించి చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతాడు – తొలిసారి విఫలమైతేనే పరీక్షను తిరిగి నిర్వహిస్తారని. వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవాలని, 'అనుమతి'ని విజయంగా చూపించుకోవాలని ఎన్.పి.సి.ఐ.ఎల్ కోరుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని అణుశక్తి నియంత్రణ బోర్డ్ (ఎ.ఇ.ఆర్.బి) తన నిర్ణయాన్ని ఒక ఆదేశంగా కాకుండా అనుమతిగా ఎందుకు చెబుతోంది? ఎన్.పి.సి.ఐ.ఎల్ తొలి పరీక్షలలో విఫలం చెందడం ఏ పరిస్థితులలో జరిగింది?

అణుశక్తి కమిషన్ చైర్ పర్సన్ ఆర్.కె. సిన్హా జులై నెలలో ఇచ్చిన ప్రకటన కొన్ని వాస్తవాలను సూచిస్తోంది. కొత్త ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ ''ప్రవాహం, పీడనం, ఉష్ణోగ్రతల వంటివాటిని నిర్దేశించిన పరిమితుల మధ్యనే ఉంచాలి'' అన్నారు.

ఈ సమాచారాన్ని, మీడియాలో వచ్చిన ఇతర వార్తలను కలిపి చూస్తే మనకు కింద పేర్కొన్న చిత్రం దొరుకుతుంది. తయారీదారు హామీ ఇచ్చినట్లుగా కొన్ని కవాటాలు (వాల్వులు) పనిచేయలేదన్న విషయం మొదటి హైడ్రోటెస్ట్‌లో తెలిసింది. (లీకులు లేవని రూఢి చేసుకోవడానికి నీటితో ఆ భాగాన్ని నింపి పీడనం పెంచడమే హైడ్రో టెస్ట్. ఒకానొక పీడన స్థాయి వరకు లీకులు రాకూడదు.) ఈ వాల్వ్‌లను కిందకు దింపి చిన్నపాటి మరమ్మతులు చేసి తిరిగి బిగించేశారు.

అనేక వాల్వులు సరిగా పనిచేయడం లేదన్న విషయం ప్లాంట్లో అమర్చిన పరికరాల నాణ్యతపై సందేహాలను లేవనెత్తుతోంది. ప్లాంటును ప్రారంభించడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్న ఈ దశలో ఇంత ఆలస్యంగా

లోపభూయిష్టమైన వాల్వ్‌లు ఉన్నాయని గుర్తించడమనేది విడిభాగాల నాణ్యత ధ్రువీకరణలోని లోపాలను ఎత్తి చూపుతోంది. మొత్తంగా చూస్తే సరఫరాదారు, కొనుగోలుదారులు ఇద్దరిలోనూ తీవ్రమైన తప్పిదాలు ఉన్నాయని ఇది సూచిస్తోంది.

రష్యన్ అణు యంత్రాంగంపైన అక్కడ కొనసాగుతున్న దర్యాప్తు ఈ కథను మరో ఆందోళనకరమైన మలుపు తిప్పుతుంది. రష్యాలో కె.జి.బి. స్థానంలో వచ్చిన ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ఫిబ్రవరి 2012 లో రోసాతుం అనుబంధ సంస్థ అయిన జియో పోదోల్స్క్ ప్రొక్యూర్మెంట్ డైరెక్టర్ సెర్గేయ్ షుతోవ్‌ను అవినీతి, మోసం ఆరోపణలపై అరెస్ట్ చేసింది. ప్రపంచంలోని రష్యన్ అణు రియాక్టర్లన్నింటికీ నీటి ఆవిరి ఉత్పత్తి పరికరాల, ఇతర ముఖ్యభాగాల ఏకైక సరఫరాదారు ఈ కంపెనీయే. ఉక్రెయిన్‌లోని చవక రకం ఉక్కుతో తయారుచేసిన విడిభాగాలను బల్గేరియా, ఇరాన్, చైనా, భారతదేశాలలో సరఫరా చేసిన రష్యన్ అణు రియాక్టర్లలో వాడి ఉండవచ్చునని రష్యన్ వార్తా సంస్థ రోస్బాల్ట్ చెబుతోంది.

కూడంకుళం ప్లాంట్ భద్రతపైన దీని ప్రభావం ఉంటుందని తెలిసి కూడా రష్యన్ దర్యాప్తు వివరాలను భారతదేశ అణు అధికార యంత్రాంగం దాచిపెడుతోంది. జియో పోదోల్స్క్ సరఫరా చేసిన భాగాల పరిశీలన కోసం ప్రభుత్వం ఒక విచారణను చేపట్టాల్సింది. దానికి బదులుగా, కూడంకుళంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆ ప్రమాద నష్టాన్ని తానే భరిస్తానని రష్యాకు హామీ ఇవ్వడంలో ప్రధాని కార్యాలయం మునిగిపోయింది.

పి.టి.ఐ. వారిదే 2011 జులైలో కలవరపెట్టే మరో వ్యాసం వచ్చింది. కూడంకుళం ప్లాంట్ మార్చి 2009లో ప్రారంభం అవుతుందని అనుకున్నారు. కానీ కాలేదు. రియాక్టర్ డబుల్ కంటైన్మెంట్ ముగిసిన దశలో రియాక్టర్లలో పలు కి.మీ పొడవునా ఉండాల్సిన విద్యుత్ తీగలు, కంట్రోల్ కేబుళ్ళు మాయమయ్యాయని గమనించడంతో ప్లాంట్ ప్రారంభం ఆలస్యమయిందని ఆ వార్త / వ్యాసం సారాంశం. పేరు వెల్లడించని అణుశక్తి విభాగపు అధికార్ల సమాచారాన్ని ఉటంకిస్తూ వచ్చింది. రష్యా నుంచి ప్రధాన పరికరాలు సకాలంలోనే అందుకున్నా, పలు ఇతర సామగ్రి చేరవేత విషయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని వారు చెప్పినట్లు రాసింది. అంటే ముందు రియాక్టర్ల డోమ్‌లు వచ్చాయి. ఆ తర్వాత కేబుళ్ళు వచ్చాయి.

అప్పటికే నిర్మించిన 'కంటైన్మెంట్ డోమ్‌లను బద్దలుకొట్టి' విద్యుత్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కేబుళ్ళు అమర్చిన తరువాత సమస్య సరి అయిందని పిటిఐ వార్త

> **వ్యర్థ జలాల విడుదల కాలక్రమంలో బీచ్‌లను విషపూరితం చేస్తాయి. ఒడ్డుకు దగ్గరలో ఉన్న చేపల నివాసాలను నాశనం చేస్తాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకారుల జీవనాధారాలను దెబ్బతీస్తాయి.**

చెబుతోంది. కేబుళ్ళు స్విచ్ యార్డ్ నుంచి తెచ్చి అమర్చిన తర్వాత పగులగొట్టిన డోమ్‌లను తిరిగి మూసివేశారు.

అన్ని వ్యవస్థలలోనూ రెండోసారి హైడ్రోటెస్ట్ నిర్వహించడమే అసంబద్ధమైన పని అనుకుంటే ఇది మరీ అన్యాయం. కంటైన్మెంట్ డోమ్ పగులకొట్టి మూసివేయడం అణురంగ చరిత్రలోనే మునుపెన్నడూ జరగలేదు. స్పష్టంగా ప్లాంట్ ప్రారంభాన్ని అడ్డుకుంటున్నది ప్రజల నిరసనలు కాదు. నిజానికి రష్యన్ ప్రభుత్వంతో 1998లో ఒప్పంద పునరుద్ధరణ జరిగిన తర్వాత ఈ 13 ఏళ్లలో ఒక ఆరు నెలల పాటు మాత్రమే నిరసనకారులు ప్లాంట్ స్థలంలో పనులు ఆపివేశారు.

ఇలాంటి కేబుల్ లోపాలు చాలా ప్రమాదకర పరిణామాలకు దారితీస్తాయి. అణు కేంద్రాల వంటి సంక్లిష్టమైన వ్యవస్థలు ప్లాంట్ నిర్వహణపైన సరైన తరుణంలో సమాచారం కోసం ఈ ఇన్‌స్ట్రుమెంటేషన్, నియంత్రణ వ్యవస్థలపైనే ఆధారపడతాయి. ఒకవేళ ఈ ఇన్‌స్ట్రుమెంటేషన్ కేబుళ్ళు తప్పుడు సంకేతాలను గనుక అందుకుంటే అది నియంత్రణ, భద్రతా వ్యవస్థలలో లోపాలకు దారితీస్తుంది.

## బి) వ్యర్థ పదార్థాల విడుదల

తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి 2013లో ఒకటి, రెండు యూనిట్ల అనుమతులను పునరుద్ధరించింది. ఒక్కో యూనిట్ నుంచి 6.3 బిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను నేరుగా సముద్ర తీరంలోకి వదిలి వేయడాన్ని అనుమతించింది. ఈ వ్యర్థ జలాల విడుదల కాలక్రమంలో బీచ్‌లను విషపూరితం చేస్తాయి. ఒడ్డుకు దగ్గరలో ఉన్న చేపల నివాసాలను నాశనం చేస్తాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకారుల జీవనాధారాలను దెబ్బతీస్తాయి.

ఇదిలా ఉండగా, అణుకేంద్రంలో సముద్రంవైపు ఉన్న ప్రహరీ గోడవారుగా ప్రవహించే కాలువ నేరుగా బీచ్‌లోకి వ్యర్థ జలాలను వదిలివేస్తుంది. రోజుకు 6.3 బిలియన్ లీటర్ల జలాలను అంటే 2,600 క్యూసెక్కులను వదులుతుంది. పూర్తి సామర్థ్యం అందుకున్నపుడు, ఈ రెండు యూనిట్లు 5,200 క్యూసెక్కుల విషతుల్యమైన అధికోష్ణ జలాలను కూడంకుళం బీచ్‌లోకి వదిలివేస్తాయి.

అమెరికాలోని అంతర్జాతీయ పర్యావరణ న్యాయవాదుల, కార్యకర్తల నెట్‌వర్క్ శాస్త్రవేత్త డా. మార్క్ చెర్నాయిక్ ఇలా అంటారు, ''ఉష్ణ జలాల ప్రభావం సముద్రజీవుల మీద పరోక్షంగా ఉన్నా అది చిన్నదేమీ కాదు. సముద్ర నీటి ఉష్ణోగ్రతలో చిన్న చిన్న పెరుగుదలలు నీటి రసాయనిక ధర్మాన్ని మార్చివేస్తాయి. నీటిలో కలిసిపోయి ఉండే డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతుంది... ఇది మత్స్య సంపదకు హాని చేస్తుంది. చేపలు ఈ ఉష్ణోగ్రతల మార్పులను తప్పించుకోవడానికి వేరే ప్రదేశాలకు తరలిపోవచ్చు. కానీ వాటి ఆహార వనరులు (ఆల్గే, స్పాంజ్, వెన్నెముక లేని ఇతర సముద్ర ప్రాణులు) ఒకచోటే స్థిరంగా ఉంటాయి. అవి తరలిపోలేవు.''

వ్యర్థ జలాలు విడుదల మొదలైన వెంటనే చేపలు లభ్యమయ్యే ప్రాంతంపైన దాని దుష్ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యర్థ జలాల కాలువ కలిసే దగ్గర ఉండే సముద్ర భూభాగంలోని (ఇంటర్-టైడల్ జోన్ - ఆటు పోటు జరిగే సముద్ర భూభాగం) సముద్ర జీవాలు అన్నీ చచ్చిపోతాయి. యూనిట్స్ 3-6 కోసం 2011లో జరిగిన ఒక అధ్యయనం కూడంకుళం సముద్ర సమీపాన పాచి, నాచులాంటి సముద్ర సూక్ష్మ జీవులు (ప్లాంక్టన్స్) ఓ 30 రకాలు ఉన్నాయని, అవి సముద్రం బాగా లోపల ఇంతకు రెట్టింపు సంఖ్యలోనూ ఉంటాయని పేర్కొంది. సముద్ర గతి వైపే ప్రవహించే వ్యర్థ ఉష్ణ జలాలు నీటిలో కరిగి ఉండే ఆక్సిజన్‌ను తగ్గించివేసి ప్లాంక్టన్లను తుడిచిపెట్టేస్తాయి. ఈ ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టే ప్రాంతం వరకు నీటిలో వీటి మృత్యులోగిలి విస్తరిస్తుంది.

సముద్రంలో వ్యర్థజలం కలిసే రాతి ప్రాంతంలోనే పీతలు, రొయ్యలు అధికంగా లభిస్తాయి. రొయ్యలు, పీతలు సముద్రజల ఉపరితల నివాసులు కావు. కనుక వేడి నీరు ప్రత్యక్షంగా వాటిని ఏమీ చేయకపోవచ్చు. కాని ప్లాంక్టన్లు నశించిపోవడంతో స్థానిక ఆహార చక్రంలో ఒక ముఖ్యభాగం అదృశ్యమయిపోయినట్టే. ఇది స్థానిక జీవావరణ వ్యవస్థలో జీవుల్ని నాశనం చేస్తుంది. చేపల వేట మీదే ఆధారపడి బతికే మత్స్యకారులను దెబ్బతీస్తుంది.

కూడంకుళం ప్లాంట్ ప్రాంతంలోని ఇదింతకరై, కూటపుల్లి, పెరుమనాల్‌లలో 2010లో 14 వేల టన్నుల చేపలు దొరికాయని ఈ అధ్యయనం పేర్కొంది. కనీసం అందులో సగం చేపలు ప్లాంక్టన్లు తిని బతికే కవళ్ళే (sardines). ఇక ప్లాంక్టన్లూ ఉండవు, కవళ్ళూ ఉండవు.

## సి) అత్యవసర పరిస్థితికి సిద్ధంగా లేకపోవడం

అత్యవసర పరిస్థితికి సిద్ధంగా ఉండటమనే విషయం – ఉపద్రవ స్వభావంపై సమాచారాన్ని తగిన సమయంలో అందించడంపైనా, దానికి ఎలా స్పందించాలి అన్న విషయంలో సమాచార గ్రహీతలకు ఉండే చైతన్యం మీదా, అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి ఉన్న మౌలిక సదుపాయాల లభ్యతపైనా ఆధారపడి వుంటుంది. జపాన్లో ఫుకుషిమా ప్లాంట్‌కు 30 కి.మీల పరిధిలోపు ప్రజలను తాత్కాలికంగా తరలించారు. వారిలో 20 కి.మీ లోపు దూరంలో బతికిన వారంతా సమీపకాలంలో ఇళ్ళకు తిరిగి వెళ్ళే అవకాశాలు తక్కువ. ఒకానొక దశలో బడులలో ఉండే వ్యాయామశాలల్లో 4 లక్షల పైగా ప్రజలు తలదాచుకున్నారు.

అత్యల్పకాలంలో అంతమందిని తరలించడం, వారికి నివాస సదుపాయం కల్పించడం వంటివి ఎంతటి సమర్థవంతమైన, చక్కటి ప్రణాళిక కలిగిన వ్యవస్థలనైనా తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తాయి. మంచి నీళ్ళు, ఆహారం, నివాస స్థలం, శాంతిభద్రతలు, ఔషధ సేవ, ప్రాథమిక వైద్యం, ప్రత్యేక రక్షణ, అణుధార్మిక పర్యవేక్షణ ఇలా ఎన్నో విషయాలను వాళ్లు చూసుకోవలసి ఉంటుంది. జపాన్ ప్రజలు ఆహారం కోసం క్యూలలో తమ అవకాశం కోసం మర్యాదగా ఎదురుచూస్తూ ఉండటాన్ని, కిక్కిరిసిన ఇండోర్ స్టేడియంలలో సైతం తమ పునరావాస స్థలాలను సాధ్యమయినంత శుభ్రంగా ఉంచుకోవడాన్ని ఫుకుషిమా దృశ్యాలు చూపించాయి. నిజాయితీగా మాట్లాడవలసి వస్తే, మన దేశంలో కనుక అటువంటి పెనుప్రమాదం సంభవిస్తే మనం అలా స్పందించగలమా?

కూడంకుళం విషయంలో అత్యవసర స్థితికి తయారుగా ఉండే విషయంలో స్థానికులకు గానీ, ప్రభుత్వ అధికారులకు గానీ ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ఇక్కడో విషయం గుర్తు చేయాలి. 2012లో బాణసంచా తయారీ జరిగే శివకాశిలో ఏటా జరిగినట్టే ఒక ప్రమాదం జరిగింది. కాలిన గాయాలతో 60 మంది మరణించారు. ఈ పట్టణంలో పేలుళ్ళు, అగ్ని ప్రమాదాలు, కాలిన గాయాలు రివాజుగా జరుగుతున్నా ఆ జిల్లాలో బర్న్స్ వార్డ్‌లు ఉన్న ఆసుపత్రులు లేవు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నందువలన ప్రమాదం జరిగిన రోజు అగ్నిమాపక, సహాయ వాహనాలు ఆలస్యంగా వచ్చాయి. కూడంకుళం నుంచి 100 కి.మీ లోపే శివకాశి ఉంటుంది. అణుధార్మిక గాయాలకు చికిత్స చేయగలిగిన ఆసుపత్రులు ఇక్కడ లేవు. అణుధార్మికత కలిగించే ప్రమాదాలను నిపుణులచేత అప్రధానం చేసి చూపడానికి కూడా ప్రయత్నించారు. అడయార్ క్యాన్సర్ సంస్థలో పేరొందిన క్యాన్సర్ డాక్టర్ శాంత ఎం.పి.సి.ఐ.ఎల్. వారి ఒక వీడియో చిత్రంలో అణురియాక్టర్ల

సమీపంలో నివసించే ప్రజలకు అదనంగా క్యాన్సర్ వచ్చే అవకాశం లేదని చెప్పారు.

## స్వతంత్ర నియంత్రణా వ్యవస్థ కరువు

ఫుకుషిమా అణుప్రమాద స్వతంత్ర దర్యాప్తు సంస్థ జపాన్ పార్లమెంట్‌కు ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. మానవ సృష్టిగా (man-made) ఈ ప్రమాదాన్ని కమిషన్ అభివర్ణించింది. ప్లాంట్ రెగ్యులేటర్ స్వతంత్రంగా ఆలోచించి స్పందించడంలో విఫలమయ్యాడని ప్రకటించింది. ప్లాంట్ రెగ్యులేటర్, ఆపరేటర్‌లు కుమ్మక్కు అయిన కారణంగానే మొత్తం ప్రమాదాన్ని మేడ్-ఇన్-జపాన్ అనాల్సి వచ్చిందని పేర్కొంది. భూకంపాన్ని తట్టుకుని ప్లాంట్ నిలబడుతుందని జపాన్ ప్రభుత్వం, ప్లాంట్ ఆపరేటర్లు చెప్పడాన్ని అది ప్రశ్నించింది. ప్లాంట్ శీతల వ్యవస్థలు భూకంపంలో దెబ్బతిని ఉండవచ్చునని అభిప్రాయపడింది.

మన దేశంలో స్వతంత్ర నియంత్రణా వ్యవస్థ లేకపోవడం మరో సమస్య. అందువల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అణుశక్తి నియంత్రణ బోర్డ్ (ఎ.ఇ.ఆర్.బి.)ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డి.ఎ.ఇ.) అజమాయిషీ చేస్తోంది. అణుశక్తిని ప్రమోట్ చేసే అధికారం డి.ఏ.ఇ.కి. ఉంది. స్వతంత్ర అజమాయిషీ లేకపోవడాన్ని లోపంగా కంట్రోలర్ ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి-కాగ్) కూడా గుర్తించింది.

## ప్రభుత్వ ప్రతిస్పందనలు

ఫుకుషిమా సంఘటన తర్వాత నిరసనలు ప్రారంభం కాగానే, జయలలిత నేతృత్వంలో కొత్తగా ఎన్నికైన ఏఐఏడిఎంకె ప్రభుత్వం భద్రత కోసం భరోసా కోరుతున్న ప్రజలతోనే తాము ఉంటున్నట్టుగా ప్రదర్శించుకుంది. కూడంకుళం ప్లాంట్ ప్రధాన ద్వారాల వద్ద నిరాహార దీక్షలపుడూ, దిగ్బంధనాల సమయంలోనూ ప్రభుత్వ పోలీసులు ఒకింత సున్నితంగానే వ్యవహరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా నడవడం కోసం అక్టోబర్లో ఆందోళనకారులు నిరాహార దీక్షను విరమించుకున్నారు. ఎన్నికల అనంతరం నిరసనలు మొదలయ్యాయి. సముద్ర దిగ్బంధనాలు, ఊరేగింపులు, నిరాహార దీక్షలు జరిగాయి. ఆందోళనా కమిటీ ముఖ్యమంత్రితో కూడా ఒక సమావేశాన్ని నిర్వహించింది.

ఒక ఉపఎన్నిక అనంతరం మార్చ్ 17న కథంతా మారిపోయింది. రాత్రికి రాత్రి ఆందోళనలో పాలుపంచుకుంటున్న ఇదింతకరై, ఇతర గ్రామాల వాళ్లను పోలీసులు చుట్టుముట్టారు. క్రూరంగా దాడి చేసారు. నిత్యావసర వస్తువుల సరఫరాను అధికారికంగా నిలిపివేశారు. తీర ప్రాంత గస్తీ విమానాలు, పడవలు రంగంలోకి దిగాయి. ఈలోగా తమిళనాడు తీరం అంతటా కోపోద్రిక్తులైన మత్స్యకారులు పనులను బహిష్కరించి ఊరేగింపులను నిర్వహించారు. వందలాది మంది అరెస్ట్ అయి జైలుపాలు అయ్యారు. తూతుకుడి జిల్లాలో జరిగిన పోలీస్ కాల్పుల్లో ఒక మత్స్యకారుడు చనిపోయాడు. చాలామందికి గాయాలయ్యాయి. ముఖ్యమంత్రి జయలలిత తిరునల్వేలి ప్రజల భద్రతపై తన ఆందోళనను వ్యక్తపరుస్తున్న సమయంలోనే పోలీసులు గుట్టు చప్పుడుగా ఆందోళనకారులపై క్రిమినల్ కేసులను బనాయించారు.

నేటికి పెట్టిన 300 కేసులలో కనీసం 20 కేసులు రాజద్రోహం నేరం కింద పెట్టినవే. చాలా కేసులు మూకుమ్మడి కేసులు – కొద్ది మంది తెలుసున్న వాళ్ళ పేర్లు ఇరికించి వారితో 500 మందిని లేదా 2000ని మంది లేదా 75 మందిని పేర్లు లేకుండా కేసులలో చేర్చారు. ఈ పేర్లు ఉన్న, లేని నిందితుల మొత్తాన్ని కూడితే కేసులు ఉన్న వారి సంఖ్య రెండు లక్షలు దాటిపోతుంది. కాని ఇక్కడి రాధాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన మొత్తం వోటర్ల సంఖ్య 1,89,000.

ప్రజలు తమ భయాందోళనల నుంచి లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ప్రభుత్వం ఇస్తున్న జవాబులు భద్రతకు సంబంధించిన అసలు సమస్యను పక్కకు నెట్టాయి. అణుశక్తి కాలుష్య రహితమైనది, చవకయినది, భద్రమైనది, దేశ రక్షణకు చాలా ముఖ్యమైనది, బొగ్గు కంటే ఆకర్షణీయమయినది అనే విషయాల చుట్టూ ప్రభుత్వ వాదనలు నడిచాయి. పునరుత్పత్తి చేయగల ఇంధనాలు అసాధ్యమనీ, అణు ఇంధనాన్ని వ్యతిరేకించిన వారంతా దేశభక్తి లేని వాళ్ళనీ, సైన్సు వ్యతిరేకులనీ చిత్రించింది.

వివిధ ప్రభుత్వ నిర్వాహకులు చేసిన వాదనలకు సమాధానాలు కింద చదవండి.

**1. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం. మనం అభివృద్ధి చెందడానికి విద్యుత్తు కావాలి. అణువిద్యుత్తును అడ్డుకుంటే అభివృద్ధి ఆగిపోతుంది.**

విద్యుత్తును ఉత్పత్తి చేసే మార్గం అణుశక్తి ఒక్కటే కాదు. సంప్రదాయ, సంప్రదాయేతర మార్గాలు అనేకం ఉన్నాయి. స్వాతంత్రం తర్వాత జరిగిన

ఆధునీకీకరణ, పారిశ్రామికాభివృద్ధిలో 3 శాతం కంటే తక్కువకు మాత్రమే అణుశక్తి దోహదపడింది. పునరుత్పత్తి చేయగల ఇంధన వనరులు దేశ విద్యుత్తు అవసరాలలో పది శాతం మేర తీరుస్తున్నాయి. భారీ నీటి ప్రాజెక్టులు 27 శాతం తీరుస్తున్నాయి. అయితే భారీ డ్యాములు పర్యావరణం మీద తీవ్ర ప్రభావం చూపాయి. ఆదివాసీ సమాజాల జీవనాధారాలను నాశనం చేశాయి.

భారతదేశం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందాలంటే మన సహజ సంపదలయిన నీరు, భూమి, గాలి, ప్రజలను విధ్వంసం చేయకుండా జాగ్రత్తపడాలి. అణువిద్యుత్తు లాంటి ఖరీదైన, ప్రమాదభరితమైన, హానికరమైన టెక్నాలజీలకు 'నో' చెప్పడం ద్వారా పరిశుద్ధమైన, తక్కువ ప్రమాదకరమైన, వివేకవంతమైన అవకాశాలను విద్యుదుత్పత్తిలో అందిపుచ్చుకోగలగాలి.

పొదుపు, విద్యుత్తు సరఫరా లోపాలను నివారించడం వంటి చర్యల ద్వారా విద్యుత్తును పెంచుకోవచ్చు. దేశంలో ఉత్పత్తి చేసిన ప్రతి వంద మె.వాల. విద్యుత్తులో 40 మెగావాట్లు అసమర్ధ సరఫరా, పంపిణీల మూలంగా నష్టపోతున్నాము. స్వీడన్ వంటి పారిశ్రామిక దేశాలలో ఈ నష్టం 7 శాతం మాత్రమే. అంటే దేశంలో ఉత్పత్తవుతున్న 1,80,000 మె.వా. విద్యుత్తులో 72,000 మె.వా (40 శాతం) వృథా అవుతోంది. అది మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో విద్యుదుత్పత్తి కేంద్రాలను మూసివేస్తే నిలిచిపోయే విద్యుత్తుతో సమానం. విద్యుత్తు ఆదా ద్వారా సామర్థ్యాన్ని పెంచితే ఆదా అయ్యే మొత్తం తక్కువ పెట్టుబడితో, ఏ ప్రమాదాలు లేకుండా 60,000 మె.వాల. విద్యుదుత్పత్తి కేంద్రాన్ని స్థాపించడంతో సమానం. విద్యుత్తు ఉపకరణాల శక్తి సామర్థ్యాలను పెంచడం మరొక మార్గం.

అనవసర విద్యుత్తు వినిమయాన్ని తగ్గించుకుంటే మరింత లాభం. షాపింగ్ మాల్స్, ఐ.టి. కంపెనీలు రోజంతా విద్యుత్తును వినియోగిస్తూనే ఉంటాయి. రేయింబవళ్ళు తేడాలేకుండా విద్యుద్దీపాలు, ఏసీలు నడుస్తూనే ఉంటాయి. అదే సమయంలో ఇళ్ళు చిన్న వ్యాపార సంస్థలూ విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ వినిమయంలో ఒక హేతుబద్ధమైన విధానం ఉండాలి. కల్పాక్కం అణుకేంద్రం చుట్టూ ఉన్న గ్రామాలు తీవ్రమైన విద్యుత్తు కొరతతో విలవిలలాడుతుండటం 'అసమ విద్యుత్తు పంపిణీ'కి ఉదాహరణగా నిలుస్తుంది.

**2.** ప్రజలు ఈ దశంలో ఎందుకు నిరసన తెలియచేస్తున్నారు? మొట్టమొదటగా ప్రతిపాదించినప్పుడే ఈ ప్రాజెక్టు వద్దని ప్రభుత్వానికి వాళ్ళు చెప్పలేకపోయారా?

మొదట ఈ ప్రాజెక్టును 1988లో ప్రతిపాదించారు. కొద్ది నెలలలోనే అణువిద్యుత్తు కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యాయి. రష్యా అధినేత గోర్బచేవ్ 1989లో భారతదేశ సందర్శించినపుడు దీనికి వ్యతిరేకంగా ఒక మిలియన్ సంతకాలను ప్రజలు, విద్యార్థులు సేకరించారు. చెన్నై, ఇంకా ఇతర కేంద్రాలలో నల్లజెండాల ప్రదర్శనలు, ఊరేగింపులు, యువకుల ఆందోళనలు జరిగాయి. తొలినాటి నుంచి కూడంకుళం ఒక వివాదాస్పద విషయంగానే ఉంటూ వచ్చింది. కన్యాకుమారి పట్టణంలో 1989 మే 1న మత్స్యకారులు, ప్రాజెక్టు పరిసరవాసులు ఒక భారీ ఊరేగింపును నిర్వహించారు. శాంతియుతంగా జరిగిన ఈ ప్రదర్శనను పోలీసులు భగ్నం చేసి ఇగ్నేషియస్ అనే యువకుడిని బలి తీసుకున్నారు. టెక్నాలజీ సరఫరాదారైన రష్యా విచ్ఛిన్నం మూలంగా 1991-2001 మధ్య ఈ నిరసనలు ఆగిపోయాయి. కాని ఈ చరిత్రంతా అణు విద్యుత్తు సమర్థకుల మూలంగా మరుగున పడిపోయింది. బాధ్యతారహిత మీడియా తరచి చూసుకోకపోవడంతో నిరసనలు ఆగిపోయాయన్న మాట పదే పదే చెప్పి తప్పుదారి పట్టిస్తున్నారు.

ఆనాటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలాగే, సోనియాగాంధీ కూడా ప్రజల నిరసనలను గుర్తించడం లేదు. స్థానికుల కోరికలను వినిపించుకోవటం లేదు. జైతాపూర్‌లో రైతుల, మత్స్యకారుల నుంచి గట్టి వ్యతిరేకత ఎదురైనా అక్కడి అణు ప్రాజెక్టులను ముందుకు తోయడంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా ఉండిపోయిన విషయం దీని ద్వారా స్పష్టమవుతుంది. గోరఖ్‌పూర్, హర్యానా, జైతాపూర్లలో నిరసనలను అలక్ష్యం చేయడమే కాదు, హింసాత్మకంగా అణచివేస్తున్నారు.

కూడంకుళం ప్లాంట్ కొద్ది రోజులలో ప్రారంభం కాబోవడం, ఆరు వేల మె.వా సామర్థ్యానికి ఈ సముదాయాన్ని విస్తరించనున్నారన్న విషయం స్థానికులలో భయాలను తిరిగి రేకెత్తించాయి. ప్రకృతి ఆగ్రహాన్ని 2004 సునామీ సందర్భంగా ప్రజలు రుచి చూసారు. ఫుకుషిమాలో మూడుసార్లు జరిగిన ప్రమాదంపై టీవీలలో వచ్చిన దృశ్యాలు, లక్షలాది మంది జపనీయులను ఇళ్ళకు పోనీయని విషాద చిత్రాలు ఇక్కడి ప్రజల కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయి. నిర్భీతితో ఉండటానికి ప్రజలేం వెర్రివాళ్ళు కాదు.

ప్రజలు ఆందోళన ఎందుకు చేయలేదని కానీ లేదా ఎందుకు అంత దృఢంగా నిరసన చేపడుతున్నారని గానీ మనం అడగకూడదు. బదులుగా ప్రజల

వ్యతిరేకతను అర్థం చేసుకోవాలి. ఈ ప్రాజెక్టును నిలిపివేయమని మనం ప్రభుత్వాన్ని అడగాలి. డబ్బు ఎందుకు వృథా చేస్తున్నదని ప్రశ్నించాలి.

**3. ప్రభుత్వం ప్లాంటుపై కోట్లాది రూపాయలను ఇప్పటికే ఖర్చు చేసింది. ఈ దశలో ప్రాజెక్టును నిలిపివేయడం సాధ్యమా?**

ఒక మంచి పని చేపట్టడానికి ఈ ఆలస్యం లెక్కలోకి రాదు. అది కొనితెచ్చే ప్రమాదం, ప్రతిదినమూ వెలువరించే కాలుష్యం వంటి అంశాలు తెలిసి కూడా దానిపై పెట్టుబడి పెట్టుకుంటూ పోవడం కంటే ఆ పెట్టుబడిని రద్దుచేసుకోవటమే మంచిది.

ప్రమాద పర్యవసానాలు పరిశీలిద్దాం. చెర్నోబిల్ అణు ప్రమాదం మూలంగా 1986లో యు.ఎస్.ఎస్.ఆర్‌లోని బెలరూస్ తీవ్రంగా నష్టపోయింది. అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ నివేదిక ప్రకారం బెలరూస్ 1991-2003 మధ్య పదమూడు బిలియన్ డాలర్లను ప్రమాద పర్యవసానాలను సరిదిద్దడానికి ఖర్చు చేసింది. రానున్న 30 ఏళ్లలో ఈ నష్టాలను పూడ్చుకోవడానికి 235 బిలియన్ డాలర్లను వెచ్చించాలని అంచనా వేసింది. ప్రమాదం సంభవించిన చెర్నోబిల్ ఉక్రెయిన్లో ఉంది. ఉక్రెయిన్ ప్రభుత్వం ప్రమాద పునరావాస కార్యక్రమాల కోసం ఇప్పటికీ ప్రభుత్వ వ్యయంలో 6-7 శాతం వెచ్చిస్తోంది. రష్యా, బెలరూస్, ఉక్రెయిన్‌లలో రెండు లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని అణుధార్మిక కాలుష్యం అలుముకుంది. తమిళనాడు విస్తీర్ణానికి రెండు రెట్లన్నమాట.

ఫుకుషిమాలో ప్లాంటును పూర్తిగా మూసివేసి, సురక్షితంగా కూల్చివేయడానికి మరో 30 ఏళ్ళు పడుతుంది. అందుకు పన్నెండు నుంచి పందొమ్మిది బిలియన్ డాలర్లు ఖర్చవుతాయి. ఇంకా ఆరోగ్య పరీక్షలు, సాంఘిక భద్రత, ప్రజల తరలింపు, కాలుష్య భూయిష్టమయిన ప్రాంతాన్ని కాలుష్య రహితం చేసే చర్యలు, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల ఆదాయంలో ఏర్పడ్డ నష్టం, అణుధార్మికత వ్యాపించివున్న కారణంగా నిలిచిపోయిన విదేశీ వాణిజ్యం వంటి అంశాలు ఈ లెక్కలోకి చేరలేదు.

**4. మన ఆర్థికాభివృద్ధి కలలను డా. అబ్దుల్ కలాం చెప్పినట్లు ఫుకుషిమా ప్రమాదం ఛిద్రం చేయడాన్ని అనుమతిద్దామా?**

1957లో కిష్టింలోనూ, 1979లో త్రీమైల్ ఐలాండ్‌లోనూ, 1986లో చెర్నోబిల్ లోనూ సంభవించిన భారీ దుర్ఘటనలు కాకుండా 1947-2008 మధ్య జరిగిన 76

అణు ప్రమాదాల వల్ల మొత్తం 19.1 బిలియన్ డాలర్ల నష్టం జరిగింది. ఇందులో 56 ఘటనలు చెర్నోబిల్ ప్రమాదం తరువాత కాలంలో సంభవించాయి. అంటే ఏటా ఒక భారీ అణు ప్రమాదం జరిగి సాలీనా 332 మిలియన్ల నష్టం వాటిల్లుతోందన్నమాట. ఈ లెక్కన 2005-2055 మధ్య కనీసం నాలుగు భయంకర అణు ప్రమాదాలు ప్రపంచంలో సంభవించవచ్చునని మెసాచ్యుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ (ఎం.ఐ.టి.) 2003లో 'అణుశక్తి భవితవ్యం' అన్న అంశం మీద జరిపిన ఒక అధ్యయనం వెల్లడించింది. ఎం.ఐ.టి. ఊహించిన ప్రమాదాల్లో పుకుషిమా మొదటిది.

మన ఆందోళన కేవలం ప్రమాదాల గురించే కాదు. ''బహు చక్కగా పనిచేసే'' రియాక్టర్లు కూడా క్యాన్సర్‌లకు, అకారణ చావులకు కారణమవుతున్నాయి. అమెరికాలో 65 ప్రదేశాల్లో నడుస్తున్న 104 రియాక్టర్లకు సమీపంలో నివసిస్తున్న వారిలో అనేకులు లుకేమియా, మెదడు క్యాన్సర్ల బారిన పడడం వెలుగులోకి వచ్చింది. కల్పాకం ప్లాంట్ సమీపంలో నివసిస్తున్న ప్రజలలో కూడా వేళ్ళ మధ్య చర్మం కలిసిపోవడం, థైరాయిడ్ సమస్యలు, రకరకాల క్యాన్సర్లు తలెత్తాయని అక్కడ పనిచేసే డా. వి. పుహళేంది తన అధ్యయనంలో వెల్లడించారు.

**5. నిజానికి బొగ్గుతో నడిచే విద్యుదుత్పత్తి కేంద్రాలే టన్నుల కొద్దీ కార్బన్‌ను విడుదల చేసి వాతావరణ దుష్ప్రభావాలకు కారణమవుతాయని డా. అబ్దుల్ కలాం అంటారు. బొగ్గు గనుల తవ్వకం మూలంగా పర్యావరణంపైనా, ఆ ప్రాంతంలో నివసించే ప్రజల మీదా పడే విధ్వంసకర ప్రభావాలను ఆయన ఎత్తి చూపుతారు.**

బొగ్గుతో నడిచే విద్యుదుత్పత్తి కేంద్రాల విషయంలో ఆయన వాస్తవాలనే మాట్లాడారు. బొగ్గు ఆధారిత కేంద్రాలు ధూళి కాలుష్యాన్ని కలుగచేసేవి. బొగ్గు గనులు భూమి మీద ఉండే నరక కూపాలు. ప్రమాదకరమైన అణు, బొగ్గు పరిశ్రమలలో ఏదో ఒకదానిని ఎంచుకోమని మనలను ఒత్తిడి చేయకూడదు. నిరంతరం నరకాన్ని భరిస్తావా లేక చస్తావా అంటే ఏదీ వద్దనేదే మన జవాబు.

డా. కలాం యురేనియం గనుల తవ్వకం పర్యావరణంపైనా, ఆ ప్రాంతంలో నివసించే ప్రజల ఆరోగ్యం మీదా కలుగచేసే విధ్వంసకర ప్రభావాలను గురించి మాట్లాడరు. భారత యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ జార్ఖండ్‌లోని జాదుగూడలో చేపడుతున్న తవ్వకాలు స్థానిక ఆదివాసీ ప్రజలపైన భయంకరమైన అణుధార్మిక దుష్ఫలితాలు కలుగచేశాయి. నోబుల్ బహుమాన గ్రహీత అయిన ఇంటర్నేషనల్ ఫిజీషియన్స్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ న్యూక్లియర్ వార్ సభ్యసంస్థ

ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ యురేనియం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో నివసిస్తున్న జాదుగూడ ప్రజల ఆరోగ్యంపైన ఒక అధ్యయనాన్ని ప్రచురించింది. ఆ అధ్యయనం ఈ కింది విషయాలను చెప్పింది.

- ప్రైమరీ స్టెరిలిటి (అసలు పిల్లలు పుట్టే సామర్థ్యం కోల్పోవడం) సాధారణం అయ్యింది.
- పుట్టుకతో అంగవైకల్యాలు సంభవిస్తున్నాయి. ఈ కారణంతో మరణిస్తున్న వారి సంఖ్య అధికం.
- ఇక్కడ మరణిస్తున్న వారిలో క్యాన్సర్ కారణాన చనిపోతున్నవారే ఎక్కువ.
- గనుల తవ్వకం జరుగుతున్న ప్రాంతాల్లో ఉంటున్న ప్రజల జీవన కాలం జార్ఖండ్ రాష్ట్ర ప్రజల మొత్తం సగటు ఆయుష్కాలం కంటే తక్కువ. దూరంగా ఉన్న గ్రామాల ప్రజల జీవన కాలం కంటే కూడా తక్కువ.

పర్యావరణానికి ప్రమాదం తెచ్చే అణు, బొగ్గు వగైరా టెక్నాలజీలకు దూరంగా ఉండడం ద్వారానే సుస్థిర అభివృద్ధి (sustainable development), సాంఘిక న్యాయంతో కూడిన భవిష్యత్తు (socially just future) సాధ్యమవుతాయి. వాతావరణ దుష్ఫలితాలను నిలువరించడానికి అణు ఇంధనం పనికిరాదు. పునరుద్ధరించగలిగిన ఇంధనాల కంటే నాలుగైదు రెట్ల కార్బన్ డయాక్సైడ్‌ను అణు ఇంధనాలు వెలువరిస్తాయి. మొత్తం అణు ఇంధన సైకిల్‌ను గనుక పరిగణనలోకి తీసుకుంటే ఈ ఉద్గారాలు మరీ ఎక్కువగా ఉంటాయి.

**6. భారత అణు కేంద్రాలు సురక్షితమైనవి. కొన్ని దశాబ్దాలుగా ఎటువంటి ప్రమాదాలు వాటిలో సంభవించలేదు. మరిక సమస్య ఏమిటి?**

ఇది వాస్తవ విరుద్ధమైనది. దాపరిక విధానాలు వీటిలో జరిగే ప్రమాదాలను వెలుగు చూడనివ్వవు. అయినా మనకు తెలిసిన కొద్దిపాటి విషయాలే ఎంతో కలవర పెడతాయి. కల్పాకంలో జరిగిన ఉల్లంఘనలను చూడండి.

- 1987 : అణు ఇంధనాన్ని తిరిగి నింపుతుండగా రియాక్టర్ కోర్ దెబ్బతింది. (rupture)
- 1981 : అణుధార్మిక భార జల ప్రభావానికి కార్మికులు లోనయ్యారు.
- 1999: అణుధార్మికత ప్రభావానికి 42 మంది గురయ్యారు.
- 2002: వంద కిలోల అణుధార్మిక సోడియం వాతావరణంలోకి విడుదల అయ్యింది.

● 2003: ఆరుగురు కార్మికులు ఎక్కువ మోతాదులో అణుధార్మికతకు గురయ్యారు.

ఇతర రియాక్టర్లలో చాలా పెద్ద ప్రమాదాలే సంభవించాయి. ఆర్.ఏ.పి.ఎస్. రియాక్టర్ కాంప్లెక్స్‌లో 1991లో ఒక కాంట్రాక్టరు వ్యర్థ అణుధార్మిక భారజలాన్ని రంగులు కలపడానికి, కుంచెలు కడుక్కోడానికి వినియోగించుకున్నాడు. అంతే కాదు దానితో ముఖం, కాళ్ళూ, చేతులూ కూడా కడిగేసుకుని తీవ్ర రేడియేషన్‌కు గురయ్యాడు.

కర్ణాటకలోని కైగా అణుకేంద్రంలో 2009 నవంబర్‌లో 55 మంది కార్మికులు అణుధార్మిక ట్రీటియం కలిసిన నీటిని తాగడం మూలంగా అధిక మోతాదుల్లో అణుధార్మిక ప్రభావానికి లోనయ్యారు.

సురక్షిత విధానాల చేర్పును ప్రమాదాల తర్వాతే చేపట్టడం సాధారణంగా జరుగుతోంది. అణుఇంధన భద్రతపై ఆ రంగ భద్రతా నిపుణుల బృందం ఒకటి 1986 నవంబర్‌లో ఇచ్చిన ''సేఫ్టీ ఆఫ్ ఇండియన్ ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్స్'' నివేదిక ''భారత దేశంలో సునామీలు, భూకంపాల వల్ల నీరు ఆకస్మికంగా పొంగి పొరలే ప్రమాదాలు అవకాశం లేదు కనుక కల్పాక్కంలో అధ్యయనాన్ని తుపానులకే పరిమితం'' చేసింది. చేసుకున్నట్టు చెప్పింది. అయినా కల్పాక్కంలో 2004లో వచ్చిన సునామీ అణురియాక్టర్ల సముదాయాన్ని, టౌన్‌షిప్‌ను కూడా ముంచెత్తింది. ఎలాగో ప్లాంట్ సురక్షితంగా బైట పడింది.

కల్పాక్కంకు అరవై కి.మీల దూరాన ఉన్న పాండిచ్చేరి వద్ద సముద్ర అంతర్భాగాన ఒక సజీవ అగ్నిపర్వతం ఉందని అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ప్రచురణ 2011లో వెల్లడించింది. అయినా ఈ రోజుకు కూడా భారీ భూకంపాలను, సునామీలను తట్టుకుని నిలబడేలా కల్పాక్కం రియాక్టర్‌ను రూపకల్పన చేయలేదు.

**7. కూడంకుళం ప్లాంట్‌లో అన్ని రక్షణ వ్యవస్థలూ ఉన్నాయి, ఇది నూటికి నూరు పాళ్ళు సురక్షితమనీ, ఈ ప్లాంట్‌కు 1300 కి.మీ దూరాన ఎక్కడో భూకంప అభికేంద్రం ఉన్నందున సునామీ భయం దీనికి లేదనీ కలాం చెబుతారు. ప్రభుత్వాన్నీ, ప్రభుత్వ నిపుణులనూ, ఇంజనీర్లనూ విశ్వసించండని కోరారు.**

మొదటిది, నూటికి నూరుపాళ్ళూ సురక్షితం అయినదేదీ ఉండదని ఏ శాస్త్రవేత్త, ఇంజనీరు అయినా చెబుతారు. కాబట్టి అటువంటి ప్రకటన ఏదయినా తప్పుడు ప్రకటన. ఒకవేళ ఏదైనా దుర్ఘటన సంభవిస్తే ఆ ప్రమాదాల

స్వభావంపైనా, తీవ్రత పైనా ప్రజలను చైతన్యవంతులను చేయడం మాని వారిని సంతృప్తి పరచడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తోంది.

రెండో విషయం, సునామీలు రావన్న అణుశక్తి విభాగపు ప్రకటనను తోసిరాజని 2004 లో సునామీ వచ్చింది. అయినా కలాం ఆ ప్రకటననే మళ్ళీ చేస్తారు. కాబట్టి ఆయన చేసే ఈ ప్రకటన ఆధునిక శాస్త్ర పరిధిలోకి రాదు, జ్యోతిష్యం పరిధిలోకి తప్పితే.

కేవలం భూకంపాలు మాత్రమే సునామీలను సృష్టించవు. సముద్ర అంతర్భాగంలో భూ చరియలు విరిగిపడటం మూలంగా కూడా సునామీలు వస్తాయి. సముద్రపు అట్టడుగున పటిష్టంగా ఉండని పర్వతాలు కూడా (slumps) ఉంటాయి. కూడంకుళం సముద్రం లోపల 100 కి.మీ దూరాన తూర్పు కామరిన్, కొలంబోల వద్ద అంతర్భాగ పర్వతాలు ఉన్నాయి. దేనికారణాన అయినా చరియలు విరిగి పడితే అది భారీ సునామీకి కారణమవుతుంది. తూర్పు కేమరూన్ పర్వతం తిరునల్వేలికి సమీపాన 70 కి.మీ పొడవు, 40 కి.మీ వెడల్పు ఉంటుంది. పపువా న్యూ గినీలో 2200 మంది ప్రాణాలను బలితీసుకున్న 1998 భారీ సునామీకి కొంతవరకూ జల అంతర్భాగ పర్వతాల నుంచి విరిగిపడ్డ చరియలే కారణం అంటారు.

భద్రత, ఉపద్రవాన్ని ఎదుర్కొనే సన్నద్ధత కేవలం సాంకేతిక అంశాలని డా. కలాం మనలను నమ్మింపజూస్తారు. అది నిజం కాదు. ప్రణాళికలు రూపొందించడం, ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయడం, విషయ పరిజ్ఞానం ఉన్న పౌరులకు ఆత్యయిక స్థితికి స్పందించడంలో శిక్షణ ఇవ్వడం, తప్పులను గుర్తించి సరిచేయగల పారదర్శక యంత్రాంగం, ప్రకృతి శక్తిని గౌరవించే ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, నిజాయితీ కలిగిన బిల్డర్లు, కాంట్రాక్టర్లు వీళ్ళందరితోనూ, అన్నింటితోనూ ఉపద్రవ సన్నద్ధతకు సంబంధం ఉంటుంది.

వాస్తవాలకు దృఢంగా కట్టుబడి ఉండటమన్నది సరయిన శాస్త్ర సాంకేతిక రంగాలకు అవసరమైన లక్షణం. ఇది మన దేశంలో కరువయ్యింది. దేశంలో ప్రతి అంశానికీ అవినీతి మచ్చ అంటుకుంటున్నపుడు ప్రభుత్వాన్నీ, ప్రభుత్వ ఇంజనీర్లనూ నమ్మాలని కలాం చెబుతున్న మాటలను ఎవరు వింటారు?

కర్ణాటకలోని కైగా అణుకేంద్రంలో మే 1994లో నిర్మాణంలో ఉన్న రియాక్టర్ డోమ్ లోపల భాగం కూలిపోయి 120 టన్నుల కాంక్రీట్ కిందపడింది. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో అణుధార్మికత బయటకు రాకుండా

నిరోధించడానికి ఉద్దేశించిన డోమ్ అది. దీని రూపకల్పనలో పాలుపంచుకున్న NPC సీనియర్ సివిల్ ఇంజనీర్లకూ, ప్రయివేటు సంస్థలకూ దగ్గరి సంబంధాలు ఉన్నాయని అణుశక్తి నియంత్రణ బోర్డు మాజీ ఉన్నతాధికారి కె. గోపాలకృష్ణన్ రాసారు. ఈ సాన్నిహిత్యం కారణంగా NPC ఇంజనీర్లు అవసరమైన క్వాలిటీ పరీక్షలను నిర్వహించలేదని ఆయన అంటారు. ప్లాంట్ నడుస్తున్నపుడు కనుక డోమ్ కూలిపోయి ఉంటే ప్రమాద స్థాయి లెవెల్-7 అయిన మెల్ట్‌డౌన్ స్థాయికి చేరేది.

ఫుకుషిమాలో ఘటనలు జరుగుతున్న సమయంలోనే 2011 జూలైలో రష్యాలో నిర్మాణంలో ఉన్న లెనిన్ గ్రాడ్-2 రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగింది. రియాక్టర్ చుట్టూ రక్షిత కవచాన్ని నిర్మించడానికి కాంక్రీట్‌ను పోయగానే పటిష్టత కొరకు వాటిలో ఉపయోగించే రాడ్లు 26 అడుగుల కిందకి వంగిపోవడంతో నిర్మాణం అంతా వంకర్లు తిరిగిపోయింది. అవినీతి, నాసిరకం సామగ్రి ప్రమాదానికి కారణం కావచ్చునని నిపుణుల సందేహం. అవినీతిలో పోటీ పడుతున్న భారతదేశం, రష్యాలు కూడంకుళంలో ప్రమాదకర పరిశ్రమను స్థాపిస్తున్నపుడు ప్రజలకు దాని మీద ఏ భరోసా ఉంటుంది?

**8. అణువిద్యుత్తును వ్యతిరేకించడంలో మనం సైన్స్ వ్యతిరేకులం అవుతున్నామా? ఒట్టి భావోద్వేగం పనిచేస్తోందా?**

కూడంకుళం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చేస్తున్న వాదన సైన్స్‌కూ, శాస్త్ర ప్రయోగానికీ వ్యతిరేకంగా చేస్తున్న వాదన కాదు. పదివేల మెగావాట్ల జైతాపూర్, కూడంకుళం ప్రాజెక్టులు ప్రయోగాలు కావు. ఇవి ప్రయోగశాలల్లో కొన్ని నియమాల మధ్య జరిపే వంద కిలోవాట్ల చర్యలు కావు. అవి విద్యుదుత్పత్తి రంగంలో పెడుతున్న, చాలామంది ప్రాణాలను అపాయకర స్థితిలోకి నెడుతున్న భారీ పెట్టుబడులు. కలాం గారు సైన్స్ కోసం ప్రజలను త్యాగం చేయమని అనకూడదు. చాలా మంది ప్రయోగవేత్తలు శాస్త్ర పీఠంపై బలి అయిన మాట నిజమే. వారిని మనం గుర్తించి తీరాలి. కృతజ్ఞతలు తెలుపుకోవాలి. తమవద్ద బందీలైన యూదుల మీద నాజీలు విషపూరిత రసాయనాలతో ప్రయోగాలు నిర్వహించడం, గతిలేని పేదలపై మందుల కంపెనీలు హానికర మందులను పరీక్షించడం సైన్స్ అభివృద్ధికి దోహదం చేయవచ్చు కాని అవి పూర్తిగా నేరపూరితమైనవి. సైన్స్ పురోగతికి తన జీవితాన్ని పణంగా పెట్టడం గురించి మాట్లాడటం లేదు కలాం. తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోబోమని చెబుతున్న కూడంకుళం ప్రజలను ఆయన నిందిస్తున్నారు.

నమ్రత, నీతి, తప్పులను అంగీకరించి, వాటి నుంచి గుణ పాఠాలను తీసుకోగలిగే సామర్థ్యం ఏ మంచి ఇంజనీరుకైనా, శాస్త్రవేత్తకయినా అవసరమైన లక్షణం. భారత దేశ అణు అధికార వర్గానికి ఇది లోపించింది.

నచ్చచెప్పవలసింది గ్రామస్తులకు కాదు. అణుకేంద్రాలు ప్రమాద రహితమని బీమా కంపెనీలు ఏవీ నమ్మడం లేదు. సరి కదా అణు ప్రమాదాలు బీమా పరిధిలోకి రావని చెబుతున్నాయి. కలాం గారు అంటున్నట్టు కూడంకుళం ప్లాంట్ పూర్తిగా సురక్షితమైనది అయితే అణువిద్యుత్తు కేంద్రాలను పూర్తిగా బీమా పరిధిలోకి తీసుకురమ్మని ఆయన ఆ కంపెనీలకు నచ్చచెప్పవచ్చు. అలాగే అణుప్రమాదాలు జరిగిన పక్షంలో తమను నష్టపరిహారం చెల్లించడం నుంచి మినహాయించాలని దేశంపై ఒత్తిడి పెడుతున్న అణు పరికరాల సరఫరాదారులకు ఆ పని చేయవద్దని ఆయన నచ్చచెప్పాలి.

సునామీ లేదా భారీ భూకంపం ఏదీ రాదని దేవుడిని నమ్మినట్టు నమ్మి అణుకేంద్రాన్ని నిర్మించడం సైన్స్‌కు వ్యతిరేకం. భారత దేశంలో అణుసాంకేతికత తెచ్చిపెట్టే పర్యవసానాల గురించి భయాందోళనలు పడుతున్న ప్రజలే శాస్త్రీయం. ఎందుకంటే నిత్యం సంభవిస్తున్న ప్రమాదాల అనుభవాలు, వాటి సామాజిక, ఆర్థిక, పర్యావరణ పర్యవసానాలే వారి భయాలకు ప్రాతిపదిక. భారతదేశంలోనూ, బైటా అణు అధికార యంత్రాంగాలలో పారదర్శకత లేకపోవడం ఈ భయాలను మరింత పెంచింది. 2-జి వంటి కుంభకోణాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో అవినీతి లేదా ఇతర అక్రమ పద్ధతుల ఫలితంగా గానీ, వివిధ కారణాలతో సాంకేతిక లోపం సంభవించి గానీ ప్రమాదం జరగడానికి అవకాశం ఉందని భయపడటం అశాస్త్రీయం కాదు.

శాస్త్రవేత్తలను కోరుతున్నది ఒక్కటే - వారి నైపుణ్యాన్ని ఉపయోగించి విధ్వంసం, ప్రమాదం కనిష్ట స్థాయిలో ఉండే పద్ధతిలో విద్యుదుత్పత్తిని చేపట్టమని.

**9. ప్రతి టెక్నాలజీకి దాని ప్రమాదాలు దానికి ఉంటాయి. కార్లు, ఓడలు, రైళ్ళు రోజూ ప్రమాదాలకు గురవుతుంటాయి. అంతమాత్రాన వాటిని వాడటం మానేస్తున్నామా? అలాంటపుడు అణువిద్యుత్తును ఎందుకు వదిలేసుకోవాలి?**

కార్లు లేదా విమాన ప్రమాదాల కారణంగా దశాబ్దాల పాటు మానవ జీవనం తిరిగి సాధారణ స్థితికి రాకుండా ఉండదు. అణుప్రమాదాలు నిషిద్ధ ప్రాంతాలను సృష్టిస్తాయి. కార్లు, విమానాల ప్రయాణీకులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసే స్వచ్ఛందంగా ప్రయాణిస్తారు. కారు ప్రమాదాలు 75 కి.మీ పరిధిలో ప్రజల

తరలింపును తప్పనిసరి చేయవు. ఈ ప్రమాదాలు తరువాత తరం వారికి గానీ, గర్భస్థ శిశువులకు గానీ హాని చేయవు. అణు ప్రమాదాలకు అంగీకరిస్తారో లేదో గర్భస్థ శిశువులను అడిగి తెలుసుకునే అవకాశం లేదు కదా. కాబట్టి రానున్న తరాలను ఇటువంటి ప్రమాదంలోకి నెట్టడం పూర్తిగా అన్యాయమైనది.

అణుసాంకేతికత మనకు లొంగకపోవడాన్ని ఒకటి కాదు అనేకమార్లు మనం చూశాం. టెక్నాలజీ రిస్కులను మనం ఎదుర్కొనగలమని రుజువు అయ్యేవరకు వాటిని ప్రయోగ పరిధిలోనే ఉంచాలని మన వివేకం మనకు బోధిస్తుంది. ప్రమాదం గురించి ఏ మాత్రం తెలియని ప్రజల మీద వాటిని బలవంతంగా రుద్దకూడదు.

**10. పునరుద్ధరించగల ఇంధనాలు సాంకేతిక పరంగా సాధ్యమయ్యేవేనా? అవి మన ఇంధన అవసరాలను తీర్చగలవా?**

పునరుద్ధరించగల ఇంధన వనరులే కాక ఇతర వనరులు కూడా మన అవసరాలను తీర్చడానికి వినియోగించాలి. ఎందుకంటే భారతదేశ ఇంధన అవసరాలలో 12 శాతాన్ని మాత్రమే విద్యుత్తు తీరుస్తోంది. కడుపేదకు కూడా వంటకు ఇంధనం అవసరం. మన దేశంలో ఇప్పటి వరకు ప్రధానమైన ఇంధన వనరుగా చెప్పదగినది బయోమాస్ (ఆవు పేడ, వంటచెరకు).

ఏ రక్షణ లేని లక్షలాది భారత ప్రజలకు ఉపకరించే ఇంధన వనరులను, వివిధ ఇంధన రూపాలను వినియోగంలోకి తీసుకువచ్చే పటిష్ట నమూనా మీద మన దేశ ఇంధన భద్రత ఆధారపడి ఉంది. మన ప్రస్తుత ఇంధన నమూనా అసమర్థ ఇంధన ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, వినియోగాలను ప్రోత్సహిస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపార సంస్థలు కరెంట్ లేక విలవిల లాడుతున్నాయి. విద్యుత్తు, ఇతర ఇంధన వనరులు ధనికులకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం మనం అవలంబిస్తున్న అహేతుక, దుబారా ఉత్పత్తి, వినిమయ విధానాల వల్ల అటు సంప్రదాయ ఇంధనాలు గానీ, ఇటు పునరుద్ధరించగల ఇంధనాలతో లభించే విద్యుత్తుగానీ మన అవసరాలు తీరడం లేదు. ఒకప్పుడు ఇంధన రాజధానిగా వెలుగొందిన సింగ్రౌలి (ఉత్తర ప్రదేశ్) చుట్టుపక్కల గ్రామాలలో నేడెందుకు విద్యుత్తుగానీ, పరిశుభ్రమైన నీరుగానీ లేవు? బొగ్గు, అణు ప్రాజెక్టులను మనం వ్యతిరేకిస్తున్నప్పుడే నిరంతరం ఆదివాసీల, దళితుల, రైతుల, మత్స్యకారుల త్యాగాలను కోరుతున్న ఈ అభివృద్ధి నమూనాను మనం ప్రశ్నించాలి.

విద్యుత్తు ఉత్పత్తికోసం పునరుద్ధరించగల ఇంధనాల సామర్థ్యాలను అందుకునే విషయంలో మనం ఒక అడుగు కూడా ముందుకు వేయలేదు. భారత ప్రభుత్వ

అంచనాల ప్రకారం 48,500 మె.వా పవన విద్యుత్తును మనం సృష్టించగలము. భారత పవన శక్తి సంఘం 65 వేల మె.వా దాకా చేయగలమని అంటోంది. చిన్న హైడ్రోప్రాజెక్టుల ద్వారా 15 వేల మె.వాను, బయోమాస్ ద్వారా 21 వేల మె.వాను, సౌరశక్తితో కనీసం 4 లక్షల మెగావాట్లను ఉత్పత్తి చేయవచ్చు. అణు రంగంలో ఖర్చు చేసిన భారీ మొత్తాలను వీటి పరిశోధనలకూ, విద్యుత్తు పంపిణీ, సరఫరా లోపాలను సరిచేసేందుకూ మళ్లిస్తే ఉపయుక్తంగా ఉండేది. సౌర, పవన విద్యుత్తు రంగాల్లో వచ్చిన పురోగతి మూలంగా మెగావాట్‌కి అయ్యే ఖర్చు తగ్గుముఖం పడుతోంది. తక్కువ సామర్థ్యం కలిగిన పాత టర్బైన్‌ల స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన కొత్త టర్బైన్‌లు పెట్టడం ద్వారా పవన విద్యుత్తు సామర్థ్యాన్ని ఆరు నుంచి ఎనిమిది రెట్లకు పెంచవచ్చు. గత 15 ఏళ్లలో భారతదేశం 17 వేల మెగావాట్ల విద్యుత్తును పునరుద్ధరించగల ఇంధనాల నుంచి జమచేస్తే చైనా అంతే మొత్తాన్ని ఒక్క ఏడాదిలోనే ఉత్పత్తిచేసింది. మరి అలాంటప్పుడు మనం అణురంగంపైనే విద్యుత్తు కోసం ఎందుకు ఆధారపడాలి?

రెండోది, చక్కటి డిజైన్‌లలో భవనాలను రూపొందించుకొని విద్యుత్తు వినిమయాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. బైట సూర్యుడు తీక్షణంగా ప్రకాశిస్తున్నా కూడా నగరాలలోని నల్లని అద్దాల భవనాలలో వెలుతురు కోసం రోజంతా విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉంటాయి. షాపింగ్ మాళ్ళు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ భవనాలు కూడా ఈ తెలివి తక్కువ పనికే పాల్పడతాయి.

జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉర్సులా స్లాడెక్ అనే ఒక సాధారణ మహిళ రష్యాలోని చెర్నోబిల్ దుర్ఘటన తర్వాత స్థానిక విద్యుత్తు కంపెనీని స్వాధీనం చేసుకోవడానికి ప్రజలను కదిలించింది. ప్రజల సొంతమైన ఆ సంస్థ నేడు పునరుద్ధరించగల ఇంధనాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసి వివిధ కేంద్రాల ద్వారా ఒక లక్ష మంది వినియోగదారులకు సరఫరా చేస్తోంది. చెర్నోబిల్ దుర్ఘటన తర్వాత కాలుష్య రహిత విద్యుత్తును కోరుతూ సగటున రోజుకు 400 మంది ఈ కంపెనీకి దరఖాస్తు చేస్తున్నారు. పునరుద్ధరించగల ఇంధనాల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తు పర్యావరణానికి హానికరం కానిదే కాకుండా వ్యాపారపరంగా కూడా విజయాన్ని సాధించేదని దీని వలన స్పష్టం అవుతోంది.

జ్యుడిషియరీ వాచ్

# రాజ్యాధిక్కారం రాజద్రోహం కాదు

— గొర్రెపాటి మాధవరావు *

తమిళనాడు రాష్ట్రంలోని కూడంకుళంలో అణువిద్యుత్ ప్రాజెక్టును నిర్మించవద్దంటూ నాలుగేళ్ళుగా అక్కడ పెద్ద పోరాటం నడుస్తోంది. ఉద్యమకారులు రకరకాల రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. పోయినేడాది సెప్టెంబర్ చివరికల్లా వారిలో **55,700** మంది మీద కేసులు రిజిస్టరు చేసింది తమిళనాడు ప్రభుత్వం. అందులో **6,918** మందిపై రాజద్రోహం నేరం ఆరోపించారు. వారిలో కొందరు **14** ఏళ్ళు నిండని బాలలు కూడా ఉన్నారు.

కొంతకాలం క్రితం దేశంలో లంచగొండితనం పెరిగిపోయిందని ఆందోళన చెందుతూ గణనీయమైన సంఖ్యలో యువతీ యువకులు రోడ్లెక్కారు. ఆ ఉద్యమం సందర్భంగా అసీం త్రివేది అనే కార్టూనిస్టు సత్యమేవ జయతే స్థానంలో అవినీతియేవ జయతే అని రాసి ఒక కార్టూను గీసాడు. ఆయనపై కూడా రాజద్రోహానికి పాల్పడినట్టు కేసు పెట్టారు. సుధీర్ ధవాలే అనే జర్నలిస్టును 2011 జనవరిలో అరెస్టు చేశారు. 2011 సెప్టెంబర్‌లో లింగరాం కొడొపి అనే మరో జర్నలిస్టును కూడా అరెస్టు చేశారు. వీళ్ళిద్దరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులకూ గవర్నమెంటుకూ మధ్య జరుగుతున్న సంఘర్షణపై పత్రికల్లో రిపోర్టులు రాశారు. వీరిద్దరిపై కూడా రాజద్రోహం నేరాన్ని ఆరోపించారు. 2010 నవంబర్‌లో అరుంధతీరాయ్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని మతోన్మాదులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 2010 డిసెంబరు 24న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లోని ఓ సెషన్సు కోర్టు పి.యు.సి.ఎల్. ఉపాధ్యక్షుడైన డాక్టర్

*న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త

బినాయక్‌సేన్‌పై రాజద్రోహం నేరం రుజువైందంటూ ఆయనకు యావజ్జీవ కారాగారవాస శిక్ష విధించింది. ఇవన్నీ ఇటీవలి సంగతులు.

జాతీయోద్యమ కాలంలో బాల గంగాధర్ తిలక్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ఆరేండ్లపాటు మాండలే జైలుకు ప్రవాసం పంపింది ఆయనపై ఈ నేరం రుజువైందనే. గాంధీపై కూడా రాజద్రోహం నేరాన్ని మోపారు. ఆయనగారు కూడా శిక్షకు గురయ్యాడు. అంటే అప్పటికి ఇప్పటికి పరిస్థితులు అలాగే ఉన్నాయన్నమాట.

ఇంతకీ రాజద్రోహం అంటే ఏమిటి? భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి)లోని సెక్షను 124ఎ రాజద్రోహం అనే నేరాన్ని నిర్వచిస్తుంది. శిక్షనూ ప్రతిపాదిస్తుంది. సాధారణంగా ఐ.పి.సి.లో ఒక సెక్షను నేరాన్ని నిర్వచిస్తే మరో సెక్షను ఆ నేరానికి విధించదగ్గ శిక్షను ప్రతిపాదిస్తుంది. సెక్షను 124ఎ మాత్రం దానికి మినహాయింపు.

ప్రభుత్వం ఎడల అనురక్తిని (disaffection) రెచ్చగొట్టినా, రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా అది నేరం అవుతుందని ఐ.పి.సి.రూపశిల్పి లార్డు మెకాలే ఒక నేరాన్ని నిర్వచించాడు. ఐ.పి.సి. ముసాయిదాలో ఈ నేరం ఉన్నప్పటికీ ఆ చట్టం తుదిరూపం తీసుకుని బయటికి వచ్చేసరికి అందులో చోటు కోల్పోయింది. ఆ తర్వాత 1870లో బ్రిటిషు ప్రభుత్వం దాన్ని చట్టంలో చేర్చి, అప్పటినుంచి అమలు చెయ్యడం మొదలెట్టింది. అప్పుడే దేశంలో వహాబీ ఉద్యమం మొదలయింది. వహాబీ ఉద్యమంతో సమర్థంగా వ్యవహరించడానికి గాను మెకాలే రూపొందించిన నేరాన్ని జేమ్స్ స్టీఫెన్ అమల్లోకి తెచ్చాడు. ఆయన వైస్రాయ్ కౌన్సిల్‌లో సభ్యుడు. న్యాయమంత్రితో సమానం. అప్పట్లో ప్రభుత్వాన్ని ఎవరు విస్మరించినా తన మీదికి జనాన్ని రెచ్చగొడుతున్నారని అంటుండేది.

ప్రభుత్వాన్ని ప్రేమించవద్దు అని అనడం కూడా రెచ్చగొట్టడంగా భావించి వారిని కేసులతో వేధించేది. అలా చాలా మందిని జైళ్ళకు పంపింది. అనురక్తి (డిస్‌అఫెక్షన్) అంటే ఏమిటి అనే ప్రశ్నను లేవనెత్తి హైకోర్టు దాకా తీసుకుపోయిన వ్యక్తి జోగేంద్ర చందర్ బోసు అనే బెంగాలీ. ఈ కేసునే బంగోబాసి (వంగవాసి) కేసు అని కూడా అంటారు. బంగోబాసి ఆయన నడిపిన పత్రిక పేరు. సమ్మతి వయసు చట్టం (ఏజ్ ఆఫ్ కన్సెంట్) అని ఒక చట్టాన్ని బ్రిటిషు ప్రభుత్వం తెచ్చినపుడు దాన్ని విమర్శిస్తూ జోగేంద్ర ఓ వ్యాసం రాశాడు. అందులో ఆ చట్టం మతానికి విరుద్ధం అని బోసు అన్నాడు. అంతే ఆ వ్యాసం ప్రభుత్వం ఎడల అనురక్తిని పెంచేలా ఉందని సెక్షన్ 124ఎ కింద ప్రాసిక్యూట్ చేసారు. 1891లో

కోర్టు అతనికి శిక్ష విధించింది. Disaffection కి అర్థం చెబుతూ అనురాగం లేకుండా చేయడమే అననురక్తి అని కోర్టు అంది. అది ద్వేషం కూడా కావచ్చునంది. అయిష్టమూ కావచ్చునంది. అంటే ప్రభుత్వంపై ఎవరికైనా అయిష్టాన్ని రెచ్చగొట్టినా, ద్వేషాన్ని రెచ్చగొట్టినా కూడా అది అననురక్తే. అంటే రాజద్రోహమే.

## విమర్శను భయపెట్టడానికే ఈ చట్టం

జాతీయోద్యమ కాలంలో బ్రిటిష ప్రభుత్వం తన మీద విమర్శను నిషేధించడానికి మొదట రెండు చట్టాలను చేసింది. ఒకటి డ్రమాటిక్ పర్ఫార్మెన్స్ యాక్ట్. రెండోది వర్నాక్యులర్ ప్రెస్ యాక్టు. మొదట చట్టం ప్రకారం ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఏ నాటికనూ ప్రదర్శించకూడదు. ఏ నాటిక వేస్తున్నారో దాని స్క్రిప్టును ముందే అధికారులకు చూపించాలి. వాళ్ళు దాన్ని సెన్సార్ చేయవచ్చు. అలాగే వర్నాక్యులర్ ప్రెస్ యాక్టు ప్రకారం ప్రచురించబోయే అంశాన్ని ముందే అధికారులకు చూపించాలి. అయితే ఈ రెండు చట్టాలూ తగినంత సమర్థంగా పని చేయటం లేదని ప్రభుత్వమే నిర్ణయించుకుని 1870లో రాజద్రోహం అనే కొత్త నేరాన్ని చట్టంలోకి చొప్పించింది.

జాతీయోద్యమ కాలంలో రాజద్రోహం నేరంపై విచారించిన కేసుల్లో అతి ముఖ్యమైన కేసు బాలగంగాధర్ తిలక్‌ది. ఆయన కేసరి అనే మరాఠీ పత్రికనూ, మరాఠీ అనే ఆంగ్ల పత్రికనూ నడిపేవాడు. 1897లో ఆయనపై రాజద్రోహం కేసు నడిచి శిక్ష పడింది. 1898లో మరో కేసు నడిచింది. ఈ రెండో కేసులోనే తిలక్‌కు ఆరు సంవత్సరాల ప్రవాస శిక్ష వేసి మాండలే జైలుకు పంపారు. మాండలే బర్మాలో ఉంది. సెక్షన్ 124 ఎ లో అప్పటికే ఉన్న అననురక్తి అనే పదానికి మరో రెండు పదాలను చేర్చారు. అవి... ద్వేషం, ధిక్కారం. అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ద్వేషాన్ని రెచ్చగొట్టినా, ధిక్కార భావనను రెచ్చగొట్టినా నేరాలే అవుతాయి.

ఈ కేసులోనే కోర్టు అననురక్తి అనే పదానికి ద్వేషం, శతృత్వం, అయిష్టం, ప్రతికూలం, ధిక్కారం అనే పదాలను పర్యాయపదాలుగా వాడుకోవచ్చు అని చెప్పింది. వీటన్నిటి భావాలనూ కలిపి రాజభక్తి రాహిత్యం (డిస్‌లాయల్టీ) అనే ఒకే పదంలో ఇమడ్చవచ్చని చెప్పింది. అలా అంటూనే ప్రభుత్వం పట్ల ఎలాంటి చెడు అనుభూతిని రెచ్చగొట్టినా, రెచ్చగొట్ట ప్రయత్నించినా అది నేరం అవుతుంది అని ప్రకటించింది. చెడు భావనను రెచ్చగొడదామనుకున్న వ్యక్తి తాననుకున్న పనిలో సఫలమయ్యాడా, కాలేకపోయాడా అనేది అప్రస్తుతం అని కూడా కోర్టు అన్నది. రెచ్చగొడదామని ఎంతగా అనుకొన్నప్పటికీ ఏ వ్యక్తినీ, లేదా సమూహాన్నీ

రెచ్చగొట్టలేకపోతే, లేదా వారిలో చలనమే కలిగించలేకపోతే వాడు సఫలం కాలేకపోయాడులే అని సరిపెట్టుకోకూడదని, అతను మాట్లాడిన మాట, రాసిన రాత రెచ్చగొట్టే ఉద్దేశంతో చేశాడని లేదా ఆ మాటలకు, రాతలకు రెచ్చగొట్టే సామర్థ్యం ఉందని పోలీసు అధికారి అనుకుంటే చాలు ప్రాసిక్యూట్ చేయవచ్చునని అంది.

## మూడు కోర్టులు – నాలుగు తీర్పులు

అప్పుడు మూడే హైకోర్టులుండేవి. ఒకటి కలకత్తా హైకోర్టు. జోగేంద్ర కేసులో తీర్పు ఇచ్చినది కలకత్తా హైకోర్టే. రెండోది బొంబాయి హైకోర్టు. తిలక్ కేసులో తీర్పునిచ్చింది అదే. దీన్ని ప్రివీ కౌన్సిల్ వరకూ తీసుకుపోవడానికి తిలక్ తరపున లాయర్లు బాగానే కృషి చేశారు గానీ, సఫలం కాలేకపోయారు. ప్రివీ కౌన్సిల్ బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానాన్ని సమర్థిస్తూ, తిలక్‌కు అపీల్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వలేదు. మూడోది అలహాబాద్ హైకోర్టు. ఆ రెండు కోర్టులు చేసినప్పుడు నేనేం తక్కువ తిన్నాను అని ఆ కోర్టు కూడా అంబాప్రసాద్‌ను రాజద్రోహం కేసులో శిక్షించింది. ఆ తీర్పు రావడానికి ముందే బొంబాయి హైకోర్టు మరో తీర్పు వెలువరించింది. దాన్నే రామచంద్ర నారాయణ కేసు అంటారు. ఇది ముగ్గురు జడ్జీల న్యాయపీఠం ఇచ్చిన తీర్పు. భారతీయుడైన రనాడే ఆ ముగ్గురు జడ్జీల్లో ఒకరు. అననురక్తి (డిస్‌అఫెక్షన్)కి ఈ న్యాయపీఠం వేరే రకమైన భాష్యం చెప్పింది. డిస్‌అఫెక్షన్ అంటే అనురాగం లేకపోవడమే అని కలకత్తా హైకోర్టు జోగేంద్ర కేసులో చెప్పిన భాష్యాన్నే తిలక్ కేసులో బొంబాయి హైకోర్టు పునరుద్ఘాటించగా ఆ భాష్యం సరైంది కాదని తిలక్ న్యాయవాదులు అభ్యంతరం లేవనెత్తి దాన్ని పరిశీలించమని ప్రివీ కౌన్సిల్‌ను కోరారు. కానీ డిస్‌అఫెక్షన్ అనే పదానికి కలకత్తా, బొంబాయి హైకోర్టులు ఇచ్చిన భాష్యం సరైందేనంటూ ప్రివీ కౌన్సిలు అప్పీలుకు తిలక్‌కు అనుమతినివ్వలేదు. ప్రివీ కౌన్సిలు వెలిబుచ్చిన అభిప్రాయాలు అనుమతి నిరాకరిస్తూ చేసిన కామెంట్సు మాత్రమే.

ఈలోగా రనాడేతో కలిసి ఉన్న బొంబాయి హైకోర్టు ఫుల్‌బెంచ్ డిస్‌అఫెక్షన్‌కు అసలు అర్థం ఇది అని మరో తీరుగా భాష్యం చెప్పింది. హైకోర్టు ఏమన్నదంటే... అననురక్తి అనే పదాన్ని చట్టం ప్రత్యేక అర్థంలో వాడిందని అంది. రాజకీయ పరాయీకరణ (పొలిటికల్ అలియనేషన్), లేక ప్రభుత్వం పట్ల అసంతృప్తి (డిస్‌కంటెంట్), లేక రాజభక్తి రాహిత్యం (డిస్‌లాయల్టీ) ఆ అర్థంలో అననురక్తిని వాడిందన్నారు. అందువల్ల డిస్‌అఫెక్షన్ అంటే అనురక్తి లేకపోవడం అని భాష్యం చెప్పడం సరికాదు అని బెంచి తరపున తీర్పు రాసిన జడ్జి పార్సన్స్ అన్నారు.

అలహాబాద్ హైకోర్టు ఈ భాష్యాన్ని ఒప్పుకోలేదు. తిలక్‌కు అప్పీలు చేసుకోవడానికి అనుమతి నిరాకరిస్తూ ప్రివీ కౌన్సిలు చేసిన కామెంట్సునే ప్రివీకౌన్సిలు తీర్పుగా పరిగణించాల్సి ఉంటుందనీ, ఇక అప్పుడు పార్సన్స్ భాష్యానికి విలువ ఉండదనీ అంది.

ఈ రెండు రకాల భాష్యాలు వచ్చిన నేపథ్యంలో 1898లో సెక్షను 124 ఎ ను సవరించారు. సవరించిన సెక్షనులో డిస్‌అఫెక్షన్‌కు కోర్టులు ఏఏ భాష్యాలు చెప్పాయో వాటి స్ఫూర్తిని సవరణలో చేర్చారు. కానీ రామచంద్ర నారాయణ కేసులో బొంబాయి హైకోర్టు ఫుల్‌బెంచ్ చెప్పిన భాష్యాన్ని సవరణ పట్టించుకోలేదు. కారణం స్పష్టమే. అది వలసవాద ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పు కాదు.

నాటి వలస ప్రభుత్వం బ్రిటను దేశపు చట్టాలకు అనుగుణంగా ఏర్పడిందే అయినా భారతదేశాన్ని పాలించడానికి నైతిక అర్హత ఉన్న ప్రభుత్వం కాదు. అది ఎన్నికల ద్వారా, ప్రజా ప్రాతినిధ్య సంస్థల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కాదు. ఆ ప్రభుత్వంపై జనానికి రోత పుట్టడం సహజం. తిలక్ లాంటి దేశాభిమానులు చేసింది ప్రజలకు గల ఈ ధర్మాగ్రహాన్ని సంఘటితం చేయడమే. ప్రభుత్వాన్ని మార్చుకునే హక్కు ప్రజలకు ఉంటుంది అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడమే వారు తమ విద్యుక్త ధర్మం అనుకొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడం కూడా దేశం కోసం అవసరమేననుకొన్నారు.

## గాంధి అభిప్రాయం

అందుకే యంగ్ ఇండియాలో ప్రచురించిన రెండు వ్యాసాలకు రాజద్రోహ నేరాన్ని ఎదుర్కొన్నపుడు గాంధీ ఇలా అన్నాడు. ''చట్టం ద్వారా అనురక్తిని సృష్టించలేరు; క్రమబద్ధీకరించలేరు. ఇప్పుడున్న ప్రభుత్వం ఎడల అననురక్తిని ప్రబోధించడం నాకు ఒక తపన (passion). పౌరుల స్వేచ్ఛను అణచివేయడానికి ఐ.పి.సి. ఉద్దేశించిన రాజకీయ నేరాలలో 124 ఎ ప్రిన్స్ (యువరాజు) లాంటిది. ఎవరికైనా ఒక వ్యక్తి మీద గానీ, వ్యవస్థ మీద గానీ అనురక్తి లేకపోతే, ఆ అననురక్తిని సంపూర్ణంగా వ్యక్తీకరించగలిగే స్వేచ్ఛ వారికి ఉండాలి. దేశ ప్రజలకు అత్యంత ప్రేమాస్పదులైన వారిని (most beloved) ఈ సెక్షను కిందే శిక్షించారని చదివాను. అంతటి మహనీయులను శిక్షించిన సెక్షను కిందే నా మీద కూడా నేరం మోపడం, నన్ను శిక్షించడం నా అదృష్టంగా భావిస్తున్నా'' అని గాంధీ కోర్టులో ఇచ్చిన ప్రకటన రాజద్రోహం నేరాన్ని ఎదుర్కొన్న ఆనాటి వారి మానసిక స్థైర్యానికి మచ్చుతునక.

కశ్మీర్ స్వాతంత్ర్య పోరాటానికి ప్రతీక అయిన షేక్ అబ్దుల్లాను కూడా ఈ సెక్షను కిందే 1946 సెప్టెంబర్ 10న శిక్షించారు. మహారాజా గులాబ్ సింగ్‌కీ బ్రిటిషు వారికీ

మధ్య జరిగిన చీకటి ఒడంబడికలను గురించి ప్రజలకు చెప్పినందుకే మహారాజా ఎడల అనసురక్తిని ప్రదర్శించాడని అతనిపై ఆరోపణ!

ఆ తర్వాత 1950 వచ్చింది. జనవరి 26 వచ్చింది. ఇండియా రిపబ్లిక్ అయింది. భారత సంవిధానం అమల్లోకి వచ్చింది. అందులో ఆర్టికల్ 19లో పౌరుల ప్రాథమిక స్వేచ్ఛలను ప్రకటించారు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఒక ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం గుర్తించింది. ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకోవడం, దాని ద్వారానే ప్రభుత్వాలను మార్చుకోవడం ప్రజాస్వామిక ప్రక్రియలో కీలకాంశంగా గుర్తింపబడింది. ఉనికిలో గల ప్రభుత్వంపై ఆగ్రహం కలిగించకుండా దాన్ని మార్చుకోవడం ఊహకు అందని విషయంగా పరిగణించారు. అయినా ఐ.పి.సి.లో రాజద్రోహ నేరాన్ని అలానే కొనసాగనిచ్చారు.

## స్వాతంత్ర్యానంతరం...

అయితే భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, భావప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక స్వేచ్ఛగా గుర్తింపు పొందిన తర్వాత రాజద్రోహ నేరాన్ని ఎలా నిర్వచించాలి? అది ఇంకెంతమాత్రమూ ఐ.పి.సి.లో ఉండతగనిది అనే జవాబు వస్తుందని ఆశిస్తాం కదా. కానీ భారత రాజ్యాంగం ప్రకారం కూడా ప్రాథమిక హక్కులు నిరపేక్షమైనవి (absolute) కావు. వాటిపై కూడా హేతుబద్ధమైన పరిమితులను విధించవచ్చు. అంటే పరిమితులను విధించే చట్టానికి లోబడి మాత్రమే ప్రాథమిక హక్కులను అనుభవించవచ్చును అని చెప్పారు. ఎలాంటి పరిమితులను విధించవచ్చు అంటే రాజ్యభద్రతా ప్రయోజనాలను, విదేశీ రాజ్యంతో స్నేహసంబంధాలను, ప్రజా శాంతిని, సభ్యత-నైతికతలను, కోర్టు ధిక్కారాన్ని, పరువు నష్టాన్ని, నేర ప్రేరేపణను దృష్టిలో పెట్టుకొని ఏ పరిమితినైనా చట్టం ద్వారా విధించవచ్చు అని.

ప్రభుత్వం ఎడల అనసురక్తిని నేరంగా చూసే ఐ.పి.సి.లోని సెక్షను 124 ఎ కీ, భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా హామీ పడిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కీ మధ్య సమన్వయాన్ని సాధించే పనిని సుప్రీంకోర్టు కేదార్‌నాథ్ కేసులో చేపట్టింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఏమందంటే ''ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎంత ఘాటైన పదాలను వాడినా అది నేరం కాదు. రాజద్రోహం అసలే కాదు. ప్రభుత్వంపై చేసే విమర్శ హింసను ప్రేరేపించేదిగా ఉంటేనే, ప్రజల్లో అశాంతిని రెచ్చగొట్టేదిగా ఉంటేనే రాజద్రోహ నేరాన్ని ఆరోపించవచ్చు. అంటే మాట్లాడిన మాటలకూ, రాసిన రాతలకూ పబ్లిక్ డిజార్డర్‌ను (ప్రభుత్వాన్ని అస్తవ్యస్తం చేయడం అని తర్జుమా చేసుకొందాం) సృష్టించే ఉద్దేశం ఉన్నా, లేక లా

అండ్ ఆర్డర్‌ను (శాంతి భద్రతలు అని స్థూలంగా అనుకొందాం) భంగపర్చే ఉద్దేశం ఉన్నా అప్పుడు మాత్రమే దాన్ని రాజద్రోహం అని అనవచ్చుంది. కేదార్‌నాథ్ కేసుతో పాటు మరో మూడు రాజద్రోహం కేసులను కూడా సుప్రీంకోర్టు అదే సందర్భంలో విచారించింది. ఆ మూడిట్లో అలహాబాద్ హైకోర్టు స్వతంత్ర భారతదేశంలో అసలు రాజద్రోహం అనే నేరమే ఉండజాలదని తీర్పు చెప్పింది. మొత్తం నాలుగు కేసులపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లగా వాళ్ళు మధ్యేమార్గంగా ఈ తీర్పు వెలువరించారు. ఆ నాలుగు కేసుల వివరాలూ క్లుప్తంగా తెలుసుకుందాం.

## నాలుగు కేసుల వివరాలు

కేదార్‌నాథ్ సింగ్ ఫార్వర్డ్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. 1953 జనవరి 26న బీహార్ రాష్ట్రంలోని మోంఘీర్ జిల్లా, బరౌని గ్రామంలో ఇచ్చిన ఒక ఉపన్యాసంలో ''మనం బ్రిటిషు వాళ్ళనే ఈ దేశం నుంచి వెళ్ళగొట్టాం. కాంగ్రెసు వాళ్ళనూ గద్దె నుంచి దింపేస్తాం. ఈ కాంగ్రెసు గూండాలు అమెరికన్ డాలర్ల మీద పడి బతుకుతున్నారు... ఏదో ఒక రోజు మేం ఆశిస్తున్న విప్లవం వస్తుంది. పెట్టుబడిదారులనూ, జమీందారులనూ, కాంగ్రెసు నాయకులనూ బూడిద చేస్తుంది'' అన్నాడు. ఈ మాటలు రాజద్రోహపూరితమైనవని మేజిస్ట్రేటు కోర్టు భావించి కేదార్‌నాథ్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. పాట్నా హైకోర్టు కూడా కింది కోర్టు తీర్పును సమర్థించింది.

రెండోకేసు ఇల్మిది. అఖిల భారత ముస్లిం కన్వెన్షన్‌కు ఆహ్వాన సంఘం అధ్యక్షుడి హోదాలో మొహమ్మద్ ఇషాక్ ఇల్మి 1953 అక్టోబర్ 30న అలీగఢ్‌లో ఇచ్చిన ఉపన్యాసం రాజద్రోహపూరితంగా ఉందని అతనిపై ఆరోపణ వచ్చింది. సెషన్స్ కోర్టు విచారణ జరిపి ఆయనపై కేసు రుజువైందని ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. ఆయన హైకోర్టుకు అప్పీలుకు పోయాడు. ఐ.పి.సి. లోని సెక్షను 124 ఎ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆటంకం కల్గిస్తుందని అలహాబాద్ హైకోర్టులో వాదించాడు.

మూడోకేసు రామానంద్‌ది. రామానంద్ బోల్షివిక్ పార్టీ సభ్యుడు. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లా, హనుమాన్‌గంజ్‌లో 1954 మే 29న ఓ సమావేశంలో ప్రభుత్వాన్ని కూలదోయమని ప్రజలను రెచ్చగొట్టినట్లు ఆయనపై రాజద్రోహం నేరం ఆరోపించారు. రామానంద్‌కు కింది కోర్టు శిక్ష విధించింది. అతనూ అలహాబాద్ హైకోర్టుకు అప్పీలు చేసుకొన్నాడు.

నాలుగోకేసు పారస్‌నాథ్ త్రిపాఠీది. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లా మన్నాపూర్ గ్రామంలో 1955 సెప్టెంబరు 26న మాట్లాడుతూ ప్రభుత్వాన్నీ, దాని

అధికారులనూ ప్రతిఘటించడానికి స్వచ్ఛంద సైన్యాన్ని తయారు చేసుకోవాలని గ్రామస్తులను రెచ్చగొట్టాడని అతనిపై ఆరోపణ. అతనూ అలహాబాద్ హైకోర్టులో తన నిర్బంధాన్ని సవాలు చేసాడు.

ఈ మూడు కేసులనూ అలహాబాద్ హైకోర్టు ఫుల్ బెంచ్ విచారించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి భావప్రకటనా స్వేచ్ఛకు హామీ పడిన తర్వాత ఐ.పి.సి.లోని సెక్షను 124 ఎ చెల్లదని, అంటే స్వతంత్ర భారతదేశంలో రాజద్రోహం అనే నేరం ఉండజాలదని తీర్పు చెప్పింది. మొహమ్మద్ ఇషాక్ ఇల్మి, రామానంద్‌లపై కేసులను కొట్టివేసింది. పారస్‌నాథ్ త్రిపాఠీని నిర్బంధం నుంచి విడిచిపెట్టింది.

ఈ కేసులన్నీ మళ్లీ సుప్రీంకోర్టు ముందుకు విచారణకొచ్చాయి. నిజానికి 1950 నాటికే, అంటే  రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంవత్సరమే సుప్రీంకోర్టు భావప్రకటనా స్వేచ్ఛను హరించే చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. రొమేష్ థాపర్‌కీ, మద్రాసు రాష్ట్రప్రభుత్వానికీ మధ్య జరిగిన కేసులోనూ, బ్రిజ్‌భూషణ్‌కీ, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య జరిగిన కేసులోనూ ఈ తీర్పు ఇచ్చి ఉంది.

అంటే సుప్రీంకోర్టు, ఆ తర్వాత అలహాబాద్ హైకోర్టు 'భావప్రకటనా స్వేచ్ఛకూ రాజద్రోహ నేరానికీ పొసగదు' అని చెప్పి 1950 తర్వాత వచ్చిన కొత్త పరిస్థితిని ఆకళింపు చేసుకోగా 1962 (కేదార్‌నాథ్ సింగ్ కేసుని పరిష్కరించిన సంవత్సరం) నాటికి సుప్రీంకోర్టు అంతటి విజ్ఞతనూ, లోతైన పరిశీలననూ పక్కకు పెట్టి పరస్పర విరుద్ధమైన భావనల మధ్య ఒక అపవిత్ర బంధాన్ని ముడిపెట్టడానికి ప్రయత్నించింది.

ప్రభుత్వం అనే భావనకూ, రాజ్యం అనే భావనకూ తేడా చూడ నిరాకరించడం వల్లనే లేదా రెంటినీ ఒకటిగా చూడ్డం వల్లనే సుప్రీంకోర్టు ఈ డొంకతిరుగుడు భాష్యం చెప్పినట్లుంది. సెక్షన్ 124 ఎ 'రాజ్యానికి వ్యతిరేకంగా నేరాలు' అనే అధ్యాయంలో ఉన్నది అనే ఏకైక కారణంతోనే రాజ్యాన్నీ, ప్రభుత్వాన్నీ ఒకటిగా చూసింది సుప్రీంకోర్టు.

నిజానికి, మారిన పరిస్థితుల్లో అంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత రాజద్రోహం అనే నేరాన్ని ఐ.పి.సి.లో అట్టిపెట్టడానికి ఎలాంటి కారణమూ లేదు. రాజ్యాంగానికి మొదటి సవరణ బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు ప్రధాని నెహ్రూ రాజద్రోహం అనే పదాన్నే కాదు, దాన్నొక నేరంగా భావించడాన్నీ కూడా

తీవ్రంగా అసహ్యించుకుంటున్నానన్నాడు. దాని ఉనికే తనకు నచ్చదు అన్నాడు. దాని పొడే తనకు గిట్టదు అన్నాడు. దాన్ని చూస్తేనే తనకు చీదర పుడుతుంది అన్నాడు. దాన్ని ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది అన్నాడు. అనడం బాగానే అన్నాడు గానీ, రాజద్రోహం అనే నేరాన్ని ఐ.పి.సి. నుండి తొలగించే ప్రయత్నం మాత్రం ఏమీ చెయ్యలేదు.

సుప్రీంకోర్టు చేసిందల్లా పాత భాషకు కొత్త అర్థాన్ని అతికించడమే. పోలీసుల దగ్గరికి చేరేసరికి ఆ అతికించిన అర్థం కూడా ఊడిపోయిందనుకుంటా. సుప్రీంకోర్టు కూడా సమర్థించేసరికి ఇక వాళ్లు అచ్చోసిన ఆంబోతులా దేశం మీద పడ్డారు. కూడంకుళంలో, అసీం త్రివేదీ విషయంలో, ఇంకెందరి విషయంలోనో అందుకే రాజద్రోహం కేసులు పెట్టి పడేస్తున్నారు. చివరికి మనకు అర్థమయ్యేదేమిటంటే తెల్లవారి పాలనలో అయినా, నల్లవారి పాలనలో అయినా ఎవరైతే రాజకీయంగా, సామాజికంగా ఒక గుణాత్మక మార్పును కోరుకుంటూ రోడ్డెక్కుతారో అలాంటి వారి మీదే రాజ్యం రాజద్రోహం నేరాన్ని ఆరోపిస్తూ వస్తోందని. పాలన ఎవరిదైనా రాజ్య స్వభావం ఒకటేనని నిరూపితమైంది.

## విశాఖపట్నం

# పారిశ్రామిక ప్రమాదాలన్నీ భద్రతా వైఫల్యాలే

నీరు నిప్పుల కుంపటి కాగలదనీ, ఆ నిప్పు వరదై పొంగగలదనీ పరిశ్రమలు మరో మారు విశాఖపట్నంలో హెచ్చరించాయి. స్వాభావికంగా భద్రమయినది లేదా ప్రమాదరహితం అనదగ్గది పరిశ్రమలో ఏదీ ఉండదని ఇక్కడి హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పి.సి.ఎల్) రిఫైనరీలో ఇటీవల జరిగిన కూలింగ్ టవర్ ప్రమాదం తెలియజెప్పింది. అత్యంత సురక్షిత విధానాల ద్వారా ప్రక్రియను నిర్వహిస్తాము కనుక ఎవరూ భయపడనవసరం లేదని అణుశాస్త్రవేత్తల నుంచి ప్రధాని వరకు మనలను అణువిద్యుదుత్పత్తి విషయంలో నమ్మబలుకుతూ ఉంటారు. కాని కీడెంచి మేలెంచే పద్ధతే ఏ పరిశ్రమ విషయంలోనైనా ప్రజలు అనుసరించతగ్గ విధానమనీ, వాటి నిర్వహణలో ఉద్యోగులు పాటించతగిన పద్ధతనీ విశాఖ పారిశ్రామిక అనుభవాలు తెలియచెబుతున్నాయి.

విశాఖపట్నం జిల్లా ఇటీవల పారిశ్రామిక ప్రమాదాలకు నెలవుగా మారింది. వరుసగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కేవలం రెండేళ్ళ వ్యవధిలో 2010-12 మధ్య 91 ప్రమాదాలు సంభవించాయని పత్రికలు పేర్కొన్నాయి. పత్రికల దృష్టికి రానివీ, అధికారిక జాబితాలోకి ఎక్కనివీ మరెన్నో తెలియదు.

మొన్న ఆగస్టు 23న నగరంలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పి.సి.ఎల్)కు చెందిన ఆయిల్ రిఫైనరీలో ఉన్నట్టుండి కూలింగ్ టవర్ పేలింది. ఈ ఘటనలో ఒళ్ళు తీవ్రంగా కాలి ఇప్పటికి 28 మంది మరణించారు. మరో 12 మంది కాలిన గాయాలతో విశాఖ, ముంబై ఆసుపత్రులలో మృత్యువుతో పోరాడుతున్నారు. బతికి బయటపడ్డ వారు అయిదారుగురికి మించి లేరు. రెండు నెలల ముందే మే 16న ఇదే రిఫైనరీలో పెద్ద

అగ్నిప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తూ అప్పుడెవరూ గాయపడలేదు, ఎవరికీ ప్రాణహాని జరగలేదు. ఓ పదహారేళ్ళు వెనక్కి పోతే ఇక్కడే 1997 సెప్టెంబర్ 14న వంటగ్యాస్ గోళం లీక్ అయి పెద్ద విస్ఫోటనం సంభవించింది. ఆ ఘటనలో 60 మంది దుర్మరణం చెందారు.

## తాజా ప్రమాదం ఎలా జరిగింది?

ఏ చమురుశుద్ధి ప్రక్రియల్లో అయినా అధిక ఉష్ణోగ్రతలు వెలువడుతాయి. పక్కనే ఉన్న సముద్రపు నీరు చవకగా లభ్యమవుతుంది కనక ఆ నీటినే వీటిని చల్లబరచడానికి ఉపయోగిస్తారు. ప్లాంట్‌లకు చల్లటి నీరు సరఫరా చేసి, అక్కడ వేడెక్కిన నీటిని చల్లబరచడమే కూలింగ్ టవర్ చేసే పని. వేడెక్కిన నీటిని సముద్రంలోకి వదిలివేయడానికి పర్యావరణ చట్టాలు ఒప్పుకోవు. కనుక ప్లాంట్‌కు కూలింగ్ టవర్ తప్పనిసరి.

ఉత్పత్తి ప్రక్రియలు నిర్వహించే ప్లాంట్‌లలో ఈ నీరూ, పెట్రోలియం ఉత్పత్తులూ ఉష్ణాన్ని బదలాయించుకోవడానికి ఎక్స్చేంజర్ (exchanger) అనే వ్యవస్థ ఒకటి అన్ని చమురుశుద్ధి పరిశ్రమల్లో ఉంటుంది. వేడెక్కిన చమురు పదార్థాలు ఒకవైపూ, సముద్రపు నీరు మరో వైపూ ఎక్స్చేంజర్‌లలో ప్రయాణించి ఉష్ణాన్ని బదలాయించుకుంటాయి. ఈ వ్యవస్థలో ఏమయినా లీకులు సంభవిస్తే ఆయిలూ లేదా గ్యాస్–కూలింగ్ టవర్‌కు తిరిగి వెళ్ళిపోయే నీటితో ప్రయాణించే అవకాశాలు ఎక్కువే. ఇది జరగకుండా పరికరాల నాణ్యత, రక్షణ వ్యవస్థల ఏర్పాటు ఉండాలి.

ప్రాసెస్ ప్లాంట్ల నుంచి కూలింగ్ టవర్‌కు తిరిగి వెళ్ళే నీటిలో చమురు లేదా గ్యాస్ వెళ్ళిపోవడం వలనే కూలింగ్ టవర్‌లో ప్రమాదం వాటిల్లిందని ప్రాథమిక అవగాహన. విచారణలు ఇంకా జరుగుతున్నాయి.

కూలింగ్ టవర్‌లో ఇటీవలి వరకూ 4 విభాగాలు ఉండేవి. ఒక్కొక్క విభాగాన్నీ సెల్ అంటారు. కొత్తగా నిర్మాణం అవుతున్న డీజల్ హైడ్రోట్రీటర్ (డిహెచ్‌టి) కోసం ఐదో సెల్‌ను నిర్మించారు. దీనిని ప్రారంభించేటపుడే ప్రమాదం వాటిల్లింది. ఇక్కడ అనేక పనులు గత రెండు వారాలుగా చేపడుతున్నారు. అప్పటికే కూలింగ్ టవర్‌లోని ఇతర సెల్స్ కూడా పాక్షికంగా పాడయిపోయి ఉండడంతో నీటి ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచడం సాధ్యం కావడం లేదు. దీనితో ఉత్పత్తి ప్రక్రియలకు విఘాతం కలుగుతోంది. అందుకోసం ఒక పక్క టవర్ పాక్షికంగా నడుస్తుండగానే మరమ్మతులు చేపడుతున్నారు. మరో పక్క డిహెచ్‌టి కోసం

నిర్మించిన సెల్‌ను ప్రాసెస్ యూనిట్లలో ప్రక్రియలను చల్లబరచడానికి వినియోగించుకోవాలని యాజమాన్యం భావించింది. దీని కోసం తాత్కాలిక పైప్ లైన్లు వేసుకున్నారు. ఒక పక్క వెల్డింగ్ పనులూ, మరోపక్క ఇతర పనులూ కొన్ని వారాలుగా జరిగిపోతున్నాయి. వీటన్నిట్లోనూ ఎన్నో సేఫ్టీ లోపాలు ఉన్నాయి. వాటి మాట అటు ఉంచితే కనీసం ఐదో సెల్‌ను ప్రారంభించే ముందు వెల్డింగ్ పనులు నిలిపివేసినా ప్రమాదం సంభవించకపోయేది. లేదా కార్మికులను అక్కడ నుంచి తరలించాక ప్రారంభించినా ఇంత ప్రాణ నష్టం జరగకపోయేది. ఏ పని చేసే ముందయినా పాటించాల్సిన ప్రాథమిక నియమాలను తుంగలో తొక్కినందువల్లే ఈ ఘటన జరిగింది.

## స్టీల్‌ప్లాంట్ దుర్ఘటన

విశాఖ ఉక్కు కర్మాగారంలో గత ఏడాది (2012) జూన్ 19న ఆక్సిజన్ ప్లాంట్ పేలి 19 మంది చనిపోయారు. ఉక్కుకర్మాగారం విస్తరణలో భాగంగా నిర్మించిన 2వ స్టీల్ మెల్టింగ్ షాప్ (SMS)ను ప్రారంభించే సమయంలో ఇది జరిగింది. రాత్రి 9 గంటలకు స్టీల్ మెల్టింగ్ షాప్‌లోని ఆక్సిజన్ ప్లాంట్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. ద్రవీకృత ఇనుము నుండి మలినాలను తొలగించి ఉక్కు తయారు చేసే క్రమంలో ఆక్సిజన్ అవసరమవుతుంది. బూస్టింగ్ స్టేషన్ నుండి ఈ ఆక్సిజన్ వెళ్ళే పైప్ లైన్‌లో ఒత్తిడి పెరిగిపోయి పేలుడు సంభవించింది. 11 మంది అక్కడికక్కడే చనిపోగా మరో 8 మంది వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతూ చనిపోయారు. కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ప్రపంచ ఉక్కు చరిత్రలోనే ఇది అత్యంత పెద్ద ప్రమాదం. యంత్రాల్లోని నాణ్యత లోపాల వల్ల, అనుభవజ్ఞులయిన అధికారులు, కార్మికులు అక్కడ లేకపోవటం వలన ఈ ప్రమాదం జరిగింది.

ఇక్కడే మరో సంఘటనలో మే 1, 2012న కొత్తగా నిర్మించిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో పేలుడు సంభవించి ఇద్దరు సజీవ దహనం అయ్యారు. పార్లమెంట్‌లో స్టీల్ మంత్రి బేణిప్రసాద్ వర్మ ఒక ప్రశ్నకు సమాధానంగా 2011లో 8 మంది, 2012లో ఐదుగురు ప్రమాదాల్లో మరణించారని జవాబు చెప్పారు. ఈ రెండేళ్ళలో ఉక్కు ఫ్యాక్టరీలో 74 'రిపోర్టబుల్' ప్రమాదాలు జరిగాయని కూడా చెప్పారు. ఈ రిపోర్టబుల్ పదానికి ఆయన గాని స్టీల్ అధికారులు గాని ఇస్తున్న నిర్వచనం ఏమిటో తెలియదు. కాని విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 2007-10 మధ్య 159 ప్రమాదాలు జరిగాయని మరో అంచనా. ఈ లెక్కలకు పొంతన ఉండదు.

జూన్ 19 ప్రమాదంపై కేంద్రప్రభుత్వం సెయిల్ మాజీ ఛైర్మన్ ఎస్.కె.జైన్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 'ఉక్కుగనులను తవ్వి

ఎలుకను కూడా పట్టలేదని' విమర్శలు వచ్చాయి. ప్రమాదం ఎవరి నిర్లక్ష్యం వలన జరిగిందో ఆ కమిటీ తేల్చలేదు. సాక్ష్యాలన్నీ కాలి బూడిద అయ్యాయని, ప్రత్యక్ష సాక్షులు ఎవరూ మిగిలిలేరని తేల్చింది.

## ఫార్మా ప్రమాదాలు

జిల్లాలోని నక్కపల్లి వద్ద ఉన్న హెటరో డ్రగ్స్ కర్మాగారంలో 2013 జనవరి 5న రియాక్టర్ పేలి నలుగురు మరణించారు. ఇక జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని ఒక కంపెనీలో ప్రక్రియాపరమైన లోపం సంభవించి రసాయన చర్యలు మారిపోయి అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక యంత్రాలు వెళ్లి కూడా నీళ్ళు లేక, మంటల్ని నివారించే నురుగు (Protein foam) లేక నిస్సహాయంగా ఉండిపోయాయి. దీనిని అదుపు చేయడానికి మూడు నాలుగు రోజులు పట్టింది.

## ఇతర దుర్ఘటనలు

పరవాడలోని హిందుజా పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్నపుడు ఎత్తు నుండి జారిపడి అయిదుగురు చనిపోయారు. పొరుగున ఉన్న శ్రీకాకుళం జిల్లాలో నాగార్జున అగ్రికెం కెమికల్ కర్మాగారంలో అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు మరణించారు.

## ప్రమాదాలకు బలి అవుతున్న వారిలో పేద కార్మికులే అధికం

ప్రమాదానికి కారణమేదైనా, కారకులెవరైనా వాటికి బలి అవుతున్న వారిలో పొట్ట చేతబట్టుకుని సుదూర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన పేదవర్గాల ప్రజలే అధికం. వీళ్ళంతా కాంట్రాక్టు కార్మికులుగా పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు మొదలుకొని పొరుగున ఉన్న ఒడిషా, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి కోసం నగరాలకు వలస వస్తుంటారు. అందులో విశాఖ ఒకటి. ఇక్కడ భారీ పరిశ్రమలు ఉండటంతో ఉపాధికి బాగానే అవకాశం ఉంది. హెచ్.పి.సి.ఎల్ లో మరణించిన వారిలో 22 మంది కాంట్రాక్టు కార్మికులే. ఒక్కరే శాశ్వత ఉద్యోగి. స్టీల్ ప్లాంటు ఘటనలో చనిపోయిన 27 మందిలో 8 మంది ప్రైవేటు కార్మికులు. మిగిలిన ఘటనలలో చనిపోయిన వారూ ప్రైవేటు అసంఘటిత రంగాలవారే. తమకు ఏ చట్టం వర్తిస్తుందో కూడా వారికి తెలియదు.

## ఎందుకు సంభవిస్తున్నాయి?

1. పబ్లిక్‌రంగ పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలకూ, పర్యావరణ పరిరక్షణకూ సంబంధించి విధి విధానాలు ఉన్నప్పటికీ వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతోంది.

2. కొత్త విభాగాలు, ప్రక్రియలు ప్రారంభించే ముందు విధిగా అన్ని రకాల తనిఖీలు జరగాలి. ఏ రకమైన ప్రమాదం వాటిల్లవచ్చో అధ్యయనం చేయాలి. కారణాలను కనుక్కొని పరిష్కరించాలి. కాని వీటిని ప్రారంభించే విషయంలో పై అధికారుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. ప్రతి పనికీ కాల పరిమితులు పెట్టడం, ఆ పనిని ఆ సమయంలోగా చేసిన వారికి పదోన్నతులకు అవసరమైన మంచి రేటింగులు ఇచ్చే అవాంఛనీయ ధోరణులు పబ్లిక్ సెక్టార్‌లో కూడా లిబరలైజేషన్ తర్వాత మొదలయ్యాయి. పనిని త్వరగా ముగించే ఉబలాటంలో కొన్ని తనిఖీలను ఉపేక్షించడం సర్వసాధారణం అయ్యింది.

3. ప్రతి పరిశ్రమలోనూ సిబ్బందిని తగ్గించివేసారు. పైన పేర్కొన్న పరిశ్రమలన్నీ సంక్లిష్ట ప్రక్రియల ద్వారా నడిచే పెద్ద పరిశ్రమలు. అధిక పీడన, ఉష్ణోగ్రతలు, ప్రమాదకర రసాయనాలు, మండే స్వభావంగల పదార్థాలు, భారీ యంత్రాలు వీటిలో సర్వసామాన్యం. ఇలాంటి చోట్ల కార్మికుల సంఖ్యను తగ్గించి వేయడమే కాకుండా పనిని కూడా ఇబ్బడి ముబ్బడిగా పెంచివేసారు. ఇది సిబ్బందిని ఊపిరి సలపనివ్వకుండా చేస్తోంది.

4. కాంట్రాక్టు కార్మికులను విచ్చలవిడిగా అన్ని పనుల్లోనూ వినియోగించడం మొదలయ్యింది. శాశ్వత స్వభావం ఉన్న పనులలో కాంట్రాక్టు కార్మికులను వినియోగించకూడదని చట్టం చెబుతోంది. అయినా చట్టానికి ఎప్పుడో చెల్లుచీటీ చెప్పేశారు.

5. పరిశ్రమల శాఖ నిర్లక్ష్యం, నిర్లిప్తత అంతా ఇంతా కాదు. పరిశ్రమల శాఖ ప్రధాన తనిఖీ అధికారి తన పరిధిలోని కర్మాగారాల్లో పరికరాల నాణ్యతనూ, భద్రతా ప్రమాణాల అమలునూ పరిశీలించాలి. పరిశ్రమలు ప్రమాద రహితంగా ఉన్నాయని ధ్రువీకరించాలి. ఇది సక్రమంగా జరగడం లేదు. విశాఖపట్నం పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 3,500 కర్మాగారాలు ఉన్నాయి. ప్రతి జిల్లాకు ఒక ముఖ్య పర్యవేక్షకుడు వుండాలి. ఆయన కింద కర్మాగారాల సంఖ్యను బట్టి మరికొంతమంది అధికారులు వుండాలి. అయితే కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే మొత్తం 3500 పరిశ్రమల్ని పర్యవేక్షిస్తున్నారు. తీవ్రమైన సిబ్బంది కొరత వుండడంతో కర్మాగారాల్లో భద్రతా తనిఖీలు, పర్యవేక్షణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. వారు కాసులకు కక్కుర్తిపడి తనిఖీలను మమ అనిపిస్తుంటారన్నది బహిరంగ రహస్యం.

కర్మాగారాల్లో కొత్త విభాగాల నిర్మాణాన్ని పర్యవేక్షించే అధికారం ఫ్యాక్టరీ చట్టంలో లేదని, అది లోపమని జిల్లా కలెక్టర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ అంటున్నారు. ఆ కారణంగానే హెచ్.పి.సి.ఎల్‌లో కొత్త విభాగంలో పని జరుగుతున్నపుడు తనిఖీ నిర్వహించలేకపోయామని చెబుతున్నారు. అది నిజమే కావచ్చు. కానీ ఉన్న అధికారాలను వినియోగించి పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలను పెంచి సిబ్బంది ప్రాణాలను కాపాడవచ్చు కదా. చిత్తశుద్ధి లోపం, రాజకీయాలు మరెన్నో వారి నిర్లిప్తతకు కారణాలు.

6. ప్రతి కర్మాగారంలో ఒక భద్రతా విభాగం వుంటుంది. ఈ విభాగంలోని అధికారులు సేఫ్టీ లేదా ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులై వుండాలి. కానీ ఇవి చాలాచోట్ల వివిధ విభాగాల్లో పనిచేసి అనారోగ్యానికి గురైన వారికీ, ప్రమాదాల్లో అంగవికలురైన వారికీ పునరావాస కేంద్రాలుగా మారాయి.

7. కర్మాగారాల్లో కాంట్రాక్టు కార్మికులకూ, అసంఘటిత కార్మికులకూ తగిన రక్షణ లేదు. భద్రత అంటే కేవలం హెల్మెట్, షూ, హ్యాండ్ గ్లోవ్స్ వంటి వ్యక్తిగత భద్రతా ఉపకరణాలపైనే దృష్టి పెడుతున్నారు. ఇతర రక్షణ వ్యవస్థల అవసరాన్ని పట్టించుకోవడం లేదు. ఇది డబ్బుతో కూడుకున్న పని. సేఫ్టీ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలు అమర్చుకోవాలి. ఒక వేళ ఇప్పటికే వుంటే వాటి పనితీరును పర్యవేక్షించుకోవాలి.

ఉదాహరణకి హెటరో డ్రగ్స్ కర్మాగారంలో ఒక పీడన మాపకం, ఒక సేఫ్టీవాల్వ్ ఉండి ఉంటే పేలుడు సంభవించేది కాదు. వీటి పనితీరును పట్టించుకున్న దాఖలాలు ప్రయివేటు పరిశ్రమల్లో అసలు కనిపించదు. పోనీ ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందా అంటే అదీ పూర్తిగా కొరవడింది. తనిఖీలు చేస్తే పరిశ్రమలు రాకుండా పోతాయని, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ప్రభుత్వం భయపెడుతుంది.

## నష్టపరిహారం కోసం అగచాట్లు

ఇదిలా ఉంటే మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కూడా పూర్తిగా అందని సందర్భాలు ఉన్నాయి. కంపెనీ రికార్డులలో పేర్లు నమోదు చేయకుండానే కార్మికులను కాంట్రాక్టరు లోనికి తెచ్చి పని చేయించుకుంటాడు. పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ. వంటి చట్టబద్ధ సదుపాయాలను ఎగవేయడానికి ఈ విధానం అవలంబిస్తారు. మేనేజ్‌మెంట్లు చూసీ చూడనట్లు ఉంటాయి. దీనివల్ల ఏదయినా ప్రమాదం జరిగినపుడు కార్మికులు నష్టపరిహారం కోసం రోడ్లు ఎక్కవలసి వస్తోంది. మొన్న రిఫైనరీ అగ్నిప్రమాదం జరిగిన తర్వాత ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల

సంఖ్యను చెప్పడంలో ఏర్పడ్డ గందరగోళం దీని ఫలితమే. విశాఖ ఉక్కు ప్రమాదంలో చనిపోయిన 8 మంది ప్రయివేటు కార్మికులకు ఇంకా నష్టపరిహారం అందలేదు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఇటీవలే స్థానిక న్యాయస్థానం కేసు దర్యాప్తు చేపట్టిందట. నిజానికి కర్మాగారంలో ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవిస్తే ఆ సంస్థ ఉన్నతాధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ దర్యాప్తు చేసి జరిమానా విధించాలి. ఈ జరిమానాలు చాలా హాస్యాస్పదంగా ఉంటాయి. చట్టం చదివితే ఇంత తక్కువ జరిమానాలా అనిపిస్తుంది. చాలా సందర్భాలలో జరిమానాలకు మాత్రమే ప్రభుత్వ విభాగాలు పరిమితమవడంతో పరిశ్రమల అధికారులలో తగినంత సీరియస్‌నెస్ వుండడం లేదు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ 2012-13 సంవత్సరానికి 5 కోట్లు జరిమానా చెల్లించింది. వారి టర్నోవర్లో ఇది ఆవగింజంత కూడా ఉండదు.

## అధునాతన బర్న్స్ ఆసుపత్రి విశాఖలో ఏర్పాటు చేయాలి

కాలిన గాయాలకు చికిత్స చేయడానికి తగిన ఆసుపత్రులు విశాఖపట్నంలో లేకపోవడం మరో విషాదం. ఇక్కడి పరిశ్రమలలో అగ్నిప్రమాదాలు జరిగి కాలిన గాయాలయిన వారు కింగ్ జార్జ్ ప్రభుత్వ ఆసుపత్రికి గాని, ప్రయివేటు ఆసుపత్రులకు గాని పోవాలి. వీటిలో చికిత్సా సౌకర్యాలు తగిన స్థాయిలో లేవు. ముంబైలో ఉన్నట్టుగా ప్రత్యేక బర్న్స్ ఆసుపత్రిని ఒకటి ఇక్కడ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. హెచ్‌పిసిఎల్‌లో ప్రమాదాలు జరిగిన రెండు సందర్భాల్లోనూ ఇలాంటి ఆధునిక ఆసుపత్రి లేని లోటు స్పష్టంగా కనిపించింది. స్టీల్ ప్లాంట్ ఆసుపత్రిలో ఉన్న బర్న్స్ వార్డ్ అత్యున్నతమైనదని అంటారు. నిజమే కాని అది కూడా వారి అవసరాలకు సరిపోలేదని జులైలో జరిగిన ప్రమాదం తెలియజెప్పింది. తీవ్రగాయాలయిన వారిని ముంబై పంపించాల్సి వచ్చింది. హెచ్‌పిసిఎల్ వారు కూడా 8 మందిని ముంబై పంపించారు. ఈ పరిస్థితి ఏర్పడకుండా విశాఖలోనే ఒక ఆధునిక బర్న్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే అక్కరకు వస్తుంది.

## ఇంకానా పరిశ్రమలు?

ఇప్పటికి ఉన్న పరిశ్రమలతోనే వేగలేకపోతుంటే కాకినాడ - విశాఖపట్నం తీరంలో పెట్రోలియం, కెమికల్, పెట్రోకెమికల్ పరిశ్రమల కారిడార్‌ను పెట్టాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అలానే పొరుగున ఉన్న కొవ్వాడలో అణువిద్యుత్తు కేంద్రాన్ని స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పటికే పరిశ్రమలకు నీటి కొరత ఉంది. కొత్తగా వచ్చే

పరిశ్రమలలో ఏదన్నా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆర్పేందుకు నీళ్ళు కూడా వుండవు. పైగా ప్రతిపాదనలో ఉన్న పరిశ్రమలన్నీ అగ్ని ప్రమాదాలకు ఎక్కువ అవకాశమున్న పెట్రోలియం, పెట్రోలియం ఆధారిత పరిశ్రమలే. ఇక కొవ్వాడలో ప్రతిపాదిత అణువిద్యుత్తు పరిశ్రమలో ఏదన్నా జరగరానిది జరిగితే ఆ నష్టం స్థానికంగా మాత్రమే పరిమితం కాదు. దాని దుష్ఫలితాలు ఎంత దూరానికి పాకుతాయో ఫుకుషిమా దుర్ఘటనే తెలియజెప్పింది.

– విశాఖ యూనిట్

## నిర్లక్ష్యానికి మూల్యం

# డ్రైనేజీ కార్మికుల మరణాలు

నగరాల్లో, పట్టణాల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులలో చాలామంది వారి ఉద్యోగ పరిమితి పూర్తికాక ముందే మరణిస్తున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. మురికి కాలువల్లో దిగడం, చెత్త ఎత్తి శుభ్రపరచడం లాంటి పనుల వల్ల చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతుంటారు. మన చెప్పుకో, బూటుకో ఎప్పుడైనా పొరపాటున మలం అంటితేనే దానిని శుభ్రపరచేవరకు మనకు ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాంటిది ఈ కార్మికులు ప్రతినిత్యం మురుగును ముట్టుకుంటారు. ఒంటికి, బట్టలకు అంటించుకుంటారు. ఆ దుర్గంధాన్ని పీలుస్తుంటారు. ఒక్క ముంబై మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో పనిచేస్తున్న కార్మికుల్లోనే దాదాపు రెండు వేలమంది దాకా యేటా ఈ వ్యాధుల బారినపడి మరణిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి.

ఇక నగరాల్లో మ్యాన్‌హోల్‌లలో దిగి పేరుకున్న చెత్తను తొలగించి ఆగిన నీటి ప్రవాహాన్ని సరిచేసే కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వారంతా కాంట్రాక్ట్ కార్మికులే. ఎందుకంటే దాదాపుగా 1990 నుండి మున్సిపల్ శాఖలో నియామకాలు నిలిపివేసారు. వాళ్ళకు శాశ్వత ఉద్యోగులకుండే రక్షణలేమీ ఉండవు. కాంట్రాక్టర్ కింద పనిచేస్తూ, మున్సిపల్ రికార్డులో ఎటువంటి స్థానం లేకుండా ఉంటారు. డ్రయినేజీని శుభ్రంచేసే పనులు, బయట చెత్తను శుభ్రపరిచే పనులు కూడా మునిసిపాలిటీలు కాంట్రాక్టర్‌లకు ప్రాంతాలవారీగా అప్పచెపుతాయి. వర్షాకాలం ప్రారంభమయేముందు డ్రయినేజీ కాలువల్లో నిండిన ఇసుక, మట్టి, చెత్తను తొలగించే పనులను కూడా కాంట్రాక్టర్లకే ఇస్తున్నారు. డ్రయినేజీలో దిగి పనిచేసే కార్మికులు విడిగా ఉంటారు. వాళ్ళంతా దళితులే. డ్రయినేజిలోకి

దిగినపుడు అనేక సందర్భాలలో వీరు విషవాయువులు పీల్చి మరణిస్తుంటారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం డ్రయినేజీ మ్యాన్‌హోల్స్‌లో దిగి 200 పైగా కార్మికులు మరణిస్తున్నారని పత్రికలు రాస్తున్నాయి. డ్రయినేజీలో మలం, చెత్త, ఇతర మురుగు పదార్థాలు ఇరుక్కుపోవడం వల్ల ఫర్మెంటేషన్ (మురిగిపోవడం) జరిగి మిథేన్, కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వాయువులు తయారవుతాయి. ఆక్సిజన్ శాతం చాలా తక్కువగా ఉంటుంది. కార్మికుడు మ్యాన్‌హోల్ మూత తొలగించి నడుముకు తాడు కట్టుకొని పారపట్టుకొని డ్రయినేజీలోకి దిగుతాడు. పైన చెప్పిన వాయువులు తక్కువ మోతాదులో ఉంటే పర్వాలేదు. కాని ఎక్కువగా ఉంటే....? మెదడులోని ప్రధాన రక్తనాళంలో రక్తం గడ్డకట్టి, కళ్ళు తిరిగి కిందపడి మురికి నీళ్ళు తాగి శ్వాస ఆడక మరణిస్తాడు. చాలా సందర్భాలలో మొదటి వ్యక్తి పైకి రాకపోవడంతో రెండవ వ్యక్తి దిగి ఆయన కూడా స్పృహ కోల్పోవడమో, మరణించడమో జరుగుతుంది. గత రెండు నెలల్లో మన రాష్ట్రంలో విశాఖలో ఇద్దరు, ఖమ్మంలో ఇద్దరు, హైదరాబాద్‌లో ముగ్గురు ఇదేవిధంగా మరణించారు. జూన్ నెలలో కర్మన్‌ఘాట్ దగ్గర డ్రయినేజీలోకి దిగిన మధు అనే కార్మికుడు పైకి రాకపోవడంతో శేఖర్, యాదయ్య అనే మరో ఇద్దరు కార్మికులను పురమాయించి కాంట్రాక్టర్ డ్రయినేజీ కాలువలోకి దించాడు. ముగ్గురూ పైకి రాకపోవడంతో ప్రమాదం జరిగిందని గ్రహించి అగ్నిమాపకదళ సిబ్బంది సహాయంతో వారిని పైకి తీసారు. మధు అప్పటికే లోపల మరణించి పడి ఉన్నాడు. అపస్మారక స్థితికి చేరుకున్న శేఖర్, యాదయ్యలను హాస్పిటల్‌లో చేర్పించారు. వారం రోజుల తర్వాత శేఖర్ చనిపోయాడు, ఇంకొక వారం తర్వాత యాదయ్య కూడా మరణించాడు.

ఈ మరణాలకు మున్సిపల్‌శాఖ బాధ్యత వహించదు. ఎటువంటి నష్టపరిహారం చెల్లించదు. రెండేళ్ళక్రితం చాంద్రాయణగుట్ట రోడ్డులో ఇట్లాగే ఇద్దరు కార్మికులు డ్రయినేజీలో దిగి మరణించినప్పుడు మానవహక్కుల వేదిక కార్యకర్తలు మున్సిపల్ అధికార్లను నిలదీస్తే, మాకు సంబంధం లేదంటూ ఒక కాంట్రాక్టర్ పేరు చెప్పారు. ఆ కాంట్రాక్టర్ దగ్గరికి వెళ్తే, ఆ పనిని తను వేరే ఒక చిన్న కాంట్రాక్టర్‌కు బదిలీ చేసానని చెప్పాడు. ఆ చిన్న కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెట్టి అతికొద్ది నష్టపరిహారం మాత్రమే ఇప్పించగలిగారు. గ్రామాలల్లో పాతబావిలో పూడిక తీయాలన్నా, ఏదైనా రిపేరు చేయించాలన్నా ముందుగా ఒక కోడిపిల్లకు గాని, లాంతరుకు గాని తాడు కట్టి లోపలికి వదులుతారు. కోడిపిల్ల మూర్ఛపోయినా, లాంతరు ఆరిపోయినా బావిలో విషవాయువులు ఉన్నాయని జాగ్రత్త పడతారు. మున్సిపల్

అధికార్లకు గాని, కాంట్రాక్టర్‌కు గాని ఆ గ్రామస్తులకున్న తెలివి కూడా ఉండడం లేదు. ముందుజాగ్రత్త అసలే లేదు. సివరేజ్ పనులు చేసే వారికి లాంగ్ బూట్లు, గట్టి రబ్బర్ గ్లౌజ్‌లు, ఆక్సిజన్ మాస్క్‌లు ఇవ్వాలనే నియమాలు ఉన్నాయి. డ్రయినేజీ లోపలికి దిగి పనిచేసే వారికి ప్రత్యేకమయిన శిక్షణా పద్ధతులు కూడా ఉన్నాయి. కాని ఇటువంటి జాగ్రత్తలు ఏమీ తీసుకోకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్మికుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు.

ప్రస్తుతం డ్రయినేజీని శుభ్రపరచడానికి ప్రెషర్ ద్వారా చెత్తను తొలగించి, నీటిని పైకి లాగే యంత్రాలు ఉన్నాయి. కాని ఈ యంత్రాలు అడ్డంగా ఉన్న చెత్తను, ఘనపదార్థాలను తొలగించలేవు. నాలుగు సంవత్సరాల క్రితం మద్రాసు ఐఐటి సంస్థ చెత్తను కూడా తొలగించే ఒక యంత్రాన్ని తయారుచేసి, దాని నమూనాను కేంద్రప్రభుత్వానికి పంపించింది. కాని ప్రభుత్వం దానిపై శ్రద్ధ చూపలేదు. మద్రాసు హైకోర్టులో, గుజరాత్ హైకోర్టులో, సుప్రీంకోర్టులో ఈ విషయంపై ప్రజాప్రయోజనాల కేసులను వేశారు. ప్రభుత్వం ఏవో మార్గదర్శకాల్ని తయారుచేసామని, అవి అమలు పరుస్తామని కోర్టులకు హామీలైతే ఇచ్చింది కాని వాస్తవంగా ఏమీ జరగలేదు.

మన ఆరోగ్యం కోసం మనం నివసించే ప్రాంతాల్నీ, పట్టణాల్ని పరిశుభ్రంగా ఉంచే పనిలో పారిశుద్ధ్య కార్మికులు బలిదానాలు చేస్తూనే వున్నారు. వీళ్ళగురించి ఏ కార్మిక సంఘం పట్టించుకోవడం లేదు. అన్యాయంగా ఆరిపోతున్న ఆ బ్రతుకుల గురించి మనం ఏమి చేయగలమో ఆలోచించండి

– ఎస్. జీవన్‌కుమార్

ఆత్మహత్యల పరంపర

# పరిహారం దక్కని వేలాది రైతు కుటుంబాలు

ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వలన గత 18 సంవత్సరాలుగా దేశంలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ వున్నారు. ప్రకృతి పరంగా ఎదురు దెబ్బలు తినటం రైతులకు సహజమే కాని విత్తనాలు, ఋణాల దగ్గరనుంచి గిట్టుబాటు ధరల దాకా ప్రతి అంశంలోను రైతు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావడం మాత్రం పాలకుల పాపమే. వ్యవసాయంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకునే విధంగా, వ్యవసాయం లాభసాటిగా వుండే విధంగా రైతులకు ఒక మద్దతు వ్యవస్థ ఏర్పాటు చేయటం ప్రభుత్వ కర్తవ్యం. తక్కువ వడ్డీకి పంట ఋణాలు, పండిన పంటలకు సరైన ధరలు, కౌలు రైతులకు గుర్తింపు, సాగునీటి సౌకర్యం, వర్షాధారిత ప్రాంతాల వ్యవసాయానికి ప్రత్యేక సహకారం, పంటల బీమా, పశు సంరక్షణ వ్యవస్థ, ఆయా ప్రాంతానికి అనువైన పంటలు పండించేందుకు సలహాలు, మార్కెటింగ్ సదుపాయాలు – ఇవన్నీ కల్పించినప్పుడే రైతన్నల, రైతక్కల కష్టానికి ఫలితం ఉంటుంది. అయితే గత 18 సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఈ విధమైన మద్దతు వ్యవస్థను కల్పించడంలో, రైతు అనుకూల విధానాలను చేపట్టడంలో విఫలమయ్యాయి.

మరొక వైపు హరిత విప్లవంలో భాగంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపు మందుల వినియోగం విపరీతంగా పెరగడం, రెండు మూడు రకాల పంటలకు మాత్రమే ప్రోత్సాహం లభించడం, వర్షాధారిత వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చెయ్యడంతోపాటు భూసారం దెబ్బతినడం, పంటపొలాలు, పరిసరాలు విషతుల్యం కావటం, నీటి వనరులు తగ్గిపోవడం రైతులను కృంగదీస్తున్నాయి. ఈ విధంగా రాష్ట్ర జనాభాలో 60 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న, దేశప్రజలందరికీ

అన్నం పెడుతున్న అతి ముఖ్యమైన రంగం సంక్షోభంలో పడింది. దీని ఫలితమే రైతు ఆత్మహత్యలు. ఒక్క మన రాష్ట్రంలోనే 1995 నుండి 2012 వరకు 35,898 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఆత్మహత్యలు ముఖ్యంగా నీటిపారుదల సౌకర్యం లేని మెట్ట ప్రాంతాలలో, మరీ ముఖ్యంగా తెలంగాణ జిల్లాలలోను, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాలలోను ఎక్కువగా జరిగాయి. రెండవ సంవత్సరం కూడా పంట నష్టపోవడం, బోర్లు విఫలం కావటం, బ్యాంకు రుణాలు దొరకక అధిక వడ్డీపై వడ్డీ వ్యాపారుల నుండి, ఇతరుల నుండి అప్పులు తీసుకొని వేధింపులకు గురికావటం, పంట ధరలు పడిపోవటం ఈ ఆత్మహత్యలకు తక్షణ కారణాలుగా కనబడుతున్నాయి.

## రైతు ఆత్మహత్యగా గుర్తించాలంటే...

జీవో 421 ప్రకారం రైతు ఆత్మహత్య గురించిన సమాచారం పోలీసులకు అందిన వెంటనే దానిని సి.ఆర్.పి.సి. సెక్షన్ 174 (అనుమానాస్పద మృతి) కింద నమోదు చేయాలి. పోలీసులు నమోదు చేసిన తర్వాత మండల స్థాయి రెవిన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులు ఆత్మహత్య జరిగిన కుటుంబం వద్దకు వచ్చి రైతు ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకోవాలి. (పంట నష్టం, బోర్లు విఫలం కావటం గురించి వాకబు చేయటం, అప్పులిచ్చిన వారిని విచారించటం వగైరా) కాని చాలా సందర్భాలలో అధికారులు రైతు కుటుంబం దగ్గరికి రాకుండా వి.ఆర్.ఒ (గ్రామ రెవిన్యూ అధికారి) లేదంటే ఆర్.ఐ. (రెవిన్యూ ఇన్‌స్పెక్టర్)ని మాత్రమే పంపుతారు. వారు పూర్తి స్థాయి విచారణ చేయకుండానే ఇది భార్యాభర్తల గొడవని, అతనికున్న అప్పు బిడ్డ పెళ్లి కోసం చేసిందని లేదా గృహ నిర్మాణం కోసమో, కొడుకు చదువు గురించో చేసిన అప్పు అనే అభిప్రాయానికి వచ్చి ఇది రైతు ఆత్మహత్య కిందికి రాదు అనే నిర్ధారణకు వస్తారు. పోలీసులు దాన్ని రైతు ఆత్మహత్యగా నమోదు చేసుకున్నప్పటికీ రెవిన్యూ అధికారులు మాత్రం దానిని రైతు ఆత్మహత్యగా పరిగణనలోకి తీసుకోరు.

రైతు ఆత్మహత్యను ప్రభుత్వం గుర్తించాలంటే దానికి 13 రకాల డాక్యుమెంట్‌లు ఇవ్వాలి. అవి 1) ఎఫ్.ఐ.ఆర్. 2) గ్రామ పంచనామా 3) పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ 4) పోలీస్ ఫైనల్ రిపోర్ట్ 5) ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ 6) మూడు సంవత్సరాల సాగు పహాణి 7) పట్టాదారు పాస్‌బుక్ 8) ప్రైవేటు అప్పులకు సాక్ష్యాలు 9) బ్యాంక్ అప్పుల కాగితాలు 10) నామినీ పత్రము 11) రేషన్ కార్డు 12) మండల్ లెవెల్ వెరిఫికేషన్ కమిటీ రిపోర్ట్ 13) డివిజనల్ లెవెల్ వెరిఫికేషన్ కమిటీ రిపోర్ట్.

## రైతు ఆత్మహత్య జరిగిన వెంటనే ఏం చేయాలి

వాస్తవానికి రైతు ఆత్మహత్య జరగటం అత్యంత బాధాకరమైన విషయం. కాని ప్రభుత్వ విధానాలవల్ల, ప్రకృతి కరుణించక, పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. రైతు ఆత్మహత్య జరిగిన వెంటనే గ్రామంలోని అందరూ వారికి బాసటగా నిలవాలి. పోలీసులకు సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత ఏ కారణాల వల్ల రైతు ఆత్మహత్య జరిగిందో వివరించాలి. (ఉదా : బోర్లు విఫలం, వర్షాలు లేక పంటలు ఎండిపోవడం, అప్పులవాళ్ల ఒత్తిడి వగైరా) తర్వాత రెవిన్యూ అధికారులకు సమాచారం అందించి, అధికారులతో విచారణ జరిపించి, వాస్తవాలను నమోదు చేయించి ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందేటట్లు చూడాలి. ఆ కుటుంబానికి పునరావాసం కల్పించే ప్రయత్నాలు చేయాలి. కుటుంబంలోని పిల్లల చదువు ఆగకుండా దగ్గరలోని గురుకుల పాఠశాలలో గాని, స్వచ్ఛంద సంస్థలు నడిపే పాఠశాలలో గాని చేర్పించే బాధ్యత తీసుకోవాలి. ఆ గ్రామంలో మరొక ఆత్మహత్య జరగకుండా అధికారులు ప్రణాళిక తయారు చేయాలి.

ఈ పదమూడు డాక్యుమెంట్స్‌తో డి.ఆర్.ఒ. (జిల్లా రెవిన్యూ అధికారి) కార్యాలయానికి ఫైలు వెళితే అప్పుడు ఆ కుటుంబానికి లక్ష రూపాయల పరిహారం, అప్పుల వారికోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద 50 వేల రూపాయలు అందుతాయి. కాని చాలా సందర్భాలలో బాధిత కుటుంబాల ఫైలు మండల స్థాయి కార్యాలయం దాటి డివిజన్ స్థాయికి వెళ్లదు. నిజానికి 421 జీవో ప్రకారం ఈ వ్యవహారమంతా జరగనవసరం లేదు. రైతు ఆత్మహత్య జరిగిన తర్వాత ఆర్.డి.ఒ. (రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్) ఆ కుటుంబం దగ్గరికి వెళ్లి విచారించి రైతు ఆత్మహత్య అవునో కాదో నిర్ధారిస్తే సరిపోతుంది. కాని ఎక్స్‌గ్రేషియాకు ఎగనామం పెట్టడానికే ఇన్ని రకాల నిబంధనలు విధించారు. రాష్ట్రంలో ఈ 18 సంవత్సరాల కాలంలో (1995 నుంచి 2012 వరకు) 35,898 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 421 జీవో ప్రకారం ఎక్స్‌గ్రేషియా అందిన కుటుంబాలు 5696 మాత్రమే. అంటే ఎక్స్‌గ్రేషియా అందుకున్న కుటుంబాలు కేవలం 16%. మిగిలిన 84% కుటుంబాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనీసం ఆ మాత్రం ఎక్స్‌గ్రేషియాకు కూడా నోచుకోవడం లేదు.

### కోర్టులో కేసు

మెదక్ జిల్లాలో 1995 నుండి ఇప్పటి వరకు 1492 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 393 మందికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా అందించారని, మిగతా వారికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్స్‌గ్రేషియా అందలేదని చెపుతూ దీని మీద

సమగ్ర విచారణ జరిపి అన్ని రైతు ఆత్మహత్య కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త పాకాల శ్రీహరిరావు 2011లో హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పి.ఐ.ఎల్) వేశారు. దానిని పరిశీలించిన హైకోర్ట్ 1998 నుండి జరిగిన అన్ని రైతు ఆత్మహత్యలను విచారించి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు తీర్పు ఆధారంగా జిల్లాలోని 3 డివిజన్‌లలో (మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి) కలిపి 654 రైతు ఆత్మహత్య ఘటనలపై పునర్విచారణ జరిపించి అందులో 125 కుటుంబాలకు మాత్రమే ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయమని అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదికలు పంపారు. వాటిలో కూడా 16 మందికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా చేతికి అందింది. కోర్టు పునర్విచారణ చేయవలసిందిగా కోరినప్పటికీ అధికారులు ఇదివరకు చేసిన విచారణ రిపోర్ట్‌నే మళ్లీ పంపి ఊరుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉన్నందున హైకోర్ట్ తీర్పును రాష్ట్రమంతటికీ వర్తింపజేసి అన్ని రైతు ఆత్మహత్యలను పునర్విచారణ చేయాలని బాధిత కుటుంబాలవారు, హక్కుల కార్యకర్తలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలకు ఎదురవుతున్న సమస్యలు

1. ఆత్మహత్య చేసుకుంటున్న రైతు సగటు వయస్సు 36 సంవత్సరాలు ఉంటోంది. ఆ వయస్సుకి వారి పేరున భూమి ఉండదు.
2. మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్నప్పుడు వారి పేరు మీద భూమి ఉండదు, అప్పుల కాగితాలూ ఉండవు.
3. కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు కౌలునామాలు ఉండవు.
4. రైతులకు అప్పులు ఎక్కువగా ఎరువులు మరియు క్రిమిసంహారక మందుల దుకాణంలో ఉంటాయి. వాటికి కాగితాలు ఉండవు.
5. రైతులు తమ కుటుంబాలలోని మహిళల దగ్గర ఉండే చిన్న, చిన్న ఆభరణాలు (బంగారం, వెండి) కుదువ పెట్టి అప్పు తెచ్చుకుంటారు. వాటికి కాగితాలు ఉండవు.
6. అప్పు ఇచ్చిన వారు విచారణ సమయంలో అధికారుల దగ్గరికి రావటానికి ఇష్టపడరు.
7. కొన్ని సందర్భాలలో చిన్న వయస్సులోనే భర్తను కోల్పోవటంతో ఆ మహిళ తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లిపోతుంది. అటువంటి సందర్భంలో డిపెండెంట్ (వారసత్వపు) సర్టిఫికెట్ బాధితుడి తల్లిదండ్రులకు అధికారులు ఇవ్వరు.

## రైతుల ఆత్మహత్యల కేంద్రంగా బిజినేపల్లి

మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లి మండలం గత **6** సంవత్సరాలుగా రైతు ఆత్మహత్యల కేంద్రంగా మారింది. గత ఆరు సంవత్సరాలలో ఈ మండలంలో **102** మంది రైతులు, ఇందులో ఒక్క **2012** లోనే **24** మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మండలంలోని కారుకొండ అనే ఒక్క గ్రామంలోనే **8** మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో భూంపెల్లి కృష్ణారావు ఒకరు. కృష్ణారావు పొలం పక్కనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువ వెళుతుంది. కాని కాలువలో నీరు లేదు. జలయజ్ఞం పనులు సక్రమంగా జరిగి కాలువలకు నీళ్లు వచ్చి ఉంటే కారుకొండ గ్రామంలో కాని, బిజినేపల్లి మండలంలో కాని ఇన్ని ఆత్మహత్యలు జరిగి ఉండేవి కావు. ఇన్ని ఆత్మహత్యలు జరిగినప్పటికీ హక్కుల సంఘాలు వెళ్లే వరకు ప్రభుత్వం ఒక్క రైతు ఆత్మహత్యనూ గుర్తించలేదు.

8. ఎఫ్.ఎల్.ఎస్. రిపోర్టు (ఫోరెన్సిక్ సైంటిఫిక్ ల్యాబ్) చాలా ఆలస్యం అవుతుంది.

ఈ కారణాల వల్ల కూడా చాలామంది రైతు ఆత్మహత్య కుటుంబాలు 421 జీవో ప్రకారం ఎక్స్‌గ్రేషియాకు నోచుకోవటం లేదు. ఎక్స్‌గ్రేషియా అందించటంలో అవసరమైనప్పుడు అర్హత నిబంధనలను మినహాయించాలని 421 జీవో చెబుతుంది. కాని అధికారులు మాత్రం ఒక్క డాక్యుమెంట్ లేకపోయినా ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయటం లేదు.

### ఏ కులాలలో ఎక్కువ?

రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా కులవృత్తులను నమ్ముకున్న ముదిరాజ్, గొల్ల, కురుమ, కుమ్మరి, కమ్మరి, చాకలి సామాజిక వర్గానికి చెందిన వారిలో, అలాగే దళిత, గిరిజన వర్గాలలో జరుగుతున్నాయి. వీరు ఒకప్పుడు కుల వృత్తి ప్రధాన ఆదాయ వనరుగా ఉండి, ఒకటి లేదా రెండు ఎకరాలలో వ్యవసాయం చేసుకొనేవారు. కాలక్రమంలో కులవృత్తులకు ప్రాధాన్యం తగ్గటంతో ఈ కుటుంబాలవారు ఉన్న ఎకరా, రెండు ఎకరాలలో వ్యవసాయం లాభసాటిగా చేయలేక దానికి తోడు మరో 3 లేదా 4 ఎకరాలు కౌలుకి తీసుకొని సాగు చేస్తున్నారు. వీరికి విత్తనం దగ్గరినుండి సమస్యలు మొదలవుతున్నాయి. విత్తన ఉత్పత్తి, అమ్మకాలు బహుళ జాతి కంపెనీల చేతుల్లోకి పోవటంతో రైతులకు వారి దగ్గర నుండి కొనటం మినహా వేరే దారి లేకుండా పోయింది. ఉదాహరణకు

మహికో కంపెనీ వారి 450 గ్రాముల బి.టి. విత్తనాల ధర 930 రూపాయలు ఉంటే వాటిని బ్లాక్ మార్కెట్‌లో 1800 రూపాయలకు కొనవలసి వస్తోంది. నీటి పారుదల సౌకర్యం పూర్తిగా దైవాధీనమైపోయింది. రైతులు ఏదో ఒక విధంగా నీటి సౌకర్యం కావాలని బోర్ల కోసం ప్రయత్నించి విఫలమవుతున్నారు. ఒక్కొక్క రైతు సగటున 3 బోర్లు వేస్తే లక్ష రూపాయల ఖర్చు అవుతోంది. నీళ్లు పడ్డాయని మోటర్ బిగించుకొని విద్యుత్ కనెక్షన్ తీసుకున్న తర్వాత ఒక్కోసారి నీళ్లు వచ్చి ఆగిపోతున్నాయి. దాంతో రుణభారం మరింత ఎక్కువ అవుతోంది.

## ఇక రుణాల విషయానికొస్తే

ప్రభుత్వ బ్యాంక్‌లు రైతులకు రుణాలు ఇవ్వటంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నాయి. పంటలకు అయ్యే ఖర్చులో కనీసం మూడవ వంతు రుణాన్ని కూడా సమకూర్చలేక పోతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ప్రతి జాతీయ బ్యాంక్ తానిచ్చే రుణాలలో 18% కచ్చితంగా వ్యవసాయానికి కేటాయించాలి. కాని అది ఏ మాత్రం అమలు కావడం లేదు. దాంతో రైతులు రుణాల కోసం వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించవలసి వస్తున్నది. వారు సగటున 30% వడ్డీని వసూలు చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు సరిగా లేకపోవడంతో సరైన సలహాలు ఇచ్చేవారు లేక పత్తికి అనుకూలంగా లేని భూముల్లో రైతులు పత్తి సాగుచేశారు. వాతావరణ పరిస్థితులలో మార్పు వల్ల అతివృష్టి, అనావృష్టి ఏర్పడి పంటలు దెబ్బతినడం, వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడం కారణంగా వారు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవలసి వస్తున్నది. పెరిగిన కుటుంబ అవసరాల రీత్యా (విద్య, వైద్యం) వాణిజ్య పంటల వైపు వెళ్లవలసి రావడం కూడా రైతు ఆత్మహత్యలకు ఒక ప్రధాన కారణం. ఇప్పటికీ ఆహార పంటలు మాత్రమే సాగు చేస్తున్న జహీరాబాద్, నారాయణ్‌పేట లాంటి ప్రాంతాలలో, పంట వైవిధ్యం ఎక్కువగా కనిపించే ఉత్తరాంధ్ర జిల్లాలలో రైతుల ఆత్మహత్యలు తక్కువగా కనిపిస్తాయి. దీనికి భిన్నంగా బోర్లపై ఆధారపడి, ఒకే పంట సాగు చేస్తున్న (పత్తి, వేరుశనగ) తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా కనిపిస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుండి కౌలు రైతుల ఆత్మహత్యలు పెరగడం మరో గమనించదగ్గ అంశం. కౌలు రేట్లు విపరీతంగా పెరుగుతూ పోవటం, వారికి ప్రభుత్వం, బ్యాంక్‌ల నుండి ఏమాత్రం సహకారం లేకపోవడంతో పంటల్లో నష్టం వచ్చినప్పుడు వారు తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి.

| రాష్ట్రాలవారీగా 1995 నుండి 2011 వరకు జరిగిన రైతు ఆత్మహత్యలు | | | |
|---|---|---|---|
| సంఖ్య | రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం | ఆత్మహత్యలు | ప్రతి లక్షమందిలో ఎందరు |
| 1 | మహారాష్ట్ర | 53818 | 48 |
| 2 | కర్ణాటక | 37153 | 61 |
| 3 | ఆంధ్రప్రదేశ్ | 33326 | 39 |
| 4 | మధ్యప్రదేశ్ | 28048 | 39 |
| 5 | పశ్చిమ బెంగాల్ | 20138 | 22 |
| 6 | కేరళ | 19737 | 59 |
| 7 | తమిళనాడు | 14498 | 20 |
| 8 | ఛత్తీస్‌గఢ్ | 14340 | 56 |
| 9 | ఉత్తరప్రదేశ్ | 10015 | 5 |
| 10 | రాజస్థాన్ | 9533 | 14 |
| 11 | గుజరాత్ | 9361 | 15 |
| 12 | ఒరిస్సా | 4604 | 11 |
| 13 | అస్సాం | 3878 | 12 |
| 14 | హర్యానా | 3204 | 13 |
| 15 | పుదుచ్చేరి | 1578 | 127 |
| 16 | పంజాబ్ | 1361 | 5 |
| 17 | బీహార్ | 1318 | 1 |
| 18 | త్రిపుర | 1155 | 31 |
| 19 | జార్ఖండ్ | 932 | 3 |
| 20 | హిమాచల్‌ప్రదేశ్ | 677 | 10 |
| 21 | సిక్కిం | 389 | 64 |
| 22 | ఉత్తరాఖండ్ | 343 | 3 |
| 23 | ఢిల్లీ | 268 | 2 |
| 24 | దాద్రా నాగర్‌హవేలి | 260 | 76 |
| 25 | అరుణాచల్ ప్రదేశ్ | 201 | 15 |
| 26 | జమ్మూ కాశ్మీర్ | 201 | 2 |
| 27 | గోవా | 171 | 12 |
| 28 | మేఘాలయ | 156 | 5 |
| 29 | అండమాన్ నికోబార్ దీవులు | 150 | 39 |
| 30 | మిజోరం | 71 | 6 |
| 31 | నాగాలాండ్ | 25 | 1 |
| 32 | మణిపూర్ | 20 | 1 |
| 33 | డామన్ డయ్యూ | 6 | 2 |
| 34 | చండీగఢ్ | 5 | 0 |

| జిల్లాలవారీగా 1999 నుండి 2011 వరకు జరిగిన రైతు ఆత్మహత్యలు | | | | |
|---|---|---|---|---|
| జిల్లా పేరు | ఆత్మహత్యలు | లక్షమందిలో ఎందరు | పరిహారం అందినవి | జనాభా లక్షల్లో |
| హైదరాబాద్ | 912 | 23 | 0 | 39.43 |
| రంగారెడ్డి | 1977 | 37 | 266 | 52.96 |
| మహబూబ్‌నగర్ | 1922 | 47 | 372 | 40.53 |
| నల్గొండ | 1887 | 54 | 343 | 34.88 |
| నిజామాబాద్ | 2786 | 109 | 195 | 25.51 |
| మెదక్ | 1474 | 49 | 394 | 30.33 |
| వరంగల్ | 2906 | 83 | 679 | 35.12 |
| ఖమ్మం | 1181 | 42 | 132 | 27.97 |
| కరీంనగర్ | 4433 | 117 | 602 | 37.76 |
| ఆదిలాబాద్ | 601 | 22 | 415 | 27.41 |
| కర్నూల్ | 1247 | 31 | 553 | 40.53 |
| కడప | 195 | 7 | 122 | 28.82 |
| అనంతపూర్ | 2496 | 61 | 780 | 40.81 |
| చిత్తూరు | 661 | 16 | 157 | 41.74 |
| గుంటూరు | 590 | 12 | 251 | 48.87 |
| నెల్లూరు | 31 | 1 | 31 | 29.63 |
| ప్రకాశం | 559 | 16 | 110 | 33.97 |
| పశ్చిమ గోదావరి | 1138 | 29 | 11 | 39.36 |
| తూర్పు గోదావరి | 734 | 14 | 53 | 51.54 |
| కృష్ణ | 1184 | 26 | 67 | 45.17 |
| విశాఖపట్నం | 315 | 7 | 33 | 42.90 |
| శ్రీకాకుళం | 243 | 9 | 11 | 27.03 |
| విజయనగరం | 238 | 10 | 2 | 23.50 |

| సంవత్సరాలవారీగా రైతు ఆత్మహత్య కేసుల, పరిహారం అందిన కేసుల వివరాలు | | |
|---|---|---|
| సంఖ్య | ఆత్మహత్యలు | పరిహారం లభించిన కేసులు |
| 1995 | 1196 | 0 |
| 1996 | 1706 | 0 |
| 1997 | 1097 | 0 |
| 1998 | 1813 | 104 |
| 1999 | 1974 | 180 |
| 2000 | 1525 | 191 |
| 2001 | 1509 | 256 |
| 2002 | 1896 | 323 |
| 2003 | 1800 | 304 |
| 2004 | 2666 | 1182 |
| 2005 | 2490 | 655 |
| 2006 | 2607 | 557 |
| 2007 | 1797 | 493 |
| 2008 | 2105 | 470 |
| 2009 | 2414 | 299 |
| 2010 | 2525 | 188 |
| 2011 | 2206 | 141 |
| 2012 | 2572 | 93 |

## మహిళల పరిస్థితి దయనీయం

రైతు ఆత్మహత్యల కుటుంబాలలో 30 సంవత్సరాలకే భర్తను కోల్పోయిన మహిళలు ఉంటే ఆ మహిళలు తమ భర్తలది నిజమైన రైతు ఆత్మహత్యలు అని నిరూపించుకోవటానికి ఎం.ఆర్.ఒ, ఆర్.డి.ఒ. మరియు కలెక్టర్ ఆఫీసుల చుట్టూ సగటున 20 సార్లయినా తిరగాల్సి వస్తోంది. అయినా ఫలితం లేకపోవడం మరింత బాధాకరం. అప్పులవాళ్ల ఒత్తిడి తట్టుకోలేక, పిల్లలను పోషించుకోలేక ఆమె కూడా ఆత్మహత్య చేసుకోవలసి రావటమో లేక ఆకలి చావుకు గురికావటమో జరిగితే పిల్లలు అనాథలుగా మారుతున్నారు. ఈ బాధిత కుటుంబాలకూ ఆహార భద్రత కోసం నెలకు 35 కేజీల బియ్యం ఇచ్చే అంత్యోదయ కార్డులను కూడా మంజూరు చేయటం లేదు. దాంతో బాధిత కుటుంబాలలోని పిల్లలు గ్రామీణ ఉపాధి హామీ పనికి వెళుతూ లేదా పెట్రోలు బంకుల్లో, బేకరీలలో, వెల్డింగ్ షాపుల్లో పనిచేస్తూ,

తామే కుటుంబాన్ని పోషించవలసి వస్తున్నది. ఆడపిల్లలు ఉంటే బంధువులు కూడబలుక్కుని కనీసం మాధ్యమిక విద్య కూడా పూర్తవక ముందే పెళ్లిళ్లు చేస్తున్నారు. ఇంత ప్రతికూల పరిస్థితులలో కూడా కొంత మంది మహిళలు మాత్రం పోరాడి తమ హక్కును సాధించుకుంటున్నారు. వారిలో బాలలక్ష్మి గురించి చెప్పుకోవాలి.

## 11 ఏళ్లు పోరాడిన బాలలక్ష్మి

మెదక్ జిల్లా తొగుట మండలం బంజేరుపల్లి గ్రామానికి చెందిన బెజగామ సాయిలు 3 బోర్లు ఫెయిలై, వేసిన బెండ, టమాట, మిర్చి పంటల్లో నష్టం వచ్చి అప్పుల వాళ్ల ఒత్తిడికి తట్టుకోలేక 21.2.2000 నాడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికి బాలలక్ష్మికి ఇద్దరు చిన్న పిల్లలు భవాని (2), వాణి (4 నెలలు). వారిని తీసుకునే మండల కార్యాలయం చుట్టూ తిరుగుతూ తనకు న్యాయం చేయమని అధికారులను కోరింది. కాని అధికారులు ప్రభుత్వం నుండి ఏ సహాయం అందదని తేల్చి చెప్పారు. తర్వాత ప్రజాసంఘాల, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకొని తనకు ఏ కారణాల చేత 421 జీవో కింద రావాల్సిన ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదో తెలుపమని కోరింది. దాంతో అధికారులు మళ్లీ విచారణ చేసి ఆమె భర్త మరణాన్ని రైతు ఆత్మహత్యగా గుర్తించారు. 11 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత బాలలక్ష్మికి 2011 ఫిబ్రవరిలో ఎక్స్‌గ్రేషియా చేతికి అందింది. ప్రస్తుతం బాలలక్ష్మి చిన్న కిరాణా షాపు నడుపుకుంటోంది. పిల్లలు భవాని (10వ తరగతి), వాణి (8వ తరగతి) చదువుకుంటున్నారు. తనకు రావాల్సిన హక్కు కోసం 11 సంవత్సరాలు పోరాడి సాధించిన బాలలక్ష్మి మిగతా రైతు ఆత్మహత్యల కుటుంబాలలోని బాధిత మహిళలకు ఆదర్శంగా నిలిచింది.

ఈ విధంగా బాధిత మహిళలు తమ హక్కు కోసం పోరాటం చేస్తూ ఉంటే రాజకీయ పార్టీలు గాని, వాటి అనుబంధ రైతు సంఘాలు గాని ఆ కుటుంబాలకు కనీస సహాయం అందించడానికి కూడా ముందుకు రాకపోవడం బాధాకరం. మేము ఇప్పటి వరకు 600 రైతు ఆత్మహత్య కుటుంబాలను స్వయంగా కలిస్తే కేవలం 5 కుటుంబాల వాళ్లు మాత్రమే మా దగ్గరికి రాజకీయ పార్టీలు వచ్చాయి, మమ్మల్ని ఆర్.డి.ఒ. ఆఫీసు దాకా తీసుకెళ్లాయని చెప్పారు. ఏ పార్టీ కూడా వీరి గురించి కార్యక్రమం తీసుకోలేదు. కొన్నిసార్లు స్థానిక శాసన సభ్యులు ఎన్.ఎఫ్.బి.ఎస్. (జాతీయ కుటుంబ ప్రయోజన పథకం) కింద వచ్చే 5000

రూపాయలను తమ వ్యక్తిగత డబ్బులాగా ఇచ్చివెళుతున్నారు. మళ్లా ఆ కుటుంబం గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వారి పార్టీ అజెండాలలో ఈ విషయాలకు అసలు చోటుండదు. కొద్దిమంది రాజకీయ నాయకులు, అధికారులు మాత్రమే దీనికి మినహాయింపు.

ఏ సమస్యలకు తట్టుకోలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడో ఆ సమస్యలన్నిటితో పాటు భర్త మరణమనే విషాదాన్ని కూడా భరించవలసి వస్తోన్న ఆ ఇల్లాళ్లకు ఈ కొంచెం సహాయం అందించడంలో కూడా ప్రభుత్వం ఇంత జాప్యం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఎలా? మొత్తం కన్నీళ్లన్నీ ఎండిపోయేదాకా కంటితుడుపు చర్యలు కూడా మొదలుపెట్టకపోవడం ఎంత అమానవీయం?

బి. కొండల్ రెడ్డి

సి.సి.సి – రైతు స్వరాజ్య వేదిక

## కల్తీ కల్లు

# మత్తు బదులు మరణాన్నిచ్చింది

షేక్‌బాబా నిజామాబాద్‌లో అల్లం మురబ్బా అమ్ముకుంటాడు. మొహమ్మద్ ఫిరోజ్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుడు. మహమూద్ రిక్షా తొక్కుతాడు. వెన్ను శ్రీనివాస్ అడ్డాకూలీ. రాజ్‌కుమార్ భవన నిర్మాణ కార్మికుడు. గండికోట సాయిబాబా రాళ్ళు కొట్టే కూలీ. ర్యాపాని సురేష్ కూడా రాళ్ళు కొట్టే కార్మికుడే. ఉల్లెంగ గణేశ్ ఇళ్లల్లో పాలరాతి బండలను పరిచి వాటిని నునుపు చేసే కూలీ. వీళ్ళంతా నిజామాబాద్‌లో ఉండేవాళ్ళే. వీళ్ళంతా ఆయా పనులు చేసుకుంటూ బతికేవాళ్ళే. ఎవరు ఏ పని చేస్తారో, ఎవరు ఎక్కడ ఉంటారో ఒకరి గురించి మరొకరికి తెలియదు. కానీ 2012 ఆగస్టు 15న అంతా ఒకచోట చేరిపోయారు... జెండా పండగ చేసుకోవడానికి కాదు. వీరంతా చేరింది నిజామాబాద్‌లోని ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో. వీరితోపాటు మరో యాభై మంది వరకూ చేరారు.

అందరూ చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. ఆసుపత్రి మంచాల మీద కొందరు ఎగిరిపడుతున్నారు. మరికొందరు వారి తలలను గోడకేసి బాదుకుంటున్నారు. మరికొందరు బట్టలు చింపుకుంటున్నారు. దాదాపు అందరూ చలిజ్వరం వచ్చిన వారిలా వణికిపోతున్నారు. కొంతమందికి దవడలు కరుచుకు పోతున్నాయి. దాదాపు అందరూ తెంపేసిన తోటకూర కాడల్లా మెడలు వాల్చేస్తున్నారు. వాలిపోయిన మెడలను పైకి లేపడం అసాధ్యమైపోతున్నది వారికి. కొంతమందికి కళ్ళు తేలిపోతున్నాయి. ఏదో మాట్లాడబోతారు. ఏదో చూపించబోతారు. మాటకూ చేష్టకూ సమన్వయం కుదరదు. నీళ్ళ గ్లాసు కూడా పట్టుకోలేకపోతున్నారు.

మానవహక్కుల వేదిక బాధ్యులు నిజామాబాద్ ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రికి పోయినప్పుడు (2012 ఆగష్టు 16న) కన్పించినవే హృదయాన్ని కలచివేసే ఈ దృశ్యాలు. వీళ్ళంతా కరిగిపోయిన కండల వాళ్ళే. తెలంగాణ నుడికారంలో

చెప్పాలంటే 'పెయి మీద చటాకు గోష్' లేనోళ్లు. (ఒంటిమీద యాభై గ్రాముల మాంసం కూడా లేనివాళ్ళు అని). వీరందరినీ ఆసుపత్రికి తీసుకొచ్చింది కల్లు. కాదు.. కాదు.. కల్తీ కల్లు.. కృత్రిమ కల్లు.

గొల్ల పోచయ్య అనే రైతు బీర్కూరు మండలం నస్రుల్లాబాద్‌లో ఉండేవాడు. వణుకుతూ వణుకుతూ కండ్లు తేలేసి చేన్లో పడి 2012 జనవరి 1న చనిపోయాడు. కారణం? కల్తీ కల్లు సేవనం. బీర్కూరు మండల కేంద్రంలో నివాసముండే కనిగిరి నాగయ్య అనే రజకుడు కూడా 2012 జనవరి 6న ఆసుపత్రిలో కన్ను మూసాడు. కారణం? కల్తీ కల్లు సేవనం.

2012 ఫిబ్రవరి నెలలో నవీపేట మండలంలోనూ పలు గ్రామాల ప్రజలు కల్తీ, కృత్రిమ కల్లు బారిన పడి ఆసుపత్రుల పాలయ్యారు. బీర్కూరు, బాన్సువాడ, నవీపేట మండలాల్లోని గ్రామాలవారు, నిజామాబాద్ నగరానికి చెందినవారు దాదాపు ఎనిమిది వందల మంది కల్తీ కల్లు బారిన పడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంతమంది చికిత్స చేయించుకున్నారో అంతకు మూడు రెట్లు ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స చేయించుకున్నారని అంచనా. 2012 వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు సేవనం వల్ల మొత్తం 12 మంది చనిపోయారు.

2012 జనవరి నుంచి ఆగస్టు వరకూ జరిగిన వివిధ ఘటనల నేపథ్యంలో కల్తీ, కృత్రిమ కల్లుపై లోతైన అధ్యయనం చేసింది మానవహక్కుల వేదిక.

తెలంగాణలో కల్లు తాగడాన్ని ఎవరూ తప్పు పట్టరు. వ్యవసాయ కూలీలకు కూడా వారి రోజువారీ వేతనంతో పాటు సీసా కల్లును రైతులు అదనంగా ఇస్తారు. చావులప్పుడు కులం వారందరికీ కల్లు తాగించకపోతే చచ్చిన వ్యక్తి ఆత్మ అక్కడే తిరుగుతుంటుందని కొన్ని కులాల వారు నమ్ముతారు. తాజాగా తీసిన కల్లు చాలా శక్తినిస్తుంది. అది పులియడం మొదలుకాగానే దానిలో జరిగే రసాయనిక మార్పుల వల్ల మత్తు కలిగించే గుణం పెరుగుతూ ఉంటుంది.

ఈత చెట్లూ, తాటి చెట్లూ విస్తారంగా ఉన్నప్పుడు కల్లు బాగానే దొరికేది. ఆ తర్వాత శాక్రిన్‌నో, చక్కెరనో కలిపేవారు కాబట్టి కల్తీ పెద్దగా తెలిసేది కాదు. కానీ ఈత చెట్లూ, తాటి చెట్లూ తరిగిపోతుండడంతో డిమాండు సరఫరాల మధ్య తీవ్ర వ్యత్యాసం ఏర్పడింది. పైగా కల్లు అమ్మకాలు కల్లు గీతకారుల చేతుల్లో ఉన్నంతవరకూ చిన్న చిన్న కల్తీలు తప్ప పెద్ద మొత్తంలో కల్తీలు ఉండేవి కావు. అమ్మకంలోకి వ్యాపారులు ప్రవేశించడంతో మొత్తం పరిస్థితిలోనే ఒక గుణాత్మక మార్పు వచ్చింది. ఒక వైపున కల్లుకు డిమాండు తగ్గలేదు. మరోవైపు కల్లు లభ్యత తగ్గిపోయింది. కల్తీ చేసినా చేయక పోయినా కల్లు అమ్ముకుంటే వారి నుంచి ఎక్సైజు

అధికారులు గుంజే లంచాలు పెరిగిపోయాయి. అధికారులు లంచాలు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులలో ఇరికించి వేధించేవారు అధికారులు. సహకార సంఘాలుగా ఏర్పడితే కేసుల బారిన పడకుండా ఉండొచ్చని భావించిన కొందరు సహకార సంఘాలను ఏర్పరిచారు. అయితే సహకార సంఘాలు ఏర్పడిన మర్నాటి నుంచే కాంట్రాక్టర్లు వాటిపై కన్నేసారు. సహకార సంఘాలు నడిపే కల్లు దుకాణాలకు స్థలాలను వెతికిపెట్టడం పేరుతో; వివిధ వనాల నుంచి తీసిన కల్లును ఒక దగ్గరకు చేర్చి సీసాల్లోకి నింపడం, వాటిని దుకాణాలకు సరఫరా చేయడం, దుకాణాల నిర్వహణ, ఖాతాలు రాయడం లాంటి ప్రక్రియల్లో గీతకారుల నైపుణ్యం సరిపోదు అనే సాకుతో; వీటన్నిటికన్నా ముఖ్యంగా ఎక్సైజు అధికారులను బుజ్జగించడం గీతకారులకు అసాధ్యం అనే సాకుతో పెట్టుబడిదారులు కల్లు వ్యాపారంలోకి ప్రవేశించారు. ప్రజా ఉద్యమాల ఒత్తిడివల్ల ప్రభుత్వం సారా వ్యాపారాన్ని మానుకోవడంతో, పేదవాడికి కల్లు తప్ప చౌకలో మరో మత్తు పానీయం దొరకని పరిస్థితి నెలకొంది. లాభార్జనే పెట్టుబడి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి పెట్టుబడి సమస్త విలువలకూ పాతర వేయగలదు.

సహజ కల్లు లభ్యత తగ్గిపోతున్నా కల్లు తాగే వారి సంఖ్య మాత్రం పెరుగుతూనే పోయింది. షాపుల సంఖ్య పెరుగుతూనే పోయింది. తెల్లటి కల్లు తాగుదామనుకొనేవారికి ఎలాంటి ఆటంకమూ లేకుండా దొరుకుతూనే పోయింది. ఎలా జరిగింది ఈ విచిత్రం? గీతకారులు వ్యక్తిగతంగా వనాల వద్ద కల్లు అమ్ముకున్నప్పుడు కల్తీ లేదు. వనాల నుంచి కల్లు దూరం పోయిన కొద్దీ కల్తీ అవడం మొదలెట్టింది. సహజ కల్లు తగ్గిపోవడంతో నీళ్ళు కలిపి దాని పరిమాణాన్ని పెంచేశారు వ్యాపారులు. కల్లులో మత్తు తగ్గకుండా ఉండేందుకు మొదట్లో కృత్రిమ రసాయనాలను కలిపారు. అప్పుడు ప్రధానంగా వాడింది క్లోరల్ హైడ్రేట్. అయితే దీన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేయడానికి చాలా స్థలం కావాలి. దానికి తోడు క్లోరల్ హైడ్రేట్‌తో కలిపిన కల్లు తగినంత కిక్కు ఇవ్వక పోవడంతో దాన్లో మాదకద్రవ్యాలైన డైజోఫామ్, అల్ప్రాజోలం లాంటి వాటిని చేర్చడం మొదలెట్టారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టన్సెస్ చట్టం ప్రకారం ఇవి నిషిద్ధ పదార్థాలు. వీటిని కలిగి ఉంటేనే తీవ్రమైన శిక్షలున్నాయి. అలాంటిది వాటిని వాడినా కేసులు పెట్టడం లేదు.

మాదకద్రవ్యాలు కలిపిన కల్లు మనిషిని పూర్తిగా లోబర్చుకుంటుంది. ఆ కల్లు అలవాటైన తర్వాత అది తాగే సమయానికి దొరకకపోతే నరాలు జివ్వుమంటాయి. సారా జీర్ణ వ్యవస్థనూ, కాలేయాన్నీ కాల్చేస్తే మాదకద్రవ్యాలు కేంద్ర నాడీ వ్యవస్థను ధ్వంసం చేస్తాయి. కొన్ని నెలలపాటు ఈ మాదకద్రవ్యాలతో కల్తీ చేసిన లేదా తయారు చేసిన కల్లును తాగాక మనిషి శరీరం దాన్ని రోజూ కోరుకుంటుంది.

టైముకు పొయ్యకపోతే చేతుల్లో వణుకులాంటి రకరకాల జబ్బులు వస్తాయి. దాంతో చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. మానవహక్కుల వేదిక అధ్యయన బృందం ఆసుపత్రుల్లో గమనించింది ఆ ప్రవర్తనలనే.

కల్లు కల్తీకి ప్రధాన కారణం కల్లు వ్యాపారం గీతకారుల చేతుల్లోంచి వ్యాపారుల చేతుల్లోకి పోవడం. ఒట్టి వ్యాపారులనైతే ఎక్సైజు అధికారులు అడపాదడపా బెదిరించగలరు. వ్యాపారమూ, రాజకీయమూ తోడైతే ఇక దానికి హద్దుండదు. నిజామాబాద్‌లో జరిగింది అదే. మొదట్లో గీతకారులకు సహకార సంఘం ఒకటే ఉండేది. వనాలలో గీత గీచి కల్లు తీసేవారికి ఈ సంఘంలో సభ్యత్వం ఉండేది కాదు. వాళ్ళు కేవలం వేతనాల కోసమే పని చేస్తుండేవారు. కల్తీ కల్లు వ్యాపారంతో సొసైటీ విపరీతంగా లాభాలు సంపాదిస్తున్నా, వనాల్లో గీత గీసే వారికి దాన్లోంచి మెతుకు కూడా రాల్చేవాళ్ళు కాదు. సొసైటీలో సభ్యత్వం అడిగితే నిరాకరించారు. దాంతో వీళ్ళే రెండో సొసైటీగా ఏర్పడ్డారు. అంతకు ముందు బోధన్ ప్రాంతంలో కూడా అలాంటి సొసైటీ ఏర్పడింది.

సొసైటీగా ఏర్పడి కల్లు అమ్మాలంటే, లాభాలు రావాలంటే కల్లును కల్తీ చేయకుండా సాధ్యం కాదని గీతకారులకు ముందునుంచే తెలుసు. సొసైటీకి లాభాలు ఎలా వస్తున్నాయో కూడా వారికి తెలుసు. లాభాలు సంపాదించడానికే వాళ్లు సొసైటీ పెట్టారు. సమాజాన్ని సమూలంగా మార్చేస్తాం అనేవాళ్ళు, కార్మికుల్ని సహకార సంఘంలోకి సమీకరించగానే కల్లు వ్యాపారం చేయాలంటే కల్తీ జరగాల్సిందేననే నిర్ధారణకొచ్చేసారు.

కల్లు వ్యాపారం పర్యవసానంగా ఎదురయ్యే కేసులను ఎదుర్కోవాలన్నా, మొదటి సొసైటీకి దీటుగా వ్యాపారం చెయ్యాలన్నా పెట్టుబడి అవసరం కాబట్టి రెండో సొసైటీలోకి పెట్టుబడిదారులను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఒట్టి పెట్టుబడిదారులైతే ఎక్సైజు డిపార్టుమెంటును ఎదుర్కోగలరో లేదోనని రాజకీయాల్లో గల పెట్టుబడిదారులైతే బాగుంటుందని నిర్ణయించుకున్నట్లున్నారు. రాజకీయుల్లో కూడా ఒకే పార్టీ వాళ్ళయితే ప్రతిపక్షం వాళ్ళు గోల చేస్తే బాగుండదని ఒకప్పుడు అధికారంలో ఉన్న వాళ్ళనీ, ప్రస్తుతం అధికారంలో ఉన్నవాళ్ళనీ కలిపితే గోలచేసే వారుండరు అని కూడా అనుకొనే ఉంటారు. ఈ రెండు రకాల వ్యాపార–రాజకీయులకి సమాజాన్ని మౌలికంగా మార్చేసి కొత్త తరహా ప్రజాతంత్ర సమాజాన్ని నెలకొల్పుతామని బీరాలు పోయేవారు తోడయ్యారు. దాంతో కల్తీ కల్లు యథేచ్ఛగా పారింది. మొదటి సొసైటీ కల్తీ కల్లు వ్యాపారం చేస్తున్నదని ఇప్పుడు రెండో సొసైటీ అనలేదు. రెండో సొసైటీ కల్తీ కల్లు వ్యాపారం చేస్తున్నదని మొదటి

సొసైటీ అనదు. అధికారంలోగల పార్టీ నేతల నాయకత్వాన ఉన్న సొసైటీలో కల్తీ వ్యాపారం జరుగుతోందని ప్రతిపక్షం అనలేదు. కల్తీ కల్లు అమ్ముతున్నారని ప్రతిపక్షాన్ని అధికారంలో ఉన్న వాళ్ళు అనలేరు. ఇద్దర్నీ విమర్శించే, సమాజ మౌలిక పరివర్తనే ఏకైక ధ్యేయం అని ప్రకటించుకొనే వారు అస్సలు ఏమీ మాట్లాడరు. ఇంత చక్కటి కూటమిని ఏర్పరచగలిగిన డైజోఫామ్, అల్ర్ఫాజోలంల మాదక మహత్తును కొనియాడేందుకు తెలుగు భాష సరిపోదేమో!

2012 ఆగస్టు 15 కల్తీ కల్లు మరణాల తర్వాత పత్రికలు కల్తీ కల్లుపై బాగా స్పందించాయి. యువజన, విద్యార్థి సంఘాలూ, కార్మిక సంఘాలూ, మహిళా సంఘాలూ మానవహక్కుల వేదికకు మద్దతుగా నిలబడ్డాయి. ఈ సంస్థలన్నీ ఉమ్మడిగా పోరాడడంతో రెండు నెలలపాటు కల్తీ కల్లు వ్యాపారం ఆగిపోయింది. కాని ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పడంతో కల్తీ కల్లు వ్యాపారం మళ్లీ మొదలైంది.

కల్తీ కల్లు వ్యాపారాన్ని నిరోధించడానికి మానవహక్కుల వేదిక ఈ క్రింది సూచనలతో ఎక్సైజు అండ్ ప్రొహిబిషన్ కమిషనరుకు ఓ వినతి పత్రాన్ని ఇచ్చింది.

1. కృత్రిమ, కల్తీ కల్లు తయారీదారులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలి.
2. మాదకద్రవ్యాల చట్టం కింద కేసులు నమోదు చెయ్యాలి.
3. సమర్థులైన, నిబద్ధులైన ప్రాసిక్యూటర్లచేత కేసులు నడిపించాలి.
4. కల్లు డిపోల నుంచి కల్లును షాపులకు తరలించకముందే డిపోల్లోనే పరీక్షించాలి. ఆ తర్వాతే కల్లు అమ్మకానికి అనుమతించాలి.
5. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి.
6. డీ అడిక్షన్ సెంటర్లలో చేరిన వారికి వారు కోల్పోతున్న వేతనాలను చెల్లించాలి.

మానవహక్కుల వేదిక పౌర సమాజాన్ని కూడా కొన్ని కోరికలు కోరింది. అవి

1. కృత్రిమ, కల్తీ కల్లు తయారీదార్లను సమాజం అసహ్యించుకోవాలి.
2. కృత్రిమ, కల్తీ కల్లు వ్యాపారంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సంబంధమున్న వ్యక్తులను, రాజకీయ పార్టీలలో ఎంత ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ ఆయా రాజకీయ పార్టీలు పక్కకు పెట్టాలి.

నిజామాబాద్ యూనిట్

# నెల్లూరు తీరాన్ని విద్యుత్ వ్యాపారులకు వదిలేద్దామా? రక్షించుకుందామా?

క
ర
ప
త్ర
ం

దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటారనేది ఎంత నిజమో గాని రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు కలిసి నెల్లూరు జిల్లా తీరప్రాంతాన్ని థర్మల్ పవర్ ప్లాంట్ల పేరుతో బహు తెలివిగా పంచుకుంటున్నారు. పేరున్న ప్రతి కంపెనీ మాకొక ప్రాజెక్టు, మాకొక ప్రాజెక్టు అని దరఖాస్తులు పెట్టుకుంటూ పోతోంది. అనుమతి పొందినవారు సైతం ఉత్పత్తి మొదలు పెట్టకుండానే ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతున్నారు. ఇదేం వేలంవెర్రి, ఇదేం స్వీయవిధ్వంసం, అసలిది కలా నిజమా అనుకుంటుండగానే ఆ వెర్రి వేయితలలేయడం, ఆ కలలు పీడకలలవడం మొదలైంది.

మన పాలకులలకు ఎంత 'అభివృద్ధి' ఉన్మాదం పట్టకపోతే ఒక జిల్లాలోని రెండే రెండు మండలాల్లో – ముత్తుకూరు, చిల్లకూరు – ఇరవై అంటే ఇరవయ్యే కిలోమీటర్ల పరిధిలో ఒకేసారి 26 థర్మల్ పవర్ ప్లాంట్లను నెలకొల్పబోతారు! వీటికి యజమానులకయ్యే ఖర్చు (అదీ ప్రజలసొమ్మే అనుకోండి) 135 లక్షల కోట్ల రూపాయలైతే మనకయ్యే ఖర్చు, మన భూగోళానికయ్యే ఖర్చు 30 వేల ఎకరాల భూమి, రోజుకు 4 లక్షల టన్నుల బొగ్గు, 58.56 లక్షల ఘనపు మీటర్ల నీరు. వాళ్లకొచ్చేది (ఒక్కటి మినహా అన్ని ప్లాంట్లూ ప్రైవేటువే) 27 వేల మెగావాట్ల విద్యుచ్ఛక్తి అయితే మనకూ, మన భూగోళానికీ వచ్చేది రోజుకు 1.3 లక్షల టన్నుల బూడిద, 2700 టన్నుల గంధకం, ఇంకా నికిల్, కాడ్మియం, క్రోమియం వంటి కాలుష్య పదార్థాలు. మరింత స్పష్టంగా చెప్పాలంటే విపరీతమైన

వాతావరణ కాలుష్యం, పంటల వినాశనం, మత్స్య సంపద నష్టం, పెద్దఎత్తున ప్రజల విస్థాపన వగైరా వగైరా.

ఈ విషయాలన్నీ నెల్లూరు జిల్లా వాసులకు తెలియనివి కావు. గత రెండు మూడేళ్ళుగా పత్రికల్లో వస్తున్న విషయాలే. అయినా సోంపేటలో లాగానో, కాకరాపల్లిలో లాగానో ఇక్కడ ఎవరూ గొంతెత్తి, రోడ్డెక్కి వీటిలో ఏ ఒక్కదాన్నీ అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. చేయడం లేదంటే అసలేం చేయడం లేదని కాదు; చేయాల్సినంత చేయడం లేదని. జరగబోయే విధ్వంసం గురించి మరింత వివరంగా తెలిస్తే జిల్లా ప్రజలు స్పందిస్తారన్న ఆశతో ఈ కరపత్రాన్ని ప్రచురించడమే కాక ఈనెల 22న చిల్లకూరు మండలంలో ప్రచారయాత్ర కూడా జరుపుతున్నాం.

మొత్తం 27,015 మెగావాట్ల సామర్థ్యంతో రానున్న ఈ 26 కేంద్రాల్లో ఇప్పటికే ఎనిమిదింటికి అనుమతులు వచ్చేసాయి. మరో 18 ప్రతిపాదన దశలో ఉన్నాయి. కృష్ణపట్నం రేవుకు ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో, ప్రధానంగా తీరప్రాంతంలో ఈ పరిశ్రమలన్నీ రానున్నాయి. ఒక్క చిల్లకూరు మండలంలోనే (తమ్మినపట్నం నుండి అంకులపాటూరు లోపే) 16,955 మె.వా. సామర్థ్యంగల ప్లాంట్లను నిర్మించబోతున్నారు. ఈ 26 ప్లాంట్లలో ముత్తుకూరు మండలంలోని నేలటూరు దగ్గర వస్తున్న ఎ.పి. జెన్‌కో ప్లాంటు తప్ప మిగిలిన పాతికా లాభార్జనే ధ్యేయంగా కలిగిన ప్రయివేటు కంపెనీలవే.

ఒకే ప్రాంతంలో ఇంత భారీ సామర్థ్యంగల బొగ్గు ఆధారిత కేంద్రాలు నెలకొల్పడం దేశంలో ఇంకెక్కడా లేదు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జాంజ్‌గిర్-చంపా జిల్లాలో ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే థర్మల్ కేంద్రాలున్నప్పటికీ, ఇంత భారీ సామర్థ్యంగల కేంద్రాలు ఒకచోట ఉండడం మాత్రం నెల్లూరులోనే చూడబోతాం. అంతేకాదు, ఆయా ప్లాంట్లు వాటి సామర్థ్యాలను భవిష్యత్తులో పెంచుకునే అవకాశం కూడా ఉంది. మోమిడి, తమ్మినపట్నం, నేలటూరు దగ్గరున్న సింహపురి, మీనాక్షి థర్మల్ పవర్‌టెక్ ప్లాంట్లు గతంలో 540 మె.వా, 900 మె.వా, 1980 మె.వా.లకు పర్యావరణ అనుమతులు పొంది ఇప్పుడు మళ్లీ 940, 1420, 660 మె.వా.లకు అదనపు ప్రతిపాదనలను పంపి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అక్కడితో ఆగుతాయనీ చెప్పలేము.

ఈ థర్మల్ కేంద్రాలన్నీ అభివృద్ధి సూచికలనీ, స్థానిక ప్రజలకి మేలు చేస్తాయనీ చెప్పేవాళ్లు కొందరున్నారు కాని అవన్నీ పని జరుపుకోవడం కోసం చెప్పే ఒట్టి దొంగ మాటలు. ఈ ప్లాంట్ల ప్రభావం ఆ రెండు మండలాల్లోని ప్రజల జీవనం, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం, నీటివనరులు, సముద్రంపై చాలా తీవ్రంగా

ఉంటుందనేది నిస్సందేహం. ఈ ప్లాంట్లన్నీ గనక పని మొదలుబెడితే అది నెల్లూరుజిల్లాకే ఒక పెనువిపత్తు కాగలదు. నెల్లూరు, గూడూరు పట్టణాలు కూడా కాలుష్యాన్ని తప్పించుకోలేవు. వ్యవసాయం మీద దీని దుష్ప్రభావం వంద కి.మీ. పరిధి వరకు ఉండగలదు.

విశాఖపట్నం దగ్గరి NTPC పవర్‌ప్లాంట్ (దాని సామర్థ్యం 1000 మె.వా. మాత్రమే) సమీప గ్రామాలకు వెళితే మేం చెబుతున్నది అతిశయోక్తి కాదని అర్థం అవుతుంది. అక్కడ కాలుష్యం బారిన పడి అవిటి వాళ్లయిన వారిని చూస్తే పరిస్థితి మరింత తేటతెల్లమవుతుంది.

అయినా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ రెండూ కరెంటు పరిశ్రమలకు అడిగిందే తడవుగా 'రబ్బర్ స్టాంప్' అనుమతుల్ని ఇచ్చేస్తున్నాయి. రాష్ట్రం మొత్తంలో ఇప్పటి ఉత్పత్తి కంటే దాదాపు రెట్టింపు సామర్థ్యం కలిగిన పరిశ్రమలను కేవలం 2 మండలాల పరిధిలో నిర్మిస్తామన్నా ఏ మాత్రం తటపటాయించకుండా అనుమతులు మంజూరు చేస్తున్నాయి. దానివల్ల జరగబోయే ప్రమాదం గురించి తెలిసి కూడా ఆ పరిశ్రమలకు పచ్చజెండా ఊపుతున్నాయి. వాస్తవానికి చట్టాన్ని గనక పటిష్టంగా అమలు చేస్తే ఈ శాఖల అధికారులు అనేకమంది ఒక ఎ. రాజాలా, ఒక గాలి జనార్ధన రెడ్డిలా కటకటాల వెనక వుండవలసిన వారు. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని అపహాస్యం చేస్తూ తప్పుడు పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలను తయారుచేసి ప్రజల మొహాన కొడుతున్నారు. ఈ నివేదికలలో ఎక్కడా కూడా ఈ పరిశ్రమలు విడుదలచేసే కాలుష్యం మనుషులపై ఎటువంటి ప్రభావం చూపుతుందనే వివరాలు లేవు. పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని శాస్త్రీయంగా పేర్కొనలేదు. అన్ని పరిశ్రమలూ కలిసి మూకుమ్మడిగా (Cumulative) కలిగించే ప్రభావాన్ని అంచనా వేయలేదు. ఇది చాలా తీవ్రమైన లోపం.

బొగ్గు మండితే వచ్చే కాలుష్యం గాలి, నీరు, మత్స్య సంపద, వాతావరణం, వ్యవసాయం, అడవులు, వన్య ప్రాణులు, ప్రజారోగ్యం... ఒకటేమిటి అన్నిటిపైనా ప్రభావం చూపుతుంది. బొగ్గు కాలినపుడు బూడిదతోపాటు పాదరసం, నికిల్, కాడ్మియం, క్రోమియం వంటి భారలోహాలు, గంధకం కూడా విడుదలవుతాయి. భారలోహాలు కాన్సర్ కారకాలు. మొత్తం 26 ప్లాంట్లూ పని మొదలుబెడితే రోజుకి సుమారు

4 లక్షల టన్నుల బొగ్గును మండించి ప్రతిరోజూ 1.3 లక్షల టన్నుల బూడిద (ఫ్లై యాష్)నీ, 2700 టన్నుల గంధకాన్నీ పరిసరాల్లోకి విడుదల చేస్తాయి. ఇంతటి విధ్వంసాన్ని తట్టుకునే శక్తి ప్రకృతికుందా?

## పర్యావరణ అనుమతి పొందినవి

| సం. | పేరు | సామర్థ్యం (మె.వా.) | స్థలం | మండలం |
|---|---|---|---|---|
| 1. | దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎ.పి.జెన్‌కో) | 1600 | నేలటూరు | ముత్తుకూరు |
| 2. | నెల్‌కాస్ట్ | 1320 | పైనాపురం, శివరాపురం, వరకాలిపాడు | ముత్తుకూరు |
| 3. | కోస్టల్ ఆంధ్రాపవర్ లి. | 4000 | కృష్ణపట్నం | ముత్తుకూరు |
| 4. | థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ | 1980 | నేలటూరు, పైనాపురం | ముత్తుకూరు |
| 5. | సింహపురి ఎనర్జీ ప్రై.లి. | 540 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 6. | మీనాక్షి ఎనర్జీ ప్రై.లి. | 900 | తమ్మినపట్నం, మోమిడి, నారికేళ్లపల్లి | చిల్లకూరు |
| 7. | కినేట పవర్ ప్రాజెక్ట్స్ లి. | 1980 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| 8. | కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్ | 1980 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| | మొత్తం | 14,300 | | |

అంతేకాదు ఈ ప్లాంట్లు నడవడానికి చాలా భారీ పరిమాణంలో నీళ్లు అవసరం. అన్ని ప్లాంట్లకు కలిపి రోజుకు 58.56 లక్షల ఘనపుమీటర్ల నీరు కావలసి వుంటుంది. ఈ నీటిని సముద్రం నుండే కాక కండలేరు నది నుండి కూడా తీసుకుంటారు. మీనాక్షి, సింహపురి థర్మల్ కాఎంద్రాలే కాదు, చిల్లకూరు మండలంలో ప్రతిపాదిత ప్లాంట్లు కూడా నీటికోసం కండలేరుపై పడే అవకాశం వుంది. తమ వ్యర్థజలాలను వారు సముద్రంలోకి, కండలేరులోకే వదులుతారు. ఆ నీరు సాధారణ నీటి కంటే 5–10 సెంటిగ్రేడ్ డిగ్రీల అధిక ఉష్ణోగ్రత కలిగి వుంటుంది. దీనివల్ల ఈ ప్రాంతంలో సముద్రం, కండలేరు నిరంతర కల్లోలానికి గురవుతాయి. చేపలూ రొయ్యలూ ఇతర జలజీవాల పునరుత్పత్తి బాగా దెబ్బతింటుంది.

# ప్రతిపాదనలో ఉన్నవి

| | | | | |
|---|---|---|---|---|
| 1. | థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ | 660 | నేలటూరు, పైనాపురం | ముత్తుకూరు |
| 2. | లెదర్ పార్క్ | 500 | కృష్ణపట్నం | ముత్తుకూరు |
| 3. | సింహపురి ఎనర్జీ ప్రై.లి. | 940 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 4. | మీనాక్షీ ఎనర్జీ ప్రై.లి. | 1420 | తమ్మినపట్నం, మోమిడి, నారికేళ్లపల్లి | చిల్లకూరు |
| 5. | శివస్వాతి కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లి. | 1200 | మోమిడి | చిల్లకూరు |
| 6. | మహావీర్ ఎనర్జీ ప్రై.లి. | 500 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 7. | ప్రాగ్దిశ పవర్ ప్రై.లి. | 2640 | మోమిడి | చిల్లకూరు |
| 8. | రామకృష్ణ ప్రసాద్ పవర్ ప్రై.లి. | 420 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 9. | శౌర్య ఎనర్జీ ప్రై.లి. | 100 | తిరుమలమ్మపాలెం, ఏపూరు | చిల్లకూరు |
| 10. | వి.ఎన్.ఆర్. పవర్‌టెక్ ప్రై.లి. | 330 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 11. | వి.ఎస్.ఎఫ్. ప్రాజెక్ట్స్. లి. | 485 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 12. | ఆశ్రిత పవర్ ప్రై.లి. | 200 | ఏరూరు | చిల్లకూరు |
| 13. | బాలాజీ పవర్ అండ్ సోలార్ ఎనర్జీ ప్రై.లి. | 100 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 14. | వి.ఎన్.ఆర్.పి. పవర్‌టెక్ ప్రై.లి. | 300 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| 15. | ఎన్.ఎస్.ఎల్. ఆంధ్ర పవర్ ప్రై.లి. | 1320 | మోమిడి, ఏరూరు | చిల్లకూరు |
| 16. | గూడూరు థర్మల్ ప్లాంట్ | 300 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 17. | లాంకో | 1000 | మోమిడి | చిల్లకూరు |
| 18. | ఎస్.బి.క్యూ స్టీల్. లి. | 300 | అంకులపాటూరు | చిల్లకూరు |
| | మొత్తం | 12,715 | | |

సముద్రంపై ఆధారపడే పట్టపోళ్లు మాత్రమేగాదు ఇతర కులస్తులు కూడా నష్టపోతారు. చిల్లకూరు మండలంలోని వరగలి, మోమిడి, లింగవరం తదితర గ్రామాలలో దళిత మహిళలు కండలేరులో రొయ్యలూ చేపలూ పడతారు. 'కరువు కాలంలో కూడా ఆదుకుంటుంది మా కండలేరు' అంటారు. రాబోయే కాలంలో దాన్నంతా కోల్పోయే ప్రమాదం వుంది. ఒకవేళ వేట నడిచినా చేతికి వచ్చేది చాలా తక్కువ. ఇప్పటికే ముత్తుకూరు మండలంలోని పైనాపురం, నేలటూరు ప్రాంతంలో ఈ పరిస్థితి ఉంది. దేవరదిబ్బకు చెందిన యానాదులు బకింగ్‌హామ్ కెనాల్‌లో వేట బాగా పడిపోయిందని వాపోతున్నారు. రేపు కండలేరు పరిస్థితి కూడా అదే అవుతుంది.

థర్మల్ ప్లాంట్లలో ఉద్యోగాలు కల్పిస్తామని కొంతమంది స్థానిక పెద్దలు, కంపెనీల బ్రోకర్లు, నాయకులు చెబుతున్న మాటలు వట్టి అబద్ధాలని ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రజలకు కొంత అర్థం అయ్యింది. నిర్మాణం జరుగుతున్న దశలో కొంత కూలి దొరుకుతుంది, కొందరు కుర్రాళ్లకు ఆఫీసు బాయ్ పనులు దొరుకుతాయి గానీ ఇవన్నీ తాత్కాలికమే. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే ఈ ప్రాజెక్టుల్లో ఉండేవే పిడికెడు ఉద్యోగాలు. అవి కూడా పెద్ద చదువులు చదివిన వారికే తప్ప స్థానికులకు అందుబాటులో వుండవు.

రాబోయే కాలంలో చిల్లకూరు, ముత్తుకూరు మండలాల్లో ఊళ్లూ, పొలాలూ కనపడవు. పొగగొట్టాలూ, బూడిదకుప్పలూ, నిస్సారమైన భూములూ, నాశనమైన నీటివనరులూ, అనారోగ్యంతో మూలుగుతున్న ప్రజలూ మాత్రమే ఉండబోతారు. చిన్న రైతుల, దళితుల, యానాదుల, పట్టపోళ్ల, రైతుకూలీల జీవితాలు పూర్తిగా ఛిద్రమవుతాయి. అందరూ మూటాముల్లె పట్టుకుని వలస పోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

అందుకే ప్రగతి పేరుతో జరుగుతున్న ఈ విధ్వంసాన్ని ఆపమని పాలకులకు చెబుదాం. ప్రజల బతుకుల కంటే ప్రయివేటు కంపెనీల లాభాలు ముఖ్యం కాదని నినదిద్దాం. తప్పుడు సమాచారంతో పొందిన 8 థర్మల్ ప్లాంట్ల అనుమతులను రద్దు చేయాలనీ, ప్రతిపాదనలో వున్న 18 ప్లాంట్లను అనుమతించరాదనీ డిమాండ్ చేద్దాం. మన భవిష్యత్తును కాపాడుకుందాం.

20-1-2012

# హక్కులడిగితే హత్యలతో జవాబు చెప్తారా!
# ఈ అనాగరికతకు అంతం లేదా?



**1985 జూలై 17న కారంచేడులో దళితులపై జరిగిన దాడికి, 2012 జూన్ 12న శ్రీకాకుళం జిల్లా వంగర మండలం లక్ష్మింపేటలో దళితులపై జరిగిన దాడికి మధ్య ఏమైనా తేడా ఉందా?**

**హంతకులు మారారు తప్ప హతులు వారే. అవే ఆలోచనలు, కక్షలు, నరనరాన జీర్ణించుకుపోయిన వివక్ష, కుల దురహంకారం. ఈ 27 ఏళ్ళలో ఏవీ మారలేదనిపిస్తుంది.**

కారంచేడుకి, లక్ష్మింపేట సంఘటనకి మధ్య దళితులపై అత్యాచారాలను నిరోధించడానికి ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989 అమల్లోకి వచ్చినా లక్ష్మింపేట దళితులు దాని నుంచి ఏ మాత్రం ప్రయోజనం పొందలేకపోయారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి, వారి జీవితాలను వికసింపజేయడానికి తీసుకొచ్చిన ఎంతో విలువైన ఈ చట్టాన్ని ప్రభుత్వ అధికారులు అడుగడుగునా అపహాస్యం చేశారు. ఫలితం ఐదుగురు తమ నిండు ప్రాణాలు కోల్పోయారు.

జూన్ 12న లక్ష్మింపేట దళితులపై తూర్పు కాపు కులస్తులు చేసిన దాడి మొదటిది కాదు, గత రెండేళ్లుగా దళితులపై జరుగుతున్న దాడుల పరంపరలో అదొకటి. ఈ విధమైన దాడి జరిగే అవకాశం ఉందని జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి, పోలీసు అధికార్లకు ముందే తెలిసినా దాడిని

నివారించడానికి వారు చిన్నమెత్తు ప్రయత్నం కూడా చేయలేదు. పైగా నర్సన్నపేట ఉపఎన్నిక వంకతో లక్షింపేటలో పెట్టిన పోలీసు పికెట్‌ను కూడా జూన్ 10వ తేది రాత్రి తీసేసి దళితులపై దాడి చేయడానికి అవకాశం కల్పించారు.

## జరిగిందేమిటి?

లక్షింపేట గ్రామంలో వంద మందికి పైగా తూర్పు కాపు కులస్తులు జూన్ 12 ఉదయం 7 గంటలకల్లా కర్రలు, బరిశలు, గొడ్డళ్లతో గుమిగూడటం చూసి ఆ ఊరి మాజీ సర్పంచ్ భర్త చిత్తిరి గంగులు వెంటనే వంగర పోలీసుస్టేషన్ ఎస్.ఐ. సుధాకర్‌కి ఫోన్ చేసి చెప్పారు. స్టేషన్‌లో ఒక్క కానిస్టేబులే ఉన్నాడు, పంపుతున్నానని భరోసా ఇచ్చాడాయన. వంగర పోలీసు స్టేషన్ లక్షింపేటకు 4 కి.మీ. దూరాన ఉంది. మహా అయితే పావుగంట ప్రయాణం. రాజాం నుండి వస్తే ముప్పావుగంట ప్రయాణం. ఎలా చూసినా గంటలోపు పోలీసు బలగాలు రావాల్సింది. కాని పంపాలనే ఆలోచన వారికి లేదు. పంపలేదు. దాడి జరుగుతున్నంతసేపు గంగులు ఫోన్ చేస్తూనే ఉన్నారు. మూడున్నర గంటల తర్వాత 10.30కి గాని పోలీసులు ఊర్లోకి రాలేదు. ఈలోపు జరగాల్సిందంతా జరిగిపోయింది.

అక్కడ పోగైన గుంపులో లక్షింపేట తూర్పుకాపు కులస్తులే కాదు విక్రంపురం, పదమవలస శేఖరపల్లి, బలిజపేట, మద్దివలస గ్రామాలకు చెందిన తూర్పు కాపు కులస్తులు కూడా ఉన్నారు. రాత్రికి రాత్రి కూడబలుక్కుని ఉదయమే మారణాయుధాలతో పోగైన వారందరికీ మొదట కనిపించింది నివర్తి సంగమేసు (40). అప్పుడే ఇంట్లో చల్దన్నం తిని తోబుట్టువు ఇంటికొస్తున్న సంగమేసుని పట్టుకుని ఆమె ఇంటి గుమ్మం ముందే కత్తులతో, బరిశలతో పొడిచారు. అడ్డొచ్చిన తోబుట్టువు సంగమ్మని కూడా కొట్టారు. సంగమేసుని కొడుతుంటే చూసి కొడుతున్నది తన అన్న గంగుల్ని అనుకుని పరిగెత్తుకొచ్చిన చిత్తిరి అప్పడును (30) 'మా మీదే కేసులు పెడతార్రా' అంటూ కొట్టి కొట్టి చంపేశారు.

తర్వాత నివర్తి వెంకటి (51) ఇంటిపై దాడి చేసారు. అతను కొట్టిస గ్రామం వైపు పారిపోతుంటే వెంటబడి ప్రాథమిక పాఠశాల ముందు పట్టుకొని అక్కడే నరికి చంపేశారు. బూరాడ సుందరరావును (40) మంచితనానికి మారు పేరుగా ఊర్లో వారందరూ భావిస్తారు. అతను శ్రీసుందర మల్లిఖార్జున మ్యూజికల్ బ్యాండ్ పార్టీలో సభ్యుడు. బాగా పాటలు పాడటమే కాదు కడుపులోది తీసి ఇతర్లకి పంచిపెట్టే గుణమున్నవాడు. ఆ రోజు ఉదయానే పొరుగూరు పెళ్లిలో పాటలు పాడి తిరిగొచ్చి బట్టలు మార్చుకుంటుండగా అతని ఇంటిపైన పడి కొట్టడం

మొదలెట్టారు. నలుగురు వ్యక్తులు అతని కాళ్లు చేతులు పట్టుకుంటే ఇద్దరు అతని ఛాతీపై పెద్ద బండరాయి పడేసి అక్కడికక్కడే చంపేశారు. అడ్డువెళ్లిన భార్యని తూర్పు కాపు కులస్తుల మహిళలు జుట్టు పట్టుకుని బైటికి ఈడ్చుకుని వచ్చి 'మా వాళ్ళతో పెట్టుకోవద్దని మొగుళ్లకు చెప్పుకోలేరా మాల లంజలారా' అంటూ చితకబాదారు. బొడ్డూరు పాపయ్య (50) ఆవు తిరుపతిరావు అనే తూర్పు కాపు దగ్గర గతంలో తులం బంగారం దాచుకున్నాడు. అతని ఇంటిపైనపడి 'బంగారం అడుగుతావురా' అని అతన్ని ఇష్టమొచ్చినట్టు కొట్టారు. ఆ దెబ్బలకు అతని మూత్రపిండాలు దెబ్బతిని వారం రోజుల తర్వాత విశాఖ కె.జి. ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు.

తూర్పు కాపులు పథకం ప్రకారం గుంపులు గుంపులుగా అన్ని వీధుల్లో తిరుగుతూ ఇళ్ళ గడలు, కిటికీలు పగలగొట్టి 'భూములు కావాల్రా మీకు, ఇప్పుడు దున్నండ్రా'', ''ఒక్కళ్లని చంపినా అదే శిక్ష, పది మందిని చంపినా అదే శిక్ష'', ''మిమ్మల్ని తగలేసి, మీ ఇళ్లల్లో మా పశువుల్ని కడతాంరా'' అని కేకలు పెట్టుకుంటూ ఇళ్లలోకి చొరబడి ముసలీ ముతకా, చిన్నా పెద్దా, ఆడామగా తేడా లేకుండా కొట్టారు. తూర్పు కాపు మగాళ్లు దాడి చేస్తుంటే వాళ్ళ ఆడవాళ్లు కారాలు జల్లడం, దాడిచేస్తున్న వారికి నీళ్లు అందించడం చేశారు. ఈ దాడిలో పాతిక మంది పైగా దళితులు ఆస్పత్రి పాలయ్యారు. మరెంతో మంది ఇళ్లలోనే మంచాన పడ్డారు. ఇప్పటికీ 11 మంది ఆస్పత్రిలోనే ఉన్నారు.

గత రెండేళ్ళలో వాళ్ల మొర ఏ ఒక్కరు ఆలకించి చర్య తీసుకున్నా ఈ దాడిని నివారించే పని. న్యాయం కోసం వారు చేయని ప్రయత్నం లేదు. తొక్కని గడపా లేదు. ఈ వ్యవహారంలో ప్రతి ఒక్క అధికారీ, రాజకీయ నాయకుడూ తూర్పు కాపు కులస్తులకే కాపు కాశారు. తూర్పు కాపులు అవడానికి బి.సి.లే కాని కులాల నిచ్చెనలో దళితుల కన్నా ఒక మెట్టుపైన ఉన్నవారు. పైగా ఈ ప్రాంతంలో రాజకీయ పలుకుబడి గలవారు. పి.సి.సి. అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ ఈ కులానికి చెందిన వాడే.

## ఎక్కడ మొదలయింది

సమస్యను ప్రయోజనాల దృష్టితో చూస్తే కనిపించేవి ప్రయోజనాలే, న్యాయం కాదు. అందుకే మీడియా సహా చాలామంది మొదట దీన్ని గ్రామకక్షలుగా సరిపుచ్చి తేల్చిపారేయాలని చూశారు. లక్షింపేట

దళితుల సమస్య భూమి సమస్యా, దళిత ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యా, నిర్వాసితుల సమస్యా అంటే దాన్ని అలా విడివిడిగా చూడలేం. లక్షింపేట గ్రామంలో తూర్పు కాపు కుటుంబాలు 85 అయితే మాల కుటుంబాలు 79. మిగతా కులాలన్నీ కలిపి మరో 15 కుటుంబాలవాళ్లు జీవిస్తున్నారు. గతంలో వారి ఊరు సువర్ణముఖి నదీ తీరాన ఉండేది. 30 ఏళ్ల క్రితం ఇందిరమ్మ పథకం కింద భూమిలేని దళిత కుటుంబాలకు ఊరిలోని ముత్యాలమ్మ చెరువులో తలా పాతిక సెంట్ల చొప్పున 20 ఎకరాల భూమి కేటాయించింది ప్రభుత్వం. మా పొలాల్లో చాకిరీ చేయాల్సిన వాళ్లు సేద్యం చేయడం ఏమిటని ఆ చెరువుని కావాలని తూర్పు కాపులు నీళ్లతో నింపేసి సాగు చేసుకోనిచ్చేవారు కాదు. అప్పట్లోనే ఒకసారి దళితులను కొట్టారు. ఆ తర్వాత పదేళ్లపాటు ఎవరి భూములు వాళ్ళు సాగుచేసుకుంటూ ఉండిపోయారు.

ఇంతలో మడ్డువలస ప్రాజెక్టు వల్ల ముంపుకి గురయ్యే గ్రామాల్లో ప్రభుత్వం భూసేకరణ మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టు వల్ల లక్షింపేట, కొట్టిస, దేవకివాడ, గుడివాడ, మగ్గూరు నరేంద్రపురం గ్రామస్తులు తమ వ్యవసాయ భూములనే కాకుండా ఇళ్లను, ఊరుని కూడా పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుకు సేకరించిన భూమిలో దళితులకు భూమి లేదు కాబట్టి వారికి నష్టపరిహారం ఏమీ దక్కలేదు. ఇళ్లు కోల్పోయినందుకు 8 నుండి 10 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది ప్రభుత్వం. ఇళ్లు, సేద్యపు భూములు కోల్పోయినందుకు తూర్పు కాపు కులస్తులకు ఒక మోస్తరు నష్టపరిహారం లభించింది. నిర్వాసితులైన లక్షింపేట గ్రామస్తులకు గృహనిర్మాణం నిమిత్తం ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువు దగ్గర స్థలం ఇచ్చింది. ముందుగా దళితులు వచ్చి అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. లక్షింపేట తూర్పు కాపు కులస్తులు కొంతమంది నష్టపరిహారం డబ్బుతో ఇతర గ్రామాల్లో పొలాలు కొనుక్కుని అక్కడే స్థిరపడిపోయారు. కొంతమంది ఇతర చోట్ల భూములు కొనుక్కున్నప్పటికీ ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువు దగ్గర కేటాయించిన భూమిలో ఇళ్లు నిర్మించుకుని ఉండిపోయారు. దళితులు అక్కడ స్థిరపడిన రెండేళ్లకు కాని వారు అక్కడికి రాలేదు. వారికీ దళితులకీ మధ్య ఒక వీధే అడ్డం.

ఆనాడు మడ్డువలస ప్రాజెక్టు నిర్వాసితుల ఉద్యమానికి నాయకత్వం వహించిన బొత్స వాసుదేవనాయుడు ఈనాడు దళితులపై దాడికి పూనుకున్న కేసులో ప్రధాన ముద్దాయి కావడం గమనార్హం. భూమి ఉన్న వారినే కాదు, భూమి లేని నిరుపేదలను, చేతివృత్తుల వారిని కూడా నిర్వాసితులుగా గుర్తించి, వారికి కూడా నష్టపరిహారం చెల్లించాలనే డిమాండుని ఆనాడు లక్షింపేట దళితులు

పెట్టలేదు కాని నిర్వాసితుల సమస్యపై పనిచేసే సంఘాలవాళ్ళు మాత్రం వారందరికీ కూడా సమగ్ర పునరావాసం కల్పించాలని కోరుతూనే వచ్చారు. దాన్ని ఖాతరు చేయకపోవడం వల్ల సమస్య ఎన్ని వెర్రితలలు వేయగలదో లక్ష్మింపేట దాడే ఒక ఉదాహరణ.

మడ్డువలస ప్రాజెక్టు నిమిత్తం లక్ష్మింపేట గ్రామంలో ప్రభుత్వం సేకరించిన భూమిలో 250 ఎకరాలు ముంపుకు గురికావడం లేదని తేలిం తర్వాత గ్రామస్తులు దానిని సాగు చేసుకోవడం మొదలుపెట్టారు. అందులో 60 ఎకరాలకు సంబంధించిన భూమి యజమానులు ప్రభుత్వం నుండి నష్టపరిహారం పొంది పొరుగూర్లలో స్థిరపడడంతో ఆ 60 ఎకరాలను దళితులు సాగుచేసుకోవడం మొదలుపెట్టారు. ఇది 15 ఏళ్ళుగా జరుగుతోంది. మిగిలిన 190 ఎకరాల భూముల్ని తూర్పు కాపులే సాగు చేసుకుంటున్నారు. అదంతా బంగారం పడే భూమి. సాలీనా రెండు పంటలు పండుతాయి.

కరపత్రం

## సర్పంచ్ ఎన్నిక కంటగింపైంది

2006లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఆ గ్రామ సర్పంచ్ పదవిని ఎస్.సి. మహిళకు కేటాయించారు. చిత్తిరి సింహాలమ్మ ఎన్నికయ్యింది. ఒక రకంగా అప్పటి నుండి గొడవ మొదలైంది. సర్పంచ్ అయినా ఆమె మహిళే, దళితే. అందులో తేడా లేదు తూర్పు కాపు పెత్తందార్ల దృష్టిలో. సమావేశాల్లో ఆమెను నిలబెట్టిన సందర్భాలున్నాయి. అయినా ఆమె కొన్ని విషయాల్లో లొంగలేదు. తను చేయదల్చుకున్న పనులు చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, సి.సి. రోడ్లు, డ్రైనేజీ కాలువ మొదలైన నిర్మాణ పనులు చేపట్టింది. పించన్లు ఇప్పించింది. దీనితో ఆమెపైనా, ఆమెకు సహకరిస్తున్న భర్త గంగులు, మరిది అప్పడులపైనా, మొత్తం లక్ష్మింపేట దళితులందరిపైనా తూర్పు కాపులు కక్ష పెంచుకున్నారు. దొంగ సర్టిఫికెట్లు సృష్టించి వృద్ధాప్య పించన్లు మంజూరు చేయించిందని ఎం.ఆర్.ఓ. కార్యాలయంలో ఫిర్యాదుచేసి వాటిని సైతం ఆపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.జి.పి) కింద దళితులకు రావాల్సిన పనులను ఆపించారు. పించన్ల మంజూరు కొరకు దళితులు కలెక్టరు కార్యాలయం ముందు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. ఎప్పుడడిగినా విచారణ జరుగుతోందని అంటారట ఎం.డి.ఓ.గారు. విచారణ ఎన్నాళ్లు పడుతుంది? ఏడాదా? రెండేళ్లా? ఈ విషయాల్లో కాలపరిమితి అంటూ ఏమీ ఉండదా?

తమ ఆధిపత్యాన్ని ప్రశ్నించకుండా పడి ఉండాల్సిన వాళ్లు తమ కళ్ల ముందే భూమి సాగు చేసుకోవడం, చదువుకోవడం, సర్పంచ్‌గిరి చేయడం, కొన్ని పథకాల ద్వారా ప్రయోజనాలు పొందటం తూర్పు కాపులకు కంటగింపై అది సూటిపోటి మాటలతో ఆగకుండా క్రమంగా కులం పేరుతో కించపర్చడం, తిట్టడం, కొట్టడానికి దారి తీసింది. జూన్ 12 సంఘటన కంటే ముందు అటువంటి నాలుగు సంఘటనలు జరిగాయి. మొదట దండాసు లత, చిన్నమ్మడు పొలాల్లో పుల్లలేరుకుంటుంటే తూర్పు కాపు కులస్తులు వారిని కులం పేరుతో తిట్టి కొట్టారు. వారు వెంటనే వంగర పోలీసులకి ఫిర్యాదు చేశారు. అయినా ఆనాటి డి.ఎస్.పి. సాగర్, సి.ఐ. శశిభూషణ్, ఎస్.ఐ. సత్యనారాయణ కేసు నమోదు చేయకుండా 8 రోజులపాటు దళితుల్ని పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పి చివరికి వారి పద్ధతిలో 'సెటిల్' చేశారు. మళ్లీ డి.ఎస్.పి. సాగర్, సి.ఐ. శశిభూషణ్ ఇద్దరూ దళితులే. ముందు అసలు ఆ ముగ్గురు అధికార్లపై చర్య తీసుకోవాలని ఇవాళ లక్ష్మింపేట దళితులు, వాళ్లకు అండగా నిలబడుతున్న అనేక సంఘాలు పెడుతున్న డిమాండ్‌లో మరి న్యాయముందా లేదా?

మరో సంఘటన 2011 ఆగస్టు 22న జరిగింది. నివర్తి రాముడమ్మ, దండాసు లత, కలమర్తి చిన్నమ్మడు అనే దళిత స్త్రీలను పట్టుకుని గంట్యాడ అప్పలనాయుడు, అతని సహచరులు కొట్టారు. రాముడమ్మకు కుట్లు కూడా పడ్డాయి. కొన్నాళ్లు ఆస్పత్రిలో ఉంది. వారు వంగర పోలీసులకి ఫిర్యాదు చేసినా ఏమీ చర్య తీసుకోలేదు. రాముడమ్మ భర్త చిత్తిరి వెంకటినే మొన్నటి దాడిలో తరిమి తరిమి కొట్టి చంపారు. జూన్ 12న చనిపోయిన మరో వ్యక్తి చిత్తిరి అప్పడు వెంకటి మామగారు. మాజీ సర్పంచ్ సింహాలమ్మ మరిది. చంపబడిన మరో మృతుడు బూరాడ సుందరరావు వరసరీత్యా ఆమెకు బాబాయి. ఒక దళిత స్త్రీ మొదటిసారి సర్పంచ్ అయినందుకు ముగ్గురు కుటుంబీకులను కోల్పోయి మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

ఇక నాల్గవ సంఘటన 2012 ఏప్రిల్ 11న జరిగింది. చిత్తిరి అప్పడు, అతని భార్య శ్రీదేవి కౌలుకి తీసుకున్న తమ పొలంలో పశువులు పడ్డాయని ఆవు తిరుపతి, గంట్యాడ అప్పనాయుడు, గంట్యాడ వెంకట రమణ, కొనిస చిన్నం నాయుడు, గేదెల కృష్ణమూర్తిలు ''మా మీద కేసులు పెడతార్రా'' అంటూ తిడుతూ వారిపై దాడి చేశారు. అప్పడుని, శ్రీదేవిని, వాళ్ల బాబుని, అప్పడు వదిన అయిన సర్పంచ్ సింహాలమ్మను కూడా బాగా కొట్టారు. ఈ కేసులో శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదుపై దళితులు పెట్టిన ఒత్తిడి మేరకు ఎట్టకేలకు ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక)

చట్టం, 1989 కింద కేసు నమోదు చేసి 8 రోజుల తర్వాత నిందితుల్ని అరెస్టు చేశారు. మూడో రోజుకి వాళ్లు బెయిల్‌పై బైటకొచ్చేసారు. (జూన్ 12న జరిగిన మారణకాండలో ఈ ఐదుగురు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.) ఈ గొడవైన తర్వాత గ్రామంలో పోలీసు పికెట్ పెట్టారు. ఇద్దరు ముగ్గురు కానిస్టేబుల్స్ ఆనాటి నుండి జూన్ 10 వరకు గ్రామంలో ఉంటూ వచ్చారు.

### ఆర్థిక అణచివేత

ఒక్క భౌతిక దాడులకు పాల్పడటమే కాదు, తూర్పుకాపులు దళితులను ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు కూడా మొదలెట్టారు. వృద్ధాప్య పింఛన్లను, గ్రామీణ ఉపాధి హామీ పథకాల పనులను ఆపించడమే కాక దళితుల వీధుల్లో బల్బులు లేకుండా చేయడం వంటి వేధింపు చర్యలకు పాల్పడ్డారు. దళితులు సాగుచేసుకుంటున్న 60 ఎకరాల భూమిలో చొరబడి ట్రాక్టర్లతో దున్నించారు. కలెక్టరుకి ఫిర్యాదు చేస్తే ఇరుపక్షాలపై బైండోవర్ కేసులు పెట్టడంతో మొత్తం వ్యవసాయం ఆగి భూములన్నీ బీడుపడ్డాయి. మా 190 ఎకరాలు దున్ననీయకుండా చేస్తారా అనే ఉడుకుమోత్తనంతో 30 ఏళ్ల నాడు ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువులో దళితులకు ఇచ్చిన 20 ఎకరాల భూమిలో కూడా సాగు చేయడానికి వీల్లేదని తూర్పుకాపులు అడ్డుపడ్డారు. దాంతో అవీ బీడుపడ్డాయి. ఈ 190 ఎకరాలలో తూర్పుకాపులు సాగుచేసుకోలేకపోయినా ఇతర చోట్ల వాళ్ళ భూముల్లో వాళ్లు వ్యవసాయం చేసుకుంటూనే ఉన్నారు.

ఈ విషయాలను దళితుడైన ఆ నియోజకవర్గం శాసనసభ్యుడు, మంత్రి కొండ్రు మురళి దృష్టికి లక్షింపేట దళితులు తీసుకెళ్తే 'ఈ బురదలోకి నన్ను లాగొద్దు' అని చెప్పి పంపేసాడట. అంటే దళితుల జీవనోపాధి సమస్య అతనికి 'బురద'లా అనిపించిందన్నమాట. ఇవన్నీ చూస్తుంటే ఎస్.సి., ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం లక్ష్యం, పరిధి ఒక సగటు లక్షింపేట దళితుడికి అర్థమైనంతగా ఒక రాష్ట్రమంత్రికి, జిల్లా కలెక్టరు, డి.ఎస్.పి., ఆర్.డి.ఓ., తాసీల్దారు, సి.ఐ., ఎస్.ఐ స్థాయి అధికార్లకు అర్థం కాలేదనుకోవాలా?

అది నిజానికి నీటిపారుదల శాఖ భూమి. ఇరువర్గాలకూ చెందదు. కాని ప్రభుత్వం తల్చుకుంటే దాన్ని రెవెన్యూ భూమిగా మార్చి భూమిలేని పేదలకు పంచడం పెద్ద కష్టమేమీ కాదు. అప్పుడు ఆ భూమిని

కరపత్రం

పొందగలిగే హక్కు మొదట దళితులకే ఉంటుంది. భూసేకరణ చట్టం, దళిత సంక్షేమ పథకాలు, చట్టాలు చదువుకునే కదా వారంతా అధికార్లయ్యింది! న్యాయం చేయాలన్న కోరిక లేకపోయాక ఎన్ని చదివినా ఏం లాభం?

దళితులకు ఆర్థిక వనరులు కల్పించి తద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. దళితులపై భౌతికదాడులను నివారించడానికి ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం, 1989 కింద కేసులు నమోదు చేయడం, అరెస్టు చేయడం మాత్రమే కాదు, అధికారులు రకరకాల నివారణ చర్యలు కూడా చేపట్టాలి. అనుమానితులు, నిందితులను ఆ ప్రాంతం నుండి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేయడం, సామూహిక జరిమానా విధించడం వంటి అధికారాలు కలెక్టరు దగ్గర నుండి తాసీల్దారు వరకు అందరు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకూ (ఈ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం) ఉంది. అటువంటి పనులు చేయగల వ్యక్తులకు ఆయుధాల లైసెన్సులు రద్దు చేసి, అవసరమైతే దళితులకు ఆత్మరక్షణ నిమిత్తం ఆయుధాలకు లైసెన్సులు మంజూరు చేయవచ్చని కూడా ఈ చట్టం చెబుతుంది. దళితుల ఫిర్యాదుని రిజిస్టరు చేయకపోతే పోలీసు అధికారికి 6 నెలల దాకా జైలు శిక్ష వేయవచ్చునని కూడా ఆ చట్టంలోని సెక్షన్ 4 అంటుంది.

లక్షింపేట దళితులకు సరైన అర్థంలో న్యాయం జరగాలంటే ఇప్పటికైనా పోలీసులు కేసు దర్యాప్తు సక్రమంగా చేపట్టి నిందితులందరిపై నేరాన్ని రుజువు చేయగల చర్యలన్నీ చేపట్టాలి. శిక్షలు పడేటట్లు చూడాలి. తమ విధులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన పోలీసు, రెవెన్యూ అధికార్లపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి. అవసరమైతే సెక్షన్ 4 కింద వారిపై కేసు నమోదు చేయాలి.

అణచివేతకు గురయ్యే ఏ ప్రజలకైనా న్యాయం చేయడానికి అత్యుత్తమ పద్ధతి వారికి సామాజికంగా, ఆర్థికంగా బలం చేకూర్చడం. అప్పుడు అణచివేతను కొంతమేరకైనా వారే స్వయంగా ఎదుర్కోగల్గుతారు. అణచివేసే వర్గాలు కూడా కొంత మేరకైనా వెనక్కి తగ్గుతాయి. ఇది జరగాలంటే లక్షింపేట దళితులకు అదే గ్రామంలో భూమి కేటాయించి పట్టాలివ్వాలి. వాళ్లు అదే ఊరిలో ధైర్యంగా, గౌరవంగా, గర్వంగా తలెత్తుకు బ్రతికేందుకు నిందితులను సత్వరమే శిక్షించడంతో సహా అన్ని చర్యలూ తీసుకోవాలి.

30-6-2012

# సిఎం గోరూ మా బాధలు ఆలకించరేటి!

ప్రియమైన ముఖ్యమంత్రి గారూ!

మా శ్రీకాకుళం జిల్లాకు మీరు వస్తున్నారని, మూడు రోజులు ఇక్కడే తిరగబోతున్నారని తెలిసి చాలా సంతోషించాము. ఇక్కడ మా సమస్యలూ, బాధలూ అన్నీ మీకు స్వయంగా చెప్పుకుందామని ఎంతో ఎదురుచూశాము. కాని ఇదేమిటి చెప్మా మాకంటే మీకే ఎక్కువ బాధలున్నట్టున్నాయి. సగం జిల్లాను ఒదిలేసి కొన్ని 'సురక్షిత' ప్రాంతాలకు మాత్రమే వెళ్తారట. ఇదేం అన్యాయమండీ సి.ఎం.గారూ!

పలాసా దాకా వచ్చి ఉద్దాన ప్రాంతం చూడకుండానే వెళ్తారా? అక్కడ మీ ప్రభుత్వం వారు వెనకేసుకొస్తున్న థర్మల్ కేంద్రం ఎలాటి చక్కటి ప్రాంతాన్ని బుగ్గి చేయబోతున్నదో చూడరా? 'సోంపేట అనే మాటకే ఉలిక్కిపడే మీ మంత్రిగారు, అధికారులు వీలైతే జిల్లా పటం నుండే ఆ మాటను తొలగించాలని చూస్తున్నారు. మరలాటప్పుడు మీ పర్యటనలో దానికి చోటు ఎలాగుంటుంది? ఉండదు.

మా సోంపేట బీలని కాపాడుకోవడం కోసం ముగ్గురు ప్రాణాల్ని పోగొట్టుకున్న మేము మీరొస్తే నాలుగు ప్రశ్నలు అడుగుదామనుకున్నాం. ఫ్యాక్టరీ అనుమతులు రద్దయిపోయిన తర్వాత ఆ భూమిని తిరిగి తీసుకోవాలి గద? అదెందుకు జరగడం లేదు? బీలను మాకు అప్పగించనవసరం లేదులెండి. ఆ మాయదారి ఎన్.సి.సి. నుండి తీసుకుని మీ ప్రభుత్వ సంరక్షణలో ఉంటే అదే మాకు పదివేలు.

మీరు పక్కనే ఉన్న సంతబొమ్మాలిలో కూడా అడుగెట్టరని తెలిసింది, అక్కడున్న తంపరలో ఈస్ట్‌కోస్ట్ విద్యుత్తు ఫ్యాక్టరీ పెట్టొద్దని ఆందోళన

చేసినందుకు ముగ్గురు రైతుల్ని కాల్చేసింది గదండి మీ కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ ప్రాంతంలో జరుగుతున్న విధ్వంసాన్ని చూడరా మరి? మీరెళ్ళకపోయినా తేలినీలాపురానికి వలసొచ్చిన పక్షులు మీ చుట్టూ చేరి అడుగుతాయి చూడండి. ఇక్కడ మనుషులకే దిక్కులేదు. పక్షుల్నేటి చూస్తామంటారా?

సరేలెండి పీత కష్టాలు పీతకున్నట్లు మీ కష్టాలు మీకుంటాయి.

అన్నట్టు, జీవ వైవిధ్యాన్ని కాపాడాలనే గొప్ప ఉద్దేశంతో మన రాజధానిలో అక్టోబర్ నెలలో ఒక అంతర్జాతీయ సదస్సు పెడుతున్నారని విన్నాము. చాలా సంతోషం. మరి సోంపేట, కాకరాపల్లి ప్రజలు చేస్తున్నది జీవవైవిధ్యాన్ని కాపాడే పనేగదండీ, చిత్తడి భూములను కాపాడుకోవడం కోసం వారి ప్రాణాలనే పణంగా పెట్టారు గద. అటువంటి ప్రాంతానికి కనీసం వెళ్ళకపోవడం ఏమిటి? అక్కడ ప్రజలు అడిగిన ప్రశ్నలకు మీ దగ్గర జవాబులు లేవనే గద!

మొదట రణస్థలం కూడా రావాలని అనుకున్నారట కదా. కొవ్వాడ దగ్గర మత్స్యకారులు అణువిద్యుత్తు వద్దని ఎప్పటినుండో మొత్తుకుంటున్నారు. ఇప్పటికి వాళ్ళ మొర ఆలకించడానికి మీరు వస్తున్నారని తెలిసి భలే సంతోషపడ్డారు. మరెంచేతనో మీరు అక్కడికి కూడా వెళ్లడం లేదని తెలిసింది. ఆ పక్కనే ఎచ్చెర్లలో నాగార్జున పురుగు మందుల కంపెనీ పేలి పెద్ద ప్రమాదం జరిగాక దాన్ని శాశ్వతంగా మూసేయమని చుట్టూ ఉన్న గ్రామస్తులు చాలా గొడవ చేస్తున్నారు. పంట పొలాలు, తాగునీరు పనికి రాకుండా పోయి నానా బాధలు పడుతున్నారు. కాని మీరు ఎచ్చెర్లకు కూడా హ్యాండిచ్చేశారు. జిల్లాలోకి అడుగుపెట్టగానే పైడిభీమవరం దగ్గర ఎదురయ్యే కంపుకిగాని భయపడ్డారా? మందుల కంపెనీల కంపు పీల్చి పీల్చి మేమైతే అలవాటు పడిపోయాములేండి. మా ఊపిరితిత్తులు చిల్లులుపడి జల్లెడయిపోయాయి. ఇదంతా ఒకెత్తు అయితే అణువిద్యుత్తు కేంద్రం ఎంత ప్రమాదమో మీకు తెలియదా రెడ్డి బాబూ? పొయ్యిమీదున్న మమ్మల్ని అణుకుంపట్లోకి నెట్టడం మీకు న్యాయమేనా చెప్పండి.

మామూలుగా మీరు అన్ని వర్గాల ప్రజల్నీ కలుస్తారు కదా! మరి అదేటండి మత్స్యకారులు ప్రజలు కారని మీకు ఎవరైనా చెప్పారా కొంపదీసి? జిల్లాకి ఇంత పెద్ద తీరం ఉంది. లక్షల సంఖ్యలో మత్స్యకారులున్నారు. ఆ తీర ప్రాంతాన్నీ, మత్స్యసంపదనూ, తమ జీవితాలనూ నాశనం చేసే థర్మల్ కేంద్రాలనూ, ఇసుక మైనింగ్‌నూ వద్దనడమే వారు చేసిన పాపమా? ఇలా విస్మరించుకుంటూ పోతే చివరికి ఏ వర్గం ప్రజలు మిగులుతారు బాబు మీరు ముచ్చటించడానికి?

పోనీ ఈ ప్రాంతాల వారంతా పోరాటాలు చేసి మీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టారనుకుందాం. అందుకే వారు మీ దర్శనానికి నోచుకోలేదు అనుకుందాం, మరి లక్ష్మింపేట దళితులు ఏం పాపం చేశారు? లక్ష్మింపేటలో కూడా కారంచేడు, చుండూరులకు ఏమీ తీసిపోని నరమేధం జరిగింది కదా. మీరు వెంటనే శ్రీకాకుళం వచ్చి క్షతగాత్రులను పరామర్శించి కొన్ని ఆదేశాలు జారీచేసి వెళ్ళిపోయారు నిజమే. మరి ఇప్పటికైనా ఆ గ్రామానికి వెళ్ళరా? ఐదుగురిని కోల్పోయిన లక్ష్మింపేట దళితులు మీ రాకకోసం వేచి చూస్తున్నారు.

ముఖ్యమంత్రిగారూ! ఈ జిల్లాను తన ఇష్టానుసారం శాసిస్తున్న మీ ధర్మానగారి మాటలు విని, ప్రజల ఆరాటాలను, ఆవేదనను తాకకుండా తప్పించుకుంటూ చేసే మీ పర్యటన ఎవరికోసం? ప్రజలను, వారి సమస్యలను ఇలాగే తప్పించుకు తిరిగితే ఈసారి మీరు హెలికాప్టర్‌లోనుండే గాలిలో చేతులూపుకుంటూ పర్యటించాల్సి వస్తుందేమో కాస్త ఆలోచించండి.

ఇట్లు శ్రీకాకుళం ప్రజలు

26-7-2012

# మృత్యుగూడలకు ముగింపు ఎప్పుడు?

## 17 మంది ఆదివాసులను హత్యచేసిన సి.ఆర్.పి.ఎఫ్‌ని శిక్షించాలి

30 ఏళ్ల గాయాన్ని మళ్లీ కెలికారు.

ఛత్తీస్‌గఢ్‌లోని సర్కెగూడలో నిష్కారణంగా కాల్పులు జరిపి ఇంద్రవెల్లి దురంతాన్ని మరోసారి గుర్తు చేశారు.

ఆదివాసులపై రాజ్యహింసకు పరాకాష్టగా ఇంతవరకు ఇంద్రవెల్లి ఘటన గురించి చెప్పుకుంటూ వస్తున్నాం. 1981 ఏప్రిల్ 20న జరిగిన ఆ కాల్పుల్లో అధికారికంగా 13 మంది, అనధికారికంగా 60 మంది దాకా చనిపోయారు. అధికారికంగా మాత్రమే చూస్తే సర్కెగూడ కాల్పుల్లో మరణించినవారు అంతకంటే ఎక్కువే. జూన్ 28న జరిగిన ఈ కాల్పుల్లో ఆరుగురు స్కూలు వయస్సు పిల్లలతో సహా మొత్తం 17 మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారు.

ఇంద్రవెల్లిలానే సర్కెగూడ కూడా చాలాకాలంపాటు రాజ్యం క్రౌర్యానికి ప్రతీకగా నిలిచిపోనుంది.

**ఈ కాల్పులకు కారణం?**

గ్రామస్తులను మావోయిస్టులుగా పోలీసులు అనుమానించడమేనట.

**ఆ అనుమానానికి కారణం?**

వాళ్లకైనా తెలుసో లేదో! ఎందుకంటే వాళ్లు గాని, వాళ్ల ఉన్నతాధికారులు గాని, అప్పటి కేంద్ర హోంమంత్రి గాని ఆ గ్రామస్తులను ఎందుకు మావోయిస్టులుగా అనుమానించారో ఇంతవరకు చెప్పలేదు.

ఆ అనుమానం వాళ్లకు ఎందుకు కలిగి ఉండకూడదో చెప్పడానికి మన దగ్గర కనీసం మూడు కారణాలైనా ఉన్నాయి.

1. గ్రామస్తుల సమావేశం పోలీసు క్యాంపుకు చాలా దగ్గరలో జరిగింది. గతంలో పోలీసు క్యాంపుకు అంత దగ్గర్లో మావోయిస్టులు తమ సమావేశాలు జరుపుకున్నట్టు గాని, సెంట్రీలు, మందుపాతర్లు వంటి జాగ్రత్తలు తీసుకోకుండా వాళ్లు అటువంటి సమావేశాలు జరుపుకుంటారని గాని మనకు తెలియదు.

2. విత్తనాల పండగ ఎప్పుడు జరుపుకోవాలనే దానిపై మాట్లాడుకోవడానికి గుమిగూడిన జనం మౌనంగా ఉండే అవకాశం లేదు. మరి అడవిలో, పది గంటల రాత్రి నిశ్శబ్దంలో పోలీసులకు వారి మాటలు వినబడకుండానే ఉంటాయా? ఒక్క నిమిషం ఆలకించినా అవి మావోయిస్టుల ప్రసంగాలా లేక ఆదివాసుల బ్రతుకు బాధలా అనేది పోలీసులకు అర్థంకాకుండా పోయేదా?

3. సి.ఆర్.పి.ఎఫ్ దళాలు ఎంత బుకాయించినా ఆ రాత్రి వాళ్లు తప్ప ఇంకెవరూ కాల్పులు జరపలేదనేది సత్యం. జనంలో నుంచి ఎవరూ తిరిగి కాల్పులు జరపనప్పుడైనా అక్కడున్నవారు మావోయిస్టులు కారు, నిరాయుధులైన ఆదివాసులనేది సి.ఆర్.పి.ఎఫ్ దళాలకు తెలియకుండా ఉంటుందా? సమావేశ స్థలంలో చనిపోయినవారు చనిపోగా మిగిలినవారిని వేటాడి ఇళ్లల్లోకి దూరి మరీ చంపాల్సిన అవసరమేమొచ్చింది?

ఇంత జరిగినా ఆదివాసులకు, మావోయిస్టు సానుభూతిపరులకు, హక్కుల కార్యకర్తలకు తప్ప వేరెవరికీ ఇది పట్టని విషయంగా ఎందుకు ఉండిపోయింది? ఈ ఘటన అడవిలో కాకుండా, చనిపోయింది ఆదివాసులు కాకుండా ఉంటే సమాజం ఇదే విధంగా స్పందించేదా? ఇంతే నిర్లిప్తంగా ఉండేదా? ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాల పట్ల మనకు ఎలాంటి అభిప్రాయాలైనా ఉండొచ్చు. మొత్తంగా నక్సలైట్ ఉద్యమానికి సంబంధించి కూడా ఎలాంటి అభిప్రాయమైనా ఉండొచ్చు. పోలీసులు – మావోయిస్టుల మధ్య సాధారణ ప్రజానీకం నలిగిపోతున్నారు అనుకునేవారు ఉండొచ్చు. రాజ్యాన్ని ధిక్కరించి మావోయిస్టులు సమాంతర రాజ్యం నడుపుతుంటే ప్రభుత్వం చూస్తూ వూరుకుంటుందా అనేవారు కూడా ఉండొచ్చు. కాని ఈ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా అందరూ గౌరవించాల్సిన హక్కులు కొన్ని ఉన్నాయి మన రాజ్యాంగంలో. వాటన్నిటిలోకి ప్రాథమికమైనది జీవించే హక్కు.

ఆదివాసుల జీవించే హక్కుకైతే రాజ్యాంగంలో అదనంగా మరికొన్ని రక్షణలు కూడా ఉన్నాయి. కాని ఏం లాభం? సాక్షాత్తూ ప్రభుత్వ భద్రతా యంత్రాంగమే వారిని నిష్కారణంగా కాల్చి చంపేస్తుంటే ఇది తప్పని అనడానికి, అన్యాయమని అనడానికి ప్రభుత్వానికి, ఈ దేశ ప్రజలకు నోరు పెగలడం లేదే!

## అసలు ఆ రోజేం జరిగింది?

సర్కెగూడ, రాజపెంట, కొత్తగూడ గ్రామాలకు చెందిన ఆదివాసులు ఆ రోజు తమ దినచర్యలు ముగించుకుని సర్కెగూడ, కొత్తగూడల మధ్యనున్న ఖాళీ ప్రదేశంలో గుమిగూడారు. అది వెన్నెలరాత్రి అయినప్పటికీ మబ్బులు కమ్మడంతో బాగా చీకటిగా ఉంది. వారి పూజారి చనిపోవడంతో కొన్ని వారాల క్రితం జరుపుకోవాల్సిన విత్తనాల పండుగ (బీజా పొండుం అంటారు) వాయిదా పడింది. ఆ పండుగ జరుపుకోవాల్సిన తేదీ నిర్ణయం కావాల్సి ఉంది. కొత్తగా కొన్న ఒక ట్రాక్టర్‌ను ఎవరు ఎప్పుడు వాడుకోవాలి, దాని అద్దె ఎంత అనేది నిర్ధారించుకోవాల్సి ఉంది. చేపల పెంపకం గురించి మాట్లాడుకోవాల్సిన విషయాలు ఉన్నాయి. తునికాకు కోసినందుకు రావాల్సిన 10,000/- రూపాయల బకాయిలు ఒకేసారి రావడంతో వాటిని ఏ విధంగా ఉపయోగించాలో చర్చించుకోవాలనుకున్నారు. దాని కోసమే ఆ మూడు గ్రామాలకు చెందిన సుమారు 60 మంది దొర్ల కోయ ఆదివాసులు అక్కడ సమావేశమయ్యారు. వారిలో ఆడా, మగా, పిల్లలూ, పెద్దలూ అందరూ ఉన్నారు. ఆదివాసీ సమాజంతో ఏ కొంచెం పరిచయమున్న వారికైనా తెలుసు ఇటువంటి సమావేశాలు వారు ఎప్పుడూ పొద్దుపోయిన తర్వాతే జరుపుకుంటారని.

సమావేశం జరుగుతుండగా పదిగంటల సమయంలో 200 మందికి పైగా కేంద్ర రిజర్వు పోలీసులు, కోబ్రా కమాండోలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఎటువంటి హెచ్చరికలు లేకుండా విచక్షణారహితంగా కాల్పులు ప్రారంభించారు. పడమర వైపు నుండి మొదలైన కాల్పుల్లో ముగ్గురు ఆదివాసులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆ తర్వాత అన్ని వైపుల నుండి కాల్పులు జరిపారు. భీతిల్లిపోయిన గ్రామస్తులు కేకలు పెట్టుకుంటూ ఎవరి ఊరివైపు వారు పరుగులు తీశారు. అయినా సరే పారిపోతున్న వారిపై కూడా కాల్పులు జరిపారు. ఈ రక్తపాతం అరగంటపాటు సాగింది. తరువాత ఎంత మంది చనిపోయారో నిర్ధారించుకోవడానికి కాబోలు సి.ఆర్.పి.ఎఫ్. దళాలు 'ఫ్లేర్ తుపాకులు' గాలిలో కాల్చి ఆ ప్రాంతాన్ని కాసేపు కాంతిమయం చేశారు. ఆ పని కాల్పులు జరపకముందు చేసుంటే అక్కడ సమావేశమయ్యింది మావోయిస్టులు కాదు, నిరాయుధులైన ఆదివాసులనే విషయం వారికి తెలిసుండేది.

మృతులందరిలోకి చిన్నది కాకా సరస్వతి. వయస్సు 12 ఏళ్ళే. కాకా రాహుల్, మడకమ్ రామ్‌విలాస్‌లు పదవ తరగతి విద్యార్థులు. బసగూడ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. వేసవి సెలవలకు ఇంటికొచ్చారు. చదువుకున్న పిల్లలు లెక్కలు వేయడానికి పనికొస్తారని ఆదివాసీ పెద్దలు వాళ్లని ఆ సమావేశంలో కూర్చోబెట్టారు. కాల్పులు జరిపిన తర్వాత కూడా సి.ఆర్.పి.ఎఫ్ దళాలు తెల్లవారే వరకు అక్కడే కాపు కాసాయి. భయపడి ఇంట్లో దాక్కున్న ఇర్పా రమేష్ తెల్లవారుజామున 5 గంటలకు బయటకు వస్తే అతనిపై మళ్లీ కాల్పులు జరిపారు. తూటా తగిలిన తర్వాత అతను తిరిగి ఇంట్లోకి పాక్కుని వెళుతుంటే పోలీసులు ఇంట్లోకి చొరబడి ఇటుకలతో కొట్టి చంపారు. అతని ఇంట్లో నుండి 5 వేల రూపాయలు కూడా దోచుకున్నారు. మరో రెండు ఇళ్ల నుండి 32 వేలు కాజేశారు. ఐదుగురు మహిళల బట్టలు చింపి బూతులు తిడుతూ అత్యాచారం చేస్తామని బెదిరించారు. ఈ వీరంగం పూర్తయ్యాక గాయపడ్డ ఆరుగుర్ని ఆస్పత్రికి తరలించి చనిపోయిన 16 మంది శవాలను బసగూడ పోలీసుస్టేషన్‌లో పడేశారు. ఇర్పా సురేష్ (15) ఆ మరుసటిరోజు బీజాపూర్ ఆస్పత్రిలో చనిపోయాడు. గ్రామస్తులు గొడవ పెట్టాక గాని శవాలను వాళ్ల వాళ్లకు అప్పగించలేదు. ఇర్పా దినేష్ మృతదేహాన్ని మటుకు మావోయిస్టని చెప్పి పోలీసుస్టేషన్ దగ్గరే పూడ్చిపెట్టారు. మృతులలో ఒక్కడయినా మావోయిస్టు అని చెప్పకపోతే పరువు పోతుందనుకున్నారేమో.

## అబద్ధాలే అబద్ధాలు

ఇక సంఘటన జరిగినప్పటి నుంచీ (అప్పటి) కేంద్ర హోంమంత్రి చిదంబరం విచిత్రమైన సమర్థింపులు, పొంతనలేని ప్రకటనలు, బుకాయింపులు చేస్తూ వచ్చాడు. మొదట అది ఒక పెద్ద మావోయిస్టుల సమావేశమన్నాడు. 'ఆపరేషన్ సిల్గేర్'లో భాగంగా వెళ్తున్న సి.ఆర్.పి.ఎఫ్. దళాలపై సర్కెగూడ వద్ద మావోయిస్టులు కాల్పులు జరిపితే సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు ఆత్మరక్షణార్థం తిరిగి కాల్పులు జరిపారన్నాడు. కరుడు గట్టిన మావోయిస్టు తీవ్రవాదులను అంతమొందించినందుకు సి.ఆర్.పి.ఎఫ్., కోబ్రా దళాలను ప్రశంసించాడు కూడా. అయితే అది వాస్తవం కాదని, అందరూ నిరాయుధులైన ఆదివాసులేననే వార్తలు రావడంతో ఇటువంటి సంఘటనల్లో అప్పుడప్పుడు సామాన్యులు కూడా చనిపోతుంటారన్నాడు. 'సారీ' అని కూడా అన్నాడు కాని చనిపోయిన

కరపత్రం

వారిలో మావోయిస్టులు ఉన్నారని మాత్రం అంటూనే ఉన్నాడు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ అయితే ఇంకొంత ముందుకుపోయి మావోయిస్టులు ఆదివాసులను మానవ కవచాలుగా వాడుకోవడం వల్లే కాల్పుల్లో ఆదివాసులు మరణించారని కట్టుకథ అల్లాడు. గుక్క తిప్పుకోకుండా ఎన్ని అబద్ధాలు చెప్పగలరో అన్ని అబద్ధాలూ చెప్పారు ఇద్దరికిద్దరూ. మావోయిస్టులు సాధారణ ఆదివాసులను మానవ కవచాలుగా వాడినప్పుడు వారిపై కాల్పులు జరపకూడదని చిదంబరం కొత్త జాగ్రత్త చెబుతున్నట్టు హితబోధ కూడా చేశాడు తన బలగాలకు. అంటే ఇన్నాళ్లూ అలాంటి సందర్భాలలో వారిని చంపే అవకాశం చట్టంలో ఉందనుకోవాలా? సాయుధ దళాలు ఎటువంటి సందర్భాల్లో కాల్పులు జరపాలో, ఎప్పుడు జరపకూడదో చెప్పే పోలీసు మాన్యువల్ నిబంధనలను వాళ్లు పూర్తిగా విస్మరిస్తున్నారనే విషయం ఈ ప్రకటనే స్పష్టం చేస్తోంది.

## ఏడేళ్ల రావణకాష్టం

ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ ఆదివాసులు ఎంతో నష్టపోయారు. మావోయిస్టుల ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2005లో సల్వాజుడుంను సృష్టించడం వల్ల అక్కడ ఎంతో ప్రాణనష్టం సంభవించింది. మావోయిస్టులను వ్యతిరేకించే ఆదివాసులకు ఆయుధాలిచ్చి, నేరాలు చేసే లైసెన్సు ఇచ్చి, అప్పటి ఉమ్మడి దంతెవాడ జిల్లా సమాజం మీదకి వదిలిన నేరగాళ్ల గుంపు సల్వాజుడుం. వాళ్లు చేసిన హింస ఇంతా అంతా కాదు. ఐదేళ్లలో 644 ఆదివాసీ గ్రామాలను తగలబెట్టారు. సుమారు వెయ్యిమంది ఆదివాసీ పౌరులను చంపారు. వందకు పైగా స్త్రీలపై లైంగిక అత్యాచారాలు జరిపారు. పెద్దెత్తున లూటీలు చేశారు. సుమారు 70 వేల మంది ఆదివాసులను అడవుల్లోని వాళ్ల గ్రామాల నుంచి బలవంతంగా తీసుకొచ్చి రహదార్లపై ఏర్పాటు చేసిన పశువుల కొట్టాల్లాంటి శిబిరాల్లో ఉంచారు. సల్వాజుడుం హింసను తట్టుకోలేక కనీసం లక్షమంది ఆదివాసులు మన రాష్ట్రానికి పారిపోయి వచ్చారు. వాళ్లు ఖమ్మం, దంతెవాడ, బీజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాల్లో, అడవిలో నివాసాలు ఏర్పర్చుకుని ఉంటున్నారు. బతకలేక వచ్చారనే సానుభూతి అయినా లేకుండా మన రాష్ట్ర పోలీసులు, అటవీశాఖవారు వారిని నిత్యం వేధింపులకు గురిచేస్తూ దాడులు చేస్తూనే ఉన్నారు. అప్పుడప్పుడు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కూడా వచ్చి వాళ్లని హింసిస్తుంటారు. పోలీసులే కాదు యావత్తు ప్రభుత్వ యంత్రాంగమూ విపరీతమైన అభద్రతలో బతుకుతున్న ఈ వలస ఆదివాసులను విదేశీ చొరబాటుదారులుగానో, సంఘవ్యతిరేక శక్తులుగానో చూస్తోంది.

సర్కెగూడ, కొత్తగూడ, రాజపెంట గ్రామస్తులనే ఉదాహరణగా తీసుకుంటే 2005లో సల్వాజుడుం మూకలు ఆ ఊళ్ల మీద పడి బీభత్సం సృష్టించి, ఇళ్ళు ధ్వంసం చేసినపుడు వాళ్లు అక్కడ నుండి పారిపోయి ఖమ్మం జిల్లా అడవుల్లో తలదాచుకున్నారు. 2009లో ధైర్యం కూడదీసుకుని తమ గ్రామాలకు తిరిగెళ్లి ఇప్పుడు ఈ మారణహోమానికి గురయ్యారు. ఇలాంటి ఊర్లెన్నో! ఆదివాసులకు ఆదివాసీయేతర ప్రపంచం ఇచ్చిందేమిటి అని చూస్తే బాధా, కన్నీళ్లు, హింస తప్ప మరేమీ కనిపించవు. ఇవన్నీ మావోయిస్టుల ఏరివేత పేరిట జరిగిపోతున్నాయి. వాస్తవం ఏమిటో తెలుసుకోవాలనే ఓపిక లేనివారు ప్రభుత్వ ప్రచారాన్ని నమ్మేస్తున్నారు. సమర్ధిస్తున్నారు. పౌర సమాజంలో ఆ సమర్ధన ఉంది కనకనే ఇంత విచ్చలవిడిగా సర్కెగూడ వంటి ఘాతుకాలకు పాల్పడి బైటపడగల్గుతోంది ప్రభుత్వం.

ఆఖరుకి సుప్రీంకోర్టు 2011 జూలై 5న సల్వాజుడుం వంటి రాజ్యాంగేతర శక్తుల ప్రయోగాన్ని తక్షణం నిలిపివేయాలని ఆదేశిస్తే ఆ పని చేయకపోగా ఆ దళాలకు అధికారిక హోదా కల్పించి వాటిని రాష్ట్ర 'ఆర్మ్డ్ ఆగ్జిలరీ ఫోర్స్'గా నామకరణం చేసి, ఇంకా ఆధునిక తుపాకులు వాళ్ల చేతిలో పెట్టి వారి జీతాలను పెంచింది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం. అంటే నేరగాళ్ల ముఠాలను క్రమబద్ధీకరించిందన్న మాట. ఇదీ సుప్రీంకోర్టుకి, దేశ రాజ్యాంగానికి వారిచ్చిన గౌరవం.



### సిబిఐ బృందంపైనే దాడి

గత ఏడాది మార్చి నెలలో సుక్మా జిల్లా కొంటా బ్లాక్‌లోని చింతల్‌నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు రోజుల వ్యవధిలో కోయ కమాండోలు (ఇప్పుడు అధికారికంగా రద్దయిన సల్వాజుడుం మూకలకు మరోపేరు), కోబ్రా బెటాలియన్ వారు కలిసి తాడిమెట్ల, మోర్‌పల్లి, తిమ్మాపురం గ్రామాలపై పడి బీభత్సం సృష్టించారు. ముగ్గురు ఆదివాసీ స్త్రీలపై లైంగిక అత్యాచారం జరిపి, ముగ్గురు ఆదివాసీ పురుషులను కాల్చి చంపి మొత్తం 320 ఇళ్లను తగలబెట్టారు. సుప్రీంకోర్టు గత ఏడాది సల్వాజుడుంపై ఇచ్చిన తీర్పులోనే ఈ సంఘటనపై సిబిఐ దర్యాప్తు చేయాలని ఆదేశించింది. దర్యాప్తు చేయడానికి వెళ్లిన సి.బి.ఐ. బృందంపైనే ప్రస్తుతం ఆర్మ్డ్ ఆగ్జిలరీ ఫోర్స్‌గా చలామణి అవుతున్న సల్వాజుడుం నేరగాళ్లు దాడి చేశారు. స్థానిక ఎస్.పి. నివారించబోతే అతన్ని కూడా కొట్టినంత పని చేశారు.

2009 సంవత్సరం చివర్నుంచి జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల్లోను, ఆ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లోనూ, మావోయిస్టులను 'ఏరివేయడానికి' కేంద్ర ప్రభుత్వం లక్షల సంఖ్యలో పారా మిలిటరీని, ప్రత్యేక దళాలను దించింది. అప్పట్నుంచి ఆ ప్రాంతాలన్నిట్లోనూ హింస మరింత పెరిగింది. మావోయిస్టు ఉద్యమం విసురుతున్న సవాళ్లను ప్రభుత్వం రాజకీయంగా ఎదుర్కోవాలని, అణచివేత దానికి జవాబు కాదని హక్కుల సంఘాలు చాలాకాలం నుంచి చెబుతూ వస్తున్నాయి. మావోయిస్టులు కూడా సంఘర్షణాత్మక వాతావరణాన్ని పెంచే పనులు చేయకూడదని విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం.

నిర్బంధం ద్వారా కాకుండా వేరే ఏ రకంగా నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కోవచ్చనే విషయంపై ప్లానింగ్ కమిషన్ 2007లో ఒక నిపుణుల కమిటీని వేసింది. దీనిలో బాలగోపాల్ గారు సభ్యులు. నక్సలైట్లను ఎదుర్కోవడానికి 40 ఏళ్లపాటు నిర్బంధాన్ని ఒక ప్రధాన సాధనంగా ప్రభుత్వాలు ఉపయోగించాయని, దానివల్ల సాధారణ ప్రజలు చాలా నష్టపోయారని, హింసకు గురయ్యారని, చనిపోయారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఏ సమస్యలకు నక్సలైట్లు ప్రజలకు పరిష్కారం చూపించగల్గుతున్నారో ఆ సమస్యలకు రాజ్యాంగంలో, చట్టాల్లో పరిష్కారాలున్నాయని, వాటిని అమలు చేయాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. అదే సరైన జవాబు అవుతుంది కాని నిర్బంధం కాజాలదని నొక్కి చెప్పారు. ప్రభుత్వం మాత్రం ఈ విలువైన సూచనలను పక్కనపెట్టి బలప్రయోగం ద్వారానే నక్సలైట్లను నిర్మూలించాలని చూస్తూ ఉంది. సర్కెగూడ ఊచకోత ఈ వైఖరి పర్యవసానమే. రాబోయే రోజుల్లో ఇటువంటి హింస మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికే మంచినీరు మొదలు విద్య, వైద్యం వరకు నిత్యజీవితావసరాలే తీరక ఎన్నో అగచాట్లు పడుతున్న వాళ్ల జీవితాలతో ప్రభుత్వం ఈ విధంగా చెలగాటమాడటం ఏ రకంగా చూసినా చాలా అన్యాయం. ఈ వాతావరణాన్ని నిలువరించడానికి ప్రజాస్వామ్యాన్ని కాంక్షించేవారంతా మరింత గట్టిగా గొంతువిప్పాలని కోరుతున్నాం.

1-8-2012

## శిథిల సంక్షేమం

### వసతి గృహాల్లో క్షేమమూ సంక్షేమమూ రెండూ కరువే

సంక్షేమ హాస్టళ్ల దుస్థితి గురించి ఈ మధ్య మీడియాలో కథనాలు విశేషంగా వచ్చాయి. నిత్యం వినడానికి అలవాటు పడిపోయిన అవినీతి వార్తలు విన్నట్లే వీటి గురించీ నిర్లిప్తంగా విన్నాము, చదివాము. ముల్లులా గుచ్చుకుంటున్నప్పటికీ కొన్ని సమస్యలను 'అవంతేలే' 'షరా మామూలే' అనుకొని వదిలేయడానికి అలవాటు పడిపోతాం. ప్రభుత్వ బాధ్యతల, ప్రాధాన్యతల జాబితాలో మొట్టమొదటన ఉండాల్సిన 'సంక్షేమం' ఊరి చివరి దళిత వాడలా చిట్టచివరికి జారిపోతున్నా దాన్ని కూడా 'అదంతేలే' అనుకుని సరిపెట్టేసుకుంటున్నాం.

కరపత్రం

రాష్ట్రంలోని ఎస్.సి. ఎస్.టి, బి.సి. సంక్షేమ వసతి గృహాలలో నివసిస్తున్న విద్యార్థులు చాలా దయనీయ స్థితుల్లో జీవిస్తున్నారు. అనేక హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. ఇరుకు అద్దె కొంపల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అద్దె బకాయిలు తీర్చకపోవడంతో ఖాళీ చేయండంటూ ఇళ్ల యజమానులు డిమాండ్ చేస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. సొంత భవనాలు ఉన్నచోట దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. లీకవుతున్న, పెచ్చులూడుతున్న స్లాబులూ, గోడలూ పిల్లల్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. నీటి వసతి లేని హాస్టళ్ల సంఖ్యకు కొదవ లేదు. బాలికల హాస్టళ్లలో మరుగుదొడ్ల స్థితి వర్ణనాతీతం. బాలల వసతి గృహాలలోనైతే మరుగుదొడ్లు కూడా ఉండట్లేదు. మరుగుదొడ్లు ఉన్నచోటయినా వాటిని మరమ్మత్తు చేయించాలనే ఇంగిత జ్ఞానం కూడా ప్రభుత్వానికి గానీ, అధికారులకు గానీ ఉన్నట్లు కనిపించదు. వారి ఉదాసీనత ఎంతవరకు వెళ్లిందనేది

ఉదహరించడానికి విశాఖపట్నానికి కూతవేటు దూరంలో ఉన్న భీమిలిలోని ఒక ఎస్‌సి హాస్టల్ భవనం గురించి చెప్పుకోవాలి. వానలకు నాని గోడల్లో కరెంటు ప్రవహించడం గమనించి కూడా పిల్లలకు ఏమవుతుందోననే చీకూ చింతా లేకుండా అధికారులు గడిపేస్తున్నారన్న వాస్తవం మనలో భయాన్ని రేకెత్తిస్తుంది. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల మరమ్మత్తుల కోసమని ఒక్కోదానికి సుమారు రూ. 1.7 లక్షలను కేటాయించినట్లు మొన్న మే నెలలో ప్రకటించింది. మరమ్మత్తులను జులై 2012 కల్లా పూర్తిచేయాలని ఆదేశాలను కూడా ఇచ్చింది. కానీ ఇంతవరకూ నిధులు విడుదల చేసిన పాపాన మటుకు పోలేదు.

## సంక్షేమానికి గ్రహణం

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రైవేటు వ్యక్తుల ద్వారా ప్రభుత్వం వసతి గృహాలను నిర్వహించేది. ఆర్థిక అక్రమాల నేపథ్యంలో వాటి నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత 1973-74 నుంచి సాంఘిక సంక్షేమ శాఖే వాటిని నిర్వహించడం మొదలెట్టింది. ఎంత లోపభూయిష్టంగా నడిచినప్పటికీ ఈ వసతి గృహాలు సత్ఫలితాలనే ఇచ్చాయని చెప్పుకోవాలి. అనేక ఆందోళనలకు స్పందనగా, ప్రభుత్వ సంక్షేమభావనలో భాగంగా హాస్టళ్లకు క్రమేణా సొంత భవనాలూ, విద్యార్థులకు దుప్పట్లూ, దుస్తులూ, ట్రంకుపెట్టెలూ, భోజన సదుపాయాలూ, నోట్ పుస్తకాలూ వగైరా సౌకర్యాలన్నీ వచ్చాయి. ఎనభైల వరకూ ఈ వరవడిలో కొనసాగిన వసతి గృహాలకు ఆ తర్వాత గ్రహణం పట్టింది.

వసతి గృహాలను ప్రభుత్వమే నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టింది. పిల్లల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు దారి మళ్లాయి. హాస్టళ్లలో చదువుకునేందుకు ముందుకు వచ్చే ఎస్.సి, ఎస్.టి. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినా వసతి గృహాల సంఖ్య ఆ నిష్పత్తిలో పెరగలేదు. కనీస సదుపాయాల కల్పనలో పూర్తి ఉదాసీనత మొదలయ్యింది. ఇప్పుడైతే హాస్టళ్లలో చేరేవారి సంఖ్య తగ్గిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. అది నిజమే కూడా. దీనికి కారణంగా ఎన్నో విషయాలను ప్రభుత్వం చెబుతున్నప్పటికీ హాస్టళ్లు అధ్వాన్నంగా తయారవ్వడం, పరిశుభ్రత లోపించడం, పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించే అధికారులు కరువవడం వంటి విషయాలను తల్లిదండ్రులు దానికి ప్రధాన కారణాలుగా ఎత్తి చూపుతున్నారు. నిజానికి హాస్టళ్లకు డిమాండ్ ఉన్న ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఒక హాస్టల్లో

100కు మించి సీట్లు ఇవ్వకూడదని సెక్రటరీ స్థాయి అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు.

స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొంటోంది. నిజానికి హాస్టళ్లను ఎత్తివేయడానికే ఈ ఎత్తుగడ అని విమర్శలు వస్తున్నాయి. ఒక పూట స్కూల్‌లోనూ, రెండోపూట హాస్టల్లోనూ పిల్లలు తినాలని చెప్పి మధ్యాహ్న భోజనాన్ని హాస్టళ్లలో ఎత్తేసారు. మధ్యాహ్నం ఎలాగూ స్కూల్లో పిల్లలకు భోజనం దొరుకుతోంది కదా, ఇక అలాంటప్పుడు ఒక పూట కోసమని చెప్పి బందిలదొడ్ల లాంటి హాస్టళ్లకు పంపడం ఎందుకు అని అనుకునే స్థితికి తల్లిదండ్రులను ఈ పథకం చేర్చింది. పోనీ ఆ మధ్యాహ్న భోజనం ఏమైనా నాణ్యమైనదా అంటే అదీ లేదు.

## కూలిన ట్యూటర్ల వ్యవస్థ

ప్రభుత్వ బడుల్లో చదువులు అంతంత మాత్రంగా తయారయ్యాయని ట్యూటర్లను నియమించారు. బడులలో చదువుల నాణ్యత తగ్గిన నేపథ్యంలో, విద్యార్థులపట్ల టీచర్ల వ్యక్తిగత శ్రద్ధకు ఆస్కారం లేని పరిస్థితులలో ఈ ట్యూటర్ల వ్యవస్థ కొంతవరకు సంక్షేమ హాస్టళ్ల పిల్లలకు ఉపయోగపడింది. పిల్లల మానసిక, శారీరక, మేధో అవసరాలన్నంటినీ ఈ ట్యూటర్ల వ్యవస్థ తీర్చింది అనలేము గాని విద్యార్థులకు చదువు అబ్బడానికి బాగానే దోహదపడింది. ట్యూటర్లకు ఇచ్చే గౌరవవేతనాన్ని రూ.500 కు మించి కొన్నేళ్లుగా పెంచకపోవడంతో టీచర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దాంతో చివరకు ఈ వ్యవస్థా కుప్పకూలిపోయింది.

ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో పిల్లలకు ఏడాదికి రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలి. వాటికి కుట్టుకూలి జతకి కేవలం రూ. 40 చెల్లిస్తున్నారు. చిన్నపిల్లల గౌను కూడా ఏ దర్జీ ఆ ధరకు కుట్టడంలేదిప్పుడు. పైపెచ్చు ఆ డబ్బును కూడా ఎప్పటికో గాని ఇవ్వట్లేదు. కాస్మటిక్ చార్జీలు జనవరి 2012 నుంచి అనేక చోట్ల రాలేదు. భోజనం, ఉదయం టిఫినూ, సాయంత్రం స్నాక్స్ అన్నీ కలిపి ఏడవ తరగతి లోపు పిల్లలకయితే నెలకు రూ. 470, ఏడు నుంచి పది లోపు వారికయితే రూ. 500 చెల్లిస్తున్నారు. అంటే రోజుకు కేవలం రూ 17

అన్నమాట. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేటి రోజులలో ఆ ధరతో నేటి పిల్లలకు పౌష్టికాహారం పెట్టడం సాధ్యమవుతుందా? నీళ్లచారూ, పప్పునీళ్లూ, నాసిరకం బియ్యంతో వండిన అన్నం ఇవీ వారికి పెడుతున్న పంచభక్ష్యాలు. ఆదివారంపూట బిర్యానీ, ప్రతిరోజూ స్వీటూ లేదా పండూ, మజ్జిగా, వివిధ రకాల కూరగాయలూ, సాంబారూ, పులిహోరా వగైరా అన్నీ అయ్యవార్ల రిపోర్టులలోనే, నోటీసు బోర్డుల మీదే. కంచాల్లో మటుకు కటిక మెతుకులే. ఇంత దరిద్రంలోనూ వార్డెన్ల అవినీతికి కొదవలేదు. అందరూ అని కాదు కాని పిల్లల పొట్టకొట్టే అవినీతి అధికారుల, వార్డెన్ల సంఖ్య తక్కువేమీ కాదు.

ఇక కాలేజి, ఉన్నత చదువులు చదివే ఈ వర్గాల విద్యార్థులకు ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ ఇచ్చేసి విద్యను అందించే సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం కొన్నేళ్ల క్రితమే మొదలయ్యింది. చివరకు అది కూడా భారమయినట్టుంది! రోజుకో మాట మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది.

## సంక్షేమ బాధ్యత ప్రభుత్వాలదే

ఒక పక్క విద్యా వైద్య రంగాలను బలహీనపరచిందీ పాలకులే. ఈ విషయంలో తరతమ భేదం లేదు, పార్టీలు ఏవైనా పరిస్థితి అదే. మరోపక్క పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం గురించి మాట్లాడుతున్నదీ వారే. బడులనూ, కాలేజీలనూ, ఆసుపత్రులనూ పట్టించుకోవడం మానేసి పథకం ప్రకారం సర్వనాశనం చేసి ఇప్పుడేమో నాణ్యమైన విద్యయినా, ఆరోగ్య రక్షణ అయినా ప్రయివేటు వ్యవస్థలోనే సాధ్యం అంటున్నారు. ప్రభుత్వ రంగంలో టీచర్లు చదువు చెప్పరు, వైద్యులు వైద్యం చేయరు, మేము మీకు డబ్బిస్తాం గదా, దానితో మీరు నాణ్యమైన అవకాశాలు పొందవచ్చు అని చెప్పుకు వస్తున్నాయి ప్రభుత్వాలు. ఈ వ్యవహారం ఎంత సజావుగా నడుస్తుందో ఇటీవలి ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల ఫీజు మడతపేచీ, ప్రభుత్వ ఊగిసలాట ధోరణులు తేటతెల్లం చేసాయి.

సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వాలు వైదొలగుతున్నాయి. ఆ బాధ్యత తమకు లేదని స్పష్టంగా చెబుతున్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ విధానాలు రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఆరోగ్యం, స్వేచ్ఛ, గౌరవం కలిగిన పరిస్థితుల్లో పిల్లలు ఎదగడానికి తగిన సౌకర్యాలనూ, అవకాశాలనూ, కల్పించాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో రాసుకున్నాము. ఆదాయాలలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ, స్థితిగతులలోనూ అసమానతలను తొలగించే

దిశగా ప్రభుత్వం తన విధానాలను రూపొందించాలని 38వ ఆర్టికల్‌లోని క్లాజ్ 2 చెబుతోంది. ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీనవర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, ప్రజల జీవన ప్రమాణాలను, ఆరోగ్యాన్ని పెంపొదించే బాధ్యతలను ప్రభుత్వం ప్రాథమిక విధిగా భావించాలని 46, 47 ఆదేశిక సూత్రాలు చెబుతున్నాయి. విద్యాహక్కు చట్టం 6 నుంచి 14 ఏళ్ళ వయసు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను గ్యారంటీ చేస్తూనే ఆ బాధ్యతను ప్రయివేటు రంగానికి అప్పచెప్పింది. సంక్షేమం పట్ల ప్రభుత్వానికి లేని బాధ్యత ప్రయివేటు రంగానికి ఎందుకు ఉంటుంది? ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సంక్షేమ సూత్రాలకు అనుగుణంగా ఉండకపోగా ఉద్దేశ్యపూర్వకంగా ఈ వర్గాల ప్రజలకు విద్యను తిరస్కరిస్తున్నాయి. రాజ్యాంగంలో పొందుపర్చుకున్న ఈ లక్ష్యాలేవీ ఎవరో రాసినవి కావు. అనేక సామాజిక సంఘర్షణల ఫలితంగా ఒక రాజకీయ ప్రక్రియ ద్వారా ఒక విలువగా, ప్రమాణంగా, హక్కుగా వచ్చి చేరినవి. ఇప్పుడు ప్రభుత్వాలు తమకు సంక్షేమ బాధ్యత లేదన్నా, దొడ్డి దారిన తప్పుకున్నా మనం ఒప్పుకోవలసిన అవసరం లేదు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద కాకుండా ఒక హక్కుగా సంక్షేమాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని మనమంతా గుర్తిద్దాం. దాని కోసం ఉద్యమిద్దాం. ప్రభుత్వం ఎందుకు దిగిరాదు?

విశాఖ జిల్లా కరపత్రం

15-9-2012

# బాలగోపాల్ యాదిలో
# హక్కుల సదస్సు

ప్రస్తుతం హైదరాబాద్‌లో జీవవైవిధ్యం మీద ఒక అంతర్జాతీయ సమావేశం జరుగుతున్నది. 150 దేశాల ప్రతినిధులొచ్చి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికి మనమంతా కలిసి తీసుకోవలసిన చర్యల గురించి సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. ఇదంతా జీవరాశులమీద నిజంగా ప్రేమతో చేస్తున్నారా లేక జీవవైవిధ్యాన్ని కోల్పోవడం మానవ మనుగడకే ప్రమాదకరమన్న భయంతో చేస్తున్నారా అనేది పక్కన పెడితే ఈ స్పృహ ప్రభుత్వాలలో కలిగించిందెవరు? ఈ చెట్లను నరికేస్తే మాకు వర్షాలు రావు, ఈ కొండల్ని పగలగొడితే మా నదులు పారవు, ఈ రసాయనాలు వాడితే మా చేపలు చనిపోతాయి... ఇలాంటి ఎన్నో వ్యక్తి స్థాయి, గ్రామస్థాయి ఉద్యమాలు జరిగితే ఈ అవగాహన ఒక వైపు నీటివనరుల సంరక్షణ ఉద్యమాలుగా, అటవీ పరిరక్షణ ఉద్యమాలుగా, కాలుష్య వ్యతిరేక ఉద్యమాలుగా; మరోవైపు వన్యసంరక్షణ కేంద్రాలుగా, అభయారణ్యాలుగా, జీవవైవిధ్య ప్రాంతాలుగా రూపుదిద్దుకుంటూ వచ్చి ఇవ్వాళ అంతర్జాతీయ ఒడంబడికల స్థాయికి ఎదిగాయి. అంటే ఇదంతా ప్రజల వివేకం నుంచి పుట్టిందే. వారి ఆందోళనల ఫలితంగా రూపుదిద్దుకున్నదే.

కింది నుంచి పైకి వెళ్ళిన ఈ జ్ఞానం స్థానిక ప్రభుత్వాల బుర్రల్లోకి మాత్రం ఎందుకు వెళ్ళలేకపోతోంది? ఇంత పెద్ద సమావేశం ఇక్కడ జరగబోతోందని తెలిసి కూడా మన రాష్ట్ర ప్రభుత్వం గత ఐదారేళ్ళలో పర్యావరణ రీత్యా ఎంతో ప్రాముఖ్యమున్న ప్రాంతాలను పోలవరం వంటి భారీ డ్యాంలకు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, సెజ్‌లకు, కోస్టల్ కారిడార్లకు, ఓపెన్‌కాస్ట్ గనులకు, బాక్సైట్ తవ్వకాలకు, యురేనియం వెలికితీతకు, అణువిద్యుత్ కేంద్రాలకు ధారాదత్తం

చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కుడిచెయ్యి ఏం చేస్తున్నదో ఎడమ చెయ్యికి తెలియదనుకోవాలా? వ్యాపార ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టవనుకోవాలా? ఒకవైపు సముద్ర తీర ప్రాంతాలను, చిత్తడి నేలలను, మడ అడవులను, సహజ వ్యవసాయాన్ని... కాపాడేందుకు ప్రయత్నిస్తున్నవారిని శత్రువులుగా పరిగణిస్తూ, వారి మీద కేసులు పెడుతూ, కాల్పులు జరుపుతూ, ప్రాణాలు తీస్తూ మరోవైపు హోర్డింగ్‌ల ద్వారా, ప్రకటనల ద్వారా, రోడ్డు నడిమధ్యలో పచ్చదనం నింపడం ద్వారా జీవవైవిధ్య ప్రాముఖ్యం గురించి మనకే చెప్పబూనుకోవడం ఏ రకమైన దగుల్బాజీతనం? పర్యావరణ వాత్సల్య రాష్ట్రంగా వచ్చే బ్రాండ్ ఇమేజ్ కంటే సదస్సు నిర్వహణ వల్ల హైదరాబాద్‌కు వచ్చే బ్రాండ్ ఇమేజ్ దానికి ఎందుకు ఎక్కువయింది? ఇంగితజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరికీ తోచే ప్రశ్నలివి. కాని మన ప్రభుత్వం మాత్రం వీటికి సమాధానం చెప్పడం తన బాధ్యత అనుకోవడం లేదు.

బాలగోపాల్ గారి మూడవ వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇదొక ప్రధాన అంశం. 'ప్రపంచీకరణ – జీవవైవిధ్యం – ప్రత్యామ్నాయాలు' అనే అంశం మీద ప్రముఖ పర్యావరణవేత్త ఆశిష్ కొఠారి మాట్లాడతారు.

ఇటీవల వార్తల్లో ఎక్కువగా కనిపిస్తున్న ఒక ప్రజాందోళన తమిళనాడులోని కూడంకుళం ప్రజలది. మెడలోతు నీళ్ళలో, ఇసకలో నిలబడి తమకు రాబోయే పీకల్లోతు కష్టాల గురించి ప్రపంచానికి తెలియజెపుతున్నారు వాళ్ళు. ఫుకుషిమా అణురియాక్టర్ దుర్ఘటన తర్వాత కూడా వారి న్యాయమైన భయాందోళనలకు స్పందించని ప్రభుత్వాలను ఏమనాలి? ఈ విషయంలో ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలిత వరకూ అందరూ అణుశక్తి గొప్పతనం గురించి అవే మాటలు మళ్లీ మళ్లీ వల్లెవేస్తున్నారు తప్ప ప్రపంచానికంతటికీ తెలిసిన చేదు అనుభవాల ఊసు ఎత్తడం లేదు. చేపలు పట్టుకుని బతికే మత్స్యకారులే చెర్నోబిల్ గురించి, ఫుకుషిమా గురించి, అణుధార్మిక శక్తి ప్రపంచానికి చేయబోయే హాని గురించి మాట్లాడాల్సి వస్తోంది. ఆ మాటలు మాట్లాడుతున్నందుకు, అణువిద్యుత్ కేంద్రాన్ని అడ్డుకున్నందుకు ఒకళ్లిద్దరి మీద కాదు వేల మంది మీద ప్రభుత్వం

కరపత్రం

కేసులు పెట్టింది. ఒక పదివేల మంది మీద అయితే ఏకంగా రాజద్రోహం కేసులే పెట్టింది. ఇక్కడ రాజెవరు? అణుశక్తా? ఆ పరికరాలను, ఇంధనాన్ని మనకు అమ్ముతున్న అమెరికన్ కంపెనీలా?

> బాలగోపాల్‌గారు మనందరికీ దూరమై మూడు సంవత్సరాలైంది. ఈ మూడేళ్లలో రాష్ట్రం, దేశం ఎదుర్కొన్న అనేక సమస్యలు ఆయన్ని మనకు మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూనే ఉన్నాయి. తెలంగాణ ఆకాంక్ష అన్ని విధాలా న్యాయమైనదని ప్రకటించిన వ్యక్తి ఎన్నేళ్ళయినా పరిష్కారం దిశగా అంగుళం ముందుకు కదలని ఆ ఉద్యమం గురించి ఏ పరిష్కారాలను సూచించేవారో; హక్కుల ఉద్యమం కారంచేడు నుంచి ఎంతో నేర్చుకుందని పదే పదే చెప్పిన వ్యక్తి నాలుగు నెలలు గడిచినా లక్షింపేట దళితుల ఊచకోతపై చార్జిషీటు దాఖలు చేయని పోలీసులకు ఎన్ని రాజ్యాంగ'పాఠాలు' నేర్పేవారో; రాబోయే కాలమంతా ఛత్తీస్‌గఢ్‌లో రక్తపుటేరులు పారతాయి, దాన్ని నిలువరించడానికి ముందుకు రండి అని 2006 లోనే మేధావులను క్రియాశీలుల్ని చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి రాజ్యం తూటాలకు బలైన సర్కెగూడ ఆదివాసుల కోసం దేశమంతా తిరిగి ఎంత మద్దతు కూడగట్టేవారో; వాన్‌పిక్ తదితర ప్రాజెక్టుల్లో అందరూ కేవలం స్కాంలనే చూస్తుంటే వాటి వెనక పొంచి ఉన్న విధ్వంసక అభివృద్ధి మహమ్మారి గురించి ఎన్ని విశ్లేషణాత్మక వ్యాసాలు రాసి ఉండేవారో; మళ్ళీ మొదలైన రైతుల ఆత్మహత్యలు, సుప్రీంకోర్టుకి వెళ్ళి ఆగిపోయిన వాకపల్లి రేప్ కేసు, చమురు వెలికితీత వల్ల కుంగిపోతున్న గోదావరి డెల్టా... ఇలా హక్కుల ఉద్యమం తన సామర్థ్యాన్ని, పనితనాన్ని నిరూపించుకోవాల్సి వచ్చిన ప్రతి సందర్భం ఆయనను గుర్తు చేసింది. సాధించిన కొద్దిపాటి విజయాలలో బాలగోపాల్‌గారి గుర్తులను వెతుక్కుంటూ ముందుకు సాగడమొక్కటే మేము ఆయనకు ఇవ్వగల నివాళి.

ఈ పోరాటం కూడంకుళం మత్స్యకారులు తమ నేల కోసం, తమ జీవనం కోసం జరుపుతున్న పోరాటంగానే చాలామందికి కనిపించవచ్చు. కాని అటువంటి ఒక అణువిద్యుత్ కేంద్రం మన దాకా రాకుండా, దాని దుష్ఫలితాలు మన పిల్లల దాకా రాకుండా మనందరి తరఫున ఆ బరువును వాళ్లు తమ భుజాల మీద మోస్తున్నారనే సంగతి మనం మర్చిపోకూడదు.

బాలగోపాల్ గారి మూడో వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇది మరొక ముఖ్యమైన అంశం. 'అణువిద్యుత్- కూడంకుళం

పోరాటం' గురించి ఆ పోరాట సంఘీభావ కమిటీలో సభ్యుడూ, రచయితా, సామాజిక కార్యకర్తా అయిన నిత్యానంద్ జయరామన్ మాట్లాడతారు.

ప్రతి ఉద్యమం, ఆందోళన, పోరాటం ఏదో ఒక దశలో కోర్టులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఉంది ఇవ్వాళ మన దేశంలో. కాని జీవితం, జీవనం కోల్పోతున్న వాళ్లు కోర్టులను ఆశ్రయిస్తున్నంత వేగంగా కోర్టులు వారి ఫిర్యాదుల మీద స్పందించడం లేదు. అభివృద్ధి పథకాల పేరు మీద జరుగుతున్న విధ్వంసం, సాగుతున్న పోలీసు నిర్బంధంపై న్యాయ నిర్ణయాలు వెలువడడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. నర్మదా నుంచి సోంపేట వరకు, వేదాంత నుంచి కూడంకుళం వరకు అందరూ ఆ క్యూలో నిలబడే ఉన్నారు ఇప్పటికీ. ఒక నరోడా పాటియా కేసులో, ఒక వాకపల్లి కేసులో ఎంతో కొంత న్యాయం సాధించుకున్నందుకు ఇవ్వాళ మనం సంతోషిస్తుండవచ్చు కాని ఎంత జాప్యం తర్వాత, ఎంత ప్రయత్నం తర్వాత వాటిని మనం సాధించుకోగలిగామో చూసినవాళ్ళు కోర్టుల మీద అదే ఆశను ఉంచుకోగలరా?

బాలగోపాల్ గారి మూడవ వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇది కూడా ఒక ముఖ్య అంశం. 'సామాజిక న్యాయసాధనలో చట్టం పాత్ర'పై సుప్రీంకోర్టు లాయరు నిత్యా రామకృష్ణన్ మాట్లాడతారు. అందరూ ఆహ్వానితులే.

4-10-2012

# నాగరిక సమాజానికి మరణశిక్షలు తగవు

'**భా**రత ప్రజల మనోభావాలను' సంతృప్తిపర్చడానికి దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక పక్క మరణ శిక్షలు విధిస్తోంది. మరో పక్క ప్రతిపక్షాన్ని అరికట్టి రేపటి ఎన్నికలలో ఓట్లు దండుకోవచ్చనే ధోరణిలో కేంద్ర ప్రభుత్వం వరుసపెట్టి వాటిని అమలు చేస్తూ పోతోంది. న్యాయస్థానం సున్నితంగా, యు.పి.ఏ ప్రభుత్వం మొరటుగా చెప్పదలచుకున్నది ఒక్కటే. ఇవాళ జాతి అహం బలికోరుతోందని, అందుకోసం మరణశిక్ష జాబితాలో ఉన్నవారిని బలివ్వడానికి తాము సిద్ధమేనని.

2014 ఎన్నికలయ్యేలోపు తగినన్ని ఉరిశిక్షలు విధించి తిరిగి అధికారం చేజిక్కించుకునే వరకు ఈ మృత్యుహేల సాగేట్లు ఉంది. ఒక్కసారి ఇన్ని ఉరిశిక్షలు అమలు చేయడం మునుపెన్నడూ మన దేశంలో జరగలేదు. పైగా గుట్టుచప్పుడు కాకుండా ఆఖరు నిమిషం వరకు ఉరితీసే వ్యక్తికి గాని, వారి బంధువులకు గాని చెప్పకుండా జరిగిన చరిత్ర అసలే లేదు.

అజ్మల్ కసబ్‌ని ఉరితీసీ తీయగానే మరి అఫ్జల్ గురు మాటేమిటని బిజెపి వర్గాలు గగ్గోలు పెట్టేసరికి హడావిడిగా అతన్నీ ఉరి తీసేశారు. అఫ్జల్‌ని ఉరితీసిన మూడవ రోజుకి కాని అఫ్జల్ భార్యకు కబురందలేదు. ఎక్కడ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారోననే అనుమానంతోనే సకాలంలో ఆమెకు కబురు చేయలేదని స్వయంగా హోమంత్రే ఒప్పుకున్నాడు. ఈ విధంగా కోర్టుల ప్రమేయాన్ని అరికట్టే గుట్టుచప్పుడు ఉరితీతలకు శ్రీకారం చుట్టింది యు.పి.ఏ ప్రభుత్వమే. ఒక పక్క సమాచార హక్కుకి, పారదర్శకతకు రాజ్యాంగ హోదా, శాసన రూపం కల్పించి మరో పక్క అతి విలువైన జీవించే హక్కును కాపాడేందుకు కావాల్సిన సమాచారాన్ని నిరాకరించడం ఎంతటి వైరుధ్యం!

అఫ్జల్ గురు విషయంలో భారత ప్రభుత్వం అతి దారుణంగా ప్రవర్తించింది. మృత్యువు అంచున ఒక వ్యక్తిని నిలబెట్టి అతను బ్రతుకుతాడో, చనిపోతాడో తేల్చకుండా ఏళ్లకు ఏళ్లు గడిపేస్తే అతను, అతని కుటుంబ సభ్యులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో ఊహించడం కష్టమైన పని కాదు. 'సరైన కారణం లేకుండా మరణశిక్షలు అమలు చేయకుండా కాలయాపన చేసి ఆ ఖైదీని మానసిక చిత్రవధకు గురిచేస్తే అతని మరణశిక్షను రద్దు చేయాలని' గతంలో సుప్రీంకోర్టే తీర్పు ఇచ్చింది. అఫ్జల్‌గురుకు సుప్రీంకోర్టు 2005 ఆగస్టు 4న మరణశిక్ష ఖరారు చేయగా 2006 నవంబరు 8న అఫ్జల్ భార్య క్షమాభిక్ష అర్జీ పెట్టుకున్నారు. ఆ తర్వాత ఏడేళ్ల పాటు అతని జీవితం చావు బ్రతుకుల మధ్య వేళ్లాడింది. ఇంత ఆలస్యం జరిగింది, మరణశిక్షను రద్దు చేయమని కోరుతూ వేసిన పిటిషనుపై కోర్టు తీర్పు చెప్పేలోపే కేంద్ర ప్రభుత్వం అఫ్జల్ గురును ఉరి తీసేసింది. కేవలం ఎన్నికల ఎత్తుగడలో భాగంగా మరణశిక్ష జాబితాలో ఉన్నవారిని కేంద్ర ప్రభుత్వం ఇలా చంపుతూపోతూ ఉంటే చూస్తూ ఊరుకుందామా?

ఈ ధోరణి అఫ్జల్‌ని ఉరితీయడంతో ఆగలేదు. వీరప్పన్ అనుచరులు సైమన్, మాదయ్య, బిలవేంద్రన్, జ్ఞాన ప్రకాశ్‌లకు క్షమాభిక్ష పెట్టడానికి రాష్ట్రపతి నిరాకరించినట్లు వార్తలు వెలువడ్డాయి. కర్ణాటకలో మగ్గుతున్న మరో మరణ శిక్ష ఖైదీ సాయిబన్న నింగప్ప నాటికార్‌కి కూడా క్షమాభిక్ష నిరాకరించారు. అయితే ఈ రెండు కేసుల్లో సుప్రీంకోర్టు కలుగజేసుకోవడంతో వారి ఉరిశిక్షలు తాత్కాలికంగా ఆగాయి.

13 మందికి మరణశిక్షలు విధించడంలో పొరపాట్లు జరిగాయని, ఆ శిక్షలను వెంటనే రద్దు చేయాలని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు 14 మంది రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి గత ఏడాది విజ్ఞప్తి చేశారు. మరణశిక్షలు 'అతి అరుదైన సందర్భాల్లోనే' విధించాలని, ఆ సందర్భాలు ఎటువంటివో వివరిస్తూ 1980లో సుప్రీంకోర్టు 'బచ్చన్‌సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్' కేసులో తీర్పు చెప్పింది. మరణశిక్షలు విధించేటప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పే ఇప్పటికీ ఈ విషయంలో మార్గదర్శకం. అయితే ఈ తీర్పుకు 1996లో సుప్రీంకోర్టే 'రాజీవ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్' అనే కేసులో పొరపాటుగా అర్థం చెప్పింది. ఆ తప్పుడు భాష్యంపై ఆధారపడి వివిధ కేసుల్లో దోషులుగా

ఉన్న 13 మందికి అప్పట్లో మరణశిక్షలు విధించేశారు. ఇప్పటికే ఇద్దరు ఆ పొరపాటుకి బలైపోయారు కూడా. మిగిలిన వారికైనా ప్రాణభిక్ష పెట్టమని ఆ మాజీ న్యాయమూర్తులు ప్రాధేయపడ్డారు. ఈ విధమైన సందేహాన్ని అఫ్జల్‌గురు కేసులో కూడా లేవనెత్తారు న్యాయవాదులు. కానీ ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకుని వెళితే తీర్పు తారుమారయ్యే ప్రమాదముందని గ్రహించి ఆగమేఘాల మీద ప్రభుత్వం అతన్ని ఉరితీసింది.

వారు ఆ విధంగా భయపడడానికి కారణముంది. 1996లో చిలకలూరిపేట బస్సు దహనం కేసులో చలపతి, విజయవర్ధన్‌ల జీవితాలను ఇటువంటి ఆఖరు నిమిష ప్రయత్నాల వల్లే హక్కుల సంఘాల వారు కాపాడగలిగారు. ఈ విధంగా మరణ శిక్షలను జీవిత ఖైదు శిక్షలుగా మార్చిన సందర్భాలు అనేకం.

పార్లమెంటుపై దాడికి కుట్రపన్నిన కేసులో ప్రత్యక్ష ప్రాత్రధారులందరూ దాడిలోనే మరణించారు. ఇటువంటి కేసుల్లో రుజువంటే ఏ మాత్రం సందేహానికి అవకాశం లేని రుజువు అని అర్థం. దాడికి పాల్పడ్డ వ్యక్తులకు అఫ్జల్ పరిచయస్తుడని, వారితో ఫోనులో సంభాషించాడనే సాక్ష్యం మినహాయించి మరే సాక్ష్యం లేదు. ఒక మనిషి ప్రాణాలను తీయడానికి ఈపాటి సాక్ష్యం సరిపోతుందా అనే సందేహాన్ని తేల్చకుండా సుప్రీంకోర్టు 'భారత ప్రజల మనోభావాలను' దృష్టిలో పెట్టుకుని అఫ్జల్ గురుకి ఉరిశిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి అఫ్జల్ గురుకి సరైన న్యాయ సహాయం అందలేదని స్వయంగా సుప్రీంకోర్టే ఒప్పుకుంది. మరి న్యాయ సహాయం అందించకుండా, సక్రమమైన న్యాయ విచారణ జరపకుండా అతనికి మరణశిక్ష విధించడం 'దేశ ప్రజల మనోభావాలను' ఎందుకు దెబ్బతీయదు? అసలు దేశ ప్రజల మనోభావాలను' దృష్టిలో పెట్టుకుని అఫ్జల్‌కి శిక్ష విధించారంటేనే అఫ్జల్ శిక్షార్హుడు కాబట్టి శిక్ష విధించారని కాదు కదా. పాకిస్తాన్‌కో, ఇస్లాం పేరిట హింసకు పాల్పడే సంస్థలకో గుణపాఠం చెప్పడమే వారి ప్రధాన ఉద్దేశంలా కనిపిస్తోంది. ఎవరికో బుద్ధి చెప్పడానికి ఇచ్చే తీర్పులు తీర్పులనిపించుకుంటాయా? అటువంటి న్యాయం న్యాయమనిపించుకుంటుందా? 'ప్రజల మనోభావాల'పై ఆధారపడి తీర్పులిస్తూ పోతే మనం ఎక్కడ తేలతాం? అది ఏమైనా అనిపించుకుంటుంది కానీ చట్టబద్ధ పాలన అయితే అనిపించుకోదు.

లింగం, వర్గం, కులం, మతం, జాతి వంటి అంశాల్ని అర్థం చేసుకోవడంలో ఒక్కో న్యాయమూర్తి ఒక్కో ధోరణి ప్రదర్శిస్తారు. అది వారి ఆలోచించే పద్ధతి, నమ్మకాలు, ఇష్టాయిష్టాలు, వ్యక్తిత్వాలు మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. రాజస్థాన్‌లో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రయత్నించి గ్రామ పెద్దల చేత

అత్యాచారానికి గురైన బన్వారీ దేవి కేసునే తీసుకుందాం. అగ్రవర్ణాలకు చెందిన గ్రామ పెద్దలు ఒక దళిత స్త్రీపై అత్యాచారం చేసే అవకాశం లేదని కోర్టు ఆమె కేసుని కొట్టేసింది. ఈ విధంగా పొరబడి తీర్పులిస్తే వేరే కేసుల్లోనైతే సరిదిద్దుకోవచ్చు. మరణశిక్ష కేసుల్లో ఎలా సరిదిద్దగలరు? పొరపాటు జరిగిందని నాలుక కరుచుకుంటే సరిపోతుందా? ఒక నిండు ప్రాణానికి మనమిచ్చే విలువ ఇంతేనా?

> నేరాలు ఘోరంగా ఉన్నాయని శిక్షలు ఘోరంగా ఉండాలా? కాలు నరికినవాడికి కాలు నరకడమే శిక్ష అని ఎవరూ అనరు. కానీ హత్యా నేరం విషయంలో చంపిన మనిషికి చావే శిక్ష అంటారు. కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షా విధానం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం. తప్పుచేసిన వ్యక్తిని సంస్కరించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తయారుచేసి బయటకు పంపే శిక్షాస్మృతే నిజంగా నైతికమైనది.
>
> –కె. బాలగోపాల్

కరపత్రం

వివక్షకు అవకాశముందనేది కొన్ని కేసులను, సంఘటనలను పక్కపక్కన పెట్టి చూస్తే తేటతెల్లంగా అర్థమవుతుంది. అజ్మల్ కసబ్, అఫ్జల్ గురులకు హుటాహుటిన మరణశిక్షలు అమలు చేసేసిన ప్రభుత్వం గుజరాత్ మారణహోమం విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నదో చూస్తూనే ఉన్నాం. 2002లో గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ సారథ్యంలో జరిగిన ఊచకోతలో రెండువేల మందికి పైగా మృతి చెందారు. ఆ మారణహోమం జరిగి ఒక దశాబ్దం అవుతున్నా కేసుల విచారణ ఇప్పటికీ సవ్యంగా జరగడం లేదు. సాక్ష్యాలు పెట్టడమే కష్టమవుతోంది. 69 మంది మృతికి దారితీసిన గుల్బర్గా సొసైటీ దహనకాండ కేసులో పార్లమెంట్ మాజీ సభ్యుడు ఎహ్సాన్ జాఫ్రీ భార్య జాకియా జాఫ్రీ వేసిన ప్రైవేటు కంప్లెయింట్ ఇంకా ఆమె నిరసన పిటిషన్లు వేసే స్థితిలోనే ఉంది. ఊచకోత కేసులో 97 మందిని దగ్గరుండి చంపించిన గుజరాత్ మాజీ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మాయా కొద్నానీకి జీవిత ఖైదు మాత్రమే విధించారు. ఆ దురాగతం ఎంతో దారుణమైనదైనా మేము ఆమెకు జీవిత ఖైదు విధించమనే చెబుతాం. మేము ప్రాధేయపడేదల్లా ఆమెకే కాదు కసబ్, అఫ్జల్ గురు లాంటి వారికి కూడా అదే విధంగా జీవితఖైదుల విధించమని. తీర్పులు చెప్పేటప్పుడు ఇటువంటి సమదృష్టి లోపించే అవకాశముందనే మరణశిక్షలు అసలు వద్దంటున్నాం. బిజెపి ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీని దెబ్బతీయాలంటే అతనికన్నా అతివాద నిరంకుశ

ధోరణిని అవలంబించాలని యు.పి.ఏ ప్రభుత్వం అనుకున్నట్లుంది. అటువంటి విధ్వంసక రాజకీయాలకు అఫ్జల్‌లాంటి వారి రాజకీయ హత్యలు అవసరం మరి.

ఈ రాజకీయాలకంతటికీ కారణం మరణశిక్షలకి ప్రజా ఆమోదముందనే ప్రభుత్వ గట్టి నమ్మకం. ప్రజా ఆమోదం పొందిన ప్రతిదీ ప్రజాస్వామికం కానవసరం లేదు. ఒక్కోసారి అత్యంత అప్రజాస్వామిక భావాలకు కూడా ప్రజా ఆమోదం లభిస్తుంది. 'నిర్భయ' అత్యాచార కేసులో వీధుల్లోకి తరలివచ్చిన జనావళిలో కొంతమంది స్త్రీలపై అత్యాచారాలు ఆగాలంటే మరణశిక్షలే పరిష్కారమని నినాదాలిచ్చారు. కసబ్, అఫ్జల్ గురులను ఉరితీసినప్పుడు వేడుకలు జరుపుకున్నవారున్నారు. ప్రజలు మరణశిక్షలు కోరుకుంటున్నారనే సాకుతో ఈ అమానవీయ శిక్షను కొనసాగించాలని ప్రభుత్వ ప్రయత్నం. మరణశిక్షలు కొనసాగాలని ప్రజలందరూ కోరుకుంటున్నారా అంటే అదీ లేదు. అదే ఢిల్లీ అత్యాచార వ్యతిరేక ఆందోళనకారుల్లో మరణశిక్షలు పరిష్కారం కాదనే బలమైన వాదన కూడా వ్యక్తమైంది. ఎన్నో ఏళ్లుగా స్త్రీల సమస్యలపై పనిచేస్తున్న మహిళా ఉద్యమకారులు, విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు, ఆందోళనకారులు చేసిన వాదనలకు సంతృప్తి చెంది వర్మ కమిటీ అత్యాచారం కేసుల్లో మరణశిక్షణను సిఫార్సు చేయలేదు. కఠ్రపెత్తనం చేయడానికి మోడీ అవసరం లేదు మేము సరిపోతాం అని నిరూపించుకోవడానికి కాబోలు ప్రభుత్వం హడావిడిగా ఆర్డినెన్స్ జారీ చేసి ఈ కేసుల్లో కూడా మరణశిక్షను చొప్పించింది. ప్రమాదకరమైన ఈ ధోరణిని అరికట్టకపోతే అనాగరిక శిక్షల సంఖ్య రానురాను మరింత పెరిగే అవకాశముంది.

మరణ శిక్షల భయానికి ప్రజలు నేరాలకు పాల్పడటం మానేస్తారనే భావన కొంతమందిలో బలంగా నాటుకుపోయింది. ఇందుకు ఎటువంటి ఆధారాలు లేవు. భారత శిక్షాస్మృతి అమల్లోకి వచ్చి 153 సంవత్సరాలైనా దేశంలో హత్యలు ఆగలేదు. మరణశిక్ష మరి ఎవర్ని భయపెట్టినట్లు? అలాగే మరణశిక్షలు రద్దు చేసిన దేశాల్లో నేరాలు పెరిగిన దాఖలాలు కూడా లేవు.

ఇంతెందుకు... మరణశిక్ష అనేది ఆదిమ ప్రతీకార నీతికి ప్రతీక అనేది స్పష్టం. ప్రతీకారేచ్ఛ అమానవీయమైనది. అప్రజాస్వామికమైనది. అందుకే మరణశిక్షలను రద్దు చేయాలనేది ఒక విలువగా ప్రతిపాదిస్తూ వచ్చాం. వాస్తవానికి మరణశిక్షణను రద్దు చేయాలనే వాదన ఇప్పుడు అంతర్జాతీయంగా బలం పుంజుకుంది. ఇప్పటికే 142 దేశాలు మరణశిక్షలను చట్టంలోకాని, ఆచరణలోకానీ రద్దు చేశాయి. ప్రజాస్వామిక వాదుల ఈ వాదన ప్రపంచమంతటా

హోరెత్తిపోతుండగా మన దేశం మటుకు పూర్తిగా వ్యతిరేక దిశలో ప్రయాణించడం విషాదకరం.

ఒక వ్యక్తి తన చుట్టూ సంక్లిష్టంగా అలుముకున్న పరిస్థితులు, ముసిరే ఆలోచనల్లో చిక్కుబడిపోయి నేరాలకు పాల్పడతాడు. అటువంటప్పుడు ఆ వ్యక్తిని ఆ సామాజిక విలువల నుండి, పరిస్థితుల నుండి వేరు చేసి అతనొక్కడికే శిక్ష విధించడం న్యాయమనిపించుకోదు. వ్యక్తికైతే మరణ శిక్ష విధిస్తారు కాని సమాజానికి విధించడం సాధ్యపడదు కదా. వివాదాలను మనం ఏ విధంగా పరిష్కరించుకుంటామనేది మన మానవీయతను రుజువు చేస్తుంది. మనసులో అంతటి విద్వేషాన్ని, ప్రతీకారేచ్ఛని పెంచిపోషించుకుంటే అవి ఎటువంటి పరిష్కారాలకు దారితీస్తాయి? విద్వేషం, ప్రతీకారేచ్ఛలు మరింత విద్వేషాన్ని, మరింత ప్రతీకారేచ్ఛను పెంచిపోషిస్తాయి కానీ సమస్యను పరిష్కరిస్తాయా? బుద్ధుడు, గాంధీలు పుట్టిన ఈ దేశంలో ప్రతీకార నీతిపై ఆధారపడిన ఈ మరణశిక్షల వ్యవస్థను రద్దు చేయాలని, నిర్మూలించాల్సింది నేరాన్ని, నేరస్తుణ్ణి కాదని, అది సంస్కరణ ద్వారానే సాధ్యమని మేము పదేపదే చెబుతూ వస్తున్నాం. అంటే నేరస్తులందర్నీ యథేచ్ఛగా సమాజంలో తిరుగాడనివ్వాలనేది మా భావం కాదు. వారిని తప్పకుండా శిక్షించాల్సిందే, కానీ నేరాల నివారణపై, నేరస్తుల సంస్కరణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలనేదే మా వాదన.

మరణశిక్షలకు ఎక్కడో చోట మనలాంటి వారు ఆమోద ముద్ర వేయబట్టే ఇవి మన దేశంలో ఇంకా కొనసాగుతున్నాయనేది మనం మర్చిపోకూడదు. కంటికి కన్ను, పంటికి పన్ను అన్న ప్రతీకార భావం సమాజంలో లేకపోతే వాటిని ప్రభుత్వం కూడా మన మీద రుద్దలేదు. ఇప్పటికైనా మేల్కొని దేశాన్ని కమ్ముకొస్తున్న మరణశిక్షల పెనుభూతాన్ని ఆలస్యం కాక ముందే అరికడదాం. మరణశిక్షల జాబితాలోకి ఎక్కి చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ప్రాణాలను కాపాడదాం. మరణశిక్షను శాసనం నుండే శాశ్వతంగా తొలగించాలని గట్టిగా డిమాండ్ చేద్దాం. మనలోని, సమాజంలోని మానవీయతను నిలుపుకుందాం.

5-3-2013

# హక్కుల రాములును 'యాది' చేసుకుంటూ హక్కుల సాధనకు సంఘటితం అవుదాం

వరంగల్ కోటలో పుట్టి, అడుగులేస్తూ, కోటగోడలు దాటి, గ్రామాలు దాటి, కాలేజీలు, యూనివర్సిటీలోంచి నడుచుకుంటూ రాష్ట్రమంతటా తిరిగి హక్కుల గురించి జనంలో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో కూడా అడుగులేసిన బుర్ర రాములు మరణించి రెండు సంవత్సరాలు కావస్తుంది. ఈ రెండు సంవత్సరాల్లో వరంగల్ జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా, ఏ హక్కుల ఉల్లంఘన వినబడ్డా, కనబడ్డా అయ్యో రాములు సార్ లేకపోయే అని అనుకుంటూనే ఉన్నాం. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో పూర్తిగా విలువలు పడిపోయినాయి. అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతూనే ఉంది. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల పక్షాన ఉండడంతో అడవుల్లో ఆదివాసీల వనరులను, గ్రామాలల్లో పేదల భూముల్ని స్వాహా చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతూనే ఉంది. పోలీసుల తమదైన పద్ధతిలో ప్రజలపై అత్యాచారాలు, ఎన్‌కౌంటర్ హత్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావలసిందే అన్న ప్రజల ఆకాంక్షలను అడ్డం పెట్టుకొని రాజకీయ పార్టీలు, సంస్థలు కపట నాటకాలు ఆడుతూనే ఉన్నాయి. దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడూ లేనటువంటి దగుల్బాజీ రాజకీయ నాటకం నడుస్తూ ఉంది. వరంగల్‌లో కూడా మినహాయింపు లేకుండా రాజకీయ నాయకులందరూ భూముల్ని వాళ్ళ ఖాతాలో చేర్చుకుంటూనే ఉన్నారు. పేదలు, నిస్సహాయులైన ప్రజలు ఇవన్నీ చూస్తూ, అయ్యో వాటిపై ధైర్యంగా, బలంగా గొంతెత్తి మాట్లాడే రాములు సార్ లేకపోయెనే అని బాధపడ్తూనే ఉన్నారు. ఇట్లా మాట్లాడగలిగిన రాములుకు జీవితారంభంలో ఖిలా వరంగల్‌లోని పరిస్థితులు, ప్రజలు స్ఫూర్తిగా ఉన్నారు. అతి మామూలు గౌడ కుటుంబంలో జన్మించిన రాములుకు, ఖిలా వరంగల్‌లో ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో బలంగా ఉన్న విప్లవ పార్టీ ఓనమాలు నేర్పింది. అక్కడి యువకులతో, ప్రజలతో,

కార్మికులతో మమేకం అయి సమాజాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలపట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని అరికట్టే పద్ధతులకోసం వెతకడం మొదలుపెట్టాడు. అప్పుడు బలంగా ఉన్న ప్రగతి శీల విద్యార్థి ఉద్యమంలో ఆయనకు పరిష్కారాలు కనబడ్డాయి. కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమంలో క్రియాశీల కార్యకర్తగా మొదలై నాయకుడిగా ఎదిగి తన ప్రగతిశీల దృక్పథాన్ని పదునుపెట్టుకున్నాడు. విప్లవ పార్టీతో అనుబంధం పెంచుకొని ఇంకా విస్తారంగా సమాజాన్ని, దాన్ని నిర్దేశిస్తున్న చోదక శక్తులను అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. విస్తారంగా గ్రామాలు తిరిగాడు. ప్రజలను కలిసాడు. విప్లవ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఇదంతా చేస్తూనే చదువు, పరిశోధన పూర్తిచేసి కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా చేరాడు. చాలామంది ఉపన్యాసకుల లాగా తరగతి గదికే పరిమితం కాకూడదని, బయట సమాజంలో కూడా పనిచేస్తూ, తను ప్రజల నుంచి నేర్చుకున్న విజ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకోవాలనుకున్నాడు. తన సామాజిక దృక్పథాన్ని బలోపేతం చేసుకోవడానికి, నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు పోవడానికి హక్కుల సంఘం తనకు తగ్గ సంస్థ అనుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో 1984లో చేరి, హక్కుల రంగంలో కృషి చేయడమే తన లక్ష్యంగా భావించి విస్తృతంగా పర్యటించాడు. దేశంలో, రాష్ట్రంలో ఏ ప్రాంతంలో హక్కుల ఉల్లంఘన జరిగినా అక్కడికి బాలగోపాల్‌తో కలిసి వెళ్ళాడు. తీవ్ర నిర్బంధ పరిస్థితిలో వరంగల్‌లో హక్కుల సంస్థకు ఇబ్బందులేర్పడినప్పుడు, ధైర్యంగా ప్రభాకర్‌రెడ్డితో కలిసి సంస్థ బాధ్యతలు చేపట్టాడు. రౌడీలు, సారా కాంట్రాక్టర్లు, కుహనా రాజకీయ నాయకులు ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాన్ని ఎలుగెత్తి ఖండించాడు.

1996లో హక్కుల తాత్విక దృక్పథం విషయంలో జరిగిన చర్చలో క్రియాశీలకంగా పాల్గొని, 1998లో స్వతంత్ర హక్కుల సంఘంగా ఏర్పడ్డ మానవహక్కుల వేదికలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ, రెండేళ్ళ తరువాత సంస్థకు మొదటి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. హక్కుల సంస్థలో విలువలకు ప్రాధాన్యత ఉండాలని చెపుతూ, సంస్థ కార్యక్రమాల్లో ఏ అవకాశాన్ని వదలకుండా రాష్ట్రంలో, రాష్ట్రం బయట పర్యటించాడు. వరంగల్‌లో అంబేడ్కర్, ఫూలే ఆలోచనా విధానాన్ని

హక్కుల కోణంలోంచి పరిశీలించడానికి ఒక సంస్థను ఏర్పరచడంలో తనవంతు పాత్రను పోషించాడు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాన్ని, దానివల్ల నిర్వాసితులైన ప్రజల బాధలను ఎప్పటికప్పుడు ప్రజల భాషలో వ్యాసాలు రాశాడు.

రాములు సాహిత్య సృజన కూడా చేశాడు. కథలు, వ్యాసాలు రాసాడు. రాజకీయ తరగతుల్లో అనేక అంశాలపై బోధన చేసాడు. తెలంగాణ ఉద్యమంలో తప్పుడు విధానాలను విమర్శించి, ప్రజల కోణం నుండి తెలంగాణ ఎలా సాధించాలో విశ్లేషించాడు. టి.ఆర్.ఎస్ పార్టీ వెలుపల స్వతంత్ర ప్రజాస్వామిక ఉద్యమ ఆవశ్యకతను వివరించాడు. ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూనే, కుటుంబం పట్ల బాధ్యతగా ఉండేవాడు. భార్య స్వరూప అనారోగ్యం పాలైనప్పుడు కృంగిపోయాడు. కూతుర్ల వివాహం విషయంలో ప్రజాస్వామికంగా వ్యవహరించాడు.

న్యాయం, నిబద్ధత జీవితంలో కొలబద్దలుగా పెట్టుకున్న రాములు వైపు అన్యాయానికి గురైన వాళ్లంతా చూసేవారు. కుటుంబంలో తగాదా, ఆస్తి తగాదాలు, స్త్రీలపై హింస, భార్యాభర్తల జీవితంలో ఒడిదుడుకులు, మార్కెట్లో చిన్న వ్యాపారస్తుల, హమాలీల సమస్యలు లాంటి అన్ని అంశాలలో హక్కుల చట్రంలో న్యాయం చెప్పేవాడు. ఇట్లా రచ్చబండలో కూర్చొని న్యాయం చెప్పడం ఒక పనిగా పెట్టుకున్నాడు. రాములు మరణించిన తరువాత ఈ పాత్ర నిర్వహించే వ్యక్తి ఖిలాలోనే కాకుండా వరంగల్‌లోనే లేకుండా పోయాడని ప్రజలు అనుకుంటుంటారు. ఇటువంటి విలువలు పుణికిపుచ్చుకున్న వ్యక్తి కోసం ప్రజలు ఆరాటపడుతున్నారు. రాములు మరణించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆయనను జ్ఞాపకం చేసుకుందామని ప్రజలు కోరుతున్నారు. ఆయనను జ్ఞాపకం చేసుకోవడానికి, ఆయన చేసిన కృషిని నిలబెట్టి ముందుకు పోవడానికి, సంసిద్ధం కావడానికి 'రాములు యాది'లో పాలుపంచుకోవడానికి రావలసిందిగా మీ అందరిని 'మానవహక్కుల వేదిక' ఆహ్వానిస్తుంది.

వరంగల్ జిల్లా కరపత్రం

10-5-2013

# అధికార వ్యవస్థల పనితీరును సమీక్షిస్తూ వుండటమే ప్రజాస్వామ్యం

అధికార వ్యవస్థకు పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని దేశవ్యాప్తంగా పెద్దెత్తున చర్చ జరుగుతుంటే ప్రజల దైనందిన జీవితాలపై ఏ విధంగా నిఘా పెంచాలా అనే ఆలోచనలో ప్రభుత్వం మునిగి తేలుతోంది. పోలీసు స్టేషన్లలో బాధిత స్త్రీల కేసులు నమోదు చేయడం లేదు కాని విశాఖ సముద్రతీరాన, వీధుల్లో, అన్ని బహిరంగ ప్రదేశాల్లో సి.సి కెమెరాలు అమర్చారు. సామాన్య ప్రజలపై నిఘా పెట్టేకంటే ఈ సి.సి కెమెరాలు పోలీసు స్టేషన్లలో అమరిస్తే వేధింపులకు గురౌతున్న ఆడపిల్లల కేసులు పోలీసులు ఏమాత్రం పట్టించుకుంటున్నారో అర్థమౌతుంది.

కరపత్రం

విశాఖపట్టణం పేదల బస్తీలలో నివాసులను గుర్తించడానికి బయోమెట్రిక్ విధానాన్ని వాడుతున్నారు. ఆధార్ కార్డుల పేరిట బయోమెట్రిక్ విధానం ద్వారా ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తున్నారు. ఇదంతా స్త్రీల భద్రత, పట్టణీకరణ, ఆహార హామీ పథకం తదితర ప్రజా ప్రయోజనాల పేరిట జరిగిపోవడం విషాదం.

ఉపాధి హామీ (ఎన్.ఆర్.ఇ.జి) పథకం కింద కనీస వేతనాలు చెల్లించమని కోర్టు ఆదేశించినా ఇవ్వము పొమ్మని కోర్టుల్లో కౌంటర్లు దాఖలు చేసే ప్రభుత్వమే కొవ్వాడ వంటి ప్రాంతాల్లో అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణం కోసం బహుళజాతి సంస్థలకు కోటానుకోట్ల రాయితీలు ఇస్తోంది. ఇటువంటి ప్రభుత్వ విధానాలపై ఉండాల్సిన నిఘా కొరవడింది. అభివృద్ధి పేరుతో పేదప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తూ ఎందరో నిర్వాసితులను తయారు చేస్తున్నారు. ఉన్న ఊర్లలో వారిని నిలవనీయడం లేదు. పొరుగూర్లలో ఆసరా ఇవ్వడం లేదు.

భీమ్లీ నుండి అనకాపల్లి వరకు అన్ని ఊళ్లను, కొండలను కబళిస్తూ, పల్లెకార్ల జీవితాలను ధ్వంసం చేస్తూ జి.వి.ఎం.సి విశాఖ 'సుందరీకరణ' కొనసాగిస్తోంది. నగరవాసులపై విశాఖ పోర్టు ట్రస్టు వెదజల్లుతున్న కాలుష్యాన్ని నిలువరించే విషయంలో ఏ చర్యకూ పూనుకోవడం లేదు. విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో సుందరీకరణ అంటే మసిబారిన భవనాలు, వీధుల నిండా నల్లటి దుమ్మూధూళి. పక్కనున్న చావులమదుమును తలపిస్తాయి ఈ జీవన ఆవాసాలు. జీవవైవిధ్యం కాపాడాలని అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. పారిశ్రామిక దుర్ఘటనలు జరిగి ప్రజలు దిక్కుతోచని స్థితిలో పరిగెడుతూంటే పారిశ్రామిక భద్రతా మండలి, కాలుష్య నియంత్రణా మండలి మాటకు పెదవి విప్పడం లేదు. పరిశ్రమ స్థాపన కోసం పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలను (ఇ.ఐ.ఏ. నివేదికలు) ఆమోదించడానికి మాత్రమే ఉన్నామన్నట్లు ప్రవర్తిస్తోంది కాలుష్య నియంత్రణా మండలి. వారి పనితీరుపై ఎటువంటి నిఘా ఉండదు. ఒక్క విశాఖ జిల్లాలోనే ఈ ఏడాది ఏడెనిమిది పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగాయి. ఒక్క సంస్థపై కూడా చర్య తీసుకున్న దాఖలాలు లేవు.

పట్టణీకరణ సమస్యలను అడ్డంపెట్టుకుని పేదల బస్తీలు ఖాళీచేయించి వారికి ఎటువంటి వసతులు కల్పించకుండా పట్టణ శివార్లకు తరిమేశారు. పునరావాసం పేరిట మధురవాడ ప్రాంతంలో నిర్జన ప్రదేశాలకు తరిమేయబడ్డ వారికి కాన్పు దగ్గర నుండి దహనకాండ వరకు జీవితంతో ముడిపడిన ప్రతీది ఒక బృహత్తర కార్యమై కూర్చుంది. ఇంత అలజడిని రేపే అధికార వ్యవస్థలపై నిఘా అవసరం లేదా?

విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు మంచినీటి సౌకర్యం లేదు, రోడ్లు లేవు, గ్రామాల్లో వీధి దీపాలు లేవు. చిన్న చిన్న వ్యాధులకే పిట్టల్లా రాలిపోతుంటే ఐ.టి.డి.ఏ, ఆరోగ్యశాఖ అచేతనంగా ఉంటున్నాయి. బంగారు తల్లులను కాపాడతామని వాగ్దానాలు చేస్తూనే ఉన్నారు. వాకపల్లి బంగారు తల్లులను మర్చిపోయారు.

ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉండాలంటే పాలనా యంత్రాంగం పని విధానాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు సమీక్షిస్తూ ఉండాలి. ఇవాళ ప్రజల జీవితాల లోలోతులను ప్రభుత్వాలు సూక్ష్మంగా సమీక్షించడం మొదలైంది. ఇది సమాజానికి ఎంతవరకు శ్రేయస్కరమో ఆలోచించండి. అధికార వ్యవస్థల పనితీరును ప్రజలు సమీక్షిస్తూ ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని ఆ విధంగానే కాపాడుకోగలమని

మానవహక్కుల వేదిక నమ్ముతోంది. అటువంటి ప్రజా సమీక్షకు దోహదపడడానికి పనిచేసే మానవహక్కుల వేదిక విశాఖ జిల్లా శాఖ జూలై 7వ తేదీన తన 4వ మహాసభను జరుపుకుంటోంది. ఈ మహాసభల సందర్భంగా ఇటువంటి విషయాల గురించి మరోసారి కలబోసుకుందాం రండి.

విశాఖ జిల్లా కరపత్రం

1-7-2013

# ఉన్నత విద్యాసంస్థల్లో
# సామాజిక న్యాయం సాధించడం ఇలాగేనా?

పులయరాజు, క్రమాన్, బాలస్వామి, సెంథిల్ కుమార్, రజిత, మల్లేశ్వరి, అమరావతి, అనూష – వీళ్లంతా ఎవరు? హైదరాబాద్‌లో ఉన్నత విద్యాసంస్థలలో చదువుకుంటూ గత నాలుగేళ్లలో ఆత్మహత్య చేసుకున్నవారు. నిజానికి గత ఐదేళ్లలో హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ, కలకత్తా విశ్వవిద్యాలయాలలో యువతీ యువకుల ఆత్మహత్యలు క్రమంగా పెరుగుతున్నాయి. వాళ్లలో చాలామంది గ్రామీణ ప్రాంతాల నుండి, చిన్న పట్టణాల నుండి వచ్చిన మొదటి తరం విద్యావంతులు. 1990 తర్వాత పెరిగిన విద్యావకాశాలను ఉపయోగించుకొని ఉన్నత విద్యకై నగరాలకు తరలివచ్చిన తరం. ఎన్నో కలలను మోసుకుంటూ, ఎన్నో అవాంతరాలను దాటుకుంటూ ఉన్నత విద్యాసంస్థలకు వచ్చినవారు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నట్టు? విద్య మాత్రమే తమను సామాజిక అణచివేత నుండి, దారిద్ర్యం నుండి విముక్తి చేస్తుందని నమ్ముతున్న బలహీనవర్గాల, దళితుల, ఆదివాసుల నుండి ఉన్నత విద్యకై వచ్చేవారి సంఖ్య రాబోయేకాలంలో ఇంకా పెరగబోతుంది. వారిలో ఎంతమందిని ఉన్నత విద్యావ్యవస్థ సగౌరవంగా ఆదరించబోతుంది? ఎంతమందిని విఫలం చెందినవారిగా, డ్రాపౌట్స్‌గా త్రిశంకు స్వర్గంలో ఉంచబోతుంది? ఎంతమంది జీవితాలను అర్ధాంతరంగా చిదిమేయబోతుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ఆ క్రమంలో వ్యవస్థను జవాబుదారీ చేయాలి.

నగర జీవితానికి, ఉన్నత విద్యకు దూరంగా ఉన్న వర్గాల యువతను విశ్వవిద్యాలయాలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. విద్యకు దూరంగా ఉంచబడిన

వర్గాలకు విద్యాలయాలలో సమాన అవకాశాల కోసం దీర్ఘకాలం పోరాటం జరిగింది. ప్రగతి పేరుమీద జరుగుతున్న సామాజిక నిర్మాణంలో ఆధిపత్య వర్గాలకు మాత్రమే స్థానం కల్పించి, బలహీన వర్గాలకు, దళితులకు స్థానం కల్పించకపోవడం సామాజిక అన్యాయం అని జరిగిన ఆందోళనల ఫలితంగా విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లు వచ్చాయి. కానీ సామాజిక న్యాయ సూత్రాలను పాటించడం వల్ల నష్టపోయే అగ్రకులాలు ఆ భావనను ఒక సామాజిక రాజకీయ విలువగా ఎప్పుడూ సంపూర్ణంగా అంగీకరించలేదు. బలవంతుల స్వప్రయోజనాలు అంత బలమైనవి మరి. బలహీనవర్గాల గొంతు తగ్గిన ప్రతిసారీ సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించే వర్గాలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చెలరేగిపోయాయి. ఈ సందర్భాలలో బహిరంగంగా ముందుకు వచ్చేవారి స్వభావం స్పష్టంగానే అర్థమవుతుంది. మరి ఏ ఆందోళనలు జరగని సందర్భాలలో ఆధిపత్యవర్గాలు ఏంచేస్తున్నట్టు? వారి స్వప్రయోజనాలను ఎలా కాపాడుకుంటున్నట్టు?

విపరీతమైన అసమానతలున్న భారతీయ సమాజంలో వాటిని సహించగల కనీస స్థాయికి తగ్గించాలనే లక్ష్యాన్ని రాజ్యాంగంలో నిర్దేశించుకున్నాం. అసమానతలను తగ్గించడం మాట అటుంచి, పెరుగుతున్న అసమానతలను సహించే స్థాయిని పెంచుకుంటున్నాం. అసమానత గురించి, వివక్ష గురించి జరిగినంత చర్చ సమానత్వం సాధించడంపై జరగడం లేదు. అవి రెండు వేరువేరు విషయాలు. కానీ బలహీనవర్గాలు మొదటి దానిపై చర్చచేస్తే, రెండవది పరిష్కారంగా ముందుకు సహజంగానే వస్తుందని అనుకున్నాయి. కానీ సామాజిక సమస్యల విశ్లేషణకు కొదువలేని విశ్వవిద్యాలయాల్లోనైనా సమానత్వం సాధించే దిశగా ప్రయోగాలు జరగాలని ఆశించడం అత్యాశ అయిపోయింది.

సామాజిక న్యాయ భావనను అంగీకరించని ఆధిపత్యవర్గాలు, దాన్ని సాధించడానికి మార్గమైన రిజర్వేషన్లను సాధ్యమైనంతగా కుదించాయి. బలహీనవర్గాల మొహాన కొన్ని సీట్లు కొట్టి, వారి ప్రవేశంతోనే విద్యాప్రమాణాలు నాశనం అయిపోయినట్టు నిరంతరం మాట్లాడుతుంటాయి. కానీ సామాజిక న్యాయ సాధనలో రిజర్వేషన్లు మొదటి మెట్టు మాత్రమే అనే విషయాన్ని మరిచిపోతుంటాయి.

విద్యా వ్యవస్థ, సామాజిక వ్యవస్థకు కొనసాగింపు మాత్రమేననే విషయం మరిచిపోకూడదు. విద్యా వ్యవస్థ స్వభావం ఏ మేరకు ప్రజాస్వామీకరించబడితే, ఆ మేరకు సమాజం కూడా మారుతుంది. యూనివర్సిటీ యువతలో వున్న నైరాశ్యం – విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య వున్న సంప్రదాయ సంబంధాలు, ఉద్యోగాల పట్ల ఆందోళన వల్ల మాత్రమే అయితే, వాటికి పరిష్కారాలు బహుశా సులభంగానే దొరకవచ్చు. కాని యూనివర్సిటీలకు, సమాజానికి మధ్య సంబంధాలు రాడికల్‌గా మార్పు చెందనంత కాలం, బలహీనవర్గాల యువత సమస్యలను అవి పరిష్కరించలేవు.

ఆధిపత్య సంస్కృతిలోని అప్రజాస్వామిక లక్షణాలన్నీ విద్యా వ్యవస్థలోని రోజువారీ పాలనను, వాతావరణాన్ని నిత్యం నిర్దేశిస్తుంటాయి. ఈ సంస్కృతి బలహీనవర్గాల వారిని బయటివారిగాను, అవాంఛనీయమైన వర్గాలుగాను పరిగణిస్తుంది. బలహీనవర్గాలు, ఆధిపత్యవర్గాల మధ్య ఉన్న సాంస్కృతిక తేడాలు బలహీనవర్గాల నుండి వచ్చిన యువత చదువు మీద, వారు సంపాదించే మార్కులు, గ్రేడ్లమీద బలంగా పడుతుంది. ఈ సాంస్కృతిక తేడాల మధ్య నిర్మాణాత్మకమైన వారధిని నిర్మించి బలహీన వర్గాల యువతలో అంతర్గతంగా వున్న శక్తి సామర్థ్యాలను వెలికితీసే ప్రయత్నమేదీ విశ్వవిద్యాలయాలు చేయడం లేదు. అగ్రకులాలకు అనువైన ప్రమాణాలమీదే కాక, వారి ఆలోచనా సరళిమీద కూడా పట్టు సాధించిన బలహీనవర్గాల విద్యార్థులు మాత్రమే ప్రస్తుతం గట్టెక్కుతున్నారు. లేదంటే ఇంటిదారి పడుతున్నారు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

విద్యార్థి కేంద్రంగా విద్యావ్యవస్థ ఇంకా ఏర్పడలేదు. కోర్సుల రూపకల్పనలో, విశ్వవిద్యాలయాల పరిపాలనా సంస్కృతిని నిర్దేశించడంలో విద్యార్థుల పాత్ర ఏమీ లేదు. ఈ పరిస్థితి మారనంత కాలం ఆధిపత్య వర్గాల సామాజిక సంస్కృతే విద్యాలయాల సంస్కృతిగా చెలామణి అవుతుంది. ప్రస్తుతం ఇలా వుంది కాబట్టే బలహీన వర్గాల నుండి వచ్చిన విద్యార్థుల చదువు జీవన్మరణ సమస్య అవుతోంది. విశ్వవిద్యాలయాలు తమకు తాముగా ప్రకటించుకున్న ప్రాథమిక కర్తవ్యాలు ఏమిటి, అవి ఆచరణలో ఎలా రూపుదిద్దుకుంటున్నాయనే చర్చగాని, విశ్లేషణగాని జరగడం లేదు. ఇది జరగకుండా బలహీనవర్గాల హక్కులు పరిరక్షించటం జరగదు. ప్రస్తుత ఉన్నత విద్యావ్యవస్థ మార్పుచెందితే ప్రయోజనం పొందగలిగే వారు వ్యవస్థ బయటే వున్నారు. వారి గొంతు బలంగా వినిపిస్తేనే వ్యవస్థ మారుతుంది.

రకరకాల సామాజిక నేపథ్యాల నుండి వచ్చే విద్యార్థుల మధ్య వున్న అంతరాల ప్రభావం విద్యార్థి చదువు మీద కనీస స్థాయికి తగ్గించడానికి ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. కలిగిన వర్గాల పిల్లలు కుటుంబ నేపథ్యం నుండి అలవోకగా నేర్చుకునే విషయాలను పేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలకు ప్రభావవంతంగా నేర్పించటం ఉపాధ్యాయుడికి చేతకావాలి. ఇది జరగాలంటే పిల్లల సామాజిక నేపథ్యాల గురించి లోతైన అవగాహన, వాటిని కనీస స్థాయికి తగ్గించాలనే గట్టి నిబద్ధత ఉండాలి. వాటికి అవసరమైన బోధనా పద్ధతులను టీచర్లు పాటించగలగాలి. కానీ విద్యా వ్యవస్థలోకి ప్రవేశం నుండి బయటపడే వరకు పూర్తిగా అంతర్జాలమయం (ఇంటర్‌నెట్) చేయడం ద్వారా విశ్వవిద్యాలయాలు సామాజిక అంతరాన్ని మరింత పెంచిపోషిస్తున్నాయి.

బలహీన వర్గాల నుండి, కులాల నుండి వచ్చిన వారిని బయటకు నెట్టేసే పరిస్థితులను ఎదుర్కొనడానికి విశ్వవిద్యాలయాలు నిబద్ధతతో చర్యలు చేపట్టడం లేదు. నిమ్న వర్గాల నుండి వచ్చిన వారి విజయాల ప్రాతిపదికగా విద్యాలయాల పని తీరును అంచనా వేసే పద్ధతి వుండాలి. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పరీక్షించడానికి పరీక్షలు, సర్టిఫికేట్లు మాత్రమే ప్రమాణాలు కాకుండా విభిన్నమైన పద్ధతులు వుండాలి. ఉపాధ్యాయుడు ఇచ్చే ప్రతి మార్కు ఒక తీర్పులాంటిది. కాబట్టి అవసరమైతే తన తీర్పును హేతుబద్ధంగా సమర్థించుకోవాల్సిన బాధ్యత టీచర్ మీద వుండాలి. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను కొలిచే ప్రమాణాలతోనే అసలు సమస్య ఉంది. మార్కులకు, గ్రేడ్లకు మార్కెట్టు విలువ ఉందే తప్ప, సామాజిక విలువ ఏమీ లేదు.

బలహీనవర్గాల నుండి వచ్చిన యువతను 'మీరు పనికి రారు' అని ప్రకటించడంలో ఉన్న ఉత్సాహం, వారికి సమాన అవకాశాలు, పరిస్థితులు సృష్టించి విద్యావంతులుగా చేయడంలో లేకపోతే విద్యాపాలనా వ్యవస్థ గురించి ఏమనుకోవాలి? ప్రస్తుతమున్న సామాజిక అంతరాలను చౌరవగా పెంచి పోషిస్తున్నాయనుకోవాలి. విద్యా వ్యవస్థ లక్ష్యం అదే అని ప్రకటించుకుంటే సరిపోయేది. కాని అలా చేయరు. ఇది ఆధిపత్యంలో ఉన్నవారు చేస్తున్న దగా, వంచన. దీన్ని బలంగా ఎదుర్కోవాలి.

భిన్న వర్గాల నుండి వచ్చిన యువత మధ్య పరస్పర అవగాహనను, గౌరవాన్ని పెంచే చోటుగా కాకుండా, బలహీనవర్గాల యువతను పనికిమాలిన వారిగా, అంటరానివారిగా చూసే సంస్కృతిని విశ్వవిద్యాలయాలు పోషిస్తున్నాయి. బలహీన వర్గాలు తమకు తాముగా ఉన్నత విద్యకు దూరంగా ఉండిపోయే పరిస్థితుల్ని సృష్టిస్తున్నాయి. ఈ దేశంలోని బలవంతులకు, అగ్రకులాలకు అంతిమంగా కావాల్సిందిదే. అది జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాస్వామికవాది మీద వుంది.

హైదరాబాద్ సిటీ కరపత్రం

22-7-2013

## మేధావులారా! ప్రజాస్వామికంగా ఆలోచిద్దాం!
## మన విజ్ఞతతో సమాజానికి దిశా నిర్దేశం చేద్దాం!

సీమాంధ్ర ప్రాంతంలో ఈ రోజు జరుగుతున్న ఉద్యమ సందర్భంలో ప్రజాస్వామ్య వాదుల ముందుకు వస్తున్న ప్రశ్నలు చూస్తే చాలా ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి. మీరు సమైక్యవాద ఉద్యమంలో పాల్గొనడం లేదేమి? అంటే మీరు తెలంగాణ వాదులా? కాదంటే ఉద్యమంలో ఎందుకు పాల్గొనరు? ఈ ప్రశ్నలు వింటుంటే విస్తుపోవాల్సిందే. ఎందుకంటే ఇవి ముఖ్యంగా మేధోవర్గాలైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, లాయర్ల నుంచి వస్తున్న ప్రశ్నలు. ఉంటే రెండే వాదాలు ఉండాలి, తెలంగాణవాదం లేదా సమైక్యవాదం, ఇంకో వాదానికి తావు లేదు అనే స్పృహతో సాగిపోతున్న వాళ్ళకు ప్రజాస్వామ్యవాదం ఒకటుందని, వ్యక్తులుగా, సంస్థలుగా మనకు ప్రజాస్వామికంగా ఆలోచించే స్వేచ్ఛ ఉందని, అలా ఆలోచించాల్సిన అవసరం ఉందని గుర్తు చేయాల్సిన పరిస్థితి.

ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నుంచి ప్రజలు, పాలకులు నేర్చుకోవాల్సిన పాఠం ఒకటుంది. సమానత్వం అనే భావన మాటల్లో చెప్పడానికీ, ఆచరణలో చూపడానికీ ఎంత వైరుధ్యం ఉందో, ఉంటుందో అనే అంశం. విభిన్నమైన సంస్కృతులతో, అలవాట్లతో ఉన్న వివిధ ప్రాంతాల మధ్య ఆచరణలో సమఅభివృద్ధి చేయకుండా కేవలం మాటలతో, వాగ్దానాలతో, పాటలతో, మనదంతా ఒకే జాతి, ఒకే భాష అన్న భావనతో కలిపి ఉంచి, అభివృద్ధి సమానంగా జరుగుతున్నది అనే భావన పెంపొందించడం ఎంత కష్టమో, ఇప్పటిదాకా పాలకులు చేసిన

అభివృద్ధి ఎంతటి కృత్రిమమో తేటతెల్లమవుతుంది. దాని ఫలితమే ఈ విభజన అనే సత్యాన్ని మరుగుపరచి మీ పార్టీ ఒప్పుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందంటే, మీ పార్టీ ఒప్పుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది అని ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ పార్టీలు ఆడుతున్న క్రీడలో సామాన్య ప్రజలు సమిధలు కాకుండా చూడాల్సిన బాధ్యత మేధావులు, బుద్ధిజీవులపై ఉంది.

ఈరోజు సీమాంధ్ర ప్రాంతంలో ప్రజలు పెద్దఎత్తున చేస్తున్న ఉద్యమం ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, నీటివనరులు వంటి వాటిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్యాన్ని, వివక్షను చూపాయో, చూపుతున్నాయో తెలియజేస్తున్నది. విభజనతో వీటికి మరింత విఘాతం కలుగుతాయన్న ఆందోళన స్పష్టమవుతూ ఉంది.

కాని విభజన ఈనాటి వాస్తవ సత్యం. విభజనకు ఏ పార్టీ సహకరించింది? ఎవరు రాజీనామా చేస్తే విభజనను ఆపగలము? అని ఆలోచించడం కంటే, ఆ ప్రాంత ప్రజలు కోరుకొని చేసిన ఉద్యమం వల్లనే విభజన ప్రకటన వచ్చింది అనే సత్యాన్ని గ్రహించడం, ఆ స్పృహ కల్గి ఉండటం చాలా అవసరం.

ఇవేవీ పట్టకుండా ఆ ప్రాంత ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా రాష్ట్రం సమైక్యంగా ఉండాలి అనేది ప్రజాస్వామిక ఆలోచనేనా? ఈ సందర్భంలో సమైక్యాంధ్ర నినాదంతో ఉద్యమం చేయడం అంటే ప్రజలపై ప్రజలు ఉద్యమం చేయడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా ప్రజలపై ప్రజలు ఉద్యమం చేయడం జరిగిందా? దీన్ని చూస్తూ మేధావులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్య వాదులు మౌనంగా ఉండటమో, సహకరించడమో చేస్తే అది ప్రజలపై ప్రజలు చేయగల యుద్ధానికి దారి తీయగలదని గ్రహించి మేధోవర్గం ఇప్పటికైనా మేల్కొనవలసి ఉంది. వాస్తవాలకు అద్దం పట్టాల్సి ఉంది. మనం పోరాడవలసింది, ప్రశ్నించవలసింది పాలకుల దమన నీతిపైన, విధ్వంసక ఆలోచనలపైన అనే చైతన్యాన్ని అందించవలసిన అవసరం ఉంది.

ఇక్కడ మరో ఆలోచన బలంగా ముందుకు వస్తున్నది. సమైక్యాంధ్ర నినాదంతో ఉద్యమం చేస్తే చివరికి ఈ విషయాలకైనా ఒప్పుకుంటారు కదా అనేది. ఇది ఒక వ్యాపార వ్యవహారం కాదు. ఏ ఉద్యమానికైనా ఒక స్పష్టమైన ఉద్దేశ్యం, విలువ ఉండాలి. అలా ఉన్నప్పుడే ఆ ఉద్యమానికి స్పష్టత, అర్థము ఉంటాయి.

అప్పుడు మాత్రమే ఆ ఉద్యమం ఈ సమాజానికి ఒక విలువను అందించగలదు.

ఉద్యమానికి ఒక ఉద్దేశ్యాన్ని ఏర్పరచుకొని విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలన్నీ రాజధాని హైదరాబాద్‌లోనే ఎందుకు అభివృద్ధి చేయాల్సి వచ్చిందని, నీటివనరులన్నీ కోస్తాలోనే ఎందుకు కేంద్రీకరించాల్సి వచ్చిందో ప్రశ్నిద్దాం. నిలదీద్దాం.. మన ప్రాంతాల్ని, ముఖ్యంగా రాయలసీమలో త్రాగడానికి కూడ నీళ్ళు లేని పరిస్థితి ఎందుకు కల్పించారని అడుగుదాం. మెరుగైన విద్య కోసం, మెరుగైన వైద్యం కోసం, ఉపాధి అవకాశాల కోసం మేమెందుకు హైదరాబాదు లాంటి నగరాలకు పరుగులు తీయాలి? ఇప్పటికైనా కేవలం ఒకే నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకొనే సంస్కృతిని విడనాడి, మా ప్రాంతంలోని నగరాలన్నింటిలో గ్రామాల సమీపంలోనే మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, తాగు, సాగు నీటి వసతులు తగినన్ని కల్పించమని పోరాడుదాం. ఆ దిశగా ఉద్యమ కార్యాచరణ ఉండాలి. ఆ దిశగా పోరాటం జరగాలని ఆశిస్తున్నాము, కోరుకుంటున్నాము.

కర్నూలు జిల్లా కరపత్రం

19-9-2013

కరపత్రం

# విలువల గీటురాయిగానే ముందుకు పోదాం

ప్రజలారా!

**భా**రతదేశ ప్రజలమైన మనం మన కోసం 'సర్వసత్తాక గణతంత్ర ప్రజాస్వామ్య సామ్యవాద లౌకిక' రాజ్యాంగాన్ని రాసుకుని 63 సంవత్సరాలయింది. ఎన్నో ప్రజాపోరాటాలు, ఉద్యమాల ఫలితంగా రూపుదిద్దుకున్న ఈ రాజ్యాంగం ఆచరణలో ఆశించిన ఫలాలను ఎందుకు అందివ్వలేకపోతోందో ఆలోచించాల్సిన అవసరముంది. రాజ్యాంగ పీఠికలో మనం రాసుకున్న ఒక్కొక్క విలువ హరించుకు పోతుంటే, పాత గాయాలు మానకుండానే కొత్తవి వచ్చి చేరుతుంటే, ఎక్కడ వేసిన ప్రశ్నలు అక్కడే ఉండిపోతుంటే పౌరులుగా మనం చేయగలిగిందేమిటో కూడా ఆలోచించుకుందాం.

లౌకికవాద విలువను కాపాడుకుంటామని ఆనాడు రాజ్యాంగంలో రాసుకున్నాం. అది ఈ రోజు నిస్సారమైన విలువగా మాత్రమే మిగిలే ప్రమాదం ఏర్పడింది. గుజరాత్‌లో ముస్లింలకు డెత్ వారెంట్ జారీ చేసి 2000 మందిని పైగా చంపించిన వ్యక్తి ఈ రోజు దేశ ప్రధాని పదవికి అభ్యర్థిగా మన ముందుకొస్తున్నాడు. లౌకిక విలువలకు ఇంతకంటే పెద్ద విఘాతం ఇంకొకటి ఉంటుందా? ఇది ప్రజాస్వామికవాదుల వైఫల్యం కాదా! గుజరాత్ మాత్రమే కాదు, స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి హిందూ మతతత్వ శక్తులు ఎన్నిచోట్ల అల్లర్లను సృష్టించి, ఎన్ని వేల ప్రాణాలను బలి తీసుకున్నాయో ఒకసారి గుర్తు తెచ్చుకోండి. గతంలో మీరట్,

భివాండి వంటి పేర్లు వినిపిస్తే యిప్పుడు ముజఫర్‌నగర్‌లు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో అక్కడ జరిగిన మతకల్లోలాలలో 48 మంది మరణించారు. హిందూత్వ సృష్టికర్తలు హెడ్గేవార్, గోల్వాల్కర్‌లైతే శివసేన సృష్టికర్త బాల్‌థాకరే. వీళ్లు ముగ్గురూ యిప్పుడు లేరు కాని వారి వారసుడుగా అవతరించిన నరేంద్ర మోడి నేతృత్వంలో ఈ శక్తుల సమీకరణ మరింత పెద్దఎత్తున జరుగుతోంది. వాళ్లు చేయగల నష్టాన్ని తక్కువగా అంచనా వేయవద్దని, గతంలో వారు దేశానికి చేసిన నష్టాన్ని మర్చిపోవద్దని మీకందరికీ మనవి చేస్తున్నాం.

భారతదేశం గుజరాత్ కాదు, దేశ రాజకీయాల్లో మోడి ఎత్తులు సాగవని భ్రమల్లో బతుకుతున్నవారున్నారు. అటువంటి భ్రమల్లో బతకవద్దని కోరుతున్నాం. 1983లో అస్సాంలోని నెల్లిలో జరిగిన మతకల్లోలాల్లో రెండువేల మందికి పైగానే చనిపోయారు. 1984లో ఢిల్లీలో జరిగిన సిక్కుల ఊచకోతలో మరో రెండువేల మంది మరణించారు. 1989లో బీహార్‌లోని భాగల్‌పూర్‌లో మతకల్లోలాలు జరిగి వెయ్యిమంది ప్రాణాలు కోల్పోయారు. 1993 ముంబయి అల్లర్లలో 1500 మంది మరణించారు. ఇక 2002 గుజరాత్ మారణకాండ గురించి చెప్పనవసరం లేదు. అవి పూర్తిగా ప్రభుత్వం దగ్గరుండి చేయించిన హత్యలు. మతకల్లోలాల చిత్రపటంలో మన హైదరాబాద్ కూడా ఒక ప్రధాన నగరం. ఒరిస్సాలోని కందమాల్‌లో, కర్ణాటకలోని మంగుళూరులో క్రైస్తవులపై దాడులు జరిగాయి. ఆఖరికి పెరియార్ ప్రభావమున్న తమిళనాడులో, వామపక్షాల ప్రభావమున్న కేరళలో కూడా మతకల్లోలాలు జరిగాయి. మత విద్వేషాలు రెచ్చగొడితే ఏ ప్రాంత ప్రజలూ, ఆ మాటకొస్తే ఏ భావజాల ప్రజలూ వాటికి అతీతులు కారని రష్యా, యుగోస్లావియా, సరయేవో పరిణామాలను విశ్లేషిస్తూ బాలగోపాల్ చెప్పిన మాటలను గుర్తు చేసుకుందాం. అందుకే దేశ రాజకీయాలను మతోన్మాద శక్తుల చేతుల్లో పెట్టకుండా దేశాన్ని కాపాడుకుందాం. అంతర్లీనంగా మనలో కూడా అటువంటి భావాలు ఉన్నాయేమో వెతికి చూసుకుని వదిలించుకుందాం.

ఇవాళ దేశం ఎదుర్కుంటున్న మరో ముఖ్యమైన సమస్య స్త్రీలపై పెరుగుతున్న అత్యాచారాలు. ఏ పురుషాధిక్యత స్త్రీ శరీరాన్ని బలవంతంగా లోబరుచుకోవడానికి కారణమవుతోందో, అది తప్పు కూడా కాదని వాళ్లను భావించేలా చేస్తోందో ఆ సంస్కృతిని రూపుమాపే ప్రయత్నాలు చేయకుండా నేరస్తులకు ఎన్ని మరణశిక్షలు విధించినా ఉపయోగం లేదు. 'నిర్భయ' లాంటి హేయమైన ఘటనలు జరిగిన తర్వాత కూడా మహిళా సంఘాలు మరణశిక్ష వద్దనే వివేకం ప్రదర్శించినా, వర్మ కమిషన్ మరణశిక్షను సిఫార్సు చేయకపోయినా ప్రభుత్వం మాత్రం రేప్‌కు మరణశిక్ష విధించే చట్టాన్ని తీసుకొచ్చింది. ఒక కొత్త చట్టం వచ్చిందంటేనే ఆ నేరాన్ని అదుపు చేయడంలో సమాజం విఫలమైందని అర్థం. రేప్‌కు మరణశిక్ష విధిస్తే అత్యాచారం చేయడమే కాకుండా బాధితురాలిని హత్యచేసి పోయే ప్రమాదముందని ఇతరత్రా మరణశిక్షను వ్యతిరేకించని భారత శిక్షా స్మృతి రూపకర్త మెకాలేనే భయపడ్డాడు. కాని మన పాలకులలో మాత్రం అటువంటి వివేచన ఏదీ లేకుండా పోయింది. మరణశిక్ష ఏ నేరానికీ పరిష్కారం కాదని అనేక దేశాల అనుభవాల, అధ్యయనాల ఆధారంగా చెపుతున్నా తనను ఇరకాటంలో పెట్టే ఏ ఘటన జరిగినా ప్రభుత్వం మరణశిక్షతోనే ప్రజాగ్రహాన్ని అదుపుచేసే ప్రయత్నం చేస్తోంది. అది సరైన వైఖరి కాదు. స్త్రీలపై హింసకు తావులేని సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించాలి. అందుకు మనందరం కూడా మన వంతు కృషి చేయాలి.

ప్రపంచీకరణ ఫలితంగా కార్పొరేట్ పెట్టుబడి ప్రాబల్యం పెరిగి దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నదని ఇవ్వాళ మనకు ఏ ఆర్థిక శాస్త్రవేత్తా చెప్పనవసరం లేదు. ప్రజలందరికీ అర్థమవుతున్న విషయమే అది. రూపాయి విలువ పడిపోవడంలో, ధరలు విపరీతంగా పెరిగిపోవడంలో ప్రజల పాత్ర ఏమీ లేకపోయినా వారు వాటికి నిరంతర బాధితులుగా మిగిలిపోవాల్సి వస్తోంది. ఏ ఆర్థిక విధానాలు, పాలనా విధానాల కారణంగా ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయో వాటిని తక్షణం సమీక్షించుకుని, చక్కదిద్దమని ప్రజల తరపున మనం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. 20 ఏళ్లుగా అనుసరిస్తున్న ఎల్.పి.జి (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) విధానాలు దేశానికి ఏం ఒరగబెట్టాయో కూడా వాళ్లను ఆలోచించుకోమని చెప్పాలి. అవి వచ్చాకే కదా...

స్కాంలు, అవినీతి పెరిగాయి. ఆదాయాల్లో, అంతస్తుల్లో, సంపదల్లో అగాధాలు ఇంతగా పెరిగాయి. వ్యవసాయం మూలపడింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. గ్రామాలు బోసిపోతున్నాయి. ప్రాజెక్టుల మీద ప్రాజెక్టులు కడుతున్నారు కాని ఏవి ఎందుకు నిర్మిస్తున్నారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. సమాచార హక్కును ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న విషయాలకు పరిమితం చేయకుండా ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్న కారణాలను తెలిపే విషయాలకు కూడా విస్తరిస్తే పాలకవర్గాలు చేసుకుంటున్న అనేక లోపాయికారీ ఒప్పందాల గురించి కూడా తెలుసుకోగలుగుతాం!

ఒకవైపు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తూ ఉపాధి అవకాశాలకోసం పారిశ్రామిక రంగం వైపుకి నెడుతూ మరోవైపు అక్కడ కూడా ఉద్యోగ భద్రత, ప్రాణ భద్రత లేకుండా చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు గర్వకారణంగా భావించే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత ఏడాది జరిగిన దుర్ఘటనలో 19 మంది మరణించారు. నిన్నగాక మొన్న విశాఖపట్నం హెచ్.పి.సి.ఎల్.లో జరిగిన ప్రమాదంలో 27 మంది మృతి చెందారు. ఫ్యాక్టరీలలో ఎంతమంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారో లెక్క కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాయి సంస్థల యాజమాన్యాలు. ఉద్యోగుల పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా ఉంది. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు గాని, కాలుష్య నివారణకు గాని ఎక్కడా సరైన నియంత్రణ వ్యవస్థలే లేకుండా పోయాయి. ఆయా వ్యవస్థలలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఎన్ని పరికరాలు ఉన్నాయనే దాని కంటే అన్ని వ్యవస్థలకూ కార్మికుల భద్రత పట్ల పట్టింపు కొరవడడమే మనల్ని ఎక్కువగా భయపెడుతున్న అంశం. ఎంతో కాలంగా మనకు పరిచయమున్న ఉక్కు, గ్యాస్ వంటి పరిశ్రమలలోనే పరిస్థితి ఇలా ఉంటే రేపు శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన అణువిద్యుత్ కేంద్రం గురించి భయపడకుండా ఎలా ఉంటాం? కడప జిల్లా పులివెందులలో జరుగుతున్న యురేనియం ఖనిజ తవ్వకాలలో అణువ్యర్థ పదార్థాలు ఇటీవల లీకైన విషయం గుర్తు తెచ్చుకుంటే

ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో మన కోసం ఇంకెన్ని పొంచి ఉన్నాయోననిపిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలే ఏ విధమైన జవాబుదారీతనం లేకుండా ఇలా ప్రవర్తిస్తుంటే ఇక ప్రైవేటు సంస్థల నుంచి ఏమి ఆశించగలం?

నిజానికి ఈ రోజు హక్కుల పరిభాష మన కంటే ప్రభుత్వాలే ఎక్కువ మాట్లాడుతున్నాయి. సమాజంలోని అన్ని రంగాల్లో సంక్షోభం పెరుగుతున్న కొద్దీ ప్రభుత్వం కొత్త హక్కులను చట్టాల రూపంలో ఇస్తూ పోతోంది. కాని ఎప్పుడు? ఆ హక్కుల్ని అనుభవించే పరిస్థితులు కుదించుకుని పోయినప్పుడు. విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిన తర్వాత విద్యాహక్కు చట్టం వచ్చింది. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డ తర్వాత దానికి అనుబంధంగా ఉండాల్సిన అహారభద్రత చట్టంగా వచ్చింది. అట్లాగే ప్రజారోగ్యం నిర్లక్ష్యానికి గురై ఇన్సూరెన్స్ కంపెనీలు ఆరోగ్య బీమాలోకి పెద్దెత్తున ప్రవేశించిన తర్వాత, ప్రభుత్వ ఆసుపత్రుల్ని పూర్తిగా పనికిరాకుండా మార్చిన తర్వాత ఇప్పుడు ఆరోగ్యహక్కు కూడా రాబోతున్నది.

ఆఖరుగా అత్యంత ముఖ్యమైన అంశం. ఎన్నో ఏళ్ల నుంచి రాష్ట్రాన్ని కుదిపేస్తున్న విభజన అంశం. ప్రాంతీయ అసమానతలకు దారి తీసే ప్రభుత్వ చర్యలను మానవహక్కుల వేదిక మొదటినుండి విమర్శిస్తూనే ఉంది. విలీనం సమయంలో చేసుకున్న ఒప్పందాల ఉల్లంఘన, రాజ్యాంగ రక్షణల అతిక్రమణ వల్లనే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ఒక హక్కుల ఉద్యమంగా ముందుకు తీసుకొచ్చి అందరి మద్దతునూ పొందగలిగారు. అది తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షల్లోంచి పుట్టిన ప్రజాస్వామిక ఉద్యమమని మానవహక్కుల వేదిక తొలినుంచి ఈ ఉద్యమాన్ని సమర్థిస్తూనే వచ్చింది. తెలంగాణ ఏర్పాటు ప్రకటన వెలువడ్డ తర్వాత రాష్ట్రంలోని మిగతా చోట్ల పెల్లుబికిన ఆందోళనలు, ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్రవాసుల ఆందోళనలు పైకి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా కనిపించినప్పటికీ సారాంశంలో అవి గత ఆరు దశాబ్దాల అసమ అభివృద్ధిని నిరసిస్తూ జరుగుతున్నవే. కాబట్టి విభజన వల్ల ఇతర ప్రాంతాల ప్రజలు కోల్పోయే అంశాలను ముందుకు తెచ్చి హక్కుల రూపంలో వాటిని స్థిరీకరించుకోవడం కోసం కృషి చేద్దాం.

ఈ పరిస్థితుల నుంచి రాష్ట్ర ప్రజలూ, పాలకులూ నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి. మొదటిది, ముఖ్యమైనది మాటల్లో చెప్పే సమానత్వ భావన దీర్ఘకాలం పాటు ఆచరణలో లోపించినపుడు కలిగే పరిణామాలు ఎలా ఉంటాయనేది. భిన్న వనరులు, విభిన్న సంస్కృతులు ఉన్న ప్రాంతాల మధ్య ఆచరణలో సమఅభివృద్ధిని చూపకుండా కేవలం మాటలతో, వాగ్దానాలతో, ఒకే జాతి ఒకే భాష వంటి భావనలతో అభివృద్ధి సమానంగా జరుగుతున్నదనే అభిప్రాయాన్ని కలిగించడం ఎంత కష్టమో తేటతెల్లమయింది. ఇప్పటిదాకా పాలకులు చూపిన అభివృద్ధి ఎంత కృత్రిమమో, లోపభూయిష్టమో కూడా బట్టబయలయింది. నేటి విభజన దీని ఫలితమే అనే సత్యాన్ని మరుగుపరచి మీ పార్టీ ఒప్పుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందంటే, మీ పార్టీ ఒప్పుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలను మభ్యపెడుతున్నారు. రాజకీయ పార్టీలు ఆడుతున్న ఈ క్రీడలో సామాన్య ప్రజలు సమిధలు కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది.

నీటి వనరులు, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం వంటి సదుపాయాల అసమ పంపిణీ, అన్యాయ పంపిణీ కారణంగానే నేడు రాష్ట్రం ఇంతటి సంక్షోభంలో చిక్కుకుందనేది స్పష్టం. విభజనకు ఏ పార్టీ సహకరించింది, ఎవరు రాజీనామా చేస్తే విభజనను ఆపగలము అని ఆలోచించడం కంటే తెలంగాణ ప్రజలు కోరుకుని చేసిన ఉద్యమం వల్లనే తెలంగాణ ప్రకటన వచ్చిందనే సత్యాన్ని గ్రహించడం అవసరం. ఈ దశలో ఆందోళన చేయడమంటే అది ప్రజలపై ప్రజలు ఉద్యమం చేయడమే అవుతుంది. ప్రజాస్వామ్య సంస్కృతికి ఈ ధోరణి తోడ్పడదని గుర్తిద్దాం. అసమ అభివృద్ధికి, వివక్షకు వ్యతిరేకంగా పోరాడడం న్యాయమని భావించే ప్రజలందరూ ఏ ప్రాంతంలో ఉన్నా సరే దాన్ని ఒక విలువగా ఆమోదించి తదనుగుణంగా నడుచుకోవడం అవసరం. ఇది ఈ క్షణానికి ఎంత కష్టమనిపించినా భవిష్యత్తులో అదొక ప్రామాణిక విలువగా నిలిచిపోవడానికి దోహదం చేసినవాళ్లమవుతాం.

ఈ సందర్భంలో మనం గుర్తు చేసుకోవాల్సిన మరో విషయముంది.

అది ఆదివాసుల ఉనికికి ఏర్పడుతున్న ముప్పు. అటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో గాని, ఇప్పటి సమైక్యాంధ్ర ఆందోళనలో గాని వారి సమస్యల ప్రస్తావన ఎక్కడా ఉండడం లేదు. ఆదివాసీ వనరుల పరాయీకరణపై, వారి భూముల సమస్యపై స్పష్టమైన విధానం కోసం మనం డిమాండ్ చేయవలసి ఉంది. తెలంగాణ ప్రకటనతో పాటు పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం ప్రకటిస్తే లక్షలాదిమంది ఆదివాసులను నిర్వాసితుల్ని చేసే ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అటువాళ్లు గాని ఇటువాళ్లు గాని ఒక్కరూ మాట్లాడలేదు. అందరికీ సమాన న్యాయం, సమాన అభివృద్ధి జరగాలని గొంతు చించుకుంటున్న సందర్భంలోనైనా ఈ దుర్మార్గాన్ని ఎవరూ ఖండించకపోవడం చాలా బాధాకరం.

ఇన్ని రకాల సంక్షోభాల మధ్య మానవహక్కుల వేదిక తన ఐదవ మహాసభలను విశాఖ తీరాన జరుపుకోబోతోంది. సామాజిక ప్రజాస్వామ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు రాజకీయ ప్రజాస్వామ్యాన్నే కూలదోస్తారని అంబేద్కర్ రాజ్యాంగ సమితి చివరి సమావేశంలో హెచ్చరించారు. కులం, మతం, లింగం, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా, అన్ని రకాల అసమానతలకు వ్యతిరేకంగా... ప్రతి మనిషికి ఒకే విలువనిచ్చే సమాజాన్ని నిర్మించుకోవడానికి కృషి చేద్దాం.

1-10-2013

# ఇందులో....



## వ్యాసాలు


నిర్మాణ కార్మికుల సంఖ్య ఎందుకు పెరుగుతోంది? . . . . . . . . . . . . . . . . . . . 7
– పి.యస్. అజయ్ కుమార్

భూమి – కాగుతున్న పెనం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 19
– నాగరాజ్ ఆడ్వె

విధ్వంసరహిత అభివృద్ధి సాధ్యమా? . . . . . . . . . . . . . . . . . . . . . . . . 39
– ఎస్. అమర్

ఆఫ్రికా భూముల్లో కార్పొరేట్ సేద్యం . . . . . . . . . . . . . . . . . . . . . . . 53
– ఎస్. జీవన్ కుమార్

దేశ అణు ఇంధన భవితవ్యం: కొన్ని పాఠాలు . . . . . . . . . . . . . . . . . . . . 61
– నిత్యానంద్ జయరామన్


## జ్యుడీషియరీ వాచ్


రాజ్యధిక్కారం రాజద్రోహం కాదు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 89
– గొర్రెపాటి మాధవరావు


## రిపోర్టులు


పారిశ్రామిక ప్రమాదాలన్నీ భద్రతా వైఫల్యాలే . . . . . . . . . . . . . . . . . . . 98

నిర్లక్ష్యానికి మూల్యం డ్రైనేజీ కార్మికుల మరణాలు . . . . . . . . . . . . . . . . . 106

ఆత్మహత్యల పరంపర: పరిహారం దక్కని వేలాది రైతు కుటుంబాలు . . . . . . . 109

కల్తీకల్లు: మత్తు బదులు మరణాన్నిచ్చింది . . . . . . . . . . . . . . . . . . . . 120

**కరపత్రాలు** . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 125 – 184